కామ్రేడ్ పి.జె. వర్ధన్ రావుకు
అరుణారుణ జోహార్లు

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 9 హైదరాబాద్ 329 అక్టోబర్, 2016 పేజీలు: 68 వెల: రు. 20



సొంతూరు నుండి
సొంత బతుకు నుండి
విసిరేస్తున్న కాలమిది
గాయాన్ని మరింత రేపొద్దు

కొందరు తమ సొంతూరు గూర్చి
మెల్ల మెల్లగా మర్చిపోవచ్చు
తమ జ్ఞాపకాల మడతల్లో
దాన్ని మడిచి పెట్టెయ్యవచ్చు

బతుకే సంచారమైన చోట
కొందరికి సొంతూరే
తీరని కలగా మిగలవచ్చు

5 అక్టోబరు 2016న తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాద్‌లో
కామ్రేడ్ బొజ్జా తారకం సంస్మరణలో 'తారకం జీవితం - సాహిత్యం' సభ దృశ్యాలు





14 అక్టోబరు 2016న తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాద్‌లో కామ్రేడ్ చలసాని ప్రసాద్
మొదటి వర్ధంతి సందర్భంగా చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1 పుస్తకావిష్కరణ సభ దృశ్యాలు



KLVA101M192

అరుణతార
సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక
విరసం

(329)

సంపాదక లేఖ..

సంపుటి : 44 ♦ సంచిక : 9 ♦ అక్టోబరు, 2016 వెల : రు. 20/-

బొజ్జా తారకంగారు విప్లవ రచయితల సంఘం తొలితరం నాయకుల్లో ఒకరు. వర్గపోరాటంతో ప్రభావితమై విప్లవోద్యమ రాజకీయాల్లోకి వచ్చారు. ఎమర్జెన్సీ దాకా విరసం కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. కవిత్వం, నవల, సామాజిక, సైద్ధాంతిక అంశాలపై రచనలు చేశారు. పౌరహక్కుల సంఘంలోనూ పనిచేశారు. విద్యార్థి దశలోనే దళిత విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారు. దేశంలోనే దళిత ఉద్యమానికి గొప్ప ప్రేరణ అందించిన కారంచేడు ఘటన తర్వాత ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలో ఆయన క్రియాశీల నాయకుడు. దళిత మహాసభ వ్యవస్థాపకుడు. ఆ సంస్థ తరపున గ్రామ స్థాయి నుంచి ఆందోళనలు నిర్మించారు. ఈ దేశంలో కులం ఎలా పని చేస్తున్నదో లోతైన అధ్యయనం చేశారు. కుల వ్యవస్థను అర్థం చేసుకోడానికి సరళ శైలిలో వ్యాసాలు రాశారు.

తెలుగు సమాజంలో కుల నిర్మూలనా అవగాహన విస్తరించడంలో తారకంగారి పాత్ర ఉన్నది. అంబేద్కర్ రచనల అనువాదంలో, ప్రచారంలో గణనీయమైన కృషి చేశారు. తండ్రి దళిత ఉద్యమ వారసత్వాన్ని చిన్న వయసు నుండే స్వీకరించిన తారకం గారి వ్యక్తిత్వాన్ని వర్గపోరాటాలు, దళిత విముక్తి పోరాటాలు రూపొందించాయి. విద్యార్థి ఉద్యమకారుడిగా తన సొంతవూరిలో దళిత యువకుల్ని సంఘటితం చేసిన అనుభవం ఆయనకు గట్టి పునాదిగా పని చేసింది. సామాజిక ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆయన 'కులం-వర్గం' అనే పుస్తకం రాశారు. అంబేద్కర్‌నూ, కార్ల్ మార్క్స్‌నూ ఆయన ఎంతగా ప్రేమించారో, దళిత ఉద్యమాన్ని, విప్లవోద్యమాన్ని అంతగానే ప్రేమించారనడానికి ఈ పుస్తకం ఉదాహరణ. ఆయన తన అవగాహనను రాజకీయ, సిద్ధాంత స్థాయిలో, ఆచరణ స్థాయిలో మేళవించారు. కులం-వర్గం మధ్య ఉండే సంబంధాన్ని ఆయన మొదటి నుంచి చాలా శ్రద్ధగా విశ్లేషిస్తూ వచ్చారు. దళిత, విప్లవోద్యమాలతో ఏకకాలంలో సంభాషించగల ప్రజాస్వామికవాది ఆయన.

సామాజిక, రాజకీయ వ్యాఖ్యాతగా గుర్తింపు ఉన్న తారకంగారు నది పుట్టిన గొంతుక, నాలాగే గోదావరి అనే కవితా సంపుటాలు ప్రచురించారు. ఆయనలోని ఉద్వేగ భరిత ప్రసంగశైలికి ఆయన కవి కంఠస్వరమే కారణం. తొలినాళ్ల విప్లవ కవిత్వానికి సూటిదనం, ప్రవాహగుణం అందించిన వాళ్లలో తారకంగారు ఒకరు. ప్రజా సాంస్కృతికరంగంపట్ల, నాటకం పట్ల కూడా ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉండేది. పంచతంత్రం నవల, చరిత్ర మార్చిన మనిషి అనే తన తండ్రి జీవిత చరిత్ర రచనా రంగంలో ఆయన విస్తృతికి నిదర్శనం. ఆయన రాసిన 'పోలీసులు అరెస్టు చేస్తే' పుస్తకం రాజ్యహింసను అనుభవించే ప్రజలకు, ప్రజాసంఘాల కార్యకర్తలకు దిక్సూచి వంటిది.

దళితులు, ముస్లింలు, ఆదివాసులు, నిర్వాసితుల పక్షాన ఆయన చివరంటా దృఢంగా నిలబడ్డారు. దండకారణ్యంలో బాసగూడ వద్ద ఆదివాసులను పోలీసులు కాల్చి చంపినప్పుడు నిజనిర్ధారణకు వెళ్లి వచ్చారు. ఆనాటి ప్రయాసభరిత ప్రయాణంలో ఆదివాసీ మహిళ నాగలి దున్నుతుండగా, పురుషుడు విత్తనాలు చల్లుతున్న దృశ్యం చూపి విప్లవమంటే ఇదే అన్నాడు. ఆ సందర్భంగా విప్లవోద్యమ నాయత్వాన్ని కలిసి క్రాంతికారీ జనతన సర్కార్ గురించి ఆసక్తిగా తెలుసుకోవడమేగాక బాసగూడ మారణకాండను ప్రత్యామ్నాయ ప్రజాధికారం నేపథ్యంలో విశ్లేషిస్తూ చాలా సందర్భాల్లో ప్రసంగించారు. కారంచేడు, చుండూరు ఘటనల్లో ఎంత క్రియాశీలంగా పని చేశారో లక్షింపేట, రోహిత్ వేముల ఘటనలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో కూడా అనారోగ్యంతో సహితం అంతే తీవ్రంగా భాగస్వామి అయ్యారు. పీడిత ప్రజలు, ప్రజాసంఘాల కార్యకర్తలు, విప్లవోద్యమ నాయకుల కేసులను కోర్టులో వాదించారు. బూటకపు ఎంకౌంటర్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు నడిపారు. రాజకీయ ఖైదీల విడుదల కోసం ఏర్పడిన కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ అధ్యక్షుడిగా, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కన్వీనర్‌గా, పదేళ్ళ ఐక్య విప్లవోద్యమం సందర్భంగా వర్గపోరాట రాజకీయాలను చర్చించడానికి ఏర్పడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ్యుడిగా ఆయన పని చేశారు. విస్తారమైన, బహుముఖీనమైన సామాజిక రాజకీయ సాహిత్య జీవితం గడిపిన బొజ్జా తారకం గారు అన్ని ప్రగతిశీల శిబిరాలకు సన్నిహిత మిత్రులు.

ఎన్నో ప్రజాసంఘాల వేదికలపై ఆయన ప్రసంగించారు. వందలాది చర్చలు, వీధి పోరాటాలతో, నిత్య నదీ ప్రవాహం ఆయన జీవితం. వ్యవస్థపై రాజీ లేని పోరాటం చేసిన బొజ్జా తారకం బ్రైన్ ట్యూమర్‌తోనూ పోరాడారు. అనారోగ్యం నుండి కోలుకుని మళ్ళీ ప్రజాజీవితంలో అడుగుపెట్టారు. డెబ్భై ఏళ్ళు ప్రజల కోసం ఆలోచనలు పోయిన మెదడు అలసిపోయి మళ్ళీ వ్యాధినబడి శాశ్వతంగా విశ్రమించింది. ఆయన ఆలోచనలు, ఆచరణ ప్రజాపోరాటాల్లో మిగిలే ఉంటాయి.

తాజాకలం : కామ్రేడ్ పి.జె. వర్ధన్ రావు 16 అక్టోబర్ 2016న తెనాలిలో అనారోగ్యంతో మరణించారు. ఆయన అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో రాడికల్ యువజన సంఘం (ఆర్.వై.ఎల్.) తొలి అధ్యక్షులుగా, తొలితరం విప్లవ రచయితల సంఘం సభ్యులుగా, ప్రగతిశీల సాహిత్య అభిమానిగా, సామాజిక ఉద్యమాల నాయకుడిగా, కార్యకర్తగా సుపరిచితం. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ఆయన స్మృతికి విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. ఆయనపై రచనలు వచ్చే సంచికలో అందిస్తాం. - సం.

అరుణతార నిర్వహణ, శాశ్వత నిధుల కోసం మా ప్రకటన చూసి **ఆనందబాబు** - నందిగామ, రూ.1,000/-, **కె. శివలక్ష్మి** - హైదరాబాద్ రూ.3,000/-, **ఎం.ఎస్. లక్ష్మి** - హైదరాబాదు, రూ.1,000/-, **దాసరి వెంకట్** - హైదరాబాదు, రూ.2,000/-, **ఎ. గాంధీ** - హైదరాబాద్, రూ.1,500/-, **అరుణ్** - కొత్తపల్లి, రూ.1,000/-, **పొరుగు రాష్ట్ర అరుణతార మిత్రులు**, రూ.5,000/-, **ఒక సాహిత్య అభిమాని**, రూ.25,000/- విరాళంగా ఇచ్చారు. వారికి ఉద్యమాభినందనలు. - సం.

ఎడిటర్

దువ్వూరి వెంకట రామక్రిష్ణారావు

రచనలు, విరాళాలు

పంపించాల్సిన చిరునామా:

ఎం.ఐ.జి. - 14, ఎ.ఫి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ పంపవచ్చు

కార్యాలయం:

12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్,
తార్నాకా, హైదరాబాద్-500007.

సంపాదకవర్గం:

ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

విరసం కార్యదర్శి చిరునామా

పి. వరలక్ష్మి

5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి. టి. పి. అండ్ లే అవుట్

ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి

కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి, ఆర్. భాగ్యలక్ష్మి

ఫొటోలు :

క్రాంతి, ఎస్. చంద్రయ్య, విరసం మిత్రులు

Like Page:
//viplava rachayitala sangham arunatara

facebook :
//viplava rachayitala sangham virasam

Virasam website :
www.virasam.org,
www.virasam.in
www.arunatara.in

గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను ఫిబ్రవరి 2016 సంచిక నుంచి రూ. 20 కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఫిబ్రవరి 2016 సంచిక నుంచి అరుణతార సంచికల క్రమాన్ని సంపుటి 44 గాను సంచిక 1 గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. - సం.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

విషయసూచిక

పాట / కవిత్వం (7-13)
నీలాకాశంలో అరుణతార - **తంగెళ్ల సుదర్శనం**
శృతి స్మృతి- **నాగేశ్వర్**
తుపాకీ నీడన నల్లతాచు - **బైదల అంజయ్య**
సూర్యచంద్ర కవితలు రెండు - కాశ్మీర్, నెత్తుటి వసంతం
యే పబ్లిక్ హై - **ఉదయమిత్ర**
మోదీ పాటకు చరమగీతం - **ఖలందర్**
ఓబులేసు కవితలు మూడు - కలల తోపుల్లో నా రాయలసీమ, సీమ రైతు గోడు, అస్పృశ్యత
సొంతూరు - **పెరుమాళ్ మురుగన్**
పలకని పిల్లంగోవి - **మహమూద్**
శాఖమూరి రవి కవితలు నాలుగు - పిడికిలి, ప్రేమ, అంధులు, వెన్నెల వర్షం
నాగేశ్వర్ కవితలు రెండు - ముంపు దుఃఖం, బతికి బట్టకట్టాలంటే..
యుద్ధభూమిలో మట్టిమల్లెలు - **అశోక్ కుంభం**

కథలు (14-24)
స్టోరి ఆఫ్ వరాహ - **పి. చిన్నయ్య**
ఘర్‌వాపసీ - **ఉదయమిత్ర**

ప్రకటన (24)
ప్రజల మనిషి తారకంగారికి నివాళి - **పి. వరలక్ష్మి**

వ్యాసాలు (25-42)
దళిత, విప్లవోద్యమాల వారధి తారకంగారు - **దుడ్డు ప్రభాకర్**
అంబేద్కరిస్టు దళిత ఉద్యమాన్ని చిత్రించిన పంచతంత్రం - **కె. సత్యనారాయణ**
అమరుడు బొజ్జా తారకం 'నది పుట్టిన గొంతుక' - **వరవరరావు**
'కులం-వర్గం' తారకంగారి దృక్పథం - **పాణి**
కశ్మీర్ సమస్య: యుద్ధ ప్రేలాపనలు - **ఎ. నర్సింహా రెడ్డి**

పుస్తక పరిచయం (43)
మత ఫాసిజాన్ని నిరసించే జీలానీబానూ కథలు - **బాసిత్**

ప్రసంగ పాఠాలు (46-55)
నేనెందుకు రాస్తున్నాను? - **పి.వరలక్ష్మి**
తప్పని అవసరంగా రచన - **పద్మకుమారి**
దక్షిణ కోస్తా రాజకీయ ఆర్థిక పరిణామం - రచయితల బాధ్యత - **నల్లూరి రుక్మిణి**
నాకు నచ్చిన నా కథ - **తాయమ్మ కరుణ**

జ్ఞాపకం (55)
తారకం గారితో ఓ జ్ఞాపకం - **వల్లూరి రుక్మిణి**

సోషలిజమే ప్రత్యామ్నాయం (56-61)
శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం: విజయాలు, వైఫల్యాలు - **బి.ఎస్.రాజు**

పుస్తక పరిచయాలు (61-62)
అభివృద్ధి ముసుగులో విధ్వంసం - **సాగర్ బొప్పూడి**
కైఫీ, నేనూను - **కృష్ణాబాయి**

సీరియల్ (63-66)
కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు - 2 - **లూయిస్ కాస్ ఫ్రై**, అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

www.virasam.org అంతర్జాల పత్రికలో గత రెండు సంచికల్లో వచ్చిన రచనల విషయసూచిక:

(సెప్టెంబర్ 1 సంచికలో)
సింగూరు తీర్పు-సంపాదకీయం-పి. వరలక్ష్మి
మరో ఆదివాసీ యువకుడు...-దండకారణ్య సమయం-క్రాంతి
ఐశ్వర్యం.. ఆకలి-వ్యాసం-ఎస్. మల్లారెడ్డి
నీ పేరేంటి?-కథ -ఆర్. శశికళ
యుద్ధ ప్రకటన-కవిత్వం-నరేష్కుమార్
మస్వాల్-కవిత్వం-కేక్యూబ్ వర్మ
వర్షం-కవిత్వం- ఎస్. చంద్రయ్య
పేగుబంధం-కవిత్వం- ఉదయ మిత్ర
రహస్య ఒప్పందం-కవిత్వం-గీతాంజలి
దేవతా-దెయ్యమూ-సంభాషణ-మిసిమి
ఇవాళ్టి రచన-కొన్ని ప్రశ్నలు-సంభాషణ-వరవరరావు
సీమ విద్యార్థులు ఆలపించిన కరువు రాగాల 'కన్నీటి కెరటాలు'-సమీక్ష-పి. వరలక్ష్మి

సెప్టెంబర్ 15 సంచికలో
సాగర్, శృతి అమరత్వంలోని అర్థం ఏమిటి? -సంపాదకీయం-తరుణ్
చిత్రకూట్... చైతన్య ప్రవాహం-వ్యాసాలు-సరస్వతి రమ
నో, ఐ డోన్ట్ లైక్ టమాట-కవిత్వం-రివేరా
లాంతరు..- కవిత్వం-సుదేచె
స్మృతి చిహ్నాలు... పోరాటపు గుర్తులు-సమీక్ష-సాగర్
మృత్యుంజయులు మొద్దుగుట్ట అమరులు-పుస్తకం-ప్రచురణ: అమరుల బంధు మిత్రు సంఘం
వివేక్ స్మృతిలో...-దండకారణ్య సమయం-పెన్నేరు
ఉనా ఉద్యమం-దళిత, ముస్లిం ప్రగతివాద రాడికల్ ఎజెండా-సంభాషణ-జిగ్నేష్ మెవాని
రాజకీయ ఖైదీలు-చావు బతుకుల్లో కె. మురళీధరన్ (అజిత్)-వ్యాసం- వరవరరావు



అరుణతార సంపాదకులకు..

అరుణతార చాలా ఏళ్ల నుంచి క్రమంగా చదువుతున్న పాఠకుడిని. రష్యా విప్లవం వందేళ్లు, సాంస్కృతిక విప్లవం యాభై ఏళ్ల సందర్భంగా మీరు కార్యక్రమాలు తీసుకోవాలనుకోవడం సంతోషంగా ఉంది. రష్యన్, చైనీస్ లిటరేచర్ ఈ సందర్భంగా మరోసారి పరిచయం చేస్తే మంచిదని నా సూచన. ఇప్పుడు ఆ సాహిత్యాలను పట్టించుకునే వారు విప్లవకారులు తప్ప మరెవరూ లేరు. విరసం ఆ పని చేస్తే మంచిది. సోషలిజమే ప్రత్యామ్నాయం అనే శీర్షికలో అప్పటి అనువాద వ్యాసాలు కూడా వేస్తే బాగుంటుంది.

విప్లవాభివందనాలతో..

సంతోష్ బాబు

ఖమ్మం

డియర్ కామ్రేడ్..

అమరుడు కా. కాశీపతి గారి గురించి గత సంచికలో వరవరరావుగారు రాసిన వ్యాసం చాలా బాగుంది. ఆ రోజుల్లో ఆయన ప్రసంగాలు చాలా ఇష్టంగా వినేవాళ్లం. ఎక్కడ మీటింగ్ ఉన్నా కాశీపతి, జ్వాలాముఖి మాట్లాడుతున్నారంటే తప్పక మేం వెళ్లేవాళ్లం. విరసం సభల్లో అయితే వీరితోపాటు త్రిమూర్తులు, కెవిఆర్ మాట్లాడుతుండేవారు. చాల రోజులు కాశీపతి గారు ఎక్కడ ఉన్నదీ, ఏం చేస్తున్నదీ తెలియదు. ఆయన అమరుడయ్యాకే తెలుసుకున్నాం. చాలా బాధగా ఉంది. ఉద్యమంలో పని చేసినంతకాలం చాలా కమిట్‌మెంట్‌తో పని చేశారు. వరవరరావుగారి వ్యాసం చదువుతూ ఉంటే ఆరోజుల్లో కాశీపతిగారి ప్రసంగాలు గుర్తుకు వచ్చాయి. ఆయన బాగా పాడేవాడు. గొప్ప మేధావి. మా ఫీలింగ్ ఇలా మీతో పంచుకోవాలనిపించింది.

శేఖరప్ప, రాజశేఖరరెడ్డి

అనంతపురం

ఎడిటర్ గారికి..

ఆగస్టు సంచికలో మహాశ్వేతాదేవి గురించి వచ్చిన వ్యాసాలు చాలా విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. సెప్టెంబర్‌లో బాసిత్ రాసిన వ్యాసం కూడా మహాశ్వేత దేవి రచనలపై మంచి అంచనా అందించింది. దండకారణ్య ఉద్యమ సమయంలో గిరిజనుల గురించి అప్పట్లోనే ఎంతో కమిట్‌మెంట్‌తో రాసిన మహాశ్వేతాదేవి సాహిత్యానికి ప్రాధాన్యత ఉంది. అయితే ఒకతల్లి గురించి ఎవరూ రాయలేదు. అతి పెద్ద ఖాళీ. ఆ నవల గురించి రాయకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆమె ముఖ్యమైన రచనల మీద విడివిడిగా రాసి ఉంటే ఈ తరం పాఠకులకు బాగుండేది. ఈ విమర్శ గురించి ఆలోచించగలరు.

జి. వెంకటనారాయణ,

హైదరాబాదు.

పాఠకులకు మనవి

అరుణతారలో వస్తున్న రచనల మీద ఉత్తరాలు, సెల్ ఫోన్ మెసేజ్‌లు, ఎక్కువగా మెయిల్స్ వస్తున్నాయి. అయితే వాటిలో ఫలానా రచన బాగుందని మాత్రమే చాలా వరకు ఉంటున్నాయి. అప్పుడప్పుడు ఏదో ఒక రచన బాగా లేదని ముక్తసరిగా అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ అభిప్రాయాలను అరుణతార తప్పక గౌరవిస్తోంది. అయితే ఒక రచన బాగున్నా, బాగలేకపోయినా ఎందుకు మీకు అలా అనిపించిందో కొంచెం వివరాలతో రాస్తే పత్రిక నిర్వహణకు, ఆ రచయితలకు కూడా ఉపయోగంగా ఉంటుంది. అరుణతారలో రావాల్సిన రచనలపై కూడా మీ సూచనలు ఇస్తే మరీ మంచిది.

సంపాదకవర్గం

విరసం అంతర్జాల పక్ష పత్రిక

www.virasam.org కి రచనలు పంపండి.

మిత్రులారా..

విరసం వెబ్ మాగజైన్‌ను సాహిత్య, విప్లవాభిమానులు ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. కొన్ని రచనలను విరివిగా చదువుతున్నారు. వీడియోలపట్ల చాలా ఆసక్తి చూపుతున్నారు. అయితే రచనల అవసరం చాలా ఉంది. కవిత్వం, వ్యాసాలు, అనువాదాలు, పుస్తకసమీక్షలు పంపించండి. సామాజిక సమస్యలపై ఎప్పటికప్పుడు విశ్లేషణ వ్యాసాలు రాయండి. అరుణతారకు రచనలు పంపించి సహకరించినట్లే అంతర్జాల పత్రికకు కూడా పంపించాలని మనవి. మీ రచనల కోసం ఎదురు చూస్తున్నాం.

www.virasam.org team

site e-mail ID : virasam1970@gmail.com

నీలాకాశంలో అరుణతార

తంగెళ్ల సుదర్శనం

నీలాకాశంలో అరుణతారయ్యి మెరిసిండు
బొజ్జాతారకం పేద ప్రజలకు అండగ నిలిచిండు
హక్కుల పోరయి కదిలిండు ॥నీలా॥

ధిక్కార స్వరమమ్మో పీడిత ప్రజలా గొంతమ్మో
దోపిడి శక్తుల నెదిరించాలని దారే చూపిండు
పోరు బాటన నడిచిండు ॥నీలా॥

దళిత జాతి కంట భూమి దక్కాలన్నాడు
కుల వర్గాలను కూల్చివేసి సమసమాజమన్నాడు
ఆ కలలే కన్నాడు ॥నీలా॥

మనువాద బోధనలనూ మట్టుబెట్టాలనియండు
దళితుల మీద అగ్రకులాల దాడులు చెల్లవనీ
దండోరా వేసిండు ॥నీలా॥

ఎన్‌కౌంటర్లన్నీ పచ్చి బూటకమన్నాడు
కాల్చి చంపిన పోలీసోల్లపై కేసుబెట్టమండు
వాళ్ళకు శిక్షలేయమండు ॥నీలా॥

బాసగూడలోన ఆదివాసుల గుండెల్లో
గుండ్లు దించితే కదిలిపోయి కన్నీరేగార్చిండు
ప్రజా కోర్టై నిలిచిండు ॥నీలా॥

మేడారం అడవుల్లో తెలంగాణ సర్కారోడు
శృతి సాగరులను చంపిన తీరుకు చలించిపోయిండు
ప్రజాస్వామ్య వేదిక అయిండు ॥నీలా॥

శృతి స్మృతి

నాగేశ్వర్

చిటారు కొమ్మల్లో చిలుకమ్మ వినవే... చిలుకమ్మ కనవే
చిన్నారి చెల్లెమ్మ జాడ తెలిసిందా... పోరు తెలిసిందా

ఓరుగల్లు జిల్ల వడ్డేపల్లిలో పుట్టిపెరిగింది
ఉన్నత చదువొదిలి పోరు సాగింది... తూరుపయ్యింది ॥చిటారు॥

మధ్య తరగతి మంగలోల్ల బిడ్డంట పేరు శృతి అంట
ఉగ్గుపాలతో పోరు పాట నేర్చింది... పాట పాడింది ॥చిటారు॥

చాయ నలుపుదమ్మ చదువుల్లో దిట్ట తంగెళ్ళబిడ్డ
బక్కపలుచనిదమ్మ బందుకుపట్టి... బతుకుపోరెళ్ళె ॥చిటారు॥

తెలంగాణ ఉద్యమంలో కదిలింది ముందు నడిచింది
ప్రజా తెలంగాణ తనదారి అంది... జన స్వప్నమంది ॥చిటారు॥

స్త్రీలపై జరిగేటి హింస జూసింది ఇంక చాలంది
పోలీసు రజినికి న్యాయమడిగింది... న్యాయమేదంది ॥చిటారు॥

ఖమ్మం కరీంనగర్ వరంగల్లు జిల్లా పోరు కమిటీల
సాయుధ గెరిల్లా పోరు మహిళమ్మా... మన చెల్లి మహిత ॥చిటారు॥

సమ్మక్క సారక్క అడుగుజాడల్లో... పోరుదారుల్లో
ఎన్నెలెలుగయ్యింది చీకటిండ్లల్లో... కూలిబతుకుల్లో ॥చిటారు॥

తెలంగాణ సర్కారు గ్రేహౌండు మూకలు కెసిఆర్ తోకలు
మేడారం అడవుల్లో పట్టుకొని చంపి... ఎన్‌కౌంటరనిరి ॥చిటారు॥

చిలుకమ్మ ఎందుకో చిన్నబోయింది కంట ఏడ్చింది
ఆ కన్నీటి చుక్కల్ని కత్తులుగ జేసింది... శత్రువును చూసింది

తుపాకీ నీడన నల్లతాచు

తైదల అంజయ్య

చిమ్మంజీకట్ల జెడలిరబోసుకున్న ఊడల మర్రి కింద
తోడేళ్ళు గుంటనక్కలు కలిసి కుట్రల్ని పంచుకున్నాయి
దయ్యాల మేడలో ఎముకల సింహాసనం మీద కూర్చుండి
పైడి కంటె పగలూ రాత్రనకుండా కూస్తూనే ఉన్నది
భూమిని నోట్ల కట్టలుగా చుట్టిన విషపు కడలి మీద
రాజా యోగ నిద్రలో కునుకుతున్నాడు
వేటకత్తులు, తుపాకులు రాజ్యం నీడలోంచే పొంచి చూస్తాయి
ఆధునిక ఆయుధం నల్లతాచు వలె నాలుకలు కోరుతూ ఉంటుంది
భూమి సూర్యుని చుట్టూ తిరిగేది నిజం
మరి భూమిని చుట్టుకున్న ఈ పాములెక్కడివి?
పాములకు గద్దలకు పగుండాలెగని పక్కపక్కనే తిరుగుడేంది?
ఆసమాన సీకటి అదును రాతిరి
ఎండిన తుమ్మచెట్టు మీద కాకులు పొదిగిన గూటిలో కాలనాగు పుట్టింది!
ఎదురు యుద్ధం చేయని వాన్ని చూసి యముడు కొంచెం అనుమానపడ్డాడు!
బస్తాల నిండా దాచుకున్నవాని ధన దాహాన్ని చూసి
కరెన్సీ నోట్ల కట్టలు ఫెళఫెళమని నవ్వుకున్నాయి!
నాది నాది అన్న వాన్ని చూసి భూమి మాత్రం విరగబడి నవ్వింది

నల్లని ముసుగులోంచి ఈ లోకాన్ని చూసి వాడు కూడా నవ్విండు
వాని కోరలు బుల్లెట్లై మెరిసినయ్!
ఖాకీ ఖద్దరుల సంతానం వాడు
ఖాకీ వనంలో గంజాయి మొక్కల్ని పెంచింది వాడు
ఈనాటి సరికొత్త రాజకీయ విష రసాయనం వాడు
శవాల మీది నుంచి నడుచుకుంటూ వెళ్ళి
వాడు కూడా శవమై మిగిలిండు
మనకు తన తోకను తానే తింటున్న పెంపుడు పాము కనిపించింది
మనమేం ఆశ్చర్యంతో నోరు తెరవలేదు
భూమి నోరు తెరిచింది
నింద ఎప్పటినుంచో ఉన్నది గానీ
వాని బొందే ఆలస్యంగా తెగింది.

సూర్యచంద్ర కవితలు రెండు

కాశ్మీర్

రాళ్ళ పెదాలపై నీ మునివేళ్ళ
సంతకాన్ని
సీతాకోక చిక రెక్కలపై
స్వేచ్ఛా గీతంగా అనువదిస్తున్నా...

బుల్లెట్ల బృందావనంలో దళాబ్దాలుగా
నెత్తురు స్రవిస్తున్న నీ కలల దోసిళ్ళలో
అరుణారుణ అక్షరాలను కుమ్మరిస్తున్నా...

చిత్రహింసల పాపాన్ని...
నెత్తుటి హోళీలో ముంచేస్తు....
"గౌకాడాల్" కన్నీటి అలలపై
ప్రతిఘటనా వసంతాన్ని
పూయించిన నీవే...

నెత్తుటి వాకిలిలో
వేకువను వినదిస్తున్న
మంచుపూల గుండెల్లోకి చొరబడుతున్న
తుపాకీస్వామ్యాన్ని...
సామూహిక సమాధుల
సుడిగాలివై ధ్వంసం చెయ్....

నెత్తుటి వసంతం

నేల గాయం నుంచి
ఉబుకుతున్న నెత్తురు
వసంతాన్ని వాగ్దానం చేస్తే
అదీ.... కాశ్మీర్....

కడుపు పండిన కుంకుమపువ్వుపై
ఇనుపగాయాల ఒడ్డున...
బిగి పిడికిళ్ళు ఉదయిస్తే...
అదీ కాశ్మీర్...

కనుసైగల సంగమంలో
వెలుగుతున్న రాత్రిని....
పొదలమాటున ఉరితీసినప్పుడు....
దుఃఖాన్ని ఒడిలోకి తీసుకున్న వేకువ
రాళ్ళ వర్షంతో కలిసివస్తే...
అదీ కాశ్మీర్....

పాలుగారుతున్న బాల్యంపై
కొలాష్నికోవ్ కల్లోలం కమ్మినప్పుడు
కన్నీటి కెరటాలపైన
వేల గొంతుకలు విచ్చుకుంటే...
అదీ కాశ్మీరే....

దుఃఖానికి, దాహానికి
అంటుగట్టిన "పురాణాలను" ఇదిగో...
నీ క్రోధాగ్నిలో దహిస్తున్నా...
నా ప్రియమైన యుద్ధభూమి...
తుపాకీ కొసకు
తుపాను హోరుకు మధ్య
చిక్కుకున్న శాంతిని... కసిగా తరిమివేయి.

యే పబ్లిక్ హై

ఉదయమిత్ర

మొదలుపెట్టిందెవరు
ముగింపునిచ్చిందెవరు
నడుమపారిన రక్తనదులెన్ని

పాటను ముక్కనుజేసిందెవరు
పథకం వేసిందెవరు
హక్కుల రెక్కలు విరిచిందెవరు
హంతకుడి జాడను తుడిచిందెవరు

ఉరితీయవలసినోళ్ళే
ఊరిమీదకు వొదిలిందెవరు
విజన్ పేరుమీద
విద్రోహంజేసిందెవరు

నిన్నటిపురుగు

నేడు వేయితలల విషనాగు ఎట్లయ్యింది
నిన్నటిసూది
నేడు దారుణ మారణాయుధమై
పొగలుగక్కిందెవరి మీద
నడిచిన
ఇనుపముళ్ళ రథచక్రాలకింద
నలిగిన బతుకులెన్నెన్ని

అరెయార్ !
యే పబ్లిక్ హై !
యే సబ్ జాన్ తిహై !
ఎవరిని మభ్య పుచ్చుతున్నారు
ఏ తల్లిని సామూహిక హత్యాచారంజేసి
ఏ బిడ్డనిమీద సానుభూతి ఒలకబోస్తున్నారు
తెలిసిన చరిత్ర వెనుక
తెలియని చీకటి కోణాలెన్నెన్ని

రక్తమంటిన ఆయుధాన్నిగాదు
వాడిన శక్తుల పట్టిచూపాలి

కవిత్వాన్ని కుప్పబోయడంగాదు
కరకు కత్తులజేసి
వ్యవస్థ విషపు వేళ్ళను
తెగనరుక విసరాలి.

మోదీ పాటకు చరమగీతం

ఖలందర్

నిద్ర ముంచుకొస్తోంది
అయినా మోడీ పాట వినిపిస్తూనే ఉంది!
గుజరాత్ చావు గీతికలు వినిపించకున్నాయ్!!
'షే' నిద్రపోనివ్వరా?
మోడీ 'హిట్లర్ ఫిడేల్'నే వాయిస్తున్నాడు
'నాజీ' ఆనందాతిశయంతో, కాషాయగీతాల్ని
సింహాసనం రచిస్తూనే ఉంది!
సున్తీ మొలలకు కాషాయం చుట్టే ప్రయత్నంలో
పడిఉంది!!
మోడీ మోడ్రన్ హీరో గొడ్డుమాంసం తినే
ఒబామే కదా!
మరి దేశీయ గొడ్డు మాంసం.....
డామిట్! కథ ఎందుకడ్డం తిరిగేయబడింది!?
భారత వనితకు కాషాయం చీర కట్టే
ఉన్మాదం ఏపాటిదీ?
పుచ్చుతలలకు
చరిత్ర రచనలెన్నటికీ తలకెక్కవు!
ఒక పక్క అమరికాకు 'జయహో'
మరో పక్క జనవరి ఫస్టుకు ఎందుకో నిరసన?
ఇంకో పక్క ప్రేమికుల దినానికెందుకో తద్దినం?
రాఖీల రెక్కలకై
ఎందకన్ని ఆర్భాటాలూ? ఆయాసాలూ?
దేశమంటే మట్టే అనుకునే వీళ్ళు
మట్టిదిబ్బలకు కాషాయం నగిషీలు
చెక్కుతూనే ఉంటారు!
వీళ్ళనందర్నీ నగ్నంగా ఊరేగించే సందర్భమిది!

ఓబులేసు కవితలు మూడు

కలల తోపుల్లో నా రాయలసీమ

ఇదేమిటి?
ఇలా నీడలా నన్నంటి
ఎన్ని కోణాల నుంచో
ప్రతిబింబిస్తూ
వెలుతురులా తాకుతూ
ఇన్నాళ్లూ ఏమైంది?

కృష్ణా పెన్నా పాయల్లో
ఏళ్లకేళ్లుగా కలల తోపుల్లో
నెరజాణలా కవ్విస్తూ
కృష్ణ తుంగభద్ర నదుల్లో
చైతన్య పుష్పంలా
యథేచ్ఛగా పారే జల పాయలా
అణువణువూ ఉద్యమ పులకితమై
ఇన్నాళ్లకు నా రాయలసీమ

విద్యార్థుల ఎగసే పిడికిళ్ళలో
నినాదాల ఊపిరి పోసుకుని
జీవచ్ఛవాల్లా బతికే సీమ బతుకుల్లో
తూర్పు తలుపులు తెరుస్తోంది

సీమ రైతు గోడు

భూమిని నమ్మి తెచ్చిన అప్పు కుప్ప మాదిరి పెరిగె
ఎండిన పొలం గుండె చితికిపాయె
అప్పు ఇచ్చిన బ్యాంకోడు ఇంటి మీద పడే
ఇయ్యడానికి పానం తప్ప ఏమీ మిగల్ల్యా

కృష్ణ తుంగభద్ర పరవళ్ళు తొక్కినా
సీమకు చుక్క నీరు అందకపాయే

ఎంతచేసినా, ఏమి చేసినా
భూమి నుండి బువ్వ రాకపాయె
ఓట్లేయించుకున్నోడికి ఇదేమీ కానరాకపాయె
జనంతో చాలగాటమాయె

నీల్లు లేక పల్లెలు తనకలాడే
ఆకలి చావులు, ఆత్మహత్యల వల్లకాటి సీమాయె
నోరెండిన బీళ్ళు, మూగబోయిన బోర్లు
ఎవరికి చెప్పాలో తెలీక
నీటి చుక్క కోసం సీమంతా ఆకాశం వైపు ఎదురు చూసె

పండించిన ఒక్క పంట కూడా చేతికి రాకపాయె
గాసం కోసం నోర్లెల్లబెట్టే డొక్కలెండిన గొడ్లు
రైతుకు కడుపులో దేవినట్లాయె
గోదేవరికి ఎల్లబోసుకోవాలో తెలియకపాయె
పల్లె బతుకులు భారమయ్యి, గొడ్డు గోదా వదులుకొని
మూట ముల్లె సర్దుకొని, పొట్టకూటి కోసమే
దేశమిడిసి బయలుదేరె

అస్పృశ్యత

పశువులు చస్తే చర్మమొలిసి
ఊరి బయటకు తీసుకొచ్చి
కంపునంత మింగుకుంట
కాళ్ళజోడు మేము చేస్తే
వయసులేని పిల్లగాడు
అరెతొరె అంటాడు
మురికి పనులు చేసెటోడ
ముట్టకురా మమ్మల్నని మూలకు నెడతారు

నీకు ఓటువేసినందుకు
ప్రశ్న నేర్పిన వేముల రోహిత్ ను చంపేసి
ఉనాలో నీవు చెప్పే ధర్మం పాటించనందుకు
దారుణంగా కొట్టి కసిగా నవ్వుతున్నావు

నన్ను ఊరి బయట వెలివేసిన
అంటరానితనాన్ని భుజాలపై మోపినా
నీ ఎదుట కుర్చీలో కూర్చోబెట్టకపోయినా
నీవు నన్ను మనిషిగా చూడలేకున్నా
భరించగలను, నాకు అనుభవం ఉంది!

కానీ
అరణ్యంలో ఆటలాడి
తుపాకితో నాట్యమాడి
అడవినంత ఛేదించినవాన్ని
సముద్రంలా ఉప్పొంగి
రేపు జనసంద్రాన్ని కదిలించినపుడు
నీలోని మనువాద మృగాన్ని చంపుతుంటే
ఆ పరాభవం, అపజయం
నీవు భరించలేవు, నీకు అనుభవం లేదు కదా!

చీకటి బతుకులకు ఎదురువెళుతూ
ఆశయాలన్నీ ఒక్కటైతే
మనువాద అహంకారం ముక్కలవుతుంది
హిందూ మతోన్మాదం చెక్కలవుతుంది
శ్రామికులంత ఒక్కటయితె ధరణి వణుకుతుంది

పున్నమి వెన్నెల నన్ను హేళన చేస్తుంది
దరిద్రపు చీకటినని
తనకు తెలీదు పాపం
విప్లవజ్యోతి ప్రజ్వలిస్తుందని.

సొంతూరు

పెరుమాళ్ మురుగన్

సొంతూరా! అదెక్కడ?
అడిగేటప్పుడు తొందరపడొద్దు
సొంతూరు నుండి
సొంతబతుకు నుండి
విసిరేస్తున్న కాలమిది
గాయాన్ని మరింత రేపొద్దు
కొందరు తమ సొంతూరు గూర్చి
ఏమీ చెప్పలేకపోవొచ్చు
కొందరు సొంతూరు గురించి
ఇంకా కలలుగంటుండవొచ్చు
కొందరు తమ సొంతూరి గూర్చి
మెల్లమెల్లగ మర్చిపోవొచ్చు
నడిచినడిచి అలిసి అలిసి
తమ జ్ఞాపకాల మడతల్లో
దాన్ని మడిచి పెట్టెయ్యవొచ్చు
కొందరు భూమ్మీద
ఎన్నేసి తరాలు బతికినా
అదెప్పటికీ
వాళ్ళ సొంతం గాకపోవొచ్చు
ఉన్నూరిలో కన్నూరిలో
పరాయోళ్ళలాగ
బతుకు నీడ్వవొచ్చు
కొందరిని
మొక్కనుపీకి పెంటమీద
విసిరేసినట్టు
తమ జ్ఞాపకాలతో సహా తీసేసి

సొంతూరు నుండి
బయటకు తరిమేయవొచ్చు
అసలు
బతుకే సంచారమైన చోట
కొందరికి సొంతూరే
తీరని కలగా మిగలవొచ్చు

(THE HOMETOWN కవితకు స్వేచ్ఛానువాదం ఉదయమిత్ర)

పలకని పిల్లంగోవి

మహమూద్

1

ఆదిమ మట్టికి పూసిన నల్లగులాబి
ఊగుతున్నది ఆశల పల్లకి
గాలిని దూరనీయకుండా నిండిన ఎడారి
వాడో పలకని పిల్లంగోవి

2

వాడు నల్లవాడు
మనిషిగా ప్రపంచ యాత్ర మొదట
మొదలుపెట్టినవాడు
వెన్నెలను ఉంగరాల జుట్టుగా పేనుకున్న
నల్లనయ్యలా వాడు
ఎడారి మీంచి వీస్తున్న వేడిగాలి సెగశూలాలతో
తనను తాను పొడుచుకుంటున్న రాత్రి వాడు
ఎవరికి పుట్టాడో గాని ఎవరిని ఉద్ధరించాలనుకున్నాడో గానీ
అంతర్యుద్ధపు దుఃఖాంతరమంగా
ఎండిన ఏర్లు దాటి అంతర్జాతీయ రేఖలు దాటి
దేశాల చట్టాల చూపుతో చుట్టరికం కలవకపోయినా
కదులుతున్న కరవు నేల వాడు
వేకువజామున తల మీద కురిసిన మంచుబిందువులను
కరిగించుకొని దప్పిక తీర్చుకునే
సవన్నా గడ్డిభూమి వాడు
గుప్పెడు జీవితాన్ని ఏరుకోడానికి
ఖండాంతరవాసం చేయడానికి
సరిహద్దు రేఖలను దాటేస్తున్న
చీకటిఖండపు అమాయక రేరాజు వాడు
పొట్టలోపలి శూన్యం
పొడువాటి బరిసెలై బతుకు మీద
అడ్డగోలు రాతను రాసేస్తుంటే
రేకుల షెడ్డు రంధ్రాల్లోంచి సూటిగా దూసుకొచ్చే
ఉదయానికి వేలాడే భూమధ్యరేఖ వాడు
పరుల చేతులు పడి ధ్వంసమైపోతున్న
ఆఫ్రికా ఖనిజ సంపద దోపిడీని అడ్డుకోడానికి
బలిపీఠపు వేదికనెక్కి
ఆత్మగౌరవపు కవనగానం చేసిన కెన్సారో వీవా కలం రాల్చుకున్న
చిట్టచివరి కవితా స్వప్నం వాడు
అర్ధరాత్రి దాకా ఓ అనామక దేశపు వీథులన్నీ తిరిగి
అర్ధాకలి పడకను కటికనేల మీద పరుచుకొని
పేగుల ఆక్రందనను అరచేతులతో ఓదారుస్తూ
నేలమీద పాకుతున్న బొద్దింక చూపుతో చూపు కలిపి
కలత నిద్ర మీద తెరుచుకున్న అస్పష్ట భవిష్యత్కలల దీపాన్ని
వెలిగించుకున్న సహార మట్టిప్రమిద వాడు
దక్షిణ మధ్యధరా అలల మీద వాడి ప్రయాణం
ఉత్తరాన్ని తాకుతుందో
మధ్యలోనే మునుగుతుందో తెలియని
నిలువెత్తు ప్రమాదం వాడు
శ్రమించడం ఒక్కటే తెలిసిన శతాబ్దాల నీగ్రో వారసత్వం వాడు
తెలుపుదనానికి తెలుపుదనం అద్దుతున్న
అతి సుందర మనోహర మోహితాత్మ వాడు
ఐరోపా నిర్మాణాల గుండెకు రక్తం అందిస్తున్న బలమైన నరం
వాడు.

(సెనెగల్, ఐవరికోస్టు, గీని, అల్జీరియా, నైజీరియా లాంటి ఆఫ్రికా దేశాల నుంచి సహారాను దాటి మధ్యధరా మీదుగా హ్యూమన్ ట్రాఫికింగ్ అనే ఒక నెట్వర్కు ద్వారా యూరప్ దేశాల్లో భవిష్యత్ వెదుక్కుంటూ చావుకు తెగిస్తున్న యువతను చూసి)

శాఖమూరి రవి కవితలు నాలుగు

పిడికిలి

అలుముకున్న ఆశలు ఆవిరై
హృదయవేదన మేఘమై
కనుగుడ్లను ఆవరించిన
కన్నీరు కదలి కెరటమై ఎగురుతుంది

ప్రేమ

ప్రేమంటే అనురాగం ఆప్యాయతేనా
ప్రేమంటే కలిసి జీవించడమేనా
ప్రేమంటే వేళకింత తిండి పెట్టడమేనా
ప్రేమంటే అభిప్రాయాలను గౌరవించడం కాదా!

అంధులు

నాన్నా
అంధులంటే ఎవరన్నది పాప
నిట్టాడిలా కాళ్ళుండి
నిండుకుండలా కళ్ళుండి
పిడికిలి హృదయాన్ని కదిలించలేని
నిస్సహాయజీవి!

వెన్నెల వర్షం

హలాలు పట్టి పొలాలు దున్నే
కర్షక వీరుల కన్నుల నిండా
పారలు పట్టి పలుగులు ఎత్తే
సుత్తీ కొడవలి గుండెల నిండా

వెన్నెల వర్షం కురవాలంటే
గుమ్మిలు గర్షలు నిండాలోయ్
గుమ్మిలు గర్షలు నిండాలంటే
రాగులు, సజ్జలు, కందులు, మినుములు
మక్కలు, జొన్నలు, వడ్లు, పెసర్లు
పంటలు దండిగా పండాలోయ్

పంటలు దండిగా పండాలంటే
వాగులు వంకలు
ఏరులు కుంటలు
చెరువులు అలుగులు దున్కాలోయ్
చెరువులు అలుగులు దున్కాలంటే
రుతువులు నిండగా
మేఘం పండగా
వర్షం మెండుగా కురవాలోయ్
వర్షం మెండుగా కురవాలంటే
పల్లె పట్నం
కొండ కోన
అడవులు మెండుగ ఉండాలోయ్

అడవులు మెండుగ ఉండాలంటే
ఏరును తొలిచి మొక్కను చంపే
పురుగును పాతర పెట్టాలోయ్
పిల్లాపాప
పండూ ముసలి
మొక్కకు జీవం పోయాలోయ్
కొత్త మొక్కకు జీవం పోయాలోయ్

నాగేశ్వర్ కవితలు రెండు

ముంపు దుఃఖం

మీద ముంపు బోర్లించి
ఊర్లను
ప్రజలను
పచ్చటి పంట పొలాలను గుటకేస్తూ
కొండెత్తు మొలిచిన కొండచిలువ ప్రాజెక్టు
బంగారు తెలంగాణ కొండగుర్తట

నేను
నాతో పాటు ఊరు
ఒకేసారి పుట్టి పెరిగినం
ఇప్పుడేడికని పోతం

ఊరు నేను
ఒకే తల్లి బిడ్డలం కవల పిల్లలం
ఎట్లని ఎడబాత్తం

ఊరే నేను
నేనే ఊరు
ఊరొదిలి పెట్టడమంటే
తల్లీ బిడ్డ తలో దిక్కైనట్లుంటది

ఊరంటే
రెండిండ్లు
నలుగురు మనుషులు కాదు
భూమికి మనిషికి మధ్య ఉన్న
బొడ్డుతాడు సంబంధం

అభివృద్ధి అంటే
చెట్టు గుట్ట అడవి సమస్త ప్రకృతి
సమాధి కావడం కాదు
హరితం హారతి కర్పూరమై కరిగిపోవడం కాదు

ఊరొదిలి
గూడొదిలి
ఎట్లా బతుకుడని
నిరసన సెగ రగిలించినందుకు
లాఠీలు తూటాలు
రాజ్యమై వెంటబడ్డది

విశ్వాసం గల జంతువుకు
దొంగా దొర తేడా ఏం తెలుస్తుంది
యజమాని చేతి సైగలకు తోకూపుడు తప్ప
మల్లన్న సాగరం మంది మీద పడి కరవడం తప్ప

పిడికిలి పట్టుకొని
తిరిగినోడే కదా అని
నమ్మకం మీద
కుర్చీల కూర్చుండబెడ్తిమి

బంగారు తెలంగాణలో
నమ్మి నానబోస్తే
పుచ్చి పురుగుబట్టినట్టయ్యింది

బతికి బట్టకట్టాలంటే..

పాము
బుసకొడుతోంది
కాషాయ పాము
దేశమంతా
కుబుసం విడుస్తూ బుసకొడుతోంది
బతికుంటే
బలుసాకు తిని బతుకొచ్చు
వంత పాడుదాం పదండి
భారత్ మాతాకీ జై

చిత్రగుప్తుడే కాదు
మన ఆకు
ఇప్పుడెవ్వడైనా తెంపొచ్చు
యముడు
చిత్రగుప్తుడు
ఇప్పుడన్నీ సంఘపరివారమే
ఎందుకైనా మంచిది
ఘర్‌వాపసీ పోదాం పదండి...

కాషాయం కంకణం కట్టుకొని
త్రిశూలం వెంబడిస్తోంది
రండి రండి
మన దేశ భక్తిని నిరూపించుకోక తప్పదు
ఈ దేశంలో
బతికి బట్టకట్టాలంటే
హిందూమాతరం పాడక తప్పదు

రండర్రా... రండి
మోడి సుడిగుండంలో కొట్టుకుపోయి
అచ్చేదిన్ మునకలేద్దాం రండి

యుద్ధభూమిలో మట్టిమల్లెలు

అశోక్ కుంభం

యుద్ధభూమిలో
మట్టిమల్లెలు
కలలు కంటున్నాయి

ఒక అంతర్యుద్ధం
సామ్రాజ్యవాద కుట్రలతో
ప్రచ్ఛన్న యుద్ధమై
ఉన్మాదం చేతిలో
"పవిత్ర" యుద్ధమై
రూపాలు మారుతు
అపురూప పసి కుసుమాలను
మృత్యుముఖంలో
తలకిందులుగా వేలాడగట్టినా
ఆ మట్టిమల్లెలు
కలలు కంటూనే ఉన్నాయి

కలలు కనగలిగే కాలం కోసం
నెత్తుటి గాయాలు లేని బాల్యం కోసం
కారుణ్యం నిండిన లోకం కోసం

మట్టిమల్లెలు కలలు కంటున్నాయి

బాంబుల వర్షం వెలిసిపోయి
వీధులలో వెన్నెల కురిస్తే
రేయింబగళ్ళు కలయతిరుగాలని

ఆకాశాన్ని ఆక్రమించిన
యుద్ధ విమానాలు ఖాళీ చేస్తే
కేరింతలతో ఇంద్రధనస్సును చూడాలని

మాయమయ్యే మనుషులు
మాంసపు ముద్దలుగా తిరిగిరాని రోజులొస్తే
నిర్భయంగ దాగుడు మూతలాడాలని

దాడులు ఎరుగని భద్ర జీవితమొస్తే
శిథిలాలలో ఆనవాళ్ల వెతుకులాట మాని
పిల్లలంతా పిచ్చుక గూడ్లు కట్టుకోవాలని

చిరుదివ్వెలు కలలు కంటున్నాయి

కాటేస్తున్న కారుచీకటి అంతమయి
వెలుగు రేఖలు చిక్కబడుతాయని
మనిషిని మింగేసె మతం మాయమయి
చివరికి మానవత్వమే మిగులుతుందని!

యుద్ధభూమిలో
మట్టిమల్లెలు
కలలు కంటున్నాయి.

(యుద్ధభూమి సిరియాలో ప్రతిరోజు బలవుతున్న పసిజీవితాలలో ఎప్పటికైన వెలుగులు నిండుతాయనే ఆశతో ...)

స్టోరి ఆఫ్ వరాహ

పి. చిన్నయ్య

అధికారుల ఆదేశాల మేర జరిగే మొక్కుబడి కార్యక్రమాల్లో ఇదోటి. పర్యావరణ, పరిసరాల గురించిన సమావేశమనుకున్న సమయానికి ముందే పూర్తయి ఎవరడావిడిల వాళ్లున్నరు బయలదేరటానికి. ఎంఇవో ఆఫీసుల పనుండే, అది పూర్తి చేసుకుని బయటకొచ్చానో లేదో, జేబుల సెల్ మోగింది. కొలీగ్ యాదయ్య సారు నుండొచ్చినది. ఈ సమయంలో ఫోన్ చేయుటమేమిటి, అనుమానంతో కాల్ తీసుకున్ననో లేదో.

"సార్ఏడున్నారు?" గొంతులో ఏదో తత్తరపాటు

"ఇప్పుడే ఆఫీసు నుండి బయట కొస్తున్న ఎందుకు?"

"ఏం లేదు ఇంతకు ముందే స్కూళ్ల గొడవయింది"

"గొడవా, ఎందుకు?"

"నీ గురించే సార్!"

"నా గురించా?"

"అవును, మొన్న మీరు పిల్లలకు ఏదో కథ చెప్పినరంటగ, దాని గురించి!'

"కథ గురించా!" అర్థంగాక గొణుకున్నా, కాని మనసుల ఏదో కీడు శంకించసాగింది.

"అసలేమి జరిగిందో చెప్పు?" షాక్ నుండి తేరుకుంటడిగా

"మీరు చెప్పిన కథను రామాచారి పోయి వాళ్లింట్ల చెప్పినడట, ఆ కథిని వాళ్ల బాబాయి వెంకటచారుండెగా, కోపంతో ఇద్దరు ముగ్గుర్ని వెంటేసుకొని స్కూల్ దగ్గరకొచ్చిండు..."

విషయమర్థంకాసాగింది. వెంకటాచారి బావాలేమిటో తెలుసు. ఇది ఎటు మలుపు తిరుగుతుందో కాస్తా జాగ్రత్తగుండాల్సిందే. యాదయ్య సారింకా లైన్లనేఉన్నడు.

"వెంకటాచారి ఇంకా ఏమన్న అన్నడా?" మరిన్ని వివరాల కోసమడిగా

"అదే మీరు చెప్పిన కథల ఆవు కన్న పంది గొప్పదని, పంది దేవుడవతారమని, దేవుళ్లు, బాపనోల్లు ఆవును తిన్నరని, అంతెందుకు రాముడు గూడ తిన్నడని చెప్పిన వంట, ఏం కథలు లేనట్టు ఈ కథలేనా చెప్పేది, బడి పిల్లల్ని చెడగొడితే ఊరుకునేది లేదు, రేపొస్తమంటు పోయినరు..."

"మిగిలిన వాళ్లేమన్నరు?"

"చాలా అన్నరు సార్, గుర్తొస్త లేదు. ఎవరో 'ధర్మ ప్రచారక్' అట, ఎట్లనో మాట్లాడుతున్నడు. అసురులు ధర్మ వ్యతిరేకులు జాతి ద్రోహులంటూ ఏదేదో మాట్లాడుతున్నడు.. '

"సరే సాయంత్రం కలుస్తాం గదా, అప్పుడన్ని మాట్లాడు కుందాం' ఫోనాఫ్ చేశానుగాని, లోపల ఏదో ఓమూలసన్నటి భయం, ఆందోళన. వాళ్లు ఏదో చేస్తరని గాదు, ఎన్నబద్దాలు ప్రచారం చేస్తరోనని ఆఫీసు బయట గేటు దగ్గరే టీకొట్టుంది. పరిచయస్తుడే, స్ట్రాంగ్ టీ చేసిచ్చాడు. ఆ వేడి టి గొంతుల పడ్డాక మనసు కాస్తా తేలికైనట్టయింది. బస్టాండ్ వైపు నడిచా, బస్సు సిద్ధంగా ఉంది. అర్ధగంట ప్రయాణం. ఊరతనే పక్కనే కూర్చున్నడు, పలుకరించాలనే సోయి లేకుండా పోయింది. మనసు మనసులు ఉండటం లేదు. రకరకాల ఆలోచనలు.

రామాచారి ఎంత పనిచేసే! తాను చెప్పిన కథను వాడెట్లర్థం చేసుకొనే? వాడు చెప్పింది వాళ్ల బాబాయికెట్లర్థమయ్యే! చిన్న నిప్పురవ్వచాలు బగ్గు మనటానికి. ఇటువంటి వాటి కోసం కొంత మంది ఎదురుచూస్తున్నరు. అయినా గత సంవత్సరమే ఇతనితో ఓ చేదనుభవం ఉండనే ఉండే. ఆ సంఘటనకు సంబంధించిన ఉత్తేజం ఇప్పటికి వెంటాడుతునే ఉంటుంది...

ఆ రోజు దసరా పండగ దినం. ప్రతి సంవత్సరం ఆనవాయితిగొస్తున్నట్లు పటేల్ ఇంటి దగ్గరే గుడేసి ఆనపకాయో, మేక తలకాయో కొట్టాలన్నడు ఈ వూరు సర్పంచ్. అలాకాదంటూ ఆ ఊరు యువకులు కొంత మంది సర్పంచ్‌తో వాదనకు దిగినరు. తెలంగాణ ఉద్యమంలో తిరిగి కాస్త తెలివి సంపాదించుకున్నోళ్ళు. ఇంకా పటేళ్లు దొరలేంది, వాళ్ల ఇండ్ల దగ్గర కొట్టుడేంది. బురుజు దగ్గరున్న గడిమైసమ్మ గుడి దగ్గరో, లేదంటే గ్రామ పంచాయితి దగ్గరో కొడదామన్నరు. వెంకటాచారి అధికార పార్టీ సర్పంచ్‌తో కలిసి వాళ్ళను వ్యతిరేకించినడు. ఇద్దరి మధ్య గొడవయింది. దీనికి తోడన్నట్లు చూడుమని ఆ రోజే కొంతమంది అగ్రకుల, బిసి యువకులు 'రాక్షస సంహారం' చేయటానికి సిద్ధమయినరు. మాదిగ యువకులు పోయి రావణుడు, మహిశాసురుడు మా జాతి నాయకులు, వాళ్లనెట్ల కాలుస్తరో చూస్తమని హెచ్చరించి ఆపుచేయించినరు. వాళ్ళ ఉద్యమ నేపథ్యం చూసి తాత్కాలికంగా వెనక్కి తగ్గినరు అగ్రకుల, బిసి యువకులు

ఈ విషయాన్ని ఊర్ల సమర్థిస్తూ మాట్లాడిన. వెంకటా చారికెట్లర్థమయిందో ఏమోగాని స్కూల్‌కి వచ్చి, నీకులమతమేంది ఆకులపోళ్లనెట్ల సమర్థిస్తవంటు వాదనకు దిగాడు. ఒపిగ్గానే ఆర్యులనే వారు ఏ ప్రాంతాలవారో, ఈ ప్రాంతానికెందుకొచ్చినది,

ఈ ప్రాంతంలుండే స్థానికులు అనార్యులుగా అసురులుగా రాక్షసులుగా ఎందుకు పిలవబడ్డారో రావణుని, మహిషాసురుని చరిత్రర్థం చేయించటానికి ప్రయత్నించా. అంతావిని గూడ లేని పోని విషయాలు చెప్పుకుంట ఊరి పోరల్ని చెడగొడుతుంది నేనేనంటు ఆరోపణ చేసుకుంటు పోయినడు. ఇద్దరి మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే నడుస్తుందప్పటి నుండి.

అయినా, కథను ఏమైన పొరపాటుగా చెప్పానా? నా మీద నాకే అనుమానం. ఇటువంటి విషయాల్లో జాగ్రత్తగుంటానె, మొన్న జరిగిన సంఘటన, దాని జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటు సీటు మీదొరిగి కండ్లు మూసుకున్న...

మధ్యాహ్న భోజనానికి బియ్యమెన్ని పోయాలో వంటమనిషికి చెప్పి, లెక్కలు చూసుకుంటు కూర్చున్న. పైగా నెలాఖరు మంత్లీ రిపోర్టు పంపాలి. పని వత్తిడిలుండగా నరేష్ వేగంగా వచ్చి.

"సార్ రామాచారిగాడు నన్ను పంది కూర, పంది కూరంటుండు" ఎగబోసుకుంట చెప్పాడు.

"ఏందిరా గోల?" వెంటనే అర్థంగాలే, మళ్లీ అదే మాట చెప్పాడు.

విషయ తీవ్రతర్థమయింది. వెంటనే వాన్ని దగ్గరకు తీసుకొని

"ఏడన్నడీ మాటలు?" అడిగా

"క్లాసుల, అందరి ముందన్నడు...."

ఊహించని సంఘటన ఏంచేయాలో కొద్ది సేపటి వరకర్థంకాలే. టేబుల్ మీద చాక్లెట్లుండే.

"రామాచారిని కొడతగాని, ఈ విషయం ఎవరికి చెప్పకు" వాడి చేతిల రెండు చాక్లెట్లు పెట్టిన.

"తప్పకుండ కొడతరుగా సార్!" నేను పిల్లల్ని ఎక్కువగా కొట్టను. అందుకే వాడికానుమానం

"తప్పకుండా" వాన్ని వప్పించాలని

"అట్లనే సార్" చాక్లెట్లను చూసుకుంట సంతోషంగా బయటకు పరిగెత్తాడు.

అలావాడు వేగంగా పోయిన మాటేగాని, నా గుండె ఇంకా వేగంగా కొట్టుకోసాగింది.

రామాచారి వల్ల ఇటువంటి గొడవే ఇంతకు ముందోసారి జరిగే. వాడి క్లాస్‌మేట్ ఉపేందర్‌ను పట్టుకొని, గొడ్డు కూర గొడ్డు కూరనటం, వాడు పోయి వాళ్ల నాయనకు చెప్పటం, వాడి నాయన ఫుల్‌గా తాగి బడికొచ్చి వాన్ని బెదిరించటమే గాదు, బడి పక్కనే ఉన్న వాళ్లింటికి పోయి, మళ్లీసారంటే గొడ్డును కోసినట్లు కొస్తానంటు హెచ్చరించి పోయాడు. వెంకటాచారి ఏ మాట్లాడ లేకపోయాడు. వాళ్లతో గొడవకు దిగటం కష్టమని తెలుసు.

ఉపేందర్ నాయన గొడ్లనుకోస్తే, నరేష్ నాయన పందుల్ని కోసి చుట్టు ప్రక్కల ఊర్ల అమ్ముకొని జీవిస్తడు.

రామాచారి నాకో సమస్యగా మారాడు. వాడికెట్లర్థం చేయించాలో తెలియక తలనొప్పిగా తయారయినది. వాడి చేష్టలు చూస్తే నా చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. తను ఆ వయసులో మాదిగ పిల్లల్ని పట్టుకొని గొడ్డుకూర, గొడ్డుకూరనటం, వాళ్లు ఎదురుతిరిగి తనను పందికూర పందికూరనెటోళ్లు. అలాన్నందుకు యాదయ్యను పట్టుకొని కిందపడేసి కొట్టేది. బలముండి కూడా యాదయ్య తిరిగికొట్టెటోడు కాదు. కారణం వాళ్ల నాయన మా ఇంట్ల జీతముండేటోడు. పైగా యాదయ్య ఎట్ల సదువుతున్నాడో చూసుకొమ్మని వాళ్లనాయన్నే బాధ్యత పెట్టెటోడు. అట్ల ఇద్దరం ఒకే స్కూళ్లో, ఒక కాలేజిల, చివరికి ఒకే విద్యార్థి సంఘంలో కలిసి పనిచేసినోళ్లం. అప్పటి సంగతులు గుర్తుకొచ్చినప్పుడల్లా నవ్వుకునేవాళ్లం.

ఆశ్చర్యమనిపిస్తుంది, మా వాళ్లు ఎలా ఈ పంది కూర కలవాటు పడ్డరాని! ఇంట్లకు పందికూర తేవద్దని తెలియనితనంలో చిన్నప్పుడు ఇంట్లో గొడవ చేసేటోన్ని. నాయన సున్నితంగా మందలించి నవ్వి ఊరుకునెటోడు. కాస్తా జ్ఞానమొచ్చాక ఈ కూరకెట్ల అలవాటు పడ్డరని పెద్దలనడిగితే ఏవేవో చెప్పెటోళ్ళు. చివరికర్థమయిందేమిటంటే, మా పూర్వీకులు గుంటూరు ప్రాంతంలున్నప్పుడు కరువొచ్చిందని, పని తిండికోసం క్రైస్తవ మతంలోకి మారినరని, కడుపు నింపుకోవటానికి ఈ కూరకు అలవాటు పడినరు. మనువు చెప్పినట్లు కరువు సమయాల్లో బ్రాహ్మణులు, రుషులే కుక్క, ఆవు మాంసాల్ని తినే, మేమెంత! ఒక్క కమ్మకులమేగాదు, రెడ్లు, ఇతర ఉన్నత బిసి కులాలు గూడ అట్ల మారిపోయి, బతుకు తెరువు కోసం తెలంగాణకొచ్చి, కమ్మగూడాలు రెడ్డి పల్లెలు గుంటూరు పల్లెల పేర్లతో స్థిరపడ్డాక, ఆ గూడెలలో కమ్మ రెడ్లు పందులు కోస్తుంటే ఈ ప్రాంతంలోని కింది కులపోళ్లు ఆశ్చర్యంగా చూసేటోళ్ళు. ఎందుకంటే ఈ ప్రాంతముల ఎరుకల, పిచ్చకుంట్ల, వడ్డెరోళ్లు మాత్రమే పందులు కోసేటోళ్లు.

నా మాంసాహారపలవాట్లు ఎలా తెలిసినయోగాని, ఎవరు లేనిది చూసి ఆఫీసుల నా దగ్గరకొచ్చి ఏం మాట్లాడకుంట నిలబడినరు. కొద్దిసేపు చూసి

"ఏందిరా? అన్ననేనే

"ఏంలేదు సార్

"చెప్పండిరా" గట్టిగా గద్దించేసరికి.

"ఏం లేదు సార్, మీరు మా కూర తింటరంటగా" నెమ్మదిగా ఎవరికి వినపడకుండ డిగాడు నరేష్

"తింటరా"... అన్ననో లేదో.

"మా కూర గూడ తింటరంటగా సార్? "ఉపేందర్ అందుకున్నడు.

"తింటరా, అందరికి చెబుతార్రా?"

"ఒట్టుసార్, ఎవరికి చెప్పం" ఇద్దరు ఒకేసారన్నరు.

ఎవరు చెప్పినరు, ఎలా తెలిసిందని అడిగి బయపెట్టదలచు కోలేదు వాళ్లను. నవ్వివూరుకున్న, దాంతో వాళ్లకు ఏదో ధైర్యం, స్వేచ్ఛ లభించినట్లయింది. అప్పటి నుండి నా దగ్గరకు ఇద్దరు ఎప్పుడైన రావటం, ఏదైన అడిగే చనువు ఎక్కువైంది.

ఆఫీసు పని పూర్తి చేసుకొని బయటకొచ్చిన. ఒకటి రెండు మూడు తరగతుల విద్యార్థులను ఒకే దగ్గర కూర్చోబెట్టి యాదయ్య సారేదో చెబుతున్నాడు. ఇంకోసారు సెలవుల్లో ఉన్నడనటం కంటే రియల్ పనుల్లో ఉన్నడంటే మంచిది. యాదాద్రిని తిరుపతిగా

మారుస్తామని ప్రభుత్వమన్న దగ్గర్నుండి ఇతను బిజిగా మారిపోయాడు. ఇలా క్లాసులను పంచుకొని చెప్పాల్సివస్తుంది.

వారం రోజుల క్రితం నాలుగు, అయిదు తరగతుల విద్యార్థుల్ని పరిసరాల విజ్ఞానంకోసమని బడికి అరకిలోమీటరు దూరంలున్న వాగు, దాని పక్కనే ఉన్న బోడగుట్టను చూపించటానికి తీసుకెళ్ళా. సరిగ్గా అదే సమయంలో అయిదారు పందులు పోవటం చూసి.

"సార్, అగో అవి అడవి పందులు" నరేష్ అరిచాడు.

"అవి అడవి పందులని ఎట్ల గుర్తు పట్టినవు? "ఒకడడిగాడు.

నరేష్ చెప్పుక పోతున్నడు వాటిని ఎట్ల గుర్తు పట్టాల్నో

"అడవిల అవి ఏం తింటాయి? ఉన్నట్టుండి రామాచారి అడిగాడు.

"గదిగూడ తెల్వదా, తుంగగడ్డలు, పల్లి, మామిడి, టెంకలు, గరికపళ్ళు, వరి, చెరుకు, కూరగాయలు ఇంకా చానా తింటాయ్..." నరేష్

నిజానికి అడవి పందుల ఆహారమేమిటో నాకు తెలియదు. వాడి వల్ల తెలిసింది. జ్ఞానమంటే అదేగదా, నా నుండి వాడు, వాడి నుండి నేను, అందరం ప్రకృతి ప్రజల నుండి నేర్చుకోవాల్సిందే గదా!

"ఊరి పందులు వేరేటివి తింటయిగా సార్, అదెట్ల?" ఇబ్బందికరమైన ప్రశ్నేశాడు రామాచారి.

వెంటనే ఏం చెప్పాలో అర్థంగాక, కొద్దిసేపటికి జవాబిచ్చాను.

"పరిస్థితులు, ప్రాంతాలు, అవసరాలబట్టి తినే తిండిల బాపలో మార్పులుంటాయిరా", వాడికేదోజవాబు చెప్పబోయినగాని, సరిగ్గా ఆ సమయము నుండి నా మనసుల కథల్లుకోవటం మొదలైంది. ఇప్పటికిగాని సమయం చిక్కలే చెప్పటానికి. అవేఆలోచనలతో తరగతి గదులకు అడుగుపెట్టానో లేదో.

"గుడ్ మార్నింగ్ సార్" అంటూ నిలబడినరు.

"సిట్‌డౌన్" అంటూనే బ్లాక్ బోర్డు మీద నేను చెప్పాల్సిన కథ పేరు తెలుగులో రాసి కింద ఇంగ్లీషులో గూడ వ్రాశా. దీనికో కారణముంది. మా పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో తప్ప, దేనిలో చదివించమని మారుమూల గ్రామాల్లో ఉండే తల్లి తండ్రులు గట్టి నిర్ణయానికొచ్చారో, మా బతుకు తెరువుకోసమన్న ఇంగ్లీషులోనే భోదించాల్సిన పరిస్థితొచ్చింది.

"బోర్డు మీద కథపేరు చదవండిరా?"

అతి కష్టంగా చదివి వో విద్యార్థి "స్టోరీ ఆఫ్ వరాహ" అని పలికాడు.

"వరాహమంటే ఏంది సార్?" ఓ విద్యార్థి అడిగాడు.

"దాని కింద ఏముంది?"

"పి. ఐ. జి. పిగ్ సార్..."

"పిగ్ అంటే ఏమిటి?"

"తెలియదు సార్..."

"పిగ్ అంటే పందిరా!"

"అబ్బే, పంది గురించి చెబుతరా సార్" వెంటనే అందుకున్నడు రామాచారి.

"చెబితే ఏమైతదోయ్", నరేష్, ఉపేందర్ ఒకేసారి రామాచారి మీదకు లేచారు. వాళ్ళిద్దర్ని వారించి

"వరాహమంటే ఏమనుకున్నరు, దేవుడెత్తిన దశావతారాల్లో ఇదొకటి..." దశావతాల గురించి వివరించా. అంతా విని

"దేవుడు పంది అవతారమెత్తుడేంది సార్?". రామాచారికి మింగుడు పడటం లేదు.

"నేను అబద్దం చెబితే పోయి మీ బాబాయినడుగు" వాన్ని వప్పించటానికన్నా.

"పంది కథ ఎందుకు, ఆవో, పులి గురించో చెప్పొచ్చుగా" రామాచారి.

"వీలైనప్పుడు వాటి గురించి చెబుతా"

"ఆవుగొప్పదా, పంది గొప్పదా సార్" మరోసారి ఇబ్బంది పెట్టే ప్రశ్నేశాడు.

"వాంతో ఎందిసార్, ముందు కథ చెప్పండి" గట్టిగా నరేష్ అనేసరికి

"గంత తొందరెరేదిరా" ఇంగ్లీషు, తెలుగును మిక్సింగ్ చేసి కథ చెప్పటం మొదలు పెట్టా.

"ఒక ఊరిలో సుంకయ్య అనేటాయన ఉండేటోడు. అతనికి చానా పందులుండేవి. తన శాతనయినంత వరకు ఎలాగో అలా కుడితిపోసి సాకుతుండేటోడు. అతనికి కష్ట కాలమొచ్చినపుడు వూరిడిసి పనులకోసం వేరే ప్రాంతాలకు పోయేటోడు. ఈ సారి గూడ అట్లనే అయింది. వూరిల కరువొచ్చింది. అప్పుడు అతని పందులకు కష్టకాలమొచ్చేది. తిండికోసం ఊరంత తిరుగుతూ ఏవేవో పదార్థలతో కడుపునింపుకునేవి. అలాంటి స్థితిల ఓ పంది వూర్ల ఏమి దొరక్క తిండికోసం వెతుక్కుంటు కంపచెట్లను, చేలను దాటుకుంటు వాగు దగ్గరకు చేరింది. ఎంత వెతికిన తాను తినదగినవి దొరకటం లేదు. సరిగ్గా అదే సమయంలో దూరం నుండి వస్తున్న పందుల గుంపు కనిపించింది. తన వూరి పందులు ఎప్పుడు ఇటొచ్చాయని ఆలోచనలుండగానే, ఆ పందుల గుంపు దీని దగ్గరకొచ్చాయి. తీరా చూస్తే అవి తనూరుపందులు కావు, అడవి పందులు, తనను ఏమైన చేస్తాయేమోనన్న భయం పట్టుకుంది. పైగా తాను ఒక్కటే, అడవి పందుల గుంపు నుండి ఒకటి ముందు కొచ్చి.

"ఎక్కడ ఉంటావు నీవు" అడిగింది.

"ఆడ ఉంటా" ఊరు వైపు చూపింది.

"మా జాతీ కానట్టుంది, అయినా ఇటువైపెందుకు కొచ్చినవు? గద్దించినది.

"ఆహారం కోసం..."

"మేం తినే తిండి కావాలా నీకు?"

"ఊరిల ఏం దొరకటం లేదు" భయంతోనే అంది

"ఊరిల కావలసినంత వేరే ఆహారం దొరకుతుందిగా ఈడికి రావాలా? మాకె దొరకటం కష్టమవుతుంది. మరోమారు మాకు ఇటువైపు కనిపించినవంటే సంపుతం" హెచ్చరించినది అడవి పంది.

"ఎప్పుడు రాను" అనుకుంట భయంతో ఊరు వైపు పరిగెత్తి తన యజమాని ఇంటెనుకున్న గుబురు సర్కార చెట్ల క్రిందకు

చేరుకుంది.

అప్పడప్పుడే పొద్దుగూక సాగింది. దాంతోతమ స్థావరాలకు చేరుకోసాగాయి పందులు. అన్ని చేరుకున్నాక వాగుల జరిగిన సంఘటనంత వివరించింది పంది. అందంత విని ఓ ముసలి పంది 'నీవు ఈ రోజే చూసినవు, నేను ఎప్పుడో చూసిన వాటిని నన్ను గూడట్లనే బెదిరించినవి" అంది.

"అవి మనలాగే ఉన్నాయిగదా, మనజాతి, వాటి జాతి తేడాలెందుకొచ్చినయి?

"మనం తినే తిండి ఉండేచోటు, అవి తినే తిండి ఉండే చోటు వేరుగనుక ఈ తేడాలు"

"మన తిండిలో తేడా లెందుకొచ్చినయి?"

"అదే అర్థం కావటం లేదు, మన పెద్దలెవరు సరిగ్గా చెప్పరైతిరి, కాని ఓసారి వాగు దగ్గర కలిసినపుడు తమ జాతి గురించి ఎంత గొప్పగా చెప్పకున్నయనుకున్నరు. అవి దేవతల జాతంట, నీట మునిగిన భూగోళాన్ని పైకి తీసిన శక్తి వంతులంట, మీరు మేము ఒకటి కామని ఈసడించుకున్నవి నన్ను..." అలా రాత్రంతా మాట్లాడుకోసాగాయి అడవి పందుల గురించి.

రోజులు గడుస్తున్నాయి. ఇంటి యజమాని పత్తాలేడు. పందులకు ఆహారం రానురాను కష్టంగా ఉంది. ఆకలితో గత సంఘటన మరిచిపోయి తిరిగి వాగు దగ్గరకు చేరుకుంది పంది.. ఎంత వెతికిన తినదగిన ఆహారం దొరకటం లేదు. సరిగ్గా ఆ సమయంలోనే బోడగుట్ట నుండి పెద్ద శబ్దం. దాన్ని పట్టించుకోకుండ ఆహారం వెతకసాగింది. గుట్టవైపు నుండి వంటరిగా ఓ పంది వేగంగా రాసాగింది. దాన్ని చూసి పై ప్రాణాలు పైనే పోయినట్టయింది ఊరి పందికి. కారణం ఇంతకు ముందు వాగు దగ్గర హెచ్చరించిన పరజాతి పందిది.

భయంతో పరిగెత్తబోయింది. అప్పటికే అడవి పంది దీని దగ్గరకు చేరుకుంది. భయంతో గసపెట్టసాగింది. నోటి నుండి సొల్లు కారుతుంది. వెంట్రుకలు నిక్కబడుచుకున్నవి. దీనంగుంది. ఊరు పందికి నెమ్మదిగా అర్థంకాసాగింది. అది తన కోసం రాలేదని, ఏదో ప్రమాదంలో ఉందని.

"ఏమయింది? దైర్యంచేసడిగినది.

నోటి నుండి మాటరావటం లేదు అడవి పందికి. జాలితోకంపచెట్లలోకి తీసుకెళ్లింది. స్తిమిత పడ్డాక,

"నీ వక్కదానివి వచ్చినవు, మిగిలిన మీ జాతోళ్లేరి? అడిగినది.

"చెట్టు కొక్కరు, పుట్టకొక్కరయినరు..." కన్నీళ్లు పెట్టుకుని, జరిగినదంత వివరించింది అడవి పంది.

ఒకప్పుడు ఈ అడవి పందులకు కావలసిన ఆహారం ఈ వాగుచుట్టు పక్కలదామెరలో దొరికేది. మనుషులు ఈ వాగును తోడేయటమే గాక, చెట్లను నాశనం చేశారు. దీంతో ఈడ జీవించే జీవరాసులు నెమ్మదిగా బోడగుట్టకు చేరుకున్నవి. కొంతకాలం ఎట్లనో గడిచిపోయింది. తిరిగి అదే మనషులచ్చి, ఈ గుట్టల్ని తొలచటం ప్రారంభించారు. చివరి కర్థమైంది, గుట్టను మొత్తము నాశనం చేస్తరని. ఇక్కడ నుండి వెళ్లిపోదమని ప్రయత్నంలుండగానే, ఇవి ఉండే సొరికే దగ్గర బాంబులు పేల్చారు. దాంతో అడవి పందులు తలో దిక్కు పరిగెత్తినవి ప్రాణభయంతో.

ఈ అడవి పంది స్థితిని చూసి మరింత జాలేసింది ఊరు పందికి. నెమ్మదిగా మాటలుకలిపి.

"మాదంటే హీనజాతి, మీది గొప్పజాతి, భూగోళాన్నె పైకి లేపిన శక్తివంతులు, దేవునవతారంగా, మిమ్మల్ని మీరు రక్షించుకోలేరా?" అమాయకంగడిగిన ఊరుపంది ప్రశ్నకు సిగ్గుతో తలదించుకుంది అడవిపంది.

నిజమే, ఊరుపంది అన్నదాంట్ల తప్పేముంది? తన పెద్దోళ్లు చెప్పిన కథని తను చెప్పింది. అసలు భూమి పైకి లేపటమేమిటో, ఎవరి దగ్గర నుండిలాగి ఎవరికిచ్చిందో ఎవరికి తెలుసు. అయినా తనకంటే బలవంతుడొకడు పుట్టాడని, ఈ భూమిని దానిలోపల సర్వస్వాన్ని తన స్వార్థం కోసం నాశనం చేస్తున్నాడని ఎలా వివరించాలో అర్థం కావటం లేదు అడవి పందికి

"ఈ భూమిని రక్షించలేవా?" తిరిగడిగింది ఊరుపంది

"రక్షించలేను'

"ఎందుకు?

"వాడు నా కన్నా చాలా శక్తివంతుడు" తన అహాన్ని వదలుకొని అన్నది.

"ఎవరతను?

"వాడు బహుళజాతి రూపుడు...."

"బహుళజాతి రూపుడా?" వాడెవడో అర్థంగాక

"నరే ఆ గుట్టలో ఉండుడు కష్టమని తెలుసుగా, వేరేచోటుకెందుకు పోలేదు?" అడిగింది ఊరుపంది.

"పోవాలనే అనుకున్నం, కాని చుట్టు పక్కలెక్కడ చూసిన ఇలాగే ఉంది. కాని అటుత్తరం వైపు పోతే దట్టమైన అడవొస్తుందట, ఆ అడవిలోకావలసిన ఆహారమేగాక, నిర్భయంగా బతుకొచ్చట..."

"ఎందుకెళ్లలేదు?"

"అటు పోవుడు చాలా కష్టమట, వాగులు వంకల నదులు దాటాలి. అయినా సరే ఈడ సచ్చుడుకంటే అటే పోతమని వయస్సు మీదున్నవి పోయినయి. ముసలి ముతక చేతకానోళ్లం ఈడనే ఉండిపోయినం".

"చెట్లను, గుట్టలను నాశనం చేసేటోళ్లు ఆడికి పోతే ఎలా?"

"అటువంటోళ్లను రానీకుండ, ఆ అడవిల మనుషులు కాపలకాస్తుంటరంట!"

"అట్లనా! ఆ అడవి పేరేంది?"

"దండకారణ్యం......"

బోడగుట్ట దగ్గరనుండి మరోసారి పెద్ద శబ్దం. భయంతో కంపచెట్లలో మరింత లోపలెల్లాయి రెండు పందులు

పొద్దు గూక సాగింది. ఊరువైపు పోవాలని నిర్ణయించుకుంది ఊరుపంది. ఈ అడవి పంది పరిస్థితర్థం కావటం లేదు. తనతో తీసుకెళితే తన జాతివి ఊరుకుంటాయా! తన వాళ్లను వప్పిద్దామని ఓ నిర్ణయానికొచ్చి.

"నాతో వస్తవా?' అంది.

"వస్తా" అంది. దీనికింకో గత్యంతరం లేదు.

ఎవరికి కనిపించకుండా కంపచెట్ల నుండి తన యజమాని

ఇంటేనుకున్న గుబురు సర్కార్ చెట్లలోకి తీసుకెళ్లింది. జరిగిన విషయమంత తన జాతి వారికి చెప్పింది. దాని బాధను చూసి పోనిలే అనుకున్నవి ఊరు పందులు.

బతుకు తెరువుకోసం ఎటో వెళ్లిన సుంకయ్య అదే రోజు తన భార్య పిల్లలతో ఇంటికి తిరిగొచ్చి, తన పందుల్ని వాటి సంతానాన్ని వెతుక్కునే ప్రయత్నంలో పడ్డాడు. పందులకు ఎంతో కొంత ఆహారం దొరకసాగింది. ఆ రోజు పొద్దుగూకాక అడవి పందిని తీసుకొని తొట్టి దగ్గరకు తీసుకెళ్లింది. ఇటువంటి ఆహారాన్ని ఎప్పుడు చూడలె. ఆకలి మీదుండే, తొట్టిలో మూతి పెట్టి కొద్దిగా తాగింది. ఏమైనదోగాని కంపచెట్లల్లకు పరిగెత్తి తాగినదంత కక్కేసింది. రోజురోజుకు దీని పరిస్థితి దారుణంగా తయారయింది. ఆకలికి తట్టుకోలేక గట్టి నిర్ణయానికొచ్చి ఉదయం ఊరి పందులతో కలిసి ఊరిబయటకు బయలుదేరింది. అవి తినే తిండిని తినసాగినది. మొదట్లో కష్టమనిపించిన ఆకలి దాన్ని మరిపించినది. అలా ఆ అడవి పంది ఇంకో ఆహారానికి అలవాటుపడింది...." కథ ముగిసాక, ఆహారపలవాట్లు అవసరాలను బట్టెట్ల మారుతున్నాయో, పూర్వకాలంలో అశ్వమేధ రాజసూయ వాజ్‌పేయ యాగాల్లో, గవమయన గ్రహమేధ క్రతువుల్లో బ్రాహ్మణులెలా జంతువులను చంపేవారో, ప్రజలు బ్రాహ్మణులు రాజులు చివరకు దేవతలనేవాళ్లు ఎట్ల ఆవులను పందులను తిన్నారో వివరిస్తుండగా.

"ఇప్పుడు కోమటోళ్లు, బాపనోళ్లు మాంసం తినడం లేదుగా సార్?" మధ్యలో రామాచారి ప్రశ్నేశాడు. నాకు కాస్త ఉత్సాహమేసి.

"నిజమే, కొన్ని కారణాల వల్ల చాలా మంది తినటం లేదు, పరిస్థితుల వల్ల నా దోస్తులైన కోమటోళ్లు, బాపనోళ్లు కొంత మంది తింటున్నరు". వివరించి చెప్పిన

"బుద్ధుడు నిజంగా పందిని తిన్నడా సార్?!."ఆశ్చర్యంతో ప్రశ్నించాడు నరేష్

పిల్లల నుండి అనేక ప్రశ్నలు, వాళ్ల ఆశ్చర్యమంతా బ్రాహ్మణులు, దేవతలు పశు మాంసం తిన్నరని!

"సార్ ఊరొచ్చింది" తన పక్క కూర్చున్న ఊరతను తట్టి లేపేసరికి, ఉలిక్కిపాటుతో లేచి, వేగంగా బస్సు దిగిన.

కలనుండి మేల్కొన్నట్టయింది. అవే ఆలోచనలతో ఇంటికి చేరుకున్న. అప్పటికే యాదయ్యసారు చదువుకుంటున్నడు. చేతిల దశావతారాలు పుస్తకముంది.

రేపు వాళ్లు వస్తే ఎట్ల వ్యవహరించాలో నా ఆలోచనంత చెప్పి, పుస్తకాలను వెతికే ప్రయత్నంలో పడ్డా

* * *

రాత్రంత రకరకాల ఆలోచనలు. తెలవారు జామున నిద్రపట్టి నట్టయింది. దాంతో ఆలస్యంగానే లేచి తయారైన. ఇంటి ముందు యాదయ్య సార్ బైక్ శబ్దం రోజులాగానే. ముందు రూములున్న దినపత్రికను తీసుకొని నా దగ్గరకొస్తునే

"ఇన్ని పట్టుకొస్తున్నరు, ఏమైన ఉపయోగముంటదా?" సంచిలున్న వాటిని చూస్తు అన్నడు.

"ఏదెట్లుంటదో చూద్దాం" సంచిని బయటకు తీసుకొస్తూ అన్నా

"బైక్ స్టార్ట్ చేసాడు. సంచిని ఇద్దరి మధ్య పెట్టి కూర్చున్న. ఊరుదాటాక యాదయ్య సారు.

"నిన్న మహేందర్, నరేష్ ఏమడిగారో తెలుసా?" "నెమ్మదిగా ప్రారంభించాడు.

"ఏమడిగినరు?!"

"బహుళ జాతి రూపుదెవడు, వాడెక్కడుంటడు?" అని

"ఏం చెప్పినవు?"

"ఏం చెప్పాలి చెప్పు, భూగోళమంత వాడే విస్తరించుండే, ఏడ మొదలుపెట్టాలో అర్థం కాలె. అవును, భూగోళమంటే గుర్తొచ్చింది, హిరణ్యాక్షుడి దగ్గర భూమిని లాక్కోవట మంటే బలవంతాక్రమనే కదా?"

"తప్పకుండ, మూలవాసుల దగ్గర భూములాక్రమించటమది ప్రారంభం కావచ్చు..."

"భూ ఆక్రమణ కోసం వరాహాన్నె ఎందుకు ప్రతికగా తీసుకోవచ్చు?"

"అడవి పందులు చాలా మొండివి, పైగా పండిన పంటలను నాశనంచేస్తాయి గదా, దేవతలకోసమల్లిన కథగా తీసుకోవచ్చు. ఏ అవతార కథైన అసురుల మీద ఆధిపత్యాన్ని నిలబెట్టడం కోసమే రూపొందాయనిపిస్తుంది..." ఇద్దరం వరాహావతారం గురించి ఆలోచనల్లో పడినం.

ఊరు నుండి ఇరవై నిముషాల ప్రయాణం. మాటల్లోనే స్కూల్‌కు చేరుకున్నం. గేటు దాటి లోపలికి పోయినమొ లేదో, దూరం నుండి ఓ పిల్లవాడు.

"యాదయ్య సారొస్తుండు... శౌరయ్య సారొస్తుండు..." పాటందుకున్నడు.

బైక్ స్టాండ్ చేయకముందె పిల్లలు చుట్టు ముట్టినరు. మా దగ్గరున్న వస్తువులను తలా వకటి తీసుకొని ఆఫీసులకురికారు. నేను వద్దంటున్న వినకుండా నరేష్ నా దగ్గరున్న సంచిని తీసుకొని.

"ఏమున్నయి సారు దీంట్ల, గింత బరువున్నయి" అనుకుంటనే ఆఫీసులో నా సీటు పక్కన పెట్టాడు.

ప్రార్థన పూర్తయి, పిల్లలు ఎవరిక్లాసులకు వాళ్లు పోయినరు. ఇంకోసారు సెలవుల్లో ఉన్నడు కనుక ఇద్దరము క్లాసులను పంచుకున్నం. ఎంత స్థిమితంగుండాలనుకున్న సాధ్యం కావటం లేదు. రాత్రంత వ్రాసుకున్న అంశాలను పదే పదే తిరగేయాల్సివస్తుంది. అసలావాదాన ఏడ మొదలవుతుందో? నిన్నొచ్చిపోయిన యువకుల శక్తి సామర్థ్యాలు తెలుసు. కాని ఆ ధర్మ ప్రచారక్‌తో వాదనెట్ల నడుస్తుందో? ఈ ఆలోచనలతో రోజంతా భారంగా మారింది.

యాదయ్యసారదే స్థితిలున్నట్లుంది. పని లేకపోయినా ఒకటికి రెండు సార్లు నేనున్న క్లాసు దగ్గరకి రావడం.

"ఏమయితదోఏమో, అయినా వాళ్లు వస్తారంటవా సార్?" అడగటం.

"తప్పకుండొస్తరు" దృఢంగా అన్న

"అంత కచ్చితంగెట్ల చెబుతున్నరు?"

"వాళ్ల కాలం నడుస్తుంది గనుక"

ఎట్లర్థం చేసుకున్నడో ఏమోగాని

"ఊర్ల మన పోరలున్నరుగా, వాళ్లకు చెప్పి పంపుదమా?"

అన్నడు.

"గంత తొందరెందుకు, ముందు వాళ్లు ఏం మాట్లాడుతరో చూద్దాం..."

"గంత ఈజీగా మాట్లాడుతున్నవేంది సార్, మొన్న ఎట్లన్నరనుకున్నవు? వాళ్లమాటలకు బయమేసింది..."

యాదయ్య సారు మాటకు నవ్వి ఊరుకున్న. స్కూల్ ముగిసే సమయం కూడ దగ్గర పడింది. వాళ్లు వస్తరో లేదోనన్ననుమానం మొదలైంది. వీళ్లతో ఏదో ఒకటి తేల్చుకోవాలన్నా పట్టుదల పెరిగింది. చివరిగంట మోగి పిల్లలు బయటకు పోతున్న సమయంలోనే నలుగురు లోపలికి రావటం నేను కూర్చున్న కిటికి నుండి స్పష్టంగా కనిపించసాగింది. యాదయ్య సారు వాళ్లను చూసి

"వాళ్లే, వస్తున్నరు..." నా దగ్గరకొచ్చి నెమ్మదిగ అన్నడు.

ఏదో జరగబోతుందని పసిగట్టిన నరేష్, మహేందర్ వాని స్నేహితులు స్కూల్‌వెనుక తచ్చాడసాగినరు. వాళ్ల తీరును చూసి అంత సీరియస్ సమయంల నవ్వొచ్చింది!

"వీళ్లతో శ్రీనుగాడు రావటమేందిసార్?" ఆశ్చర్యంతో గొణిగాడు యాదయ్య.

శ్రీను యాదయ్య సారుకు బంధువే. నాకు దగ్గరి పరిచయమే. అతను మాదిగ పోరాట సమితిలో పనిచేసినప్పుడు కరపత్రాలు రాసివ్వమని మా దగ్గరికొచ్చినోడే. వీళ్లతో రావుడు, ఆ కలయికేమిటో అర్థం కాకుంటయింది మాకు.

"నమస్కారం సార్" అనుకుంట శ్రీనే ముందు ఆఫీసులకు వచ్చాడు. అతని వెనుకనే ముగ్గురొచ్చారు..

ప్రతి నమస్కారము చేసుకుంట, ఎదురుగున్న కుర్చిలో కూర్చోమని చెప్పి, చాయ్‌లకోసం తలుపుదగ్గరున్న యాదయ్య సార్‌కు సైగ చేసిన.

"ఈ ప్రాంత ధర్మప్రచారక్‌సారు" కొత్తతన్ని పరిచయం చేశాడు వెంకటాచారి.

"అలాగ, ఏ ఊరు?"

ఊరు పేరు చెప్పాడు. డిగ్రీ వరకు నా చదువాడే పూర్తయింది. ఎక్కడో చూసినట్టుందితని రూపం

"ఎబి కాలేజీలో చదివినరుగద" తనే అడిగాడు.

"అవును మీరు?"

"నాది అదే కాలేజి..." చెప్పుకుంటా మిత్రులను, విద్యార్థి సంఘాలను గుర్తుచేసాడు.

అప్పుడర్థమైంది పూర్తిగా. మేమిద్దరం పనిచేసిన విద్యార్థి సంఘాలు భిన్న దృవాలు. వాళ్లు మా మీద రష్యా, చైనా తొత్తుల్లారా ఖబడ్దారంటూ రాస్తే, వాటికిందే మేం మతోన్మాదుల్లారా ఖబడ్దారంటూ గోడల మీద కొట్లాటేగాదు, ఒక్కోసారి ప్రత్యక్షంగా జరిగేవి. వాళ్ల ప్రవర్తన చూసి కాలేజీల అసహ్యించుకునేటోల్లు. అప్పుడంటే మేము రష్యా చైనా తొత్తులము, మరిప్పుడు ఈ దేశాన్నే పరాయిదేశాలకు తొత్తులుగా మారుస్తున్నదెవరు? పరిస్థితులు ఎంత చిత్రంగా మారి పాయె!

"నిన్న నీ కోసమొచ్చినం సార్" వెంకటాచారనటతో

"అవును సారు చెప్పిండు" అన్న

"మీకు చాలా విషయాలు తెలుసు, కాని పిల్లలకు చెప్పిన కథ మంచిగ లేదు."

ఏంమాట్లాడాలో అర్థం కాలే వెంటనే. కొద్ది సేపటికి

"నేను చెప్పిన కథేందో విన్నవా? అడిగిన

"రామ్ చెప్పిండు"

"ఏం చెప్పాడు?"

"మీరు చెప్పిందే..."

"మంచిది, అదే క్లాసు పిల్లల్నడుగుత, వాళ్లేమి చెపుతరో విందం, మీ వోన్నడుగుదాం, వాడేమి చెబుతడో విందాం...." అన్ననో లేదో

"నేను ముందే చెప్పలె, ఈ సారు తెలివిగ మాట్లాడుతడని, గిట్లగాదు కాని...." అసహనంతో లేచాడు కొండల్‌రెడ్డి.

"గంత తొందరేంది, మాట్లాడుతున్నంగా" కొండల్‌రెడ్డిని సముదాయించి కూర్చొబెట్టాడు శ్రీను.

"ఇంద్రుడు అగ్ని సోమ రంతి దేవుడు బ్రాహ్మణులు చివరికి రాముడు గూడ ఆవు మాంసం తిన్నడని చెప్పినవంట. గిటువంటి తప్పుడు కథలు పోరలకు చెప్పుడేంది" వెంకటాచారి.

"పూర్వకాలంలో ఆహారపలవాట్లు ఎట్లుండెనో, ఇప్పుడెట్ల మారినయో అర్థం చేయించడానికి చెప్పినగాని, ఎవ్వరిని ఇబ్బంది పెట్టాలని కాదు."

"అట్లనా, అయితే ఆవుకన్న పంది గొప్పదని చెప్పినవంట, అది మమ్మల్నిబ్బంది పెట్టదా?"

"ఆవు గొప్పదా, పంది గొప్పదాని గాదు. ప్రకృతిలో అన్ని జీవులకు, మొక్కలకు దేని ప్రాముఖ్యత దానికుంటదని, దేన్ని కించపరచొద్దని, కథలో భాగంగా పిల్లలడిగిన ప్రశ్నలకు దేవుడు పంది అవతార మెత్తిండుగాని, ఆవు అవతారమెత్తలేదని చెప్పిన..."

"అంటే ఆవుకు పవిత్రత లేదంటావా?" నెమ్మదిగా, మృధువుగా అందుకున్నడు ప్రచారక్, నా గుండెకాస్త వేగంగా కొట్టుకోసాగింది

"పవిత్రత గురించిగాదు నేను మాట్లాడేది, ఈ భూమి మీద పుట్టిన ప్రతి జీవికి, ఏదోఒక ప్రాముఖ్యత, ఉపయోగముంటుందని..."

"అయితే ఆవు, పంది ఒకటే అంటవు?"

"అలా ఒకదానికొకటి పోల్చటం, పోటి పెట్టడం మంచిదికాదు, దేని అస్తిత్వం దానిది"

"నీవు సైన్సును నమ్మెటోనివి, ఆవు ప్రత్యక్ష దైవమంటే నమ్మవు, దాని వల్ల ఎంతుపయోగముందో తెలుసుగా?" గడ్డాన్ని నిమరుతుఅన్నాడు ప్రచారక్

"అవును, పంచగావ్య ఉపయోగాలు తెలుసు" అన్ననో లేదో.

"ఉపయోగాలుంటే ఏంది? మా కడగట్టు కులాలోల్లు పంచగావ్యాలు తాగితే నరకానికి పోతరని మీ మత గ్రంథాల ద్వారా బయపెట్టి, మాకు దక్కకుండ చేస్తిరిగా." వెంటనే యాదయ్యసారందుకున్నడు. అతనికి జవాబు చెప్పకుండానే

"పంది వల్ల ఏదైన ఒక ఉపయోగముంటే చెప్పు?" నా వైపు చూస్తు అడిగాడు.

"ఈ భూమి మీద పుట్టిన ప్రతి జీవి వలన ఏదోఒక ఉపయోగముంటది."

"అదే ఏదైన ఒకటి చెప్పు?"

"దీన్ని కొంత మంది ఆహారంగా తీసుకుంటున్నారుగా...."

"అదిగాదు, దీనివల్ల ఏదైన ఆరోగ్యపరమైన ఉపయోగముందో చెప్పు"

"ఉన్నది, కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు కాల్లు బెణికినపుడు పంది కొవ్వు నూనెతో రాసుకోవటమే గాదు, పాదాల పగిలితే పంది పేగులను తింటరు" జవాబు చెప్పినవోలేదో.

"నేను గూడ తిన్న, నా పాదాలు పగిలినపుడు ఎరుకల సాయిలు పంది పేగుల్ని శుభ్రం చేసిస్తే వండుకొని తిన్న" శ్రీను అనటంతో నాకు బలం దొరికినట్టయింది. దీంతో ముగ్గురి ముఖాలు ఎట్లనో మారాయి.

కోపంతో ఏదో అనబోయిన కొండల్‌రెడ్డి అప్పుడే చాయ్‌లు తీసుకొచ్చిన ఖాసీమును చూసి ఆగిపోయాడు. అందరికి చాయ్‌లు పోసాడు, కాని ఆ ముగ్గురు చాయ్‌లు ముట్టుకోలేదు. మిగిలిన చాయ్‌ను ప్లాస్కుల పోసి ఖాసీమ్ వెళ్లిపోయాడో లేదో.

"నీవు చెప్పే కథలు, పాఠాలు ఇనెటందుకు రాలే మేం, గటువంటివి ఇప్పటిసంది చెప్పొద్దని చెప్పెటందుకొచ్చినం, మళ్లోసారి గిట్ల జరిగితే ఏం జరిగిన మా బాధ్యతగాదు" చివరకు చెప్పదలచుకున్నది చెప్పాడు కొండల్‌రెడ్డి.

గొంతుల తడారి పోయినట్లయింది. జీవితంలో ఇటువంటి స్థితెప్పుడు రాలే. అర్థంకానోనికి అర్థంచేయించొచ్చుగాని, ఇటువంటోల్లకెలా చెప్పాలి. మాట్లాడుదామని అనుకుంటుండగానే, అడ్డుపడి

"చూడండిసారు, ఆవంటే ఏమనుకుంటున్నరు? అన్ని వేదాల సమాహార ప్రతిరూపం. సృష్టిలోనే పవిత్రమైనది." దాని మహాత్యాలను చెప్పుకపోతున్నడు ప్రచారక్. ఓపిగ్గా విని

"అట్లని వేదాల్లో ఉపనిషత్తులలో ఎక్కడ లేదుగా?" వాదనకు దిగిన.

"వేదాలను గూడ చదువుతవా? అయితే దేవతలు ఆవు మాసం తిన్నరని ఆధారాలు చూపించు" అమాయకంగా దొరికిపోయాడు ప్రచారక్.

"చూపిస్తా చదువుతారా?" అన్ననో లేదో

"చూపించు...." కొండల్‌రెడ్డి, వెంకటాచారి ఒకేసారన్నరు.

నా సీటు వెనుకున్న సంచిని తీసి టేబుల్ మీద పెట్టిన. యాదయ్యసారొచ్చి పుస్తకాలను టేబుల్ మీద పెట్టాడు.

"రామాయణం, మహాభారతం, మనుస్మృతి, అర్థశాస్త్రం, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు..." వరుసగా పుస్తకాల పేర్లను చదవసాగాడు శ్రీను

వీటిని చూశాక ముగ్గురి మొఖాలు మారాయి. మరీముఖ్యంగా ప్రచారక్‌ను చూడాలి!

"దేవతలు ఆవు మాంసం తిన్నరని ఏ పేజీలుంది?" పుస్తకాలను తిరగేస్తడిగాడు శ్రీను.

"అట్ల వెతికితే దొరికాదు గాని..." అంటూ ఏ పుస్తకములో, ఏ పేజీలుందో చెప్పాడు యాదయ్య సారు.

ప్రచారక్‌కు ఇదంత మింగుడు పడడం లేదు. ఏదో చెద్దామనొస్తే మరేదో అయినట్టయిందతని పరిస్థితి. ఆ అసంతృప్తితో

"కలివర్జ్యాలను పట్టుకొని ఈ రాద్ధాంతమేమిటి?" అన్నడు.

"మేమదే అంటున్నం, ఒకప్పుడు అథో అన్నం వాయ్‌గోవ:ఇ అన్నరు. ఇప్పుడనటం లేదు గదా? ఒకప్పటి ఆహార ఆచార వ్యవహారాలు ఇప్పుడు లేవు, ఇప్పుడున్నవి రేపుండక పోవచ్చు, ఒక ప్రాంతములున్నవి ఇంకో ప్రాంతంలుండక పోవచ్చు..." చెప్పటం పూర్తి కాకముందే

"బ్రాహ్మణులు ఆవు మాంసం తింటున్నరని చెప్పినవంట" మరో ఆరోపణకు దిగాడు కొండల్‌రెడ్డి.

'అవును, అమెరికాలుంటే నా మిత్రులు బీఫేగాదు, పోర్క్‌కు గూడ అలవాటుపడినరని చెప్పిన..."

"అమెరికాకు పోవాల, మన దగ్గరగూడ తినెటోల్లను చూపిస్తా" యాదయ్యసార్ గట్టిగానే అన్నడు.

"పోరలకు గివన్ని చెపుడవసరమా?" మొండి వాదనకు దిగాడు వెంకటాచారి.

"అవసరమే, ఏ కాలాల్లో, ప్రాంతాల్లో ఏయే ఆహారపలవాట్లుండెనో విద్యార్థులకు చెప్పటం తప్పా?" అంతే మొండిగ వాదనకు దిగాడు యాదయ్య.

"మా దృష్టిల తప్పే..."

"ఎందుకు?"

"ఎందుకంటే దేశమంతా ఒకే సంస్కృతి ధర్మం మతం మా లక్ష్యం..." వెంకటాచారి.

ఎలా జావాబు చెప్పాలో ఆలోచిస్తుండగానే, యాదయ్య సారు.

"మంచిది వెంకటాచారి, మన సంస్కృతి, ధర్మం, మతం అందరికి ఒకటే అంటావు?" సంభాషణ మరో వైపుకు మళ్లించాడు.

"అవును ఒకటే..."

"తేడాలు లేవుగదా?"

"లేవు..."

"అయితే మీ ఆడ పిల్లల్ని మాకిచ్చి, మా పిల్లల్ని మీరు చేసుకొని మంచం, కంచం పొత్తు పెట్టుకోవచ్చుగా?!

"అదెట్ల కుదురుతది?" వెంటనే అందుకున్నడు కొండల్‌రెడ్డి.

"ఎందుకు కుదరదు? మనమంత ఒకటేగా, శ్రీనుకు మీ ఆడపిల్లన్ని ఇవ్వొచ్చుగా?" యాదయ్య సారు మాటలకు భయంగా నా వైపు చూశాడు శ్రీను, విషయము ఏడబయట పడతదోనని. విషయము ఏమిటంటే, శ్రీను వెంకటాచారి చెల్లెలు ప్రేమించుకున్నరు. వీళ్ల విషయం ఊర్ల చాలా మందికి తెలుసు, వెంకటాచారికి తప్ప.

"మీ ఊర్ల మీరేం చేస్తుందో అన్ని తెలుస్తనే ఉన్నయి, దేనికైన టైం రావాలి..." విషయాన్ని పక్కకు మళ్లించాటానికో, భయటపెట్టడానికో అన్న కొండల్‌రెడ్డి మాటలను పట్టించుకోకుండా "మీకు మాకు, మంచం కంచం పొత్తు లేనంత కాలం మనమ్మెటికొకటి కాదు. మా జాతి, మీ జాతి వేర్వేరు" కఠినంగా అన్నడు యాదయ్యసారు.

దాంతో ఏంమాట్లాడోలో తెలియక కోపంతో ముగ్గురు లేచి నిలబడినరు. పుస్తకాన్ని తిరగేస్తున్న శ్రీను చేతిని గట్టిగా లాగేసరికి, అతని చేతిలో ఉన్న పుస్తకమే గాదు, టేబుల్ మీదున్న పుస్తకాలు

"బ్రాహ్మణులు ఆవు మాంసం తింటున్నరని చెప్పినవంట" మరో ఆరోపణకు దిగాడు కొండల్‌రెడ్డి. 'అవును, అమెరికాల్నుంటే నా మిత్రులు బీఫేగాదు, ఫోర్క్‌కు గూడ అలవాటుపడినరని చెప్పిన..."
"అమెరికాకు పోవాల, మన దగ్గరగూడ తినెటోళ్లను చూపిస్తా" యాదయ్యసార్ గట్టిగానే అన్నడు.
"పోరలకు గివన్ని చెపుడవసరమా?" మొండి వాదనకు దిగాడు వెంకటాచారి.
"అవసరమే. ఏ కాలాల్లో, ప్రాంతాల్లో ఏయే ఆహారపలవాట్లుండెనో విద్యార్థులకు చెప్పటం తప్పా?" అంతే మొండిగ వాదనకు దిగాడు యాదయ్య.

పడిపోయాయి. కోపంతో ముగ్గురు బయటకెళ్లిపోయారు. వారలా బయటికి పోయారో లేదో.

"ఈళ్లతో కలిసినవేందిరా, బుద్ధి లేదురా?" కింద పడిన పుస్తకాలను తీస్త కోపంతో లేచాడు యాదయ్య సారు.

"లేదన్న, గిట్ల గొడవ జరుగుతుందని తెలువదు, ఏదో మాట్లాడేదుందని చెప్పి పట్టుకొచ్చినరు. అయినా వాడెవడన, మనం తినె తిండి తినొద్దనేటోడు. సారి సార్, గిట్లయిత దనుకోలే...." నా చేయిని పట్టుకున్నాడు శ్రీను

"నా కర్థంకావటం లేదు, కొండల్‌రెడ్డి ఎందుకంత కసిగా మాట్లాడుతున్నడు?" యాదయ్యసారు.

"దానికో కథుందిలే" ఫ్లాస్క్‌లున్న చాయ్‌లు ముగ్గురికిపోశా

"మళ్లో కథనా!" చాయ్‌గ్లాను తీసుకుంటన్నడు యాదయ్యసార్.

"శ్రీనుగ్గాడ తెలిసె ఉండాలి. కొండల్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి ఇతనికంటే మూర్ఖుడు. ఇతను భూములు కొల్చేటోడు. అతను కొలిచెదొంట్ల తప్పుడు కొలతలెక్కువగుండేవి. ప్రజల నుండి పంచాయితిలస్తె ఇరువైపుల డబ్బుల్లాగి పంచాయితి తెగకుండ చేసేటోడు. అప్పుడు చుట్టుపక్కల ఊర్ల నక్సలైట్లు బలంగుంటిరి. ప్రజలు వాళ్లకు పోయి ఫిర్యాదయినరు. నర్సింహ్మారెడ్డిని ఒకటికి రెండు సార్లు పిలిపించి మాట్లాడినరు. వాళ్ల మాటినలే. ఊర్లనే గ్రామ పంచాయితి దగ్గర మీటింగ్ పెట్టినరు. తమను ఎట్ల మోసం చేసింది ప్రజలు చెప్పుకున్నరు. ప్రజల సమక్షంలో శిక్షపడింది. ఆ అవమానాన్ని తట్టుకోలేక హైద్రాబాద్‌కు పోయాడు. అక్కడ ఇతనికి బాగానే కలిసొచ్చింది రియల్ ఎస్టేట్‌ల. ఊర్లకు రాడుగాని ఊర్ల జరిగే పండుగలకు జాతరలకు బ్యానర్లు కట్టిచ్చుకోవుడేగాదు, విరాళాలిస్తుంటాడు. ఇతను యాక్సిడెంట్‌ల చనిపోయిండని కొందరు, లేదు ఎవరో కావాలని యాక్సిడెంట్‌ల చంపించినారనుకుంటరు. తండ్రి మరణం పిదప కొండల్‌రెడ్డి ఆ బాధ్యతను తీసుకున్నడు. మాలమాదిగలంటే అసలు పడదితనికి..."

"వాళ్ల నాయనను కొట్టినరు గనుక కొండల్‌రెడ్డికి కింది కులపోళ్ల మీద కోపం, కాని వెంకటాచారి కెందుకింత కోపం?" యాదయ్య.

"తప్పుడు చైతన్యం, తన పీడితఅస్తిత్వాన్ని మరిచిపోయి, పరాయి పీడక అస్తిత్వాన్ని ఆశ్రయించటం. ఈ స్థితిప్పుడే గాదు, ఎప్పటి నుండో చూడొచ్చు. గుహుడు, ప్రహ్లాదుడు, విభీషణుడు, శబరి వీళ్లంత పీడక అస్తిత్వాన్ని ఆశ్రయించినోళ్లే. ఇప్పుడు మరింత సమస్యగా మారిందిటువంటోళ్లతో. ద్రోహాలు పెరిగాయి. దీనివల్ల పీడుతులు మరింత నష్టపోతున్నరు. రాజ్యానికి కావాల్సింది గూడ అదే మరి!"

"నీవుగూడ వాళ్ల లెక్క, తయారవుతవారా?"

"ఏందన్న గట్టంటవు" యాదయ్య సారు మీద నిష్టూరంగన్నడు శ్రీను.

"ఎంత మందిని చూడట్లేదురా?"

"అంత దిగజారనులే అన్నా" అనుకుంట నా దగ్గరకొచ్చి

"మా అన్న అట్లనే అంటడు సార్, మీరు చెప్పిన చదువు మరిచి పోను సార్" పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, కొద్ది సేపు కూర్చుని పనుందని వెళ్లిపోయాడు శ్రీను.

చాయ్‌గ్లాసు కడుగుదామని కిటికి దగ్గరకు పోయిన. వెనుక నుండి పిల్లల గుసగుసలు

"ఎవర్రా ఆడ?"

"మేమె సార్..." నరేష్ గొంతు

"ఆడేం చేస్తున్నార్రా, లోపలికి రండి"

ముగ్గురు నలుగురు ఆఫీసులకురికొచ్చారు.

"ఏందిరా, ఇంకా ఇంటికి పోలే?" తెలిసిగూడడిగా

"లేదుసార్"

"ఎందుకురా?"

'మనకు కాపలకాస్తున్నరు!" యాదయ్య సారందుకున్నడు నవ్వుకుంట.

వాళ్లకు పిప్పరమెంట్స్ ఇచ్చి పంపా. వాళ్లు వెళ్లాక కొద్ది సేపటికి కిటికీలను మూస్తూ యాదయ్యసారు.

"చూసింర్రా, మనకేదో అయితదని మనకోసమున్నరు పిల్లలు. ఇప్పటిదాక మనం తిండి గురించో, వాటలవాట్ల గురించో ఆలోచిస్తున్నాం గాని, వాళ్లకు చాలా చెప్పాల్సుంది సార్..." కంఠస్వరంలో మార్పొచ్చింది.

"ఏం చెబుతాం?" అతని మాటల తీవ్రత గురించాలోచిస్తూ.

"నీవు చెబుతున్నట్ట దశావతారాల కథేందో పురాణాల పుట్టుకేందో, ఈ దేశమూలవాసులు అంటరానివారిగా రాక్షసులుగా తీవ్రవాదులుగా ఎందుకు పిలవడుతున్నరో చెప్పాలి"

"అంతవరకే చెబితే సరిపోద్దా?"

"సరిపోదు లోక కళ్యాణం కోసమనొకరు, అభివృద్ధి కోసమనింకొకరు, ఆర్యరాముడి నుండి అమెరికోడి వరకు దండకారణ్యంలోకి ఎందుకు పోయినరో, ఆ అడవిల ఏమున్నదో పిల్లలకు చెప్పాలి..."

"చెబితె కష్టాలస్తయిగా!"

"ఏమైనగాని..." అనుకుంట బండి తీశాడు యాదయ్యసారు, అతని వెనుక కూర్చొని ఉద్విగ్నంగా వస్తున్న అతని మాటలిన సాగాను.

ఘర్‌వాపసీ

ఉదయమిత్ర

○ అడవీ, ఊరు గాని పొలిమేరలో జంతువులు సభ జరుపుతున్నాయి. కుక్కలు, పందులు, జింకలు, కుందేళ్ళు మొదలైన సాధుజంతువులన్నీ ఒక చోట చేరి ఏదో ముఖ్యమైన విషయం చర్చించబోతున్నట్టున్నాయ్. అంతకుముందే వర్షం పడి ఉండడంతో వాతావరణమంతా కడిగిన ముత్యంలా ఉంది. చెట్ల కొమ్మల మీద పక్షులు కూచొని "ఏం జరుగబోతోందా?" అని ఒకదాని కొకటి ముక్కులు పొడుచుకుంటున్నాయి. ఉడుత సగం కొరికిన మేడిపండును అట్లాగే పట్టుకొని ఎగాదిగా జూస్తున్నది. జంతువులన్నీ కొన్ని మొద్దుల మీదా, బండరాళ్ళ మీదా కొన్ని నిలబడీ సర్దుకుపోయాయి. అడవి నుంచి వలసొచ్చిన "కుమ్మాంగో" పక్షి మాత్రం ప్రత్యేక అతిథిలా కనబడుతోంది.

సభకు ఓ పక్కగా ఆవు నిల్చొని ఉంది. అన్ని జంతువులు దానివైపు అదోలా చూస్తున్నాయి. గత రెండు మూడు సంవత్సరాలుగా జంతువులన్నీ తనను వెలేసినట్లు చూడడంతో అది విపరీతమైన గిల్టీ కాంప్లెక్స్‌తో ఉంది. ఏదో పెద్ద రాద్ధాంతమే జరిగేటట్టుంది. కోతి ఇకిలించబోయి, వాతావరణపు గంభీరత్వాన్ని జూసి, వెనక్కి తగ్గింది.

అధ్యక్ష స్థానంలో ఉన్న ఎద్దు జడ్జి గంభీరంగా తన తలను అటూ ఇటూ తిప్పి, మరోసారి ఆవు కేసి జూసి, "ఇక మొదలెట్టండి" అంది.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

కుక్క "కుయ్, కుయ్" అంటూ ముందుకొచ్చింది. అటూ ఇటూ జూసి భూమిని మూర్క జూసి మొదలెట్టింది.

"అధ్యక్షా! ఈ ఆవుకు ఇటీవల వస్తున్న ప్రచారం చూసి నాకు ఒళ్ళు మండుతున్నది. ఏమిటి దీని గొప్ప! అని నేను ప్రశ్నిస్తున్నాను. నేను చూడండి. మనుష్యుల ఇండ్లకు కాపలాగాస్తాను. దొంగల్ని పట్టుకోవడానికి పోలీసులకు సహకరిస్తాను. హంతకులను పట్టుకోవడానికి నన్ను ఉపయోగిస్తారు. ఇప్పటికీ నేను చనిపోతే, కొందరు నన్ను మనుష్యులలో సమానంగా ఊరేగించి పూడ్చిపెడ్తారు. అయినా అదేమిటో గాని, ఈ ఆవుకిచ్చిన గౌరవంలో పదవ వంతు కూడా ఇవ్వరు. ఇప్పటికీ, నన్ను నీచ జాతి అనే అర్థంలో మాట్లాడుతారు" అంటూ తక్కిన జంతువులవైపు "మీరేమంటారు?" అన్నట్లు జూసి పక్కకు తొలగింది.

మెల్లిగా బర్రె ముందుకొచ్చింది. అప్పుడే నీళ్ళలో తడిసి వచ్చినట్టుంది. పెంక మీద జారుతున్న నూనెలాగ నీటి బిందువులు దాని ఒంటి మీది నుండి జారుతున్నాయి.

"అధ్యక్షా!" అంటూ మొదలెట్టింది. "అనాదిగా నేను నలుపుగా ఉండడంతో, నా పట్ల ప్రజలు వివక్ష చూపుతున్నారు. ప్రజల్లో ఎక్కువ నా పాలే తాగుతారు. మేం వ్యవసాయానికి తోడ్పడుతాము. అసలు మేం లేనిది రైతు లేడు. మా మాంసాన్ని హాయిగా భోం చేస్తారు. అయినా అందరూ ఈ ఆవును "గోమాత" అంటారే గాని నన్ను "బర్రె మాత" అని ఎవరూ అనరు. ఎటు జూసినా పేపర్లల్లో, టివిల్లో దీని పేరు మారుమోగడంతో దీనికి టెక్కు ఎక్కువైంది" అంటూ ఆవు వైపు మిర్రి మిర్రి చూసింది. "అదొక్కటే గాదు అధ్యక్షా! దీనికి మాకన్నా అందగత్తెనని పొగరెక్కువ. నడిచేటప్పుడు, నవ్వేటప్పుడు భలే "వగలాడి" నవ్వు నవ్వుతుంది" అని ముక్కు మూతి అదోలా తిప్పడంతో, జంతువులన్నీ గొల్లుగొల్లుగా నవ్వేసాయి.

"ష్ష్ష్..." గట్టిగా అరిచింది ఎద్దు జడ్జి. "ఒకటి గుర్తుంచుకోవాలి. మనం జంతువులం. మనుషులం గారు. మాట్లాడేటప్పుడు భాష విషయంలో మర్యాదగా ఉండాలి. మనుష్యులలాగ మతి తప్పి మాట్లాడ వద్దు" అంది హెచ్చరికగా.

కలకలం సద్దుమణిగింది. బర్రె వెనుదిరిగింది. ఆ తర్వాత గుర్రం ఠీవిగా ముందుకొచ్చింది. అది గోధుమ వర్ణంలో మిసమిసలాడుతోంది. అందరినీ తేరిపార జూసి గంభీరంగా మొదలెట్టింది.

"అధ్యక్షా! నా గురించి ప్రపంచానికంతటికీ తెల్సు. నేను జంతువులన్నిటిలో సైన్యాధ్యక్షురాలి వంటి దానిని. నా అందం ముందు, నా పరుగు ముందు వేరెవరూ సాటిరారు. నన్ను యుద్ధంలో వాడుకున్న రాజులెందరో గెలిచారు. ఇప్పటికీ మహానగరాలలో నన్ను వాడుకుంటారు. అయినా, అదేమిటో గాని ఈ ఆవును "గోమాత" అంటారు గాని, నన్నెవరూ "అశ్వమాత" అనరు. హూ... దీని కొస్తున్న ప్రచారం చూస్తే, అమ్మతోడు... దీని మూతి పళ్ళు మొత్తం రాలకొట్టాలనిపిస్తుంది" అంటూ గుర్రం వెనక్కాళ్ళతో తన్నబోయింది. తక్కిన జంతువులన్నీ దాన్ని ఆపాయి గాని, లేకపోతే ఆవును ఏం చేసేదో. మళ్ళీ లొల్లి షురువయ్యింది.

"సైలెన్స్!" గట్టిగా అరిచింది ఎద్దు జడ్జి. "అరవొద్దన్నానా! క్రమశిక్షణగా ఉండాలని చెప్పానా లేదా? మనమెవ్వుడూ మనుష్యులతో పోల్చుకునే స్థితికే రావొద్దు. వాళ్ళంటే కులం పేరు మీద, మతం పేరు మీద, రాజ్యాల పేరు మీద కొట్టుకు ఛస్తారు. మనకా ఖర్మ పట్టలేదు. అనవసరమైన హింస జంతు సంస్కృతికి వ్యతిరేకమైనదని నేను చెప్పదలిచాను" అంటూ ముగించింది.

గుర్రం కోపాన్ని తగ్గించుకొని వెనక్కి వచ్చేసింది.

ఇంకెవరొస్తున్నారు? అని జంతువులు, పక్షులు ఒకదాన్నికటి చూసుకున్నాయి. ఇంతలో ఆరిద్ర పురుగొకటి గునగున నడుచుకుంటూ ముందుకు వచ్చింది. అది అందరికీ కనబడడానికి ఒక పెద్ద మొద్దునెక్కి చెప్పడం మొదలెట్టింది. దాని శరీరమంతా ఎఱ్ఱటి మఖ్మల్ బట్ట గప్పినట్టు మనోహరంగా ఉంది.

"అధ్యక్షా! నేను ఆరిద్రపురుగును. కొద్ది కాలమే జీవించేది. వర్షాలు పడ్డ తర్వాత పుట్టి, పంటకు కీడు చేసే క్రిములను తిని, రైతుకు మేలు జేసి, జీవితం చాలిస్తా. నేను మేలు తప్ప కీడెవ్వరికీ చేయను. అయినా నన్నెవరూ పట్టించుకోరు. ఈ ఆవుకిచ్చిన గౌరవంలో నాకు లక్షవ వంతు కూడా ఇవ్వరు" అంటూ దుఃఖించింది. తక్కిన క్రిమికీటకాదులు దాన్ని సముదాయించాయి.

ఇంతలోనే మళ్ళీ కలకలం. ఒక్కొక్క జంతువు గోస విన్న తక్కిన జంతువులన్నీ కోపంలో ఊగిపోతూ, అరవడం మొదలెట్టాయి. "ఈ ఆవు సంగతేందో జూడాల్సిందే", "ఎవరి విలువ వాళ్ళకుంటది", "ఈ ఆవు మనిషితో కుమ్మక్కయి పోయింది", "ఏదో కుట్ర జరుగుతోంది" అంటూ నినాదాలిచ్చాయి.

సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది.

"ఇక ఆపండి" అంటూ ఆవు మోరలేపి పెద్దగా అరిచింది. ఆ శబ్దానికి చెట్ల ఆకులు స్తంభించిపోయాయి. పక్షులు రెక్కలు నిక్కబొడుచుకున్నాయి. గాలి అల్లల్లాడిపోయింది. అది ఆవేశంలో డొక్కలెగరేస్తూ మాట్లాడటం మొదలెట్టింది.

"అధ్యక్షా! ఇదంతా అన్యాయం, అక్రమం, అజ్ఞానం. మనుష్యులు చేసే కుట్రలో నన్ను ఇరికించి బలి పశువును చేస్తున్నారు. నేను చేయని పాపానికి విలన్‌ని అయిపోయాను. గత కొంత కాలంగా నా మీద వస్తున్న కార్టూన్లు చూస్తే నాకు సిగ్గనిపిస్తోంది" అంది గాద్గదికంగా. ఆవు కంట కన్నీరు పెట్టింది. జంతుజాలమంతా కోపం తగ్గి, సానుభూతి పెరిగినట్లుగా మౌనమయిపోయాయి.

"అసలు అధ్యక్షా! నేను ఈ సభను ఒకటి అడగదలిచాను. ఇందులో నా తప్పేమున్నది? ఎవరో కొందరు మనుషులు తమ స్వార్థం కోసం, రాజకీయాల కోసం నన్ను 'గోమాత'ను చేస్తే అది నా తప్పా? వాళ్ళు తమ తమ పుస్తకాలలో నా గురించి గొప్పగా రాస్తే నేనేం చేసేది? నేనేమన్నా అట్లా రాయమన్నానా?

గత కొంత కాలంగా నాకు 'గోమాత' గా పేరొచ్చిన మాట నిజమే. అది నా మీద ప్రేమవల్ల కాదు. వాళ్ళ స్వార్థాలు వాళ్ళకున్నాయి. నా పేరును అడ్డం పెట్టుకుని కొందరు మనుష్యులు గుడ్డి ద్వేషంతో ఇతరుల మీద దాడులు చేస్తున్నారు. చంపుతున్నారు. అసలు ఈ మనుష్యులున్నారే, వీళ్ళు సామాన్యులు కారు. నా చుట్టూ ఒక మార్కెట్ సృష్టించి, తమ పబ్బం గడుపుకోనీకె ఒక వర్గాన్ని బలి తీసుకోనీకె నన్ను వాడుకుంటున్నారు" అంది ఆవు.

ఆవేశానికి దాని ముక్కు పుటాలు అదిరిపోతున్నాయి.

"ఇక ఆపుతావా" అంటూ ముందుకొచ్చింది జింక. దాని కొమ్ములు ఎండల బాకుల్లాగ మెరిసిపోతున్నాయి. ఎవరూ లేకుంటే, ఆవును పొడిచేసేదేమో. నిగ్రహించుకుంది.

"నీవు చెప్పిందంతా బాగానే ఉంది. కాని, నీ ఒంటి మీద ఆ కాషాయం రంగేమిటి? అదెట్లా వచ్చింది?" అంటూ లా పాయింట్ లేవదీసింది జింక.

"ఓ ఇదా, ఇవ్వాళ అందరికీ నా మీద అనుమానాలే వస్తున్నాయి. అధ్యక్షా! నన్ను క్షమించాలి. ఇది నా రంగు కాదు. నాది తెల్ల రంగు. మా తాత ముత్తాతలది తెల్ల రంగు. వెన్నెలంత స్వచ్ఛమైన తెల్లరంగు" అంది సమాధానంగా ఆవు.

"మరి ఈ రంగెట్లా వచ్చింది"

"చెప్పినా కదా, ఇవేవీ నావి కావు. ఈ రంగు, ఈ గౌరవం, ఈ పూజలు నా మీద బలవంతంగా రుద్ద బడ్డవి. ఈ రంగును ఎవరో వచ్చి నాకు పూసి వెళ్ళారు. నేను కడుక్కున్న కొద్దీ మళ్ళీ మళ్ళీ పూసి వెళ్ళున్నారు. నేనేం చెయ్యాలి? నా కిష్టం లేకుండా నా చుట్టూ పనులు జరిగిపోతున్నాయి" అంటూ నిట్టూర్చింది ఆవు.

"అవునన్నా. ఇదైతే నిజం. మనకిష్టం లేకుండా, మన ప్రమేయం లేకుండా ఏమేమో జరిగిపోతున్నాయి" అంటూ ముందుకొచ్చింది గౌమాంగో పక్షి.

"అడవులనే జూడండి" అంటూ అందరివైపూ చూసి, రెక్కలల్లార్చుతూ మొదలెట్టింది. "మనుష్యులు ఏవేవో పెద్ద పెద్ద భూతాల్లాంటి యంత్రాలు తెస్తున్నారు. భూమిని పేల్చివేస్తున్నారు. నిత్యమూ పేలుళ్ళతో భూమి పచ్చి పుండుగా మారిపోయింది. పశుపక్ష్యాదులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆదివాసీల బతుకయితే ఆగమాగమయిపోతున్నది. ఇయ్యాల ఉన్న చెట్లును రేపు కూల్చేస్తున్నారు. ఇయ్యాల ఉన్న గూడేన్ని రేపు కూల్చేస్తున్నారు. నేనేమో అందరినీ కోల్పోయి ఒంటరిగా బతుకుతెరువు కోసం ఈ మైదానానికి వచ్చాను" అంటూ కొనసాగింది. అది మాట్లాడ్తుంటే, స్వయంగా అడివే మాట్లాడుతున్నట్లుంది.

"నాకేమో అడివంటే ఇష్టం" అంది కొనసాగింపుగా. "కన్నతల్లిని, ఉన్న ఊరినీ పోగొట్టుకొని, సగం చచ్చి, సగం బతికి ఈడ్చుకొస్తున్నా ఈ బతుకును" అంటూ కంట తడిపెట్టింది గౌమాంగో పక్షి.

"ఇక్కడ నా పరిస్థితి కూడా అంతే అధ్యక్షా!" అంటూ మళ్ళీ కొనసాగించింది ఆవు. "నాకు మనుష్యులలో ఉండటం ఇష్టం లేదు. మీతోనే ఉండాలనుకుంటున్నా" అని ఆగింది. "వాళ్ళెంత మోసకారులో నాకు బాగా తెలుసు. నేను మార్వాడీల వీధికి పోతే, గోమాత పేరు మీద బొట్టు పెట్టి, భక్ష్యాలు వగైరాలు పెడ్తారు. వీళ్ళే మార్కెట్లో రైతు పొట్టగొడ్డారు" అంది ఆవు.

"ఆపు ఆపు నీ ఉపన్యాసం" అంటూ ముందుకొచ్చి మీసాలు దువ్వుకొంది బావురుపిల్లి. "గత కొంతకాలంగా నువ్వు మాతో కలివిడిగా ఉండటం లేదు. నేనేదో ప్రత్యేకమైన దాన్ని అన్నట్టు పోజు పెడ్తున్నావు. నువ్వు మనుష్యుల్తో కుమ్మక్కయ్యావని మా జంతుజాలం భావిస్తోంది. దీనికేమంటావు?" అంది ఘాటుగా తన పిల్లి కళ్ళను అటూ ఇటూ తిప్పుతూ.

"అయ్యో... పిల్లి తల్లీ.. నాకు మీతో ఉండటమే ఇష్టం. అసలు మీరే నన్ను అనుమానంతో దూరం పెడ్తున్నారు. అటు మీకు గాకుండా, ఇటు మనుష్యులలో ఉండటం ఇష్టం లేకా, నా బతుకు అడకత్తెరలో పోకలాగ మారిపోయింది" అంది ఆవు నిట్టూరుస్తూ.

కొద్ది సేపు మౌనం. మళ్ళీ లొల్లి షురువయ్యింది.

"ష్ష్ష్... అరవొద్దన్నానా... ఎన్ని సార్లు చెప్పాలి" అంటూ గద్దించింది ఎద్దు జడ్జి. "ఆ... ఇప్పుడు జెప్పు. నువ్వేం చెప్పదల్చుకున్నావు?" అంది ఆవునుద్దేశించి.

"అధ్యక్షా! నేను మీలో కలువదలచాను. నీకు ఈ "వెలి"

ప్రకటన

ప్రజల మనిషి తారకంగారికి నివాళి

ఆయన విప్లవ రచయితల సంఘం తొలితరం నాయకుల్లో ఒకరు. పౌరహక్కుల సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు. విద్యార్థి దశలోనే దళిత విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన వారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు. దళిత మహాసభ వ్యవస్థాపకుడు. రాజకీయ ఖైదీల విడుదల కోసం ఏర్పడిన కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ అధ్యక్షులు. తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కన్వీనర్. పదేళ్ళ ఐక్య విప్లవోద్యమం సందర్భంగా వర్గపోరాట రాజకీయాలను చర్చించడానికి ఏర్పడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలో కూడా సభ్యులు. ఇంతటి విస్తారమైన సామాజిక రాజకీయ జీవితం బొజ్జా తారకం గారిది. అన్ని ప్రగతిశీల శిబిరాలు ఎంతగానో ప్రేమించే తారకం గారు ఇక లేరంటే ఎంతో కష్టంగా ఉంటుంది.

తండ్రి దళిత ఉద్యమ వారసత్వాన్ని చిన్న వయసు నుండే స్వీకరించిన తారకం గారు సాంస్కృతిక కార్యకర్తగా, విద్యార్థి ఉద్యమకారుడిగా తన సొంతవూరిలో దళిత యువకుల్ని సంఘటితం చేశారు. వర్గపోరాట రాజకీయాలతో ప్రభావితమై విరసం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైనారు. ఆయన రాసిన 'కులం-వర్గం' భారతదేశంలో జమిలిగా జరగవలసిన కుల వర్గ పోరాటాలను నొక్కి చెబుతుంది. తారకం గారు ఎమర్జెన్సీ దాకా విరసం కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. కవిత్వం, నవల, సామాజిక, సైద్ధాంతిక అంశాలపై రచనలు చేశారు. సామాజిక సమస్యల్ని సాధారణ కార్యకర్తలకు అర్థం అయ్యే రీతిలో విశ్లేషించి చెప్పారు. ఎమర్జెన్సీలో జైల్లో ఉన్నప్పుడు ఆయన రాసిన 'పోలీసులు అరెస్టు చేస్తే' పుస్తకం నిత్యం

రాజ్యహింసను అనుభవించే ప్రజాసంఘాల కార్యకర్తలకు దిక్సూచి వంటిది.

అంబేడ్కర్ నూ, కార్ల్ మార్క్స్ నూ ప్రేమించినట్లే దళిత ఉద్యమాన్ని, విప్లవోద్యమాన్ని ప్రేమించారు. దళితులు, ఉద్యమ కార్యకర్తలు, నిర్వాసితులు..ఇలా హక్కులు నిరాకరించబడిన సమూహాలన్నిటి పక్షాన కోర్టుల్లో న్యాయపోరాటం చేశాడు. కారంచేడు, చుండూరు, లక్షింపేట నిండి రోహిత్ వేముల దాకా, ప్రజాసంఘాల కార్యకర్తల నుండి విప్లవోద్యమ నాయకుల దాకా కేసులు వాదించాడు. బూటకపు ఎంకౌంటర్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు నడిపాడు. ఎన్నో ప్రజాసంఘాల వేదికలపై ఆయన గళం సముద్రం వలె గర్జించింది. వేలాది ఉపన్యాసాలు, చర్చలు, వీధి పోరాటాలతో, నిత్య నదీ ప్రవాహం ఆయన జీవితం. వ్యవస్థపై రాజీ లేని పోరాటం చేసిన బొజ్జా తారకం బ్రైన్ ట్యూమర్ తోనూ పోరాడాడు. అనారోగ్యం నుండి కోలుకుని మళ్ళీ ప్రజాజీవితంలో అడుగుపెట్టారు. డెబ్భై ఏళ్ళు ప్రజల కోసం అలోచనలు పోయిన మెదడు అలసిపోయి మళ్ళీ వ్యాధినబడి శాశ్వతంగా విశ్రమించింది. ఆయన ఆలోచనలు, ఆచరణ ప్రజాపోరాటాల్లో మిగిలే ఉంటాయి. విరసం ఆయనకు వినమ్రంగా జోహార్లర్పిస్తున్నది.

- వరలక్ష్మి, విరసం కార్యదర్శి

భరించడం కష్టంగా ఉంది. మీరేం చేయమంటే అది చేస్తా" అంది దృఢంగా ఆవు.

"అయితే మేం కాస్త ఆలోచించుకుంటాం. నువ్వు అవతలికి పో...." అంటూ ఆజ్ఞాపించింది జడ్జి ఎద్దు.

ఆవును దూరంగా తీసుకుపోయాక, జంతువులు మంతనాలు సాగించాయి. కొంతసేపు చర్చలు జరిగాయి. గుర్రం, బర్రె, కుక్కలు తీవ్రంగా విభేదించినా, తక్కిన జంతువులు వాటిని సముదాయించాయి. అన్నీ ఒక నిర్ణయానికొచ్చి, ఆవును రప్పించాయి.

"చూడు గోమాతా..." అని నాలిక్కర్చుకొంది ఎద్దు జడ్జి. "ఓ... సారీ.. ఆవుతల్లీ మేమందరం గల్సి ఒక నిర్ణయానికొచ్చాం. ముందు నీవు ఆ కాషాయం రంగు తొలగించుకొని అసలు రంగుకు రావాలి" అంది.

"సరే చెప్పండి ఏం చేయాలో?"

"ఈ ఆవును చెరువు కాడికి తీస్కపోండి..." అంటూ మరో ప్రశ్నకు తావు లేకుండా హుకుం జారీచేసింది.

అన్నది తడవుగా పాలోమంటూ జంతువులన్నీ తోకలూపుకుంటూ బయలుదేరాయి. సమస్త జంతువులన్నీ కలిసి కట్టుగా బయలుదేరడంతో, కులం పేరు మీద కొట్టుకుంటున్న ఇద్దరు మనుష్యులు తమ కొట్లాటనాపి, నోరెళ్ళబెట్టి జంతువుల్ని చూస్తూ ఉండిపోయారు.

అదొక సుందర దృశ్యం. శివుని గుడికాడి ఊర చెరువు తన అలల్తో కలల్ని రేపుతోంది.

జంతువులన్నీ గట్టుమీద నిలబడి చూస్తున్నాయి. కొన్ని సీతాకోక చిలుకలు జింకల కొమ్ము మీద వాలి, వాటి పదును జూసి ఆశ్చర్యపోతున్నాయి. ఓ పక్షి బర్రె మీదకు చేరి తదేకంగా చూస్తోంది. కుమ్మొంగోల్ పక్షి చింత చెట్టును చేరింది. గుర్రం మీద పిల్లి కూచొని "మ్యావ్, మ్యావ్" అంటోంది. చెరువు నీటి అలలు 'తళల్, తళల్' మంటూ ఆవును ఆహ్వానిస్తున్నాయి.

ఆవు మెల్లిగా చెరువులోకి దిగింది....

దాని వీపు మీద వాలిన బూరీగలు ఒక్కొక్కటిగ ఎగిరిపోయాయి. మెల్లగా తెల్ల తామెరలు తమ ముని వేళ్ళతో ప్రేమగా తాకాయి. అది లోనికి పోయిన కొద్దీ, చేపలు గిచ్చి గిలిగింతలు పెట్టాయి.

ఆవు మెల్లగా నీళ్ళలో మునిగింది. మెల్లగా కాషాయం కరిగింది. ఆవు మోరనెత్తి ఆకాశంలోకి చూసింది... దాని కళ్ళల్లో వెన్నెల కాంతులు.

తెల్లని ఆవు తన ఉనికిని సగర్వంగా చాటుకుంటూ బయటికొచ్చింది. అది విముక్తం చెందింది. గట్టు మీద జంతువులు గంతులేసాయి. కోయిల కొత్తపాటందుకొంది.

ఆవును తమలో కలుపుకున్న జంతువులు సంతోషంగా ఇంటి బాట పట్టాయి.

(నోట్: దీనికో మంచి ముగింపునిచ్చిన గీతాంజలిగారికి పేరు సజెస్ట్ చేసిన వీరబ్రహ్మాచారికీ కృతజ్ఞతలు.)

దళిత, విప్లవోద్యమాల వారధి తారకంగారు

దుడ్డు ప్రభాకర్

ప్రకాశం జిల్లా కారంచేడులో ఆరుగురు మాదిగల్ని అత్యంత క్రూరంగా హత్య చేసిన కమ్మ కుల దురహంకారుల అరెస్టు కోసం చీరాల కేంద్రంగా దేశవ్యాపితంగా ఉద్యమం జరుగుతున్న రోజులవి. అపుడు నేను చీరాలలో ఎం.కాం. చదువుతున్నాను. చీరాల గడియారం స్తంభం సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తారకం గారు ఎంతో ఆవేశంగా, ఆవేదనగా, గంభీరంగా ఉపన్యసిస్తున్నారు. అపుడే మొదటిసారి ఆయన్ని చూసాను. గంటకు పైగా మాట్లాడారు. ఆ ఉపన్యాసం విన్న తర్వాత ఆయనతో మాట్లాడాలనిపించింది. కనీసం ఆయన్ని తాకాలనుకున్నాను.

కానీ ఆరోజు సాధ్యపడలేదు. తారకం గారి ఉపన్యాస స్ఫూర్తితో నేను మా ఊరు (ప్రకాశం జిల్లా చీమకుర్తి) వెళ్ళి మాల, మాదిగలతో పెద్ద ర్యాలీ నిర్వహించాను. కారంచేడు కమ్మ భూస్వాముల్ని అరెస్టు చెయ్యాలని నినాదాలిస్తూ ఊర్లోని కమ్మ కూడళ్ళగుండా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. రెండు పల్లెల్లోని ప్రతి ఇల్లూ కదిలింది. నేను అప్పుడు అంబేద్కర్ యువజన సంఘం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. మా ఊరి చరిత్రలో కమ్మోళ్ళకు వ్యతిరేకంగా ప్రదర్శన చేయడం అదే మొదటిసారి. బహుశా జిల్లాలోనే అది మొదటి ప్రదర్శన కావచ్చు. ర్యాలీలో వస్తున్న మాల, మాదిగ పెద్దల్ని కమ్మ యువకులు పక్కకు పిలిచి, "అక్కడ వాళ్ళ నెవర్నో చంపితే ఇక్కడ మీరు ఊరేగింపులు చేస్తున్నారు. ఇక్కడ మిమ్మల్ని నరికితే మీకు దిక్కెవర్రా?" అన్నారు. అప్పటికే హంతకుల అరెస్టుకై రాష్ట్రంలో ఉద్యమం ఉధృతంగా నడుస్తున్నది. ఆ హత్యాకాండకు ప్రధాన సూత్రధారి అయిన దగ్గుబాటి చెంచురామయ్య (అప్పటి ముఖ్యమంత్రి ఎన్. టి. రామారావు వియ్యంకుడు) పేరు పోలీసులు ఎఫ్ఐఆర్ లో కూడా చేర్చలేదు. కమ్మ సామాజిక వర్గం రాష్ట్రంలో మొదటిసారిగా అధికారాన్ని హస్తగతం చేసుకొని విర్రవీగుతున్న రోజులవి. అందుకే కమ్మ యువకుల హెచ్చరిక మాలోని కొందరిలో భయాందోళనలు కలిగించాయి. తర్వాత కొన్నాళ్ళకు పీపుల్స్‌వార్ దళం కారంచేడులోని చెంచురామయ్య ఇంటిలోనే ఆయన్ని హత్య చేసింది. చెంచురామయ్య హత్య రాష్ట్ర వ్యాపితంగా దళితులపై పెద్ద ప్రభావాన్నే వేసింది. ఆ హత్య దళితులపై జరుగుతున్న దాడుల్ని ఆపగలిగిందా? అనే ప్రశ్నలూ ఉన్నాయి. కానీ దళిత పీడిత కులాల బతుకు భద్రతకు చిన్న భరోసా మాత్రం ఇవ్వగలిగింది. ఆ తర్వాత పీపుల్స్‌వార్ పార్టీ అంటే మాల మాదిగోళ్ళ పార్టీ అనే ప్రచారం సాగింది. ఆనాడు దళితులపై దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు పీపుల్స్‌వార్ అండగా నిలిచింది. తారకం గారి గురించి మాట్లాడటం అంటే కుల-వర్గ పోరాటాల గురించి, వాటికున్న విడదీయరాని సంబంధం గురించి చర్చించడమే. నాకు, నాలాంటి వేలాది మంది కార్యకర్తలకు ఆయనొక స్ఫూర్తి.

తెలంగాణ ప్రాంతంలో అంబేద్కర్ యువజన సంఘాలు ఏర్పాటు చేసి, దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగినపుడు ఉద్యమాలు చేయిస్తూ కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తున్న తారకం గారు కారంచేడు నరమేధం తర్వాత హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాద పదవికి రాజీనామా చేసి దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులయ్యారు. అంటరానితనం ప్రత్యక్షంగా అనుభవించక పోయినా, సాయుధ పోరాటంలో పాల్గొనకపోయినా, దళితుడిగా పుట్టడం, విప్లవాల పురిటిగడ్డ తెలంగాణలో తిరుగాడటం వల్ల కాబోలు తారకం గారు కుల, వర్గ ఐక్యతను కోరుకున్నారు. ఆయన రాసిన కులం-వర్గం పుస్తకంలో ఈ దేశంలో కులవర్గ పోరాటాల ఐక్యతావశ్యకతను వివరించారు. ఆయన దృష్టిలో కులపోరాటాలకు ప్రతినిధులుగా దళిత, పీడిత కులసంఘాల నాయకులు, వర్గపోరాటాలకు ప్రతినిధులుగా వామపక్ష భావజాలం కల్గిన అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి. అయితే దాదాపు రెండు శిబిరాలు

కులవర్గ పోరాటాల ఐక్యతను నిరాకరించాయని చెప్పాలి. అంతటితో ఆగడంలేదు. దళితులపై దాడులు తీవ్రమవుతున్న క్రమంలో ఒక శిబిరంపై మరొక శిబిరం తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి. విషాదమేమంటే ఈ దేశంలో కమ్యూనిస్టులు కుల సమస్యను నిర్లక్ష్యం చేసారని, తరతరాలుగా ఆయా పార్టీలలో అగ్రకుల నాయకులు తిష్ట వేసుకొని కూర్చున్నారని అందుకే కుల సమస్యను పట్టించుకోలేదని కుల సంఘాలను ఏర్పాటు చేసుకున్న నాయకులు కొందరు తమ వ్యక్తిగత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ఆయా కులాల ప్రజల ఆకాంక్షలను అగ్రకుల పాలకపార్టీల పాదాల దగ్గర తాకట్టు పెడుతున్నారు. వారి కాంక్షల్ని పీడిత ప్రజల ఆకాంక్షలుగా భావించిన వామపక్ష రాజకీయాలు పీడిత కులాల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపాలైన ప్రజాస్వామిక ఉద్యమాలను అస్థిత్వ ఉద్యమాలకు కుదించి, అవి విముక్తి పోరాటాలకు ఆటంకంగా తయారయ్యాయని ప్రచారం చేస్తున్నాయి. ఈ వైఖరి వల్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కోరుకుంటూ, అందుకోసం అనేక రూపాలలో పోరాటం చేస్తున్న ప్రజాసమూహాలు రెండు శిబిరాలపై ఆశలు వదులుకొన్నాయి. ఎవరైతే వీరి దుస్థితికి కారకులో ఆయా అగ్రకుల పార్టీలకు, హిందూమతోన్మాదమే ఎజెండాగా కల్గిన బిజెపికి దగ్గరౌతున్నారు. ప్రస్తుతం దేశవ్యాపితంగా అదే పరిస్థితి కొనసాగుతూ ఉంది. ఈ పరిస్థితికి దారితీసిన కారణాలను సీరియస్‌గా సమీక్షించకుండా, జనాలపై నిందలు వేసి చేతులు దులుపుకోవడానికి ప్రజలు గొర్రెలు కాదు. ఆ విషయాన్ని అనేక అనుభవాల ద్వారా గమనించిన కమ్యూనిస్టు పార్టీలు పశ్చాత్తాపం ప్రకటించి వాటి కార్యక్రమం, ప్రణాళికలో కులానికి సంబంధించి చిన్న మార్పులు, చేర్పులు చేసాయి. ఆచరణలోకొచ్చేసరికి కింది క్యాడర్ ఆ మార్పును జీర్ణించుకోలేక పోతోంది. కుల ఉద్యమాలు, వర్గ నిర్మూలన ఉద్యమాలు ఈ స్థితికి రావడానికి కారణాలపై నిజాయితీతో కూడిన చర్చ జరగాలి. కానీ కనుచూపు మేరలో ఆ ప్రయత్నమే లేదు. అందుకు అనేక కారణాలున్నాయి. వాటి వెనుక ఎవరి ప్రయోజనాలు వారికున్నాయి. అస్సలు చర్చకే తావులేని చోట, విమర్శను స్వీకరించే సహనం కూడా లేనిచోట కాలమే పరిష్కరిస్తుందని కాలానికి వదిలేయడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు. తారకం గారు ఇదే వైఖరి తీసుకున్నారు. అలాగని ఆయన నిరాశతో మౌనంగా కూచోలేదు. తన కుల-వర్గ నిర్మూలన ఆకాంక్ష విప్లవ పార్టీల ద్వారా నెరవేరగలదని ఆశపడ్డారు. దశాబ్దకాలంగా ఆయన ఆచరణే అందుకు సాక్ష్యంగా మన ముందుంది.

ఈ దేశంలో అగ్రకుల భూస్వామ్య పాలకులు, సామ్రాజ్యవాదులు, హిందూ మతోన్మాదులు పీడిత ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలను ధ్వంసం చేస్తున్న సందర్భంలో అనేక మార్పులకు గురౌతున్న కాలానికి అనుగుణంగా ప్రజల పక్షాన ఆలోచించారాయన. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎం.ఎల్ పార్టీ నుండి పోటీ చేసారు. బియస్పీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన వాళ్ళలో ప్రముఖులు. తర్వాత దానికి రాజీనామా చేసి ఆర్‌పిఐ అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌పిఐ ఒక ప్రజాస్వామిక ఉద్యమ సంస్థగానే పని చేస్తుంది. ఈ మార్పులన్నీ అనేక మందికి తప్పుగా కన్పించవచ్చు. రాజకీయ పదవుల వ్యామోహంతో ఆయన ఆపని చెయ్యలేదు. అగ్రకుల పాలక పార్టీలకు వ్యతిరేకంగా ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీలకు ఒక ప్రత్యామ్నాయ పార్లమెంటరీ రాజకీయ పార్టీ అవసరమని ఆయన భావించారు. అందుకు ఆయన నాన్నగారైన అప్పలస్వామి ఆదర్శం కావచ్చు. అయితే ఆయనెప్పుడూ అగ్రకుల పాలకవర్గ పార్టీల దరి చేరే ప్రయత్నం చెయ్యలేదు. తారకం గారిని ఒక దళిత నాయకుడిగా చూసినా ఇప్పటి కుల సంఘాల నాయకులతో పోల్చుకుంటే ఆయనకు అప్పటి నుండి ఇప్పటి దాకా ఉన్న పర్సనాలిటీ తక్కువదేమీ కాదు. ఆయన కావాలనుకుంటే ఎపుడో ఏ రాజకీయ పార్టీలోనైనా ఎంఎల్‌ఏనో ఎంపినో మంత్రో అయ్యేవారు. అంతెందుకు ఆయన హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగినా సుప్రీం కోర్టు జడ్జిదాకా ఎదిగేవారు. తారకం గారు అలాంటి ఎదుగుదలను కాని, అధికారాన్ని గానీ కోరుకోలేదు. ఈయనకు ప్రజల మీద, ప్రజాపాలన మీద, ప్రజా కోర్టుల మీద విశ్వాసం. అందుకే జనతన రాజ్యాన్ని చూడటానికి 75 ఏళ్ళ వయస్సులో దండకారణ్యం వెళ్ళారు. దండకారణ్యంలో ఆదివాసులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక పోరాట కమిటీలో ఒకానొక కో-కన్వీనర్‌గా ఉన్నారు. వారిని అరెస్టు చేసి జైళ్ళలో పెడితే వారి విడుదల కోసం ఏర్పాటు చేసిన రాజకీయ ఖైదీల విడుదల కమిటీలో వ్యవస్థాపక ఉపాధ్యక్షులుగా ఉన్నారు. వారిని, వారికి మద్దతుగా నిలిచన మావోయిస్టు పార్టీ సభ్యుల్ని కాల్చి చంపుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అప్రజాస్వామిక, హంతక విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడిన తెలంగాణ ప్రజాస్వామిక వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరయ్యారు. మొదటితరం పార్లమెంట్ రాజకీయ నాయకుడి కొడుకుగా, దళిత ప్రజాస్వామిక ఉద్యమకారుడిగా తన ఉద్యమ జీవితాన్ని ప్రారంభించిన తారకంగారు విప్లవ రాజకీయాల పట్ల అచంచలమైన విశ్వాసంతో తన తుది శ్వాస విడిచారు.

ఆయన విప్లవ స్వాప్నికుడు కావడానికి బలమైన కారణాలున్నాయి. ఈ దేశంలో అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలు దళితులకు, ముస్లింలకు, ఆదివాసులకు న్యాయం చెయ్యకపోగా, వాళ్ళను హింసించి, అణచివేసి, హత్యలు చేసి పబ్బం గడుపుకునేవే అనే సత్యం తన జీవిత అనుభవం ద్వారా తెలుసుకున్నారు. ఓట్లపై ఆధారపడే అన్ని రాజకీయ పార్టీలు (సిపిఐ, సిపిఎం, ఎంసి పార్టీలతో సహా దళిత, బహుజన పార్టీలుగా గుర్తింపు పొందిన పార్టీలు) 'వాడ'లోని దళితులపై దాడులు జరిగినపుడు బాధితులైన దళితుల పక్షాన నిలబడడానికి జంకుతాయి. 'ఊరి' ఓట్లు దూరమవుతాయనే భయం. ముస్లింలపై ఊచకోతలు జరుగుతున్నా, వారి ప్రార్థనామందిరాలు ధ్వంసం చేయబడుతున్నా, మౌనంగా ఉంటాయి. మెజారిటీ హిందువుల ఓట్లు దక్కవని దడ. ఈ దేశ ఖనిజ సంపదను దోచుకుంటున్న పాలకుల వైఖరిని ఆదివాసులు ప్రాణాలు పణంగా పెట్టి వ్యతిరేకిస్తున్నారు. అందుకే

అధికారంలో ఉన్న వాళ్ళు ఆదివాసుల జాతి హననానికి పాల్పడుతుంటే ప్రతిపక్ష పాలక పార్టీలు మౌనం వహిస్తున్నాయి. కాబట్టే ప్రజల్ని ఓటర్లుగా కాకుండా మనుషులుగా చూస్తున్న విప్లవకారులపై తారకం గారు అభిమానం పెంచుకున్నారు.

'పోలీసులు అరెస్టు చేస్తే' అనే పుస్తకం ద్వారా సామాన్య ప్రజలకు అనేక సూచనలు, సలహాలు చేసారు. అయితే పాలకుల దోపిడీ తీవ్రతరమౌతున్న కొద్దీ అరెస్టులు కనుమరుగయ్యాయి. పాలకవర్గాలు పోలీసుల్ని, హంతకులుగా మాఫియా గ్యాంగులుగా తయారు అయ్యాయి. మిస్సింగులు, హత్యలు, కిడ్నాప్‌లు మొదలయ్యాయి. వివిధ పేర్లతో హంతక ముఠాలను సృష్టించి ప్రశ్నించే ప్రజల్ని బీభత్సంగా నరికి చంపక పోతే ప్రభుత్వాలు మనుగడ సాగించలేని ప్రతి సందర్భంలో తారకంగారు ప్రజలకు అండగా నిలిచారు. కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తూనే బాధిత కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పేవారు. ప్రభుత్వాన్ని పత్రికల ద్వారా నిలదీసేవారు.

2005లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హంతక ముఠాలు గ్రీన్‌టైగర్స్, క్రాంతిసేన, నల్లమల నల్లత్రాచులు, నర్సాకోబ్రాస్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాల నాయకుల ఇళ్ళపై దాడులు చేస్తూ వారిని నరికి చంపాయి. హత్యకు గురైన శవాలు ఊరేగించినా, సంస్మరణసభలు జరిపినా హతమారుస్తామని హెచ్చరిస్తున్న సందర్భం. ఎవడు పోలీసో, ఎవడు హంతకుడో, ఎవడు రౌడీనో తేడా లేకుండా ఎవరు, ఎవర్ని, ఎప్పుడు, ఎలా ఛంపుతారోనని ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న రోజులు. ఆ సమయంలో అమరుడు పున్నారావుతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని హంతకుల్ని, ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. అడవిలో అన్నలతో తలపడలేక నగరాలలో తలదాచుకొంటున్న నల్లత్రాచులు నిరాయుధులైన ప్రజాసంఘాల నాయకుల్ని చంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. అప్పట్లో ఆ ప్రకటన ప్రజలకు అడివంత అండ. కొండంత ధైర్యాన్నిచ్చింది.

శ్రీకాకుళం జిల్లా లక్షింపేటలో తూర్పు కాపులు ఐదుగురు దళితుల్ని నరికి చంపిన సందర్భంగా జరిగిన ఉద్యమంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. లక్షింపేట హంతకుల అరెస్టుకై, దళితులకు పునరావాస కార్యక్రమాల కోసం సుమారు 55 ప్రజాసంఘాలతో ఏర్పడ్డ లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ కన్వీనర్‌గా తారకంగారు, ముగ్గురు కన్వీనర్‌లలో ఒకానొక కన్వీనర్‌గా కులనిర్మూలనా పోరాట సమితి ప్రతినిధిగా నేను ఉన్నాను. ఆ సందర్భంగా సుమారు రెండు సంవత్సరాలు అనేక సార్లు ఆయనతో గంటల తరబడి చర్చించే అవకాశం దక్కింది. 'లక్షింపేట'కు నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, జిల్లా కేంద్రాలలో ర్యాలీలు, బహిరంగ సభలు, కోస్తాంధ్ర, ఉత్తర కోస్తా, రాయలసీమ, తెలంగాణలో ప్రాంతీయ సదస్సులు, హైదరాబాద్‌లో 5 రోజులు రిలే నిరాహార దీక్షలు, ఢిల్లీలో ధర్నా, లక్షింపేట నుండి శ్రీకాకుళం దాకా 5 రోజులు పాదయాత్ర, శ్రీకాకుళంలో బహిరంగసభ లాంటి అనేక రూపాలలో రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాన్ని నడిపించారు. ఆ సందర్భంగా కులం, వర్గం గురించి విస్తృతమైన చర్చే జరిగింది. (దళితులపై హత్యాకాండ జరిగిన ప్రతిసారీ అనేక రూపాలలో చర్చను లేవదీస్తూ ఉంటారు. ఉద్యమాన్ని బలహీన పరచడానికి పాలకుల అమ్ములపాదిలో అలాంటి చర్చలు కూడా ఆయుధాలుగా ఉంటాయి) ఆ చర్చలో కమ్యూనిస్టుల్ని దళిత వ్యతిరేకులుగా ప్రచారం చేస్తూ అగ్రకుల పాలక పార్టీలతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ఉద్యమాలు చేసే కొందరు దళారీ నాయకుల గారడీలను తీవ్రంగా తప్పుబట్టారాయన. అదే విధంగా మార్క్సిస్టు ముసుగు తగిలించుకొని అభ్యుదయవాదులుగా చెలామణి అవుతున్న అగ్రకుల మేధావుల కుతర్కాన్ని తూర్పారబట్టారు. దళితులకు విప్లవోద్యమం అండగా నిలవాలని విజ్ఞప్తి చేసారు.

లక్షింపేట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఫూలే జయంతి (ఏప్రిల్ 11) నుండి అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) వరకూ రిలే నిరాహార దీక్షలు జరిగాయి. ఆ శిబిరాన్ని ప్రారంభించడానికి వచ్చిన తారకం గారు తిరిగి ఇంటికి వెళ్ళిన తర్వాత జ్ఞాపకశక్తి కోల్పోయారు. ఆసుపత్రికి తీసుకెళితే బ్రెయిన్ ట్యూమర్ అని తేలింది. "కొంతకాలం మందులు వాడి చూద్దాం. తగ్గకపోతే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. అప్పటిదాకా విశ్రాంతి అవసరం" అని డాక్టర్లు చెప్పారు. అయినప్పటికీ తారకంగారు లక్షింపేట నుండి శ్రీకాకుళం దాకా 140 కిలోమీటర్లు 5 రోజుల పాటు జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. అప్పటి పిసిసి అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర తూర్పుకాపుల నాయకుడిగా ఉన్న బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కొండ్రు మురళి అనుచరులు పాదయాత్రను భగ్నం చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారనే వార్తలు శ్రీకాకుళం జిల్లాలో భగ్గుమంటున్నాయి. ఆ పరిస్థితుల్లో పాదయాత్రలో

ఆయన విప్లవ స్వాప్నికుడు కావడానికి బలమైన కారణాలున్నాయి. ఈ దేశంలో అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలు దళితులకు, ముస్లింలకు, ఆదివాసులకు న్యాయం చెయ్యకపోగా, వాళ్ళను హింసించి, అణచివేసి, హత్యలు చేసి పబ్బం గడుపుకునేవే అనే సత్యం తన జీవిత అనుభవం ద్వారా తెలుసుకున్నారు. ఓట్లపై ఆధారపడే అన్ని రాజకీయ పార్టీలు (సిపిఐ, సిపిఎం, ఎంసి పార్టీలతో సహా దళిత, బహుజన పార్టీలుగా గుర్తింపు పొందిన పార్టీలు) 'వాడ'లోని దళజతులపై దాడులు జరిగినపుడు బాధితులైన దళితుల పక్షాన నిలబడడానికి జంకుతాయి. 'ఊరి' ఓట్లు దూరమవుతాయనే భయం.

తారకంగారు పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. ప్రతి గ్రామంలో పాదయాత్ర ముందు నిలిచి ప్రధాన కూడళ్ళలో అనర్గళంగా మాట్లాడారు. గ్రామానికి గ్రామానికి మధ్య రెస్టు తీసుకొని మందులు వాడుతూ పాద యాత్రను విజయవంతంగా ముగించారు. పాదయాత్ర తర్వాత ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆపరేషన్ చెయ్యక తప్పలేదు. అయినప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇఫ్లూ విద్యార్థులపై యాజమాన్యం పెట్టిన తప్పుడు కేసుల విచారణ నిమిత్తం హైకోర్టుకి హాజరౌతున్నారు. ఆ సమయంలోనే చుండూరు కేసు విచారణ కొచ్చింది. అప్పటిదాకా చుండూరు కేసును చూస్తున్న బాలగోపాల్, బి. చంద్రశేఖర్‌లు మరణించడంతో చుండూరు దళితులు, కులనిర్మూలనా పోరాట సమితి నాయకత్వం, తారకంగారిని కలసి చుండూరు దళితుల తరపున హైకోర్టులో వాదనలు వినిపించాలని విజ్ఞప్తి చేసాం. సహాయకులుగా ఉండటానికి పౌరహక్కుల సంఘం నాయకుడు వి. రఘునాథ్ ఒప్పుకున్నారు. దాదాపు నెలరోజుల పాటు తారకంగారి జూనియర్ యు. భీమారావు చార్జ్‌షీట్, కింది కోర్టు జడ్జిమెంట్ చదువుతుంటే పాయింట్స్ నోట్ చేసుకొని కోర్టులో వాదనలు వినిపించారు.

హైకోర్టులో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి వ్యవహరిస్తున్న తీరు తారకంగారికి అనుమానం కలిగించింది. నర్సింహారెడ్డి చుండూరు రెడ్లకు అనుకూలమైన తీర్పు వెలువరించబోతున్నట్లు స్మెల్ చేసారు. తారకంగారు, రఘునాథ్‌లతో పాటు మరికొంత మంది లాయర్లు, చుండూరు బాధితులు, మేము కలిసి తీసుకున్న నిర్ణయం మేరకు కేసును వేరే బెంచ్‌కి మార్చాలని ఎల్. నర్సింహారెడ్డికి పిటిషన్ అందజేసారు. ఎల్. నర్సింహారెడ్డి "మీరు ప్రభుత్వం నియమించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అయివుండి కోర్టుల మీద నమ్మకం లేదంటారా? మూడు రోజుల్లో కోర్టుకు క్షమాపణ చెప్పకపోతే కోర్టు ధిక్కారం కేసు పెడతామ"ని హెచ్చరించారు. మూడు రోజులు కాదు, మూడు నెలలైనా సరే నా నిర్ణయంలో మార్పులేదు. మీ ఇష్టం వచ్చింది చేస్కోండని తెగేసి చెప్పారు తారకంగారు. రఘునాథ్ కూడా అదే అన్నారు. చుండూరు నుండి దళిత బాధితుల పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్ కు నోటీసులు పంపించి కోర్టుకు పిలిపించాడు నర్సింహారెడ్డి. చుండూరు నరమేధంలో తండ్రిని, పినతండ్రిని కోల్పోయిన మోజెస్‌పై కేసు పెట్టి ఉద్యోగానికి దూరం చేసి చుండూరు రెడ్లను తృప్తి పరచాలనుకున్నాడు నర్సింహారెడ్డి. ఇదంతా ఆలోచించి ఉమ్మడి నిర్ణయం మేరకు జాలాది మోజెస్ హైకోర్టులోని పిటిషన్ ఉపసంహరించుకున్నాడు. అందరం ఊహించినట్లే ఎల్. నర్సింహారెడ్డి, జైస్వాల్ బెంచ్ చుండూరు హంతకులందర్నీ, నిర్దోషులుగా విడుదల చేసింది. ఆ సందర్భంగా తారకం గారు ఒక కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, సభలు జరిపి కోర్టులో భారత శిక్షాస్మృతి మనుస్మృతిని బదులుగా నర్సింహారెడ్డి అమలు చేశాడని వివరించారు. అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కేసును సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్ట్‌కి అప్పీల్ కెళ్ళింది. తారకం గారి సూచన

> దళితులు-రాజ్యం అనే పుస్తకంలో దళితులంటే ఎవరు? వారికి రాజ్యంతో ఉండే సంబంధమేమిటి? ఉంటున్న జగడ మేమిటి? రాజ్య స్వభావం ఎలా ఉంటుంది? అనే విషయాలను చాలా సరళమైన వాడుక భాషలో తెలియజేసారు. ఒక స్పష్టమైన, స్థిరమైన స్థావరం ఏర్పరచుకున్న రాజ్యాన్ని మార్చడం చాలా కష్టమైన పని. రాజ్యాన్ని మార్చాలంటే సమూలమైన మార్పును తెచ్చే విప్లవం రావాలి. ....రాజ్య సవభావాన్ని విప్లవాత్మకమైన మార్పుల ద్వారానే మార్చడం సాధ్యమవుతుందని అంటారాయన

మేరకు బాధితుల వైపు నుండి ప్రైవేట్ అప్పీల్‌కి వెళ్ళాం. మన వైపు నుండి కేసును సుప్రీంకోర్టులో అడ్మిట్ చేయించినందుకు 50 వేలు, సుప్రీంకోర్టులో వాదనలు వినిపించినందుకు (కేవలం రెండు నిముషాలే) రెండు లక్షల రూపాయలు, మొత్తం రెండు లక్షలా యాభైవేలు తన స్వంత ఖాతా నుండి చెక్ రాసి సుప్రీం కోర్టు లాయర్లకిచ్చారు. బాధితుల పక్షాన ఫీజు లేకుండా వాదించే వాళ్ళను చూసాం. బాధితులకు చార్జీలు, ఖర్చులు ఇచ్చేవాళ్ళను కూడా చూసాం. కానీ కోర్టు ఫీజు కూడా కట్టే లాయర్‌ని అప్పుడే చూసాను నేను. అప్పుడు తారకంగారిని చూస్తూ అనుకోకుండానే నా కళ్ళు చెమర్చాయి. నా భుజం మీద చెయ్యేసి నన్ను సముదాయించారాయన.

రోజు రోజుకీ తారకంగారి ఆరోగ్యం క్షీణిస్తోంది. ఆయన కర్థమవుతూనే ఉంది. మృత్యువు తనను వెన్నంటి ఉంటుందని, అయినప్పటికీ హైదరాబాద్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు, ముఖ్యమైన కేసులో కోర్టుకు వెళ్ళడాలూ చేస్తూనే ఉన్నారు. మిగిలిన సమయంలో ఖాళీగా ఉండకుండా వాళ్ళ నాన్నగారి జీవిత చరిత్రను రాయడం మొదలు పెట్టారు. అంతలో మళ్ళీ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. రెండవసారి ఆపరేషన్ చేసేలోపే వాళ్ళ నాన్న (చరిత్రను మార్చిన మనిషి) గురించి రాయడం ముగించారు. ఆయన్ని కలవడానికి వెళ్ళిన ప్రతిసారీ వాళ్ళ నాన్న గురించి రాస్తూనో, ప్రూఫ్‌లు చూస్తూనో కనిపించేవారు. హైదరాబాద్ బుక్‌ట్రస్టు వారు ఆయన మరణానికి వారం, పదిరోజుల ముందు 'చరిత్రమార్చిన మనిషి' ని పుస్తకరూపంలోకి తెచ్చారు. అలుపెరుగని అవిశ్రాంత యోధుడు తారకం గారు.

నాకు తెలిసి ఆయన రెండు ప్రధానమైన కోర్కెలు తీరకుండానే పోయారు. 1. లక్షింపేట దళితులకు మడ్డువలస రిజర్వాయర్ మిగులు భూములు పంపిణీ చేయించడం 2. నామాల బాలస్వామి కుటుంబ ఇతివృత్తాన్ని నవలగా తీసుకురావడం. 2001 జూలై 27వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా పెద కొత్తపల్లి మండలం కల్వకోలు అనే గ్రామంలో నామాల బాలస్వామి అనే దళిత యువకుడ్ని బిజెపి ఎంపీటీసీ బాదం శ్రీను, అతని అనుచరులు సజీవదహనం చేసారు. బాలస్వామి సిపిఐ పార్టీ కార్యకర్త. అతని తమ్ముడు, చెల్లెలు పీపుల్స్‌వార్ పార్టీ దళాలలో ఉన్నారు. బాలస్వామి

హత్యకు ముందే తమ్ముణ్ణి పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. బాలస్వామి హత్య తర్వాత అతని చెల్లెలు అమరురాలయ్యింది. ఆమె అంత్యక్రియలకు తారకంగారు హాజరైనట్లు నాకు చెప్పారు. "ఒక కుటుంబం మొత్తంగా ఎర్రజెండాను ఎంతో ప్రగాఢంగా విశ్వసించింది. మరణించే దాకా అంటి పెట్టుకొనుండడం చిన్న విషయం కాదు" అని కన్నీటి పర్యంత మయ్యారు. విప్లవోద్యమంలో చస్తున్నది అందరూ దళితులే అని ప్రచారం చేస్తున్న దళారీ నాయకుల నోరు మూయించేలా దళితులకు విప్లవోద్యమం అవసరం ఉంది కాబట్టే విప్లవిస్తున్నారు. అమరులౌతున్నారు. అనే వాస్తవ జీవిత చిత్రీకరణను ఆ నవల ద్వారా తారకం గారు ప్రజలకు చెప్పాలనుకున్నారు. నామాల బాలస్వామి కుటుంబంలో మిగిలిన సభ్యులను, వారి బంధువులను, ఆ పల్లెలోని ప్రజల్ని కలిసి కొంత సమాచారం తెలుసుకుందామని అనేక సార్లు నాతో అన్నారు. తను రాసిన కులం-వర్గం పుస్తకాన్ని ఒక జీవితానికి అన్వయించి నవలగా తెస్తే దళిత ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేదిగా ఉంటుందనేవారు. అయితే 2008లోనే దళితులు-రాజ్యం అనే పుస్తకంలో ఆ ప్రయత్నం కొంత చేసారు. కానీ నవలగా వస్తే ఇంకా మంచి ఉపయోగముంటుందనేది ఆయన అభిప్రాయం.

'దళితులు-రాజ్యం' అనే పుస్తకంలో దళితులంటే ఎవరు? వారికి రాజ్యంతో ఉండే సంబంధమేమిటి? ఉంటున్న జగడ మేమిటి? రాజ్య స్వభావం ఎలా ఉంటుంది? అనే విషయాలను చాలా సరళమైన వాడుక భాషలో తెలియజేసారు. ఒక స్పష్టమైన, స్థిరమైన స్థావరం ఏర్పరచుకున్న రాజ్యాన్ని మార్చడం చాలా కష్టమైన పని. రాజ్యాన్ని మార్చాలంటే సమూలమైన మార్పును తెచ్చే విప్లవం రావాలి. రాజ్య సవభావాన్ని విప్లవాత్మకమైన మార్పుల ద్వారానే మార్చడం సాధ్యమవుతుందని అంటారాయన. భారతదేశంపై అనేక శక్తులు బయట నుండి వచ్చి దండయాత్రలు చేసి, ఈ దేశాన్ని ఓడించి, ప్రభుత్వాలను స్థాపించుకోవడానికి, ఈ దేశం అనేక సార్లు స్వాతంత్ర్యం కోల్పోవడానికి, నేడు సామ్రాజ్యవాదుల అడ్డాగా మారడానికి కుల వ్యవస్థ కారణమని దళితులు-రాజ్యం అనే పుస్తకంలో వివరించారు. హిందూమతం ఏ విధంగా వెలివాడల్ని స్థిరీకరించింది.. ముస్లిం, క్రైస్తవం కూడా వెలివాడల్ని ఎందుకు రద్దు చెయ్యలేకపోయాయి... మతం ఈ రోజు రాజ్యమెలా అయ్యింది... వామపక్ష పార్టీలు మతాన్ని నిర్లక్ష్యం చెయ్యడానికి కారణాలేమిటి..? అనే విషయాలు సమగ్రంగా ఆ పుస్తకంలో విశ్లేషించారు.

బ్రిటిష్ పాలనలో అగ్రవర్ణాలు అధికారులుగా, సలహాదారులుగా, న్యాయమూర్తులుగా, భూస్వాములుగా మనుగడ సాగించారు. బ్రిటిష్ వాళ్ళ అడుగులకు మడుగులొత్తుతూ పాలనలో భాగమయ్యారు. వారి దురాగతాలను ఏ మాత్రం ప్రస్తావించని మేధావులు గుప్పెడు మెతుకుల కోసం, పిడికెడు ఆత్మగౌరవం కోసం బ్రిటిష్ సైన్యంలో చేరిన దళితుల్ని, చేరమని ప్రోత్సహించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ని బ్రిటిష్ రాజ్యానికి అనుకూలురుగా, తెల్లవారి తొత్తులుగా చిత్రీకరించారు. ఆ వక్రీకరణలను తిప్పి కొడుతూ దళితులు-రాజ్యం అనే పుస్తకంలో తారకంగారు కింది విధంగా అన్నారు.

"వేల సంవత్సరాలుగా ఆయుధం పట్టుకొనే హక్కుకు దూరంగా ఉండిపోయినవారు, సైన్యంలో చేరి ఆయుధం చేతపట్టడం అనేది కూడా విప్లవాత్మకమైన (సామాజిక) మార్పు. మామూలు బట్టలు కూడా కట్టుకోవడానికి వీలు లేని దళితులు ఒకసారి మిలటరీ దుస్తులు వేసుకొని తుపాకీ భుజాన ధరించే పరిస్థితి వచ్చిందంటే వారిలో అది ఎంత ఆత్మస్థైర్యాన్ని కల్పించి ఉన్నదో సవర్ణుల ఊహకు అందదు. బ్రిటిష్ అధికారులే కాదు, సామాజిక శాస్త్రవేత్తలకు కూడా ఈ రకమైన ఆత్మగౌరవ ప్రతిష్ట అర్థమయ్యేది కాదు. స్వదేశానికి వ్యతిరేకంగా పరాయి వాడి తరపున పోరాటం చెయ్యడం దేశద్రోహం అవుతుందని వీరిని నిందించారు కూడా. ఇది దేశద్రోహం కానేకాదు. ఏ దేశమైతే తనను మనిషిగా గుర్తించలేదో ఆ దేశానికి ద్రోహం చేయడం ఎలా అవుతుంది. ఆ పని సవర్ణుడు చేస్తే అనవచ్చు. కేవలం తిండి కోసం బ్రిటిష్ సైన్యంలో చేరాడనే నింద వేయవచ్చు. కానీ దళితుల పరిస్థితి అది కాదు. అది ఆత్మగౌరవ ప్రతిష్ట కోసం, మానవ మర్యాద అందుకోవడం కోసం. ఇది సవర్ణులకు అర్థం కాకపోవచ్చు. విలువిద్యలో అత్యంత ప్రావీణ్యతను పొందిన ఏకలవ్యుని బొటనవేలు నరికిన దశ నుంచి అదే ఏకలవ్యుడు మిలటరీ దుస్తులు ధరించి క్షత్రియులు మాత్రమే ధరించే తుపాకీ భుజానేసుకొని నడిచే దశకు చేరుకోవడం భారతదేశ సామాజిక శాస్త్రజ్ఞులకు గానీ, మనో విజ్ఞాన నిపుణులకు గానీ అర్థం కాదు. వారికి అది వట్టి ద్రోహంలాగానేకనబడుతుంది" అని దళితులు-రాజ్యం పుస్తకంలో విశ్లేషించారు.

దశాబ్దకాలంగా విప్లవోద్యమానికి, దళిత ఉద్యమానికి వారధి కట్టే ప్రయత్నం చేసారాయన. ఆయన కృషి కొంత ఫలితాన్ని సాధించింది. అయితే తారకంగారి ప్రయత్నం కొంత మందికి తలనొప్పిగా మారింది. పీడిత కులాల ప్రజల సమస్యల పరిష్కారం కోసమంటూ సంఘాలు ఏర్పాటు చేసిన నాయకులు వారి వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేర్చుకుంటూ ఆయా ప్రజల ఆకాంక్షలను గాలికొదిలేస్తున్నారు. పీడిత కులాల ప్రజలు పోరాట బాట పడితే వీరి ప్రయోజనాలు నెరవేరవు కాబట్టి వారికి తారకం గారి ప్రయత్నం నచ్చలేదు. అందుకే ఆయన జీవితంలో ఎక్కువ కాలం దళితులు, పీడిత కులాల సంక్షేమం కోసం కృషి చేసిన ఆయన మరణం తర్వాత ఏ దళిత నాయకుడూ ఆయన్ని స్మరించుకొనే ప్రయత్నం చెయ్యలేదు. మరోవైపు అగ్రకుల భావజాలాన్ని వదులుకోలేక ఎర్రజెండా నీడన అభ్యుదయవాదులుగా, ఆదర్శమూర్తులుగా కీర్తించబడుతూ, దళితుల్ని, పీడిత కులాల ప్రజల్ని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునే అగ్రకులాల మనుగడ తారకం గారి ప్రయత్నంతో ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండు శిబిరాలు అగ్రకుల పాలక వర్గాల ప్రయోజనాలు నెరవేర్చడానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో చరిత్ర నిండా అనేక సాక్ష్యాలు ఉన్నాయి. కాబట్టే వారికి పాలక పార్టీల ఆశీస్సులు, మీడియా ఆదరణ ఉంటుంది. అగ్రకుల దోపిడీ పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు, హిందూమతోన్మాదులు, దళారులు, ఎన్ని కుట్రలు, కుటిల ఎత్తుగడలు పన్నినా ఈ సమాజంలో ఆకలి, అంటరానితనం ఉన్నంత కాలం అనేక మంది తారకంలా పీడిత ప్రజలకు నాయకత్వం వహిస్తూనే ఉంటారు. అది సమాజ అనివార్య అవసరం.

వ్యాసం

అంబేద్కరిస్టు దళిత ఉద్యమాన్ని చిత్రించిన పంచతంత్రం

కె. సత్యనారాయణ

బొజ్జా తారకం గారి నవల 'పంచతంత్రం' డా. అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితమై ఎదిగిన దళిత ఉద్యమ పోరాట చరిత్ర. మొదటి తరం దళిత నాయకత్వం ఎదిగిన తీరు, అప్పుడప్పుడే అనుభవంలోకి వస్తున్న 'స్వాతంత్ర్యం', ప్రధానంగా విద్య, ఉద్యమాల వల్ల సామాజిక సంకెళ్ళు తెంచుకొని బయటకొచ్చిన మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగుల లాంటి అనేక పరిణామాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. సమగ్రంగా, సరైన కోణం నుంచి దళితుల పోరాట చరిత్ర లేనిలోటుని పూడ్చటానికి తారకం గారు 'పంచతంత్రం' రాసారు.

ఈ చరిత్ర రాయటానికి, నవలా రూపంలో చిత్రీకరించటానికి గొప్ప జీవిత అనుభవం కావాలి. కేవలం పరిశోధన ద్వారా రాయగలిగే నవల కాదిది. తారకం గారు సుదీర్ఘమైన రాజకీయ జీవితంగల వ్యక్తి. మూడు తరాలకు ప్రతినిధి. 1947 తర్వాత ఎగిసిన అంబేద్కర్ ఉద్యమాలతో ఆయన రాజకీయ జీవితం ప్రారంభమయింది. 1970లలో ఉవ్వెత్తున లేచిన రైతాంగ ఉద్యమాలు, పౌరహక్కుల ఉద్యమాలు ఆయన్ని రాటుదేలిన పోరాట యోధుని చేసాయి. ఎమర్జెన్సీలో అరెస్టుకు గురయ్యారు. 1985లో జరిగిన కారంచేడు మారణకాండ తారకం గార్ని సమకాలీన దళిత ఉద్యమ నాయకుడ్ని చేసింది. 70 ఏళ్ళ వయస్సులో ఇరవై ఏళ్ళ కుర్రాడిలా, ఆవేశంలో నిన్న జరిగిన లక్ష్మిపేట మారణకాండను నిరసిస్తూ పోరాటాన్ని ముందుండి నడిపారు. 'పంచతంత్రం' నవల రాయటానికి ఈ ఉద్యమాల నేపథ్యం, జీవిత అనుభవం పునాదిగా ఉన్నాయి.

తారకం గారిది రాజకీయ కుటుంబం. తండ్రి బొజ్జా అప్పలస్వామి గారు మొదటి తరం అంబేద్కరిస్టు. ఆయన జీవితం, పోరాటాలు 'పంచతంత్రం' నవలకు నేపథ్యంగా ఉన్నాయి. అప్పలస్వామి గారు పిఠాపురం రాజా వారి స్కూలులో చదవడం, తిరుగుబాటు భావాలు గల బ్రహ్మసమాజంతో పరిచయం కావడం, సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు, భావకవి, బ్రహ్మ సమాజ సభ్యుడు కృష్ణశాస్త్రి తదితరుల ప్రభావం ఇలాంటి అనేక చారిత్రక సన్నివేశాలు ఆయనని ఒక సంస్కర్తగా, అభ్యుదయ వాదిగా, రాజకీయవేత్తగా తీర్చిదిద్దాయి. 1930, 1940లలో దళితులకు, అగ్రకులాలకి మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగేవి. ఈ వాతావరణంలో పుట్టిపెరిగిన తారకం గారు చిన్నప్పటి నుంచీ గోదావరి జిల్లాలో రాజులకు, జమీందార్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఘర్షణలు, చర్చలు విన్నారు. 1944లో తూర్పు గోదావరి జిల్లాలో డా. అంబేద్కర్ పర్యటన, అంబేద్కర్ స్థాపించిన షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ తరపున బొజ్జా అప్పలస్వామిగారు పోటీ చేయడం, 1952లో, 1955లో రెండుసార్లు కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా పోటీ చేసి యం.ఎల్.సి. గా నెగ్గడం లాంటి ఘట్టాలన్నీ తారకం గారిపై బలమైన ముద్ర వేసాయి. కుటుంబంలో తాత, తండ్రి కవులు, గాయకులు కావడం, తారకం గారికి, ఆయన అన్న గారికి సంగీతం, సాహిత్యం ఆకట్టుకున్నాయి.

తారకం గారి కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రభావాలు, చారిత్రక ఘట్టాలు 'పంచతంత్రం' అర్థం చేసుకోవడానికి చాలా అవసరం.

తెలుగు దళిత సాహిత్యంలో, 'పంచతంత్రం' ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సాధిస్తుంది. తొలిదశ దళిత ఉద్యమ చరిత్ర కథాంశంగా నవలలు ఇంతవరకూ రాలేదు. వామపక్ష ఉద్యమాలకు వెలుపల గాంధేయవాదాన్ని వదిలించుకుంటూ స్వతంత్రంగా నడిచిన దళిత ఉద్యమ చరిత్రని చిత్రిస్తూ నవలలు రాలేదు. తొలి దశ అంబేద్కర్ ప్రభావిత దళిత ఉద్యమ చరిత్రను చిత్రించిన నవలగా 'పంచతంత్రం' గుర్తుండిపోతుంది. గతంలో వచ్చిన చిలుకూరి దేవపుత్ర గారి 'పంచమం' నవలలో సమకాలీన దళిత ఉద్యమ చరిత్ర, కారంచేడు తర్వాత జరిగిన పోరాటాలు, పౌరహక్కుల ఉద్యమం, ఎం. ఎల్ ఉద్యమాలు, మాదిగ హక్కుల పోరాటాల లాంటి అంశాలన్నీ చర్చించారు. 'అంటరాని వసంతం'లో కళ్యాణరావుగారు వలస పాలనలో దళితులు చేసిన పోరాటాలు, వారి సాంస్కృతిక వారసత్వం, క్రైస్తవంలోకి మారడం, పీడనకు దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన భూపోరాటాలు, చివరగా దళితులు నక్సలైట్ ఉద్యమంలో భాగం కావడం చిత్రించారు. వేముల ఎల్లయ్య కక్క నవలలో తెలంగాణ మాదిగ జీవితం, భాష, సంస్కృతిని వివరించారు. ఈ నవలలన్నింటికీ భిన్నంగా, 'పంచతంత్రం' అంబేద్కర్ ఆలోచనా విధానం వెలుగులో ప్రారంభమైన దళిత ఉద్యమ క్రమాన్ని చూపిస్తుంది. దళిత జీవితాన్ని పోరాట నేపథ్యంలో చిత్రించింది.

మాలపల్లికి, జమీందారీ కుటుంబానికి మధ్య ఘర్షణ ప్రధాన ఇతివృత్తంగా సాగే ఈ నవలకు ఒక మాల యువకుడు సూరన్న బాల్యం నుంచి అనేక అవమానాలకు, వివక్షకు, అణచివేతకూ గురవుతూ, తన కృషితో, చైతన్యంతో విద్యార్థి నాయకుడిగా ఎదిగే క్రమాన్ని చాలా గొప్పగా చెపుతుంది. నవల మొదటి పేజీ చదివితే చివర దాకా ఆపడం కష్టం. చాలా చక్కగా, సాఫీగా, ఆసక్తిని కలిగించే రీతిలో రాయడం ఈ నవలను చదివించేలా చేస్తుంది. తారకం గారి సహజ కవిత్వం, సరళమైన భాష నవలను మరింత

తీర్చిదిద్దాయి. ప్రధానంగా మూడు పాత్రల చుట్టూ కథ నడుస్తుంది: జమీందారు, కాపు కులస్థుడైన విశ్వనాథం, మాల యువకుడు, విద్యార్థి నాయకుడు సూరన్న, మిలట్రీలో పని చేసి వచ్చిన మాల కులస్థుడైన సుబ్బారావు. సుబ్బారావు మాల పల్లికి నైతిక ధైర్యాన్నిస్తూ, సూరన్నని కాపాడుకుంటూ దళిత ఉద్యమంలో చాలా కీలక పాత్ర పోషిస్తాడు. పాలేర్లుగా వెట్టి చాకిరి చేస్తూ, అంటరానివారిగా అవమానాలకు, హింసకు గురవుతూ బానిసల్లా బతుకుతున్న దళితులు విద్యావాకాశాల వల్ల ఉద్యమాల చైతన్యంతో "స్వాతంత్రం" తెచ్చిన కొద్ది వెసులుబాటు వల్ల విద్యావంతులుగా, నాయకులుగా ఎదగడం, జమిందారు కుటుంబాన్ని, దానికి అండగా ఉన్న రెవెన్యూ, పోలీసు వ్యవస్థని వ్యతిరేకించడం, అక్రమంగా జమిందార్లు ఆక్రమించిన భూముల్ని వెనక్కి తీసుకోవడం లాంటి ఘటలన్నీ ఈ నవలలో చాలా చక్కగా చిత్రించారు. సూరన్న సామాజిక మార్పుకు, చైతన్యానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈ ప్రధాన కథకు అనుబంధంగా మిలట్రీ సుబ్బారావు కథ, మొదటి దళిత టీచరు వీర్రాజు కథ, పాలేరుతనం చేయనని పారిపోయి ఇంజనీరయిన దళితుని కథ-ఇలాంటి కథలెన్నో ఉన్నాయి. కథానాయకుడు సూరన్న బంధువు, సహధ్యాయి అయిన గౌరి హత్యకేసు విచారణకు బయలుదేరుతున్న దృశ్యంలో ప్రారంభమైన నవల, కోర్టులో కేసుని కొట్టివేయడం, విశ్వనాథాన్ని ఎవరో గుర్తు తెలియని వారు నరికి చంపడంతో కథ ముగుస్తుంది.



అంబేద్కర్ భావజాల ప్రభావంతో నడిపించిన దళిత చైతన్య క్రమం నవలలో కనిపిస్తుంది. అంటరానితనం వ్యక్తుల శుభ్రత అశుభ్రతలకు సంబంధించిన అంశం కాదని ఇది ఒక సామాజిక అణచివేతలో భాగమని రచయిత విశ్లేషించారు. పాలేరుతనాన్ని ఎటువంటి వేతనం లేని, గౌరవం లేని, అమానుషమైన వెట్టి చాకిరీ వ్యవస్థగా చిత్రీకరించారు. ప్రత్యేక గ్లాసులు, పాత్రలు మాలలకు కేటాయించడం, చెప్పులు తొడుక్కోనివ్వకపోవడం, సైకిళ్ళు తొక్కనివ్వకపోవడం, పెళ్ళి ఊరేగింపుల్ని అడ్డగించడం, పాఠశాల లోంచి వెలివేయడం, బల్లకట్టుపై ఎక్కనివ్వకపోవడం, లాంటి వివిధ రూపాల సామాజిక వివక్ష చిత్రించి, దాని మూలాలు కుల వ్యవస్థలో ఉన్నాయని రచయిత చెప్పారు. దొంగ కేసులలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై, దళితులని వేధించడం, వారి భూముల్ని అక్రమంగా సాగుచేసుకుని అనుభవించడం, దళితులపై దోపిడీ, అణచివేతలో భాగమేనంటారు. ఈ వివక్షను, దోపిడీని ప్రశ్నిస్తే పెద్ద సూరన్న, నారన్న, గంగన్న, చంద్రారావు లాంటి దళితులంతా బహిరంగంగా హత్య చేయబడ్డారు. దళిత మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. విద్యార్థి నాయకుడిగా దళితుల ఆత్మగౌరవ పోరాటం (రోడ్లపై హోటళ్ళలో, పాఠశాలల్లో సమానత్వం కోసం) చేస్తున్న సూరన్న పై కక్ష తీర్చుకోవటానికి దళిత యువతి డాక్టరు కోర్సు చదువుతున్న గౌరిని విశ్వనాథం మనుమడు అత్యాచారం చేసి, హత్య చేస్తాడు. సజీవ దహనాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు, భూమిపై హక్కు కోసం ఉద్యమాలు, కూలీవాళ్ళ సమ్మెలు, ఎన్నికల్లో పోటీ చేయడం లాంటి ఘట్టాన్నీ చూస్తే అంబేద్కరిస్టు దళిత పోరాట క్రమం కనిపిస్తుంది. సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం రాజ్యంపై వత్తిడి తేవడం ప్రధాన పోరాట రూపంగా దళితులు చేపట్టారు. న్యాయవ్యవస్థను ఉపయోగించుకోవాలనే ప్రయత్నం, మరో పక్క ఉద్యమాన్ని బలోపేతం చేసే చర్యలు చాలా స్పష్టంగా దళిత ఉద్యమ అవగాహనని తెలియజేస్తాయి. రిపబ్లికన్ పార్టీ, ఆదియాంధ్ర ఉద్యమం, అంబేద్కర్ పర్యటన లాంటి చారిత్రక సన్నివేశాల నేపథ్యం నవలలో స్పష్టంగా కనిపిస్తుంది. నవలా కాలం 1940ల నుంచి 1950ల వరకూ అని చెప్పవచ్చు. బోయిభీమన్న గారి 'పాలేరు' (1938) నాటక ప్రదర్శనలు, దేశంలో మొట్టమొదటి ఎన్నికలు (1952) గురించి చేసిన ప్రస్తావన వల్ల నవలా కాలం మనం ఊహించవచ్చు. ఇదే కాలంలో గోదావరి జిల్లాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు కూడా ఉన్నాయి. కానీ నవలలో ఆ ఉద్యమాల ప్రస్తావన కనిపించదు. బహుశా-ఈ నవల్లో దళిత ఉద్యమ చైతన్యాన్ని చూపించే లక్ష్యంతో రచయిత దళితుల స్వతంత్ర పోరాటాల గురించే వివరించారు. స్వాతంత్ర్యం తెచ్చిన ఎన్నికలు, రోడ్లు, రూల్సు, పోలీసు, రెవెన్యూ వ్యవస్థలు దళితులకు న్యాయం చేయక పోగా....... మరింత హింసకు, అణచివేతకు కూరుకుపోయాయి. మొత్తంగా ఈ నవల తొలిదశ ఉద్యమ చరిత్రను రికార్డు చేసిన గొప్ప ప్రయత్నంగా చెప్పవచ్చు.

తారకం గారు 'పంచతంత్రం'లో దళిత జీవితాన్ని, ఉద్యమాన్ని చిత్రించిన తీరు గురించి కొంత చర్చించుకోవాలి. అయితే దళిత సాహిత్యోద్యమం తెరపైకి వచ్చాక దళితుల్ని చూసిన తీరు, చిత్రించిన తీరు, విశ్లేషించిన దృక్పథం కొత్తది. దళితులు శ్రమ చేసి, మనిషిగా మర్యాద కోసం, గౌరవం కోసం నిరంతరం పోరాడుతూ, కష్టనష్టాలకు, అణచివేతకు కృంగిపోని చైతన్య వంతమైన మనుషులుగా కనిపిస్తారు. దళితుల్ని జంతువులుగా అగ్రకుల సమాజం చూసి ఉండవచ్చు. వాళ్ళు ఏ సంస్కృతికీ, చరిత్రకు, పోరాటాలకు వారసులు కారని వారిని అమానవీకరించి ఉండవచ్చు. కానీ దళితుల దృష్టి కోణం నుంచి, ముఖ్యంగా అంబేద్కర్ అవగాహన నుంచి దళితుల్ని చూస్తే వారు గొప్ప సంస్కృతికి, చరిత్రకు, పోరాటాలకి వారసులుగా జీవితమే నిరంతరం పోరాటంగా బతికిన నిండైన మనుషులుగా కనిపిస్తారు. అంటరానితనం, వివక్ష, అమానవీకరణ, హింసా దౌర్జన్యాలు అనుభవించి, భరించి, ఎదుర్కొంటూ తలెత్తుకుని బతికారు.

'పంచతంత్రం'లో సూరన్న అంబేద్కర్ ఆలోచనలకు, పోరాటాలకు ప్రతినిధి. పాలేరు జీవితాన్ని తిరస్కరించి, చదువుకొని విద్యార్థిగా, నాయకుడిగా ఎదిగాడు. తెలుగు సాహిత్య చరిత్రలో బహుశా మొదటి అంబేద్కరైట్ కథా నాయకుడు. తన అస్తిత్వాన్ని అసహ్యించుకోవడం, ఆత్మన్యూనతతో కృంగిపోవడం, హిందూ భావజాలానికి బానిసగా ఆలోచించడం సూరన్న పాత్రలో మనకు కనిపించవు. "చదువుకున్నా సరిపోదు, కులముంటేనే గాని మనిషికి రావలసిన మర్యాద రాదేమో" అని సూరన్నకి స్పష్టంగా తెలుసు. అంటరాని కులాలవారు పంచములనే పేరు వదలి ఆదియాంధ్రులుగా చైతన్యమవుతున్న నేపథ్యంలో సూరన్న నాయకుడుగా ఎదిగాడు.

దళిత విమర్శకులు అభ్యుదయ, విప్లవ సాహిత్యాలపై దళిత జీవితాన్ని చిత్రించలేదని విమర్శలు చేసారు. అంటరాని కులాల ప్రజలు వ్యవసాయ కూలీలుగా, కూలి రేట్ల కోసం, భూమి కోసం చేసిన పోరాటాల్లో అమరులైన వారిగా అభ్యుదయ, విప్లవ సాహిత్యాల్లో కనిపిస్తారు. దళిత రచయితలు తెరపైకి వచ్చాక, ముఖ్యంగా మరాఠీ దళిత సాహిత్యోద్యమం తరువాత తమను తాము మనుషులుగా, సంపూర్ణ వ్యక్తిత్వం, సంస్కృతి, చరిత్ర కలిగినవారుగా దళితుల్ని చిత్రీకరించడం మొదలైంది. 'పంచతంత్రం' మరాఠీ దళిత సాహిత్య వారసత్వాన్ని, అంబేద్కర్ సైద్ధాంతిక దృష్టిని ముందుకు తీసుకు పోయింది.

అంటరానితనాన్ని, దానికి మూలమైన కుల వ్యవస్థ, హిందూమతం గురించి ఒక స్పష్టమైన అవగాహన 'పంచతంత్రం'లో కనిపిస్తుంది. అంతకుమించి కులం, వర్గం ఎలా విడదీయరాని వాస్తవ వైరుధ్యాలో తారకం గారు విశ్లేషించారు. "స్వాతంత్రం" వచ్చాక ఎన్నికలు, పోలీసులు, అభివృద్ధి ఎజెండా, రాజ్యాంగం దళితులకి అంటరానితనాన్ని, వివక్షని, హింసను వ్యతిరేకించే కొంత వెసులుబాటు కల్పించాయి. అయితే 'ఎన్నికలు డబ్బున్నోళ్ళకి, కులమున్నోళ్ళకి, కామందులకీ' అన్నది తెలిసిపోయింది. బూర్జువా కోర్టుల్లో న్యాయం నేతిబీరకాయ అని భూస్వామి, కాపు నాయకుడు విశ్వనాథాన్ని నిర్దోషిగా కోర్టు ప్రకటించటంతో స్పష్టమయింది. కుల వ్యవస్థని, సామాజిక అణచివేతను కొనసాగిస్తున్న భూస్వామ్యం, నూతన భారత రాజ్య వ్యవస్థ తీరును స్పష్టంగానే తారకంగారు చూపించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, బహిరంగ ప్రదేశాల్లో ప్రవేశం కోసం చేసే పోరాటాలు, భూమి కోసం చేసే పోరాటాలు, రిక్షా కార్మికుల సమ్మె, కూలీల సమ్మె, కలగలిపి కొన్ని సార్లు సమాంతరంగా కొన్ని సార్లు నడుస్తున్నట్లు తారకంగారు చూపించారు. వర్గ అణచివేతలో కులపరమైన సామాజిక వివక్ష. ఈ వివక్ష గురవుతున్న అంటరాని కులాల అమానవీకరణ, అస్తిత్వం, మానవ మర్యాద, గౌరవాల్ని సమస్యలుగా చూపిస్తూ 'పంచతంత్రం'లో విశ్లేషించారు. కుల అణచివేత, వర్గ దోపిడీ విడివిడిగా ఉంటాయని తారకం గారు భావించలేదు. తొలితరం దళిత ఉద్యమ చరిత్రను చిత్రిస్తూ, అంబేద్కర్ ఆలోచనలు వెలుగులోకి తెచ్చిన కట్టు బానిస బతుకులు, విప్లవోద్యమాలు నడిపించిన రైతుకూలీల ఉద్యమాలు కలిసి సాగాల్సిన అవసరాన్ని 'పంచతంత్రం'లో చూపించారు. నవల దళితులు కోర్టులో ఓడిపోవడం, భూస్వామి విశ్వనాథాన్ని ఎవరో నరికి చంపడంతో ముగుస్తుంది. ఈ ముగింపులోనే తారకంగారి అవగాహన ఉంది.

కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ ప్రచురణలుగా వస్తున్న

కెవిఆర్ రచనలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
మొదటి భాగం
వెల : రు. 300/-
పేజీలు : 798

కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
రెండో భాగం
వెల : రు. 250/-
పేజీలు : 678


కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
మూడో భాగం
వెల : రు. 250/-
పేజీలు : 598


కె.వి.ఆర్.
సామాజిక వ్యాసాలు
వెల : రు. 300/-
పేజీలు : 748


కె.వి.ఆర్.
డిటెన్యూ డైరీ
వెల : రు. 170/-
పేజీలు : 340

మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామకృష్ణారావు, అరుణతార ఎడిటర్,

ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే) ఈమెయిల్ : arunatara1977@gmail.com

మా ప్రచురణలు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387



అమరుడు బొజ్జా తారకం
'నది పుట్టిన గొంతుక'

వరవరరావు

ఆ ఇద్దరి గురించి ఆది లేదా ఆదర్శ దంపతులు అని రాయాలని నేను చాలాసార్లు అనుకున్నాను. అట్లా రాస్తే ఆ తర్వాత వాళ్లనంత ఫ్రీగా కలవలేనేమో అనిపించి మానుకున్నాను. మూడేళ్లుగా బొజ్జాతారకం గురించిన ఆలోచనలు అశ్రుసిక్తం కాకుండా వచ్చేవి కావు. బ్రెయిన్ ట్యూమర్ అటువంటి భయంకర వ్యాధి. చెరబండరాజును, మా దామోదరరావు అన్నయ్యను ఆ క్యాన్సర్‌తో బాధపడడం దగ్గరగా చూసాను. ముగ్గురూ ఆ వ్యాధి ముందు ఓడిపోయారు గాని లొంగిపోలేదు. వీరిలో తారకం గారయితే పూర్తి విశ్రాంత జీవితం గడపాల్సిన వయసులో కూడా దానినొక సవాల్‌గా స్వీకరించాడు.

ఈ మూడేళ్ల కాలంలోనూ అటు దళితుల, విప్లవకారుల పక్షాన వ్యవస్థ, రాజ్యహింసలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలను సంఘటితం చేసి గ్రామాల్లో, పట్టణాల్లో పోరాడాడు, న్యాయస్థానంలో పోరాడాడు. ఇటు తండ్రి జీవిత చరిత్ర రాసాడు. 'చరిత్ర మార్చిన మనిషి'గా కేవలం తన తండ్రి అయిన ఒక వ్యక్తి గురించి కాదు. ఆది రుద్రాంధ్ర మహోద్యమంలో బొజ్జా అప్పలస్వామి పాత్ర గురించి. 'శతాబ్దాలుగా వెట్టి చాకిరీతోనూ పాలేరుతనాలతోనూ దీనంగా, దుర్భరంగా, నిస్సహాయంగా జీవితాలు గడుపుతూ ఆత్మగౌరవం అనే మాటకు ఆమడదూరం పెట్టబడిన వర్గాల గురించి - ఆ వర్గాలను పురోగమన మార్గంలో నడిపించిన ఉద్యమశక్తుల గురించి'. 'హిందూ సమాజపు సామాజిక నిర్మితిపైనా, మత మౌఢ్యపు దౌర్బల్యాలపైనా సమరం సాగించిన ఉద్యమశక్తుల సమాహారంగా ఆయన ఆది రుద్రాంధ్ర మహోద్యమాన్ని దృశ్యమానం చేశాడు.

నేను 1960లో ఎం. ఎ. లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరినపుడు ఫైనల్ ఇయర్‌లో ఉన్న విజయభారతి గారిని నా క్లాస్‌మేట్ రావి భారతి గారు పరిచయం చేసారు. రావి భారతి కూడ ఎం. ఎ. ఫైనల్ ఇయర్‌లో ఉండాల్సింది గానీ పరీక్షలు, ప్రసవకాలం ఒకటే అయి మా క్లాస్‌మేట్ అయింది. రావి భారతి రావి నారాయణరెడ్డి గారి కూతురు. విజయభారతి బోయి భీమన్న గారి కూతురు. అప్పటికంతే. అప్పటికదే మాకెంతో పులకింత. విజయభారతిగారు ఎం.ఎ అయిపోయి నిజామాబాద్‌లో లెక్చరర్‌గా చేరినట్లున్నారు. 1966 నుంచి స్పాట్ వాల్యూయేషన్‌లో కలుస్తుండే వాళ్లం. 1968 స్పాట్ వాల్యూయేషన్ సందర్భంగా తెలిసింది ఆమెకా సంవత్సరమే వివాహమైందని. మా సహాధ్యాయి వే నరసింహారెడ్డి చొరవతో ఈ నవదంపతులకు ఆమెకు తెలిసిన లెక్చరర్స్‌మంతా నారాయణగూడ తాజ్‌మహల్‌లో విందు ఏర్పాటు చేశాం. బొజ్జా తారకం గారిని అప్పుడు చూశాను. ఆయనప్పటికి కాకినాడలో లా ప్రాక్టీస్ చేస్తున్నాడు. 'మీరు సృజన ద్వారా తెలుసు. ఎస్జీవో నాయకుడు శ్యాంసుందర్ ఇస్తుంటాడు' అని చెప్పాడు. ఆ రోజుల్లో కాకినాడలో శ్యాంసుందర్ కేవలం ఎస్జీవో నాయకుడే కాదు, దిగంబర కవులకు, విప్లవోద్యమానికి వీరాభిమాని.

'నాలాగే గోదావరి' అని ఇటీవల తారకం గారు ఒక కవితా సంకలనం తెచ్చారు. 'గోదావరి సముద్రంలో కలిసిన చోట పుట్టాను నేను. గంగ హిమాలయాల్లో పుట్టింది. గోదావరి త్రయంబకంలో పుట్టింది. జనాన్ని చూసి జనుల నాదాన్ని చూసి.. హర్షామోదాన్ని చూసి భగ్న హృదయావేశాలను చూసి రక్తనాళాలన్నీ పొంగి ఖంగున మ్రోగి వాయువులా విజృంభిస్తే కన్నీళ్లు పొంగితే మాటలు పేర్చాను. పాటలు కూర్చాను. అవి అలలై జలలై సెలయేళ్లై జనం నదిలో పొంగి ప్రవహిస్తుంటే..

'నది పుట్టిన నా గొంతుక నదిమి పట్టారు' అని రాసారు. ఆ పుస్తకానికి ఆ పేరు పెట్టండి అని సూచించాడట కవి మిత్రుడు కె. శివారెడ్డి. 'నది పుట్టిన గొంతుక' కవిత ఎమర్జెన్సీలో చంచల్‌గూడ (హైదరాబాద్) జైల్లో 1976లో పుట్టింది. ఆయన ఆశించినట్లుగానే ఈ నలభై ఏళ్ల ఆయన ప్రజా ఉద్యమ జీవితం వల్ల ఈ కవిత 'జనసంద్రంలో కలిసిపోయింది'.

ఆ కలిసిపోవడానికి ఆయన తాత తండ్రుల నుంచి వచ్చిన పోరాట సంప్రదాయం, బ్రహ్మ సమాజం, అంబేద్కరిజం ప్రభావాలతో పాటు గోదావరిని ఎదురీది వచ్చిన ఆయన పోరాట జీవితం నిండుదనాన్నిచ్చింది. ఈ గోదావరి సముద్రంలో కలిసే చోటనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఇండియన్ యూనియన్ సైన్యాల నుంచి తప్పుకొని గోదావరిలో దూకి ఈదుతుండగా మృత్యుంజయుడిని చంపేశాయి.

గోదావరి తెలంగాణలో ప్రవేశించిన నిజామాబాద్‌కు 1968లో వచ్చిన తారకం గారు ఇక్కడి మట్టిలోని ఎరుపులోనూ, ఇక్కడి నీళ్లలోని ప్రవాహ గుణంలోనూ కలగలిసిపోయారు. 1968 నుంచి 78 దాకా ఒక దశాబ్దం పాటు విప్లవోద్యమాలకు, విప్లవ సాహిత్యానికి నిజామాబాద్ చిరునామా బొజ్జాతారకం. అంబేడ్కర్ అసోసియేషన్, బీడీ కార్మికుల సంఘం, విప్లవ రచయితల సంఘం, పౌరహక్కుల సంఘం, భారత చైనా మిత్రమండలి - ప్రజా ఉద్యమ సంఘమేదైనా దాని నిర్మాణంలో భాగమాయన. ఆ పోరాట నది గొంతుక ఆయన.

1970లో విరసం ఏర్పడగానే ఆయన విరసం కార్యవర్గ సభ్యుడయ్యాడు. నిజామాబాద్‌లో చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో సిపిఐ ఎంఎల్ రాజకీయ విశ్వాసాలనామోదించిన రచయితలెందరో విరసంలో చేరారు. కె. ఎన్. రావు, సి. ఎచ్. మధు, నారాయణ మొదలైనవారు. నిజామాబాద్‌లో బహుముఖీన కార్యకలాపాల వల్ల ఆయనకు నిజామాబాద్ వదిలి విరసం కార్యవర్గానికి గానీ, కార్యకలాపాలకు గానీ రావడం వీలయ్యేది కాదు. ఆయన, పాలిటెక్నిక్‌లో పనిచేసే వరంగల్ మిత్రుడు మల్లేశ్వరరావు, బత్తుల పున్నయ్యల ఆహ్వానంపై నేనే రెండు మూడుసార్లు నిజామాబాద్, కామారెడ్డిలకు వెళ్లాను. ఆయనింట్లోనే ఉన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకూ విజయభారతి గారి ఆత్మీయమైన ఆతిథ్యాన్ని చవిచూస్తూనే ఉన్నాను. వేలాది మందితో కూడిన విరసం సభల్లో గంగిరెడ్డి రాసిన 'నాంది' నాటక ప్రదర్శన కూడా ఉండేది.

నక్సల్బరీ, శ్రీకాకుళాలు సెట్‌బ్యాక్‌కు గురయిన తర్వాత కూడా గోదావరి లోయ ఎమర్జెన్సీ దాకా నిలబెట్టిన నిప్పుల జెండాకు న్యాయవాదిగా, కవిగా, ఉద్యమశీలిగా నిజామాబాద్‌లో ఆయనందించిన స్వరమే 1975 జూన్ 26న ఎమర్జెన్సీ ప్రకటించి జులై 4న సిపిఐ ఎంఎల్ పార్టీలను నిషేధించిన రాత్రి ఆయనే చెప్పినట్లు ఆ జిల్లాలో ఆయనే మొదటి వ్యక్తిగా అరెస్టు కావడానికి కారణమైంది.

'నీతో చెప్పలేదు. నేను వెళ్తున్నపుడు, నన్ను పోలీసులు పట్టుకున్నపుడు నీతో చెప్పలేదు. నన్ను చూస్తూ నిలబడిపోయావు. నీ కళ్ల నిండా నీళ్లు. నీ కన్నీళ్లు తుడవడానికి నా చేతులకు సంకెళ్లు. నీతో చెప్పలేదు. నీ కన్నీళ్లు నాకొక్కడికే కాదని, కోటి కోటి బాధాతప్త హృదయాలకు నివాళని. ఆశా కిరణాలని. అరుణార్ణవ కెరటాలని'.

ఆయనను మొదట నిజామాబాద్ జైల్లో పెట్టారు. నిజామాబాద్ జైలు ఎత్తైన కొండ మీద ఉంది. పెద్ద పెద్ద మెట్లు ఎక్కి వెళ్లాలి. దేవాలయాన్ని నిజాం ప్రభుత్వం జైలుగా మార్చిందంటారు. 'ఎవర్నో ఒకరిని బంధించడానికే రెండూను. నిజాం ప్రభుతం కవిత్వం రాసినందుకు దాశరథిని ఇదే జైల్లో ఉంచారు. రచయితగా నేను రెండోవాడిని' అని రాసుకున్నాడు. మొదట డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కింద అరెస్టు చేసి బెయిలుపై విడుదలయితే మీసా కింద అరెస్టు చేసి హైదరాబాద్ చంచల్‌గూడ జైలుకు పంపారు. వరంగల్ జైలు అధికారులపైకి నక్సలైట్ ఖైదీలను దాడికి పురికొల్పుతున్నాడన్న ఆరోపణతో నన్ను వరంగల్ జైలు నుంచి చెంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. అప్పటికే చెరబండరాజు, తారకం మొదలైనవారు ఆ జైల్లో ఉన్నారు.

ఒక ఏడాదికి పైగా సన్నిహితంగా తారకంగారితో కలిసుండే అవకాశం ఈ జైల్లో కలిగింది. ఇరవై నాలుగు గంటలు కలిసుండే అవకాశం ఉన్న జైలు జీవితం మనుషుల్ని అర్థం చేసుకోవడానికి మిగతా అన్ని సందర్భాల కన్నా చాలా విలువైనది. తారకం గారిలోని జ్ఞానసంపద, వైవిధ్యభరితమైన ప్రతిభ ఇక్కడ చూసాను. నిరంతర అధ్యయనపరుడు. అద్భుతంగా పాటలు పాడేవాడు. మృదంగం, హార్మోని, తబలా ఎంతో సంగీత వాద్యజ్ఞానంతో వాయించేవాడు. షటిల్‌కాక్ ఆడటంలో దిట్ట. హిందూ ధర్మ శాస్త్రాలను, కఠోపనిషత్ వంటి క్లిష్టమైన ఆధ్యాత్మిక అంశాలను మార్క్సిస్ట్ దృక్పథంతో విశ్లేషించి, విమర్శించి దక్షిణ భారతానికే ఆర్ఎస్ఎస్ ప్రచార ప్రముఖ్ అయిన దేశముఖ్‌ను, బిజెపి నాయకుడు బంగారు లక్ష్మణ్‌ను అప్రతిభుల్ని చేసేవాడు. ఎంతో సరదాగా, హాయిగా, మానవీయంగా తోటి ఖైదీల పట్ల ప్రవర్తించేవాడు.

నాగిరెడ్డి కుట్ర కేసులో నాలుగేళ్ల శిక్ష పడిన డిటెన్యూల నందరినీ హైదరాబాద్‌కు తరలించినపుడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం నుంచి కూడా పోరాటంలో ఉన్న కమ్యూనిస్టు యోధుడు బంద్రు నర్సింహుల్ని రోజుల తరబడి ఇంటర్వ్యూ చేసి చాల నోట్స్ తీసుకున్నాడు. 1977 ఫిబ్రవరిలో పెరోల్ మీద విడుదలైనపుడు జైలు గేట్లో ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ రామారావు జప్తీ చేయించి ఆ నోట్స్‌ను లాక్కొని తారకం గారి కళ్లముందే కాల్చివేసాడు.

"ఇద్దరు డిటెన్యూలు చాల గొప్ప విషయాలు చెప్పారు నాకు. వారి దగ్గర రోజూ కొంతసేపు కూర్చొని నోట్స్ రాసుకున్నాను. ఇంతవరకూ తెలుగు సాహిత్యంలో రాని విషయాలు సేకరించాను. గత యాభై ఏళ్ల చరిత్ర అది. రెండు ప్రాంతాల గాథ అది. రెండు పోరాటాల కథలు... చాల గొప్ప కథలు. ఇద్దరివీ గొప్ప అనుభవాలే... రెండు నవలలుగా రాయాలనుకొన్నాను" అని ఎంతో బాధగా రాసుకున్నాడు. ఆ రెండో వ్యక్తి ఎవరో ఇప్పుడు నాకు జ్ఞాపకం లేదు.

బొజ్జాతారకం గారు నవలలు రాయదల్చుకుంటే ఎంతో అద్భుతంగా రాసి ఉండేవారని డెబ్బయ్యోపడిలో పడినాక రాసిన ఆత్మకథాత్మక నవల 'పంచతంత్రం' చదివిన వాళ్లు ఊహించుకో గలరు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన సిపిఐ ఎంఎల్ పక్షాన లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత విజయభారతి గారు తెలుగు అకాడమీకి పదోన్నతిపై రావడంతో హైదరాబాద్‌కు మారి, ఇక్కడ హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆయన కార్యక్షేత్రం ఇక్కడి నుంచి రాష్ట్రానికి, దేశానికి విస్తరించింది. ఎపిసిఎల్‌సి ఉపాధ్యక్షుడుగా, రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడుగా ఆయన వందలాది సభల్లో రాజ్యహింసకు, దళితులపై హింసకు వ్యతిరేకంగా మాట్లాడాడు. ఉద్యమాలు, పోరాటాలు నిర్మించాడు. కారంచేడు మారణకాండకు నిరసనగా ప్రభుత్వ న్యాయవాద పదవికి రాజీనామా చేశాడు. అప్పుడే ఆయన కత్తి పద్మారావు ప్రధాన కార్యదర్శిగా దళిత మహాసభను స్థాపించాడు. విజయనగర్ కాలనీ (చీరాల)లో కారంచేడు బాధితులకు ఈ దళిత మహాసభ పునరావాసం కల్పించినప్పుడు డాని నాయకత్వంలో విరసం, దివాకర్ నాయకత్వంలో జననాట్యమండలి, కె. సుధ నాయకత్వంలో ఆర్ఎస్‌యు చివరిదాకా ఎంతో క్రియాశీలంగా వాళ్లకు అండగా ఉన్నారు. బాధితుల హక్కుల కోసం వారితో కలిసి పోరాడారు. గద్దర్ రాసిన 'దళిత పులులమ్మ' పాట, ఈ ఉద్యమానికి ఒక మిలిటెంట్ పరిష్కారం అమరుడు కారుమంచి శివప్రసాద్

నాగిరెడ్డి కుట్ర కేసులో నాలుగేళ్ల శిక్ష పడిన డిటెన్యూలనందరినీ హైదరాబాద్‌కు తరలించినపుడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం నుంచి కూడా పోరాటంలో ఉన్న కమ్యూనిస్టు యోధుడు బంద్రు నర్సింహుల్ని రోజుల తరబడి ఇంటర్వ్యూ చేసి చాల నోట్స్ తీసుకున్నాడు. *1977* ఫిబ్రవరిలో పెరోల్ మీద విడుదలైనపుడు జైలు గేట్లో ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ రామారావు జప్తీ చేయించి ఆ నోట్స్‌ను లాక్కొని తారకం గారి కళ్లముందే కాల్చివేసాడు.

విప్లవోద్యమ నాయకత్వం దళిత ఉద్యమంతో సృజనాత్మకంగా చేసిన జోక్యం ఫలితమే.

బొజ్జా తారకం గారు కోర్టులో ఈ కేసును వాదించాడు. అక్కడి నుంచి చుండూరు కేసును హైకోర్టులో వాదించే దాకా ఆయన నిరంతరం కోర్టులో, బయట దళితులపై జరిగిన దాడులు, అత్యాచారాలు, హింసాకాండలకు వ్యతిరేకంగా పోరాడాడు. చుండూరు పోరాటం సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి నిందితులు ఇరవై నాలుగు గంటల్లో లొంగిపోకపోతే ప్రభుత్వం వాళ్ల భూములను స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించాడు. అప్పుడు సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ అంతమాత్రమే కాదు, ఆ భూములు బాధితులకు పంచాలి అని డిమాండ్ ముందుకు పెట్టింది. ఇది బాధితులకు, ఆ ప్రాంతపు దళితులకు, మొత్తంగా ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ఆశ్వాసాన్నిచ్చింది. దీని కొనసాగింపుగానే బొజ్జా తారకం గారు అధ్యక్షుడుగా, తెనాలి కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్, గతంలో ఆర్‌వైఎల్ అధ్యక్షుడు, విరసం సభ్యుడుగా ఉన్న పి. జె. వర్ధన్‌రావు కన్వీనర్‌గా చుండూరు దళితుల న్యాయపోరాట కమిటీ ఏర్పడింది. తెనాలిలో ఈ కమిటీ ఏర్పాటు చేసి మేం హైదరాబాద్ తిరిగి వచ్చేవరకే కన్వీనర్‌గా రాజీనామా ఇవ్వకపోతే పి. జె. వర్ధన్‌రావును చంపేస్తామని ఇంటి మీదికి అప్పటి శాసనసభ స్పీకర్ ఆలపాటి ధర్మారావు గూండాలను పంపించాడు. అట్లా కారంచేడు, చుండూరు పోరాటాలు ఎంతో సంఘర్షణాత్మకంగా సాగినవి. పోరాడి స్పెషల్ కోర్టు సాధించుకొని బి. చంద్రశేఖరరావు, శివనాగేశ్వరరావు న్యాయవాదుల పోరాట ఫలితంగా ఎంతో కొంత న్యాయం పొందిన చుండూరు బాధితులు కొన్నాళ్ల పోయాక ఇన్నాళ్లకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అది ఎట్లా కోల్పోయారో ఈ హిందూ అగ్రవర్ణ న్యాయాన్ని మనం చూశాం. ఈ కేసులో స్పెషల్ ప్రాసిక్యూటర్లుగా నియమితులైన బొజ్జా తారకం గారు, వి. రఘునాథ్‌లకు జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కంటెమ్ట్ ఆఫ్ కోర్టు ఉత్తర్వు ఇవ్వడం, అయినా వాళ్లు దృఢంగా నిలబడడం కూడా చూశాం.

రామచంద్రపురంలో త్రిమూర్తులు దళితుల శిరోముండనం చేసిన ఘటన నుంచి పాతపెల్లిలో బ్రాహ్మణ పూజారి రెచ్చగొట్టడంతో బోయలు దళితుల ఇళ్లు తగులబెట్టిన సందర్భం దాకా ఆయన చేపట్టని పోరాటం లేదు. ఇంక లక్షింపేట దళితుల భూ నిర్వాసితత్వం, హత్యలకు వ్యతిరేకంగా ఆయన నాయకత్వంలో ప్రారంభమైన పోరాటం ఇంకా ముగియనేలేదు. ఇంతలో రోహిత్ వేముల ఆత్మహత్య రూపంలో వ్యవస్థీకృత హత్యలు సెంట్రల్ యూనివర్సిటీ వంటి ఉన్నత విద్యాలయాల్లో మొదలయ్యాయి.

దేవాలయాన్ని ఒక జైలుగా పోల్చిన తారకం గారికి హిందుత్వం అన్నా, బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాలమన్నా ఎంత అసహ్యం, ఎంత ఆగ్రహమంటే 1990లో బిఎస్‌పి పార్టీలో చేరినవాడు 1994లో మాయావతి బిజెపితో పొత్తు పెట్టుకోగానే బిఎస్‌పికి రాజీనామా చేశాడు. ఇపుడు రాందాస్ అఠావలే బిజెపి ప్రభుత్వంలో చేరగానే నిరసనగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా 'ఆర్గనైజర్' అంబేడ్కర్‌ను హిందువుగా చిత్రిస్తూ ఆకాశానికి ఎత్తే ప్రయత్నం చేసినప్పుడు కె. వై. రత్నం, లక్ష్మీనారాయణ, కె. సత్యనారాయణలకు పురమాయించి తన మార్గదర్శకత్వంలో తాను కూడ కలిసి ఇంగ్లీష్‌లో ఆ అర్ధసత్య ప్రతిపాదనలను, వాదనలను పరాస్తం చేస్తూ ఖండిస్తూ, సోపపత్తికంగా పొత్తం రాసాడు.

అంబేడ్కర్ ఆశించిన ఎడ్యుకేట్, యునైట్ అండ్ స్ట్రగుల్ (చైతన్యపరచు, ఐక్యపరచు, పోరాడు) అనే ఆశయాన్ని దళితుల విషయంలో ఆచరించినవాడు తారకం. ఆయన దళితుల సమస్యను కేవలం అంటరానితనం, ఆత్మగౌరవం దృష్టితోనే చూడలేదు. భూమిపై అధికారం దృష్టితో చూశాడు. అందుకే 'నేల, నాగలి, మూడు ఎద్దులు', 'కులం-వర్గం' వంటి విశ్లేషణాత్మకమైన పుస్తకాలు రాశాడు. భారతీయ వ్యవసాయ సమాజాల్లో నాగలి కింద రెండెడ్లే కాదు, మూడో ఎద్దు వెట్టి మాదిగ. భారతీయ సమాజాల్లో కులంలో వర్గం ఉంది. వర్గంలో కులం ఉంది.

ఈ అవగాహనతోనే ఆయన మావోయిస్టు పార్టీతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో చర్చలు జరిపినప్పుడు ప్రజాస్వామిక హక్కులు, భూ సంస్కరణలు అనే అంశంపై నాలుగు రోజుల పాటు జరిగిన విశ్లేషణాత్మక వివరమైన చర్చలో క్రియాశీలంగా, మధ్యవర్తిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత ఏర్పడిన ప్రజా భూమి కమీషన్ చైర్మన్‌గా తెలంగాణలో కరీంనగర్ (రాజారాం సహకారంతో) మొదలైన చోట్ల, రాయలసీమ చిత్తూరు (నరేంద్రనాథ్ సహకారంతో) మొదలైన చోట్ల, ఆంధ్రలో తూర్పు గోదావరి జిల్లా మొదలు శ్రీకాకుళం వరకు స్వయంగా భూ సంబంధాలను అధ్యయనం చేశాడు. ఈ కమీషన్ కన్వీనర్‌గానే చిక్కుడు ప్రభాకర్ ఆయనకు సన్నిహితుడయ్యాడు.

1990 వరంగల్ రైతు కూలీ సంఘం మహాసభల పిలుపు మేరకు తెలుగు నేలంతటా వేలాది ఎకరాల భూములు భూమిలేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలు స్వాధీనం చేసుకోవడం, ఏడాది తిరగకుండానే గ్రామాల్లో పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు ప్రారంభం కావడంతో 1996-97 వరకు తెలంగాణ ఒక నెత్తుటి ఏరు అయింది. ప్రభుత్వం పీపుల్స్‌వార్‌తో చర్చలు జరపాలనే ప్రతిపాదనతో ఎస్. ఆర్. శంకరన్ నాయకత్వంలో కన్సర్న్డ్ సిటిజన్స్ కమిటీ ఏర్పడింది. అందులో బొజ్జా తారకం గారు కూడా ఉన్నారు. ఈ కమిటీని ఎక్కువగా వేధించిన అంశం తెలుగు నేల మొత్తంగా ప్రత్యేకించి తెలంగాణలో ఈ ఘర్షణ మూలంగా పడావు భూములు (ఫాలో ల్యాండ్స్) వేల ఎకరాలుగా ఏర్పడి సామాజిక ఉత్పత్తి కుంటుపడుతున్నది, కనుక చర్చల ద్వారా సత్వర భూసంస్కరణలు అమలు చేయాలి.

నక్సల్బరీ, శ్రీకాకుళ, గోదావరి లోయ పోరాటాల ప్రభావంతో విప్లవోద్యమంలోకి వచ్చిన తారకం గారు ఆదివాసులకు జల్ జంగల్ జమీన్‌లపై ఉండే హక్కు గురించి పోరాడడంలో ఆశ్చర్యం లేదు. అది 1/70 అమలు చేయాలని డిమాండ్ చేసే సందర్భాల్లో కావచ్చు. 1989లో ఎన్‌టిఆర్ ప్రభుత్వం 1/70 రద్దు చేయాలని ప్రయత్నించినప్పుడు ప్రతిఘటించడంలో కావచ్చు. ఎల్లవేళలా ఆయన ఆదివాసీ పోరాటాలకు ముందున్నాడు.

ఆదివాసుల పోరాటాల్లో ఆయన నిమగ్నత ఎంత కంఠదఘ్నమైందంటే 2009లో ప్రజలపై యుద్ధంగా మొదలైన గ్రీన్‌హంట్ ఆపరేషన్ దాడిని ఖండిస్తూ బి. డి. శర్మతో పాటు దేశమంతా తిరిగాడు. 2012 జూన్‌లో బసగూడ మారణకాండలో 27 మంది ఆదివాసులు పిల్లలు, స్త్రీలతోపాటు అమరులైనప్పుడు వెళ్లిన సిడిఆర్ఒ ముప్పై ఇద్దరు బృందానికి నాయకత్వం వహించి వెళ్లాడు. వానలు, వరదలు, బురదలో రెండు రోజులు ట్రాక్టర్‌పై సుకుమా, దంతెవాడ జిల్లాలు తిరిగాడు. ట్రాక్టర్ బయనెట్‌పై కూర్చుని ట్రాక్టర్ తిప్పుతున్న ఆదివాసి గెరిల్లా చెప్పిన పోరాట చరిత్రవిని చలించిపోయాడు. ఆ ఆదివాసి గెరిల్లా మరెవరో కాదు, ఇరవై ఏళ్లుగా

ఆదిలాబాద్ మంగి దళం నిర్మిస్తున్న విప్లవోద్యమానికి నాయకుడైన చార్లెస్ - శోభన్. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం గడ్చిరోలిలో ఆయనతోపాటు మహేశ్, అనిల్ అనే మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేసింది.

తిరిగి వచ్చాక ఈ విషయాలు చెప్తూ ఉంటే ఆయన కళ్లల్లోని తడిలో వెలుగును గురించి నేను 'నిజమైన వీరులు నేల నుంచి వస్తారు' అనే వ్యాసంలో రాసాను.

ముస్లిం మైనారిటీలపై హిందుత్వ వ్యవస్థ చేసే దుష్ప్రచారాన్ని, రాజ్యహింసను ఎన్నో ప్రజాసంఘాల కన్నా ముందు నుంచే వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్మాణం చేశారు తారకం గారు. తొంబైల ఆరంభంలో జూబ్లీహిల్స్‌పై జరిగిన ఫసియొద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ మొదలు, మక్కా మసీదు బాంబు పేలుళ్లు, పోలీసు కాల్పులు, వికారుద్దీన్ అతని సహచరుల బూటకపు ఎన్‌కౌంటర్లు, అన్నిటినీ వ్యతిరేకిస్తూ ఆయన కోర్టులో, బయటా ఉద్యమాలు నిర్మించాడు.

2007లో ఏర్పడిన రాజకీయ ఖైదీల విడుదల కమిటీకి కెజి కన్నబిరాన్ అమరత్వం తర్వాత అధ్యక్షుడయి, అఖిల భారత సీనియర్ రాజకీయ ఖైదీల డిఫెన్స్ కమిటీ బాధ్యతలు కూడా చేపట్టాడు. 2014లో అనారోగ్యంతోనే కలకత్తాలో జరిగిన సిఆర్‌పిపి రెండవ మహాసభల్లో పాల్గొన్నాడు. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సుశీల్ కుమార్ రాయ్ దీర్ఘకాల జైలు జీవితంతో అనారోగ్యం పాలై, చివరకు క్యాన్సర్‌తో చావు బతుకుల్లో ఉన్నప్పుడు కేంద్ర హోంమంత్రి సుశీల్ కుమార్ షిండేకు ప్రొ. హరగోపాల్, ప్రొ. గిలానీలతో పాటు రిప్రజెంట్ చేసి మొదట ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్పించి తర్వాత విడుదల చేయించారు.

ఎన్నో ఎన్‌కౌంటర్ హత్యల విషయంలో నిజనిర్ధారణలు చేసి ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే అని శ్రీకాకుళ పోరాటకాలం నుంచే చెప్తూ పోరాడుతున్నది ఏపిసిఎల్‌సి. హక్కుల సంఘాలన్నిటి తరపున హైకోర్టులో ఎన్‌కౌంటర్లను హత్య కేసులుగా నమోదు చేయాలని వాదించినప్పుడు కెజి కన్నబిరాన్, కె. బాలగోపాల్ తదితర పదిమంది న్యాయవాదులు, అమికస్ క్యూరీ, సి. పద్మనాభరెడ్డిలతో పాటు చివరి దాకా దృఢంగా వాదించిన వారిలో తారకం గారు ఉన్నారు. ఈ వాదనల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏకగ్రీవంగా ఎన్‌కౌంటర్లను హత్యకేసులుగా నమోదు చేయాలని తీర్పునిచ్చింది. పోలీసు అధికారుల సంఘం సుప్రీంకోర్టులో దీనిపై స్టే తెచ్చినప్పుడు ఆ కేసును ఎట్లా వాదించాలో న్యాయ సూక్ష్మాలతో సూచనలు చేసినది కూడా తారకం గారే.

ఒక న్యాయమైన, ప్రజాస్వామికమైన డిమాండ్‌గా తెలంగాణను, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచాడు గనుకనే ఆయన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా కొనసాగిన గ్రేహౌండ్స్ గాలింపు చర్యలను, బూటకపు ఎన్‌కౌంటర్లను తీవ్రంగా ఖండించారు. లంకపెల్లి, మొద్దుగుట్ట ఎన్‌కౌంటర్లను ఖండించడమే కాకుండా శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్‌పై రౌండ్ టేబుల్‌లో పాల్గొన్నాడు. భావోద్వేగానికి గురయి ఆగ్రహావేశాలతో ఆయన చేసిన ప్రసంగమే ప్రేరణగా పది పార్టీలు, 371 సంస్థలతో తెలంగాణ ప్రజాస్వామిక వేదిక (టిడిఎఫ్) ఏర్పాటయిందని అనడంలో అతిశయోక్తి లేదు. తెలంగాణ ఏర్పడేనాటికే ఆయన బ్రెయిన్ ట్యూమర్‌కి గురయ్యాడు. కనుక ఆయన ఆ సంస్థ ఉద్యమ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయాడు. ఆఖరి శ్వాస వరకు కూడా ఆయన ఆ సంస్థ కన్వీనర్‌గా ఉన్నాడు.

ఆదివాసుల పోరాటాల్లో ఆయన నిమగ్నత ఎంత కంఠదఘ్నమైందంటే 2009లో ప్రజలపై యుద్ధంగా మొదలైన గ్రీన్‌హంట్ ఆపరేషన్ దాడిని ఖండిస్తూ బి. డి. శర్మతో పాటు దేశమంతా తిరిగాడు. 2012 జూన్‌లో బసగూడ మా రణకాండలో 27 మంది ఆదివాసులు పిల్లలు, స్త్రీలతోపాటు అమరులైనప్పుడు వెళ్లిన సిడిఆర్ఓ ముప్పై ఇద్దరు బృందానికి నాయకత్వం వహించి వెళ్లాడు. వానలు, వరదలు, బురదలో రెండు రోజులు ట్రాక్టర్‌పై సుకుమా, దంతెవాడ జిల్లాలు తిరిగాడు. ట్రాక్టర్ బయనెట్‌పై కూర్చుని ట్రాక్టర్ తిప్పుతున్న ఆదివాసి గెరిల్లా చెప్పిన పోరాట చరిత్ర విని చలించిపోయాడు.

2014 సెప్టెంబర్ 21న మావోయిస్టు పార్టీ ఏర్పడి పదేళ్లు అయిన సందర్భంలో ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయాలను చర్చించడానికి ఏర్పడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ్యుల్లో ఆయనే ప్రథముడు.

ఐదు దశాబ్దాలు దళిత, విప్లవ ఉద్యమాల విశ్వసనీయత అంతగా చూరగొన్న మానవీయ వ్యక్తిత్వం మరెవ్వరిలోనూ చూడం. ఆయనకు వివక్ష, వేదన స్వానుభవమే. పోరాట చైతన్యమూ వారసత్వంగానే వచ్చాయి. తండ్రి తారకం అనే పేరుతో సహా ఇంట్లోకి తెచ్చిన బ్రహ్మ సమాజ సంస్కరణ దృష్టి ఆయన జీవనశైలిని ప్రభావితం చేసింది. నలుపులోని స్పష్టత, స్వచ్ఛత ఆయన తెల్లని ఆహార్యంలో వ్యక్తమయ్యేవి. రాజ్యాంగ ఉపోద్ఘాతం, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు, న్యాయశాస్త్ర సృజనాత్మక వ్యాఖ్యానం, అన్వయింపు మొదలు రాజ్యం అణచివేత సాధనం గనుక అది రద్దయ్యేంతవరకు వర్గపోరాటాలు వర్గరహిత సమాజ లక్ష్యంగా సాగుతాయన్న అవగాహన, చైతన్యాలను జీర్ణం చేసుకునే దాక ఆయన అధ్యయనం, ఆచరణ ఒక దీర్ఘ ప్రయాణం.

లక్షల ప్రతులు అమ్ముడుపోయి, ముప్పై వేల పుస్తకాలు పోలీసులు కొని తగులబెట్టి, ఆ పుస్తకం చేతిలో ఉండడమే అండ అని ప్రజలు భావించి, నేరమని పోలీసులు భావించిన 'పోలీసులు అరెస్టు చేస్తే' పుస్తకంలో ఈ దీర్ఘ ప్రయాణ కృషి కనిపిస్తుంది.

ఆయనకు భారతీయ సమాజాలను అర్థం చేసుకొని, విశ్లేషించి, వ్యాఖ్యానించడానికి ఈ ప్రాపంచిక దృక్పథం ఎంతో దోహదం చేసింది. అందుకే ఆయన పీడిత ప్రజల అదిమిపట్టిన గొంతు నుంచి పెకిలి వచ్చిన నది పుట్టిన గొంతుక అయ్యాడు. కామ్రేడ్ ఇన్ ఆర్మ్స్ - మన రెక్కల్లో, బొక్కల్లో తన రెక్కలతో, బొక్కలతో, చూపులతో, మాటలతో, నడకతో, నడతతో నడిచిన సాంస్కృతిక యోధుడయ్యాడు.

'నాలాగే గోదావరి' అన్న భావుకుడిప్పుడు భౌతికంగా మన మధ్యలేడు. కాని ఒక న్యాయపోరాట చైతన్యంగా మనలో అతడు గోదావరిలా నిరంతరం ప్రవహిస్తూనే ఉంటాడు.

కులం-వర్గం
తారకంగారి దృక్పథం

పాణి

తారకంగారు తన జీవిత కాలంలో అనేక రంగాల్లో పని చేశారు. అనేక రూపాల్లో పని చేశారు. వీటన్నింటి అంతస్సూత్రంలో ఆలోచనాపరుడిగా ఆయన కనిపిస్తుంటారు. ఆచరణ-ఆలోచనా రంగాల మధ్య సమన్వయానికి అవసరమైన పద్ధతుల్లో తన పని కొనసాగించారు. దళిత, ప్రజా ఉద్యమాల నాయకుడిగా, మిత్రుడిగా చివరి దాకా కొనసాగారు. ఆ ఉద్యమాలకు అవసరమైన పనులు చేయడమేగాక వాటి సమన్వయానికి కూడా కృషి చేశారు.

ఆయన తన జీవిత కాలంలోని వేర్వేరు దశల్లో ఇలాంటి ప్రయత్నం చేశారు. వాటన్నిటినీ మదింపు చేయాలి. తన కుటుంబ, సాంఘిక నేపథ్యాలతో సహా వాటిని సమగ్రంగా పరిశీలించాలి. వ్యక్తిగా, రచయితగా, ఆలోచనాపరుడిగా, కార్యకర్తగా, నాయకుడిగా ఆయన రూపొందిన తొలినాళ్ల నుంచి చివరి దాకా అన్నిటినీ సమగ్రంగా స్వీకరించాలి. అప్పుడు గాని ఆయన పాత్ర మనకు అర్థం కాదు. అలాగే తెలుగు సమాజపు సాంఘిక ఉద్యమాలు, రాజకీయ పోరాటాల వెల్లువల్లోంచి, అవి ఎదుర్కొంటున్న సంక్షోభాల్లోంచి, వాటికి దారి చూపుతున్న సిద్ధాంత రంగ సంఘర్షణల్లోంచి కూడా తారకంగార్ని చూడాలి. వీటన్నింటి నుంచి వేరు చేయలేని వ్యక్తిత్వం ఆయనది.

1970ల నుంచే చెప్పుకుంటే.. ఆ కాల ప్రభావం వల్ల సహజంగానే ఆయన విప్లవోద్యమం పక్షానికి వచ్చారు. నిజామాబాద్‌లో ఉన్న రోజుల్లో విప్లవ సాహిత్యోద్యమంలో, విప్లవోద్యమంలో క్రియాశీలంగా ఉన్నారు. కవిగా, మేధావిగా ఆ ఉద్యమాలకు స్థానికంగా పెద్దదిక్కుగా ఉన్నారు. అంబేద్కర్ ప్రభావం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వాడు కావడంతో సాంఘిక సమస్యలపై నేరుగా పని చేశారు. అంబేద్కర్ సంఘాలతో కలిసి నడిచాడు.



ఎమర్జెన్సీలో అరెస్టయ్యారు. ఆ తర్వాత పూర్తిగా దళిత ఉద్యమాల వైపు మళ్లారు. ఈ అంశ ఆయనలో మొదటి నుంచే ఉన్నది కాబట్టి కారంచేడు ఘటన నాటికే ఆయన దళిత ఉద్యమ నేతగా ప్రధాన పాత్ర పోషించారు. దళిత మహా సభ క్రియాశీలంగా ఉన్నంత కాలం దాని నాయకుడిగా అట్టడుగు నుంచి పని చేశారు. దళిత ఉద్యమ నేతగా, అంబేద్కర్ ఆలోచనల ప్రచారకుడిగా, సాంఘిక సిద్ధాంత కర్తగా విలువైన పాత్ర పోషించారు. ఒకరకంగా మన విశ్లేషణ సౌకర్యం కోసం ఆయన సామాజిక జీవితాన్ని మూడు దశలుగా గుర్తిస్తే ఒకటి: 1970ల దశకం, రెండు: 1980ల దశకం, మూడు: దళిత మహాసభ తర్వాతి నుంచి చివరి వరకు.

ఈ దశల్లో తారకంగారు వేర్వేరుగా కనిపిస్తారు. అదే సమయంలో వాటి మధ్య ఒక తెగిపోని ధార కొనసాగించారు. అదే తారకంగారి విశిష్టత. ఉద్యమాల్లో, రచనల్లో, న్యాయస్థానాల్లో ఆయన దృఢమైన పాత్ర పోషించడానికి అదే కారణం. తారకంగారంటే దళిత నాయకుడు, దళిత మేధావి అనే బలమైన భావన దేశమంతా ఉన్నప్పటికీ చాలా మంది దళిత నాయకుల కంటే ఆయన విలక్షణంగా కనిపించేది దీని వల్లే. ఆయన కొనసాగించిన ఈ ఆలోచనా ధారను, వేర్వేరు దశల్లో ఉన్న ప్రత్యేకతలను విమర్శనాత్మకంగా అంచనా వేయడమే ఆయనకు నివాళి.

విప్లవ ప్రజా సంఘాల్లో ఉన్న రోజుల్లోనే అంబేద్కర్ సంఘాలతో కలిసి పని చేయడం, రిపబ్లికన్ పార్టీలో ఉంటూనే విప్లవోద్యమ సంబంధమైన సమస్యలపై సన్నిహిత మిత్రుడిగా కొనసాగడం ఆయన ప్రత్యేకతల్లో ఒకటి. దీనికి కులం-వర్గం అనే పుస్తకం రచనా రంగంలో ఆయనకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇందులో ఉండే ఆలోచనల వివరాలు దళితులు-రాజ్యంలో, నేల-నాగలి-మూడెద్దులులో, పంచతంత్రం అనే నవలలో, చరిత్ర మార్చిన మనిషి అనే తన తండ్రి జీవిత చరిత్రలో కనిపిస్తాయి.

1996లో కులం వర్గం రాశారు. 1985లో కారంచేడు ఘటనతో తెలుగులో నిర్దిష్టంగా మొదలైన దళిత ఉద్యమ నేపథ్యంలో, ఒక దశాబ్దంపాటు కుల సమస్యపై జరిగిన చర్చ వెలుగులో ఈ పుస్తకాన్ని చూడవచ్చు. వ్యక్తిగతంగా అయితే ఆయనకు అంతకముందు నుంచే కులంపై, అంబేద్కర్‌పై ఉన్న అవగాహన కూడా దీనికి దోహదపడి ఉండవచ్చు. మొదటి నుంచీ కింది స్థాయిలో కుల వాస్తవికతను తెలుసుకోడానికి ఆయన చేసిన ప్రయత్నం కూడా ఈ రచనలో ప్రతిఫలించి ఉండవచ్చు.

నిజానికి అప్పట్లో.. మన దేశంలో వర్గం లేదని, కులమే వర్గమని, మార్క్సిజం అవసరం లేదనే వాదన చేసేవారే ఎక్కువగా ఉండేవారు. కులాన్ని, వర్గాన్ని సమన్వయం చేయాలనే ఆలోచన కూడా ఉండేది. అయితే అలాంటి వాళ్లు కొందరే ఉండేవారు. వాళ్లలో తారకంగారు ఒకరు. కొందరు విప్లవ ఆవరణలో ఈ పని చేస్తే, తారకంగారు కొంత కాలం బీఎస్పీలో, మరికొంత కాలం ఆర్పీఐలో ఉంటూ ఈ పని చేశారు. సారాంశంలో ఆయన కులాన్ని, వర్గాన్ని కలిపి చూడాలనుకున్నారు. కమ్యూనిస్టులు, విప్లవకారులు కులాన్ని పట్టించుకోవడం లేదని, తాను ఉన్న పార్టీనే అయినా అంబేద్కర్ ఆశించినట్లు ఆర్పీఐ వర్గాన్ని పట్టించుకోవడం లేదనే అవగాహన నుంచి ఆయన కులాన్ని-వర్గాన్ని కలిపి చూసే ప్రయత్నం చేశారు. చివరి దాకా ఆయన ఈ అవగాహనతోనే ఉన్నారు.

1998లో అచ్చయిన మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం గమనం అనే పుస్తకంలో ఆయన దళితుల ముందు రెండు మార్గాలు ఉన్నాయని చెబుతూ... 'ఓటు దారిలో వెళితే అందంగా అగాథంలోకి తోసి వేస్తుంది. పరమపద సోపానంలో పెద్ద పాము మింగినట్టు మళ్లీ మళ్లీ మొదటికి వస్తారు. ..' అని అంటారు. రెండో దారిలోని చిక్కులు కూడా చెప్పినా పార్లమెంటరీ మార్గంపట్ల ఆయన అంచనాను పై వాక్యాలు తెలియజేస్తాయి.

కులం అనగానే అంబేద్కర్ గుర్తుకు వస్తాడని, వర్గం అనగానే మార్క్స్ గుర్తుకు వస్తాడని అంటూ ఆయన ఈ పుస్తకం ప్రారంభిస్తారు. ఆ ఇద్దరి సంవిధానాల ఆధారంగా కులాన్ని, వర్గాన్ని వివరించే ప్రయత్నం చేశారు. కులానికి, వర్గానికి మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన భూమి సమస్య అనే వంతెన మీది నుంచి చూసి విశ్లేషించారు. భూమితోపాటు సాంఘిక విముక్తికి అంతే ప్రాధాన్యమిచ్చారు. ఇలా ఆయన కులం.. వర్గం అనే రెంటికీ సమ ప్రాధాన్యత ఇస్తూ ఆ రచనను ముగించారు. కానీ ఇప్పుడు.. ఆయన కులాన్ని అంబేద్కర్ మౌలిక అవగాహన నుంచి వివరించినట్లుగా వర్గాన్ని మార్క్స్ మౌలిక అవగాహన నుంచి వివరించారా? అనేది మనం లోతుగా పరిశీలించి విశ్లేషించాల్సి ఉన్నది. అంబేద్కర్ సామాజిక అధ్యయనం కులం అనే కేటగిరీ దగ్గర మొదలవుతుంది. అది ఎలా మొదలవుతుందో, దాని ద్వారా చూచి కులాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చాలా ప్రామాణికంగా చెప్పారు. అట్లా సామాజిక చరిత్రను అధ్యయనం చేయడానికి వర్గం అనే కేటగిరీ ప్రమాణంగా మార్క్స్ రూపొందించిన సంవిధానాన్ని తారకంగారు వినియోగించుకున్నారా? అని శాస్త్రీయంగా వస్తుగతంగా చర్చించాలి. ఆయనా తనను తాను మార్క్సిస్టుగానే గుర్తించుకునేవారు కాబట్టి ఈ కోణంలో ఆయన ఆలోచనలతో ఎంగేజ్ అయితేనే ఆయన ఆలోచనలను ముందుకు తీసకపోగలమనే పాజిటివ్ అర్థంలో అంటున్నాను. దేన్నయినా సరళంగా, సుబోధకం చెప్పడం తారకంగారి పద్ధతి. ఇది ఆయన కవిత్వంలో, ప్రసంగంలో కూడా ఉంటుంది. వర్గం దగ్గర మొదలయ్యే మార్క్స్ సంవిధానంలోని సంక్లిష్టతను సాధారణ పాఠకులకు కూడా అర్థమయ్యేలా చెప్పడానికి ఆయన అలా రాసి ఉండొచ్చు. అయినా పైన చెప్పిన కోణంలో తారకంగారిని చదివితే కులం-వర్గం అనే రెండు వాస్తవాలను, వాటి సంబంధాలను ఆయన అర్థం చేసుకున్న తీరు తెలుసుకోవచ్చు. ఈ రెంటినీ అంబేద్కర్, మార్క్స్ పద్ధతుల్లో విశ్లేషించి ఒకే సిద్ధాంతంగా మలచడానికి ఆయన చేసిన ప్రయత్నం ఏమిటో స్పష్టం చేసుకోవచ్చు. ఆ రెంటికీ సమ ప్రాధాన్యత ఇచ్చి పోరాడాలనే రాజకీయ తలానికి సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు ఇది. అలా పోరాడకపోతే ఒకడుగు కూడా ముందుకు పోలేం. కానీ తారకంగారు పోరాట రంగంలోనే కాక సిద్ధాంత రంగంలో కూడా దళిత, విప్లవోద్యమాల మధ్య వారధిగా ఉండాలనే ప్రయత్నం చేశారని మనకు తెలుసు. ఆ క్రమంలో ఆయన కృషిని అంచనా వేయడానికి పై పరిశీలన తప్పక అవసరం అవుతుంది. వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాట శక్తుల ఐక్యతకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. సాంఘిక విముక్తి, రాజ్యాధికారం, భూమిపై యాజమాన్యం అనే భావనలు నిజం కావడానికి దళితుల ఐక్యత కోరుకున్నారు. అయితే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో ఆయన స్పష్టంగా మాదిగల పక్షాన నిలబడి ఉంటే తప్పక పీడిత కులాల ఐక్యతకు బలమైన ప్రాతిపదిక ఏర్పడి ఉండేది.

ఇక రెండో ప్రత్యేకత ఏమంటే ఆయనకు వర్గం పట్ల గురి ఉన్నప్పటికీ, చివరి రోజుల్లో అది మరింత బలపడినప్పటికీ.. అగ్రకుల ఆధిక్యంలో నడిచే పార్టీలకు ప్రత్యామ్నాయంగా దళితులకు స్వతంత్ర పార్లమెంటరీ పార్టీ కూడా కావాలనే అభిప్రాయం ఉండేది. ఓట్లు మావి.. సీట్లు మీవా అనే డిమాండ్‌తో దళిత బహుజన రాజకీయ వేదికగా బీఎస్పీ రంగం మీదికి రాగానే తారకంగారు 1989లోనే అందులో చేరారు. దాని రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 1994లో ఆ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీతో పొత్తు పెట్టుకోడాన్ని తీవ్రంగా నిరసిస్తూ రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆ తర్వాత 1995లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఇటీవల ఆ పార్టీ నాయకుడు అతావలె కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వంలో చేరాక ఆయన నాయకత్వంలోని ఆర్‌పీఐతో తెగతెంపులు చేసుకున్నారు. ఇప్పుడు ఆయన అధ్యక్షుడిగా ఆర్‌పీఐ రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. అగ్రకుల, హిందుత్వ శక్తులపట్ల, పార్లమెంటరీ పంథా పట్ల ఆయనకు విమర్శనాత్మక దృష్టి ఉండేదనడానికి ఇలాంటివి ఎన్నో చెప్పవచ్చు. 1998లో అచ్చయిన మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం గమనం అనే పుస్తకంలో ఆయన దళితుల ముందు రెండు మార్గాలు ఉన్నాయని చెబుతూ... 'ఓటు దారిలో వెళితే అందంగా అగాథంలోకి తోసి వేస్తుంది. పరమపద సోపానంలో పెద్ద పాము మింగినట్టు మళ్లీ మళ్లీ మొదటికి వస్తారు. ..' అని అంటారు. రెండో దారిలోని చిక్కులు కూడా చెప్పినా పార్లమెంటరీ మార్గంపట్ల ఆయన అంచనాను పై వాక్యాలు తెలియజేస్తాయి. అయినా తరతరాల నుంచి రాజకీయాధికారం చెలాస్తున్న అగ్రకులాలకు ప్రత్యామ్నాయంగా దళిత బహుజన శక్తులు సంఘటితం కావాలనే తన ఆకాంక్షను ఆయన పార్లమెంటరీ మార్గంలో కూడా వినిపించారు. దళితుల ఆత్మగౌరవ నినాదాన్ని శక్తివంతంగా ముందుకు తెచ్చిన దళిత మహా సభ తదనంతరం ఆయన జీవితంలోని మూడో దశలో బీఎస్పీ, ఆర్పీఐలలోకి వెళ్లినా.. తనకు పదువులో, అధికారాలో కావాలని ఆయన ఆ మార్గాన్ని కూడా అట్టిపెట్టుకున్నారని ఎవ్వరూ వేలెత్తి చూపలేరు. పైగా పైన చెప్పిన వ్యాసంలోనే విప్లవ పంథాలోని సాధకబాధకాలు చాలా చర్చిస్తూనే ప్రజలకు విప్లవోద్యమం ఒక మాట, ఒక పాట, ఒక తూటాను ఇచ్చిందని అంటారు. ప్రజలు అనే మాటలో దళితులనే నొక్కు ఉందని మనకు తెలుస్తూ ఉంటుంది.

విప్లవకారులు దళితుల విముక్తి విషయంలో భరోసా ఇవ్వలేకపోయారు కాబట్టే ఆయన పార్లమెంటరీ మార్గాన్ని కూడా అలా అట్టి పెట్టుకున్నారని విమర్శించేవాళ్లూ ఉండవచ్చు. అదీ నిజమే అనుకున్నా.. ఆయన విషయంలో ఈ పరిశీలన కూడా చేయవచ్చు. ఆయనలోని పార్లమెంటరీ అంశ వల్ల దళితులకేం మేలు జరిగిందో తెలియదు గాని, మొదటి నుంచీ అంబేద్కర్‌వాదిగా కారంచేడు నుంచి లక్ష్మింపేటదాకా చేసిన కృషి, విప్లవాభిమానిగా నిజామాబాద్‌లో ఉన్న రోజుల నుంచి దండకారణ్య విప్లవోద్యమం దాకా నది పుట్టిన గొంతులాంటి ఆయన పలుకు, పని, రచనల వల్ల దళితులకు, పీడిత వర్గానికి ఎనలేని మేలు జరిగింది. ఆ రకంగా ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమైంది. దళిత, విప్లవ శిబిరాల మధ్య ఆయన ఎంచుకున్న ప్రజాతంత్ర ఆచరణ సదా గుర్తుంచుకోదగింది.



కశ్మీర్ సమస్య: యుద్ధ ప్రేలాపనలు

ఎ. నర్సింహా రెడ్డి

మంచుకొండలు, పచ్చనిలోయలు, స్వచ్ఛమైన సరస్సుల కశ్మీర్ మరోసారి నెత్తురోడుతోంది. పోస్టర్‌బాయిగా పేరొందిన ముజాహిద్దీన్ కమాండర్ బుర్హాన్ ముజఫర్ వనీ (22)ని జూలై 8న అనంతనాగ్ జిల్లా కోకర్‌నాగ్ వద్ద భద్రతా దళాలు కాల్చి చంపాయి. బుర్హాన్ అంత్యక్రియలకు రెండు లక్షలకు పైగా ప్రజలు హాజరయ్యారు. అతన్ని అమరవీరునిగా భావించారు. ఇంతగా కశ్మీర్ యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకోవడానికి కారణం దశాబ్దాలుగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్బంధ విధానాలే. బుర్హాన్, మరో ఇద్దరు ఆయన అనుచరులను ఎన్‌కౌంటర్ చేసిన తదనంతరం చెలరేగిన ఆందోళనలో భద్రతా దళాల పెల్లెట్ తూటాలకు 80 పైగా మరణించారు. 100 మంది అంధులయ్యారు. వేలాది మంది గాయాల పాలయ్యారు. నిరాయుధులైన నిరసనకారులపై భద్రతా బలగాలు విరుచుకు పడుతున్న తీరు కూడ కశ్మీర్ ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచుతున్నాయి. 2008, 2010 సంవత్సరాలలో కశ్మీర్‌ను కుదిపేసిన హింసాకాండ పునరావృతమవుతోంది. వేర్పాటువాదులు, మిలిటెంట్లు కశ్మీర్ లోయలో అత్యధిక సంఖ్యాకులైన సున్నీలు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని (పిడిపి) పార్టీ తమను మోసం చేసిందని భావిస్తున్నారు. గత మూడు మాసాలుగా కశ్మీర్‌లో కర్ఫ్యూ నీడలు పరచుకున్నాయి. అవి అంతకంతకు సుదీర్ఘమవుతున్నాయి. కర్ఫ్యూ నీడలో నిషేదాజ్ఞలను చవిచూస్తున్న కశ్మీరీల కష్టాలు మరింత అధికమయ్యాయి. ప్రజల సాధారణ జీవితం స్తంభించి పోయింది.

కశ్మీర్ ప్రజల ఆజాదీ ఆకాంక్ష ఇవ్వాల్టిది కాదు. భారత సైన్యం 1948లో చేసిన దాడితో మొదలైంది. ఇవాళ కశ్మీర్‌లో ఏడు లక్షల సైన్యం, మరో ఏడు లక్షల పారా మిలిటరీ బలగాలు ఉన్నాయి. అంటే ప్రతి ఆరుగురికి ఒక సైనికుడు ఉన్నాడు. ప్రపంచంలో ఏ దేశంలో, ఏ ప్రాంతంలో ఇంత నిర్బంధం లేదంటే అతిశయోక్తి ఏమికాదు. 1948లో ఇక్కడ 'ప్రజాభిప్రాయ సేకరణ' నిర్వహిస్తామని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో నెహ్రూ ప్రకటించారు. గత ఏడు దశాబ్దాలుగా ఐ.రా.సలో ఇచ్చిన మాట ప్రకారం 'ప్రజాభిప్రాయ సేకరణ' నిర్వహించాలని కశ్మీరీలు డిమాండు చేస్తున్నారు. కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవించాలని భారత్‌లో ఉన్న ప్రజాస్వామికవాదులను కోరుతున్నారు. పాలస్తీనా వలె కశ్మీర్ ఎప్పుడు ఒక పోరాటాల, గాయలతోనే సతమతమవుతోంది. 70 సంవత్సరాలుగా కశ్మీరీ ప్రజల ఆజాదీ ఆకాంక్షను క్రూరంగా అణిచివేస్తున్నారు. 26-10-1947 నాటి 'విలీన ఒప్పందం'లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. 1952లో చేసుకున్న 8 సూత్రాల ఒడంబడికను అటుకెక్కించారు. పాకిస్తాన్‌ను బూచిగా చూపించి కశ్మీరీ ప్రజల్ని అణచి వేయడం భారత పాలక వర్గాలకు అలవాటుగా మారింది.

కశ్మీర్ ప్రజలో ఏండ్ల తరబడి పేరుకుపోయిన అసంతృప్తి, ఆశాభంగం, అశాంతితో ఆందోళనకర పరిస్థితి కొనసాగుతోంది. భారత పాలకులంతా తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ ప్రజలను విభజించి, అణచివేయటానికి ఉపయోగించారు. కశ్మీర్ ప్రజల న్యాయమైన ఆకాంక్షలను గౌరవించటానికిగానీ, తాము ఎన్నికలలో ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేసేందుకు గానీ ప్రయత్నించలేదు. కశ్మీరీ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామనే గట్టి నమ్మకాన్ని వారికి కలిగించేవైపుగా ఏనాడూ దృష్టి పెట్టలేదు. బిజెపి నాయకత్వంలో కేంద్రంలోనూ, పిడిపి, బిజెపిల కూటమి నాయకత్వంలో జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోను అధికారంలో కొనసాగుతున్న పాలకులు గత ప్రభుత్వాల పాత విధానాలను అమలుచేస్తున్నారు. పూర్తిగా బిజెపిపై ఆధారపడి కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని సాగిస్తున్న పిడిపి, బిజెపిని సంతృప్తిపరిచే చర్యలకు పూనుకుంటున్నది. బిజెపి తన మతతత్వ, విభజన రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలను తీవ్రం చేయటం ద్వారా తన స్థానాన్ని పదిలపరచుకోవాలని భావిస్తోంది. అసలు బిజెపిలో పిడిపి కలవటం ఒక వైరుధ్యాల పుట్ట. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని మించిన హక్కు కావాలనే పిడిపి, 370వ అధికరణాన్నే రద్దు చేయాలనే బిజెపి కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఒక వింత. అఫ్జల్‌గురు పేరెత్తడమే నేరమైనట్టు విద్యార్థులను వేటాడింది బిజెపి. అధికారం చేపట్టక ముందు పిడిపి ఆ అఫ్జల్ గురునే గురువులా భావించింది. ఈ ఇద్దరి కలయిక దేశ రాజకీయాల్లోనే అత్యంత విడ్డూరమైన ఒక అధికార అమరిక.

గత రెండున్నర దశాబ్దాల కశ్మీరీ ప్రజల అనుభవాలు చాలా కఠోరంగా ఉన్నాయి. 2008లో అమరనాథ్ భూ ఆందోళన

బ్రద్దలైంది. కశ్మీరీ లోయలో రాళ్ళతో యుద్ధాలు జరిగాయి. చొరబాటుదారుల వ్యతిరేకులు, రాళ్ళు విసిరేవారిలో ఓ కొత్త శత్రువును కనుగొన్నారు. అనుమానితుడైన, రాయివిసిరిన వానికోసం గాలింపులు ప్రారంభమయ్యాయి. 2009లో సోఫియా జిల్లాలో నీలోఫర్ జాన్, ఆసియా జాన్‌లపై అత్యాచారం, హత్య ఘటనతో కశ్మీర్ మరోమారు కంపించింది. ఈ అత్యాచారం, హత్యలకు అక్కడికి దగ్గరలోని సిఆర్‌పిఎఫ్ బలగాల శిబిరంలోని సైనికులే బాధ్యులని స్థానిక ప్రజానీకం ముక్తకంఠంతో నినదించారు. 2010లో మరో ఆందోళన కశ్మీర్‌ను కుదిపేసింది. ఉత్తర కశ్మీర్‌లో ముగ్గురు యువకులను "పాకిస్తానీ చొరబాటుదారులనే" పేరుతో సైనిక బలగాలు కాల్చి చంపారు. వీరిని నాదిహాల్ గ్రామస్థులుగా గుర్తించారు. స్థానిక ఇన్‌ఫార్మర్‌తో ఓ సైనికాధికారి కుమ్మక్కై, ముగ్గురు యువకులను పట్టుకొని తెచ్చి కాల్చిచంపి, చొరబాటుదారులను కాల్చి చంపినట్లు తప్పుడు ధృవీకరణ చూపి ప్రభుత్వం నుండి నగదు బహుమతులను కూడ అందుకున్నాడు.

ఈలాంటి కట్టు కథలు ఎన్నో ఈనాటికీ పునరావృతమౌతున్నాయి. కశ్మీర్‌లోని విశాల ప్రాంతాలన్నీ కల్లోలిత ప్రాంతాలుగా ఉన్నాయి. ఏఎఫ్ఎస్‌పిఏతో సాయుధమైన సైనిక బలగాల ఉక్కుపాదం కింద ఆ ప్రాంతాలన్నీ ఈనాటికీ చిక్కుకొని నలిగిపోతూ ఉన్నాయి. ప్రజాభద్రతా చట్టం (పిఎస్ఏ) తదితర చట్టాల కింద పెట్టబడిన పలు తప్పుడు కేసులలో వేలాదిమంది కశ్మీరులు- ముఖ్యంగా యువత-జైళ్ళలో మగ్గుతున్నారు. భయోత్పాతపు వాతావరణంలో, అభద్రతలో, సాధారణ జీవితానికి దూరమై ప్రజలు బతుకులీడుస్తున్నారు. జీవనాధారాలు, ఉద్యోగాలు లేకపోవటమేగాక కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా వారికి మృగ్యమయ్యాయి. జీవితంలో పెరుగుతున్న భారాలు వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి. యువతలో అత్యధికులను అనుమానితుల పేరున, చొరబాటు దారులకు మద్దతుదారుల పేరున వెంటాడి, వేధిస్తున్నారు. యువత జీవితాలు మరింత దుర్భరం కావడంతో అధికశాతం ప్రజానీకంలో తాము పరాయివారమనే భావం బలపడుతోంది.

దశాబ్దాలుగా రగులుతున్న కశ్మీర్ ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, స్వయంపాలన వంటి సమస్యలను పరిష్కరించే పెనుభారం పోలీసులు, భద్రతాదళాలపై వేయడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ఇప్పటికే రెండున్నర దశాబ్దాలుగా సైనిక నియంత్రణ కింద నగిలిపోతున్నారు. నిర్బంధ నీడలో కుమిలిపోతున్నారు. మూడు నెలలక్రితం కుప్వారా జిల్లా హంద్వారాలో ఒక బాలికపై కానిస్టేబుల్ అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ నిరసన ప్రదర్శనలు మిన్నంటాయి. అప్పుడు భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మరణించారు. కశ్మీర్ కేవలం భూమి సమస్యకాదు, ప్రజల సమస్య. ప్రజలను విశ్వాసంలోకి తీసుకోని ఏ చర్యా సత్ఫలితాన్నివ్వదు. అందువల్ల అధికార, ప్రతిపక్ష రాజకీయ వాదులు ముందుకు వచ్చి గతంలో అనుసరించిన రాజకీయ చర్చల ప్రక్రియ పునరుద్ధరణకు కృషి చేయడమే ఇప్పుడు ఆశించదగినది.

కశ్మీరు ప్రజానీకం ప్రత్యేకించి యువజనులు - తమ కోపం, నిరసన, బాధలను వ్యక్తం చేసేందుకు విభిన్న పద్ధతుల నెంచుకొంటున్నారు. తిరస్కార ధోరణి ప్రజలలో బలం పుంజుకుంది. ఈ మార్గంలో కశ్మీర్‌లో వివిధ నిరసనోద్యమాలు ఊపందుకున్నాయి. 'పాకిస్తాన్ అనుకూలుడు', 'మిలిటెంట్', 'వేర్పాటువాది' తదితర పదాలను ప్రభుత్వం లేదా సైనిక బలగాలు నిరసనకార్లకు ఆపాదించినప్పటికీ ప్రజలు వీటికి బెదిరిపోవడం లేదు. దీనిని బట్టి ప్రజానీకం, ప్రత్యేకించి యువత ప్రభుత్వ వ్యతిరేకులుగా పిలిపించుకోవటాన్ని గౌరవనీయమైందిగా, న్యాయం కోసం చేస్తున్న పోరాటంగా భావిస్తున్నారు. బిజెపి మతతత్వ విభజనను పెంచే విధానాలను కశ్మీర్‌లో అనుసరిస్తోంది. ఈ రకంగా రాష్ట్రంలో తన బలాన్ని, మద్దతును పెంచుకోజూస్తోంది. అత్యంత దుష్పరిణామాలతో కూడిన ప్రమాదకరమైన క్రీడ ఇది. కత్తులను, తుపాకులను, ఇతర ఆయుధాలను ప్రదర్శిస్తూ, 'అగర్ హిందూస్తాన్ మే రహనా హై తో వందేమాతరమ్ కహనా హై' వంటి నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ రకమైన కార్యకలాపాల ద్వారా హిందూ మతతత్వవాదులు కశ్మీర్‌లోని ప్రజలను విభజించటమే గాకుండా నూతన సమస్యలకు బీజాలు వేస్తున్నారు.

బుర్హాన్ ముజఫర్ వని ఎన్‌కౌంటరు తరువాత నెలకొన్న ప్రజా ఆగ్రహం నియంత్రించడానికి చేపట్టిన అణచివేత చర్యలతో, సైనిక దుర్మార్గాలతో అట్టుడుకుతున్న కశ్మీర్‌లో ప్రజల ప్రతిఘటనను తీవ్రంగా అణచడానికి, ఉక్కుపాదం మోపడానికి, అలాగే కశ్మీర్ సమస్యపై ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ మాట్లాడటానికి సరిగ్గా ఒక్కరోజు ముందుగా ఆయన ప్రసంగాన్ని పలుచన చేయడానికి మోడీకి, ఆరెస్సెస్ పరివారానికి ఒక సాకు అవసరమయింది. అందులో భాగమే సెప్టెంబర్ 18 ఉదయం బారాముల్లా జిల్లాలోని ఉడీలో అత్యంత కట్టుదిట్టమైన సైనిక బ్రిగేడ్ కేంద్ర స్థావరం మీద దాడి జరిగి 18 మంది సైనికులు మరణించారన్న వార్త. ఈ దాడి పాకిస్తాన్ సాయుధ మూకలు చేసిన పనేనని రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటన తెలియజేసింది. దీన్నే మీడియా ప్రచారం చేసింది తప్ప ఏ ఒక్కరు ఘటన స్థలానికి వెళ్లి వాస్తవ సమాచార సేకరణ చేయలేదు.

ఉడీపై దాడి జరిగిన వెంటనే పాకిస్తాన్‌పై దండెత్తాలని హిందూత్వ శక్తులు ప్రకటనలు చేశాయి. రామ్‌మాధవ్ లాంటి వారు పాకిస్తాన్‌పై ఇక యుద్ధమే అన్నట్లుగా మాట్లాడారు. ఉడీ దాడి తరువాత బిజెపి, ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం యుద్ధోన్మాదాన్ని, పాక్ వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఇటువంటి చర్యల ద్వారా యావజ్జాతిని తన వెనక ర్యాలీ అయ్యేలా చూసుకోవాలని, తద్వారా కీలక యూపి అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలనేది ఆరెస్సెస్, బిజెపిల పన్నాగం. కేరళలోని కోజికోడ్‌లో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాల్లోను, ఐరాస వేదికపైన సుష్మా స్వరాజ్ చేసిన ప్రసంగంలోను, సింధు జలాల చర్చల్లోనూ ఈ ధోరణే కొట్టొచ్చినట్లు కనిపించింది. మీడియాలో వస్తున్న వార్తలు, బిజెపి నాయకుల

ప్రకటనలు అనేక సందేహాలకు తావిస్తున్నాయి.

భారత భూభాగం వైపు నుంచి 1972లో నిర్ణయమైన 550కి.మీ పొడవైన వాస్తవాధీనరేఖ (యుద్ధ విరమణ రేఖ) పొడవునా ముళ్ల కంచె ఉన్నది. ఆ కంచెను భారత ప్రభుత్వమే నిర్మించింది. "ఇది 8 నుంచి 12 అడుగుల ఎత్తు గోడలతో, నిరంతర విద్యుత్ ప్రవాహంతో ఉన్న తీగలతో, మోషన్ సెన్సర్లతో, థర్మల్ ఇమేజింగ్ పరికరాలతో, ఫ్లడ్‌లైట్లతో, హెచ్చరిక గంటలతో ఎంతో అభేద్యంగా ఉంది. ఆ కంచె నిర్మించిన ఉద్దేశం పాకిస్తాన్ నుంచి సాయుధ మూకలు, వేర్పాటువాద మిలిటెంట్లు ఆయుధాలను, చొరబాటును అడ్డుకోవడానికే. 'అయినా నలుగురు తీవ్రవాదులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి చొరబడి, శత్రు దుర్భేద్యమైన బ్రిగేడ్ కేంద్ర కార్యాలయపు సైనిక శిబిరం మీద విజయవంతంగా దాడి జరిపారట" అని రిటైర్డ్ పోలీసు అధికారి సంజీవ్ బట్ సంశయం వెలిబుచ్చారు. మరోవైపు సెప్టెంబర్ 29న, అక్టోబర్1న భారత సైనికులు చేశారని చెప్పుకుంటున్న సర్జికల్ ఆపరేషన్ పైన కూడ ప్రతిపక్షాలు అనుమానాలు వెలిబుచ్చాయి. ఈ ప్రచారమంతా మోడీని హీరోను చేసి రానున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో లబ్ది పొందడానికేనని ఆరోపిస్తున్నాయి.

బిజెపి మద్దతుదారుల సాంస్కృతిక జాతీయవాదం పాకిస్థాన్‌ను శాశ్వత 'శత్రువు'గా పరిగణిస్తోంది. ఈ సాంస్కృతిక జాతీయవాదం ప్రతిపాదిస్తున్న అఖండ్ భారత్ దృక్పథం మేరకు పాకిస్థాన్‌ను సంపూర్ణంగా నిర్మూలించాలని బిజెపి మద్దతుదారులు దృఢంగా విశ్వసిస్తున్నారు. ఇటువంటి అహేతుక ధోరణి ఒకటి భారత్‌కు ఆవలవైపు కూడా ఉన్నది. భారత్‌ను వెయ్యి గాయాలతో రక్తమోడేలా చేయడమే పాకిస్థాన్‌లోని భారత్ వ్యతిరేకుల ధ్యేయంగా ఉన్నది. ఈ వ్యతిరేకతను మొదట బ్రిటన్, ఆ తర్వాత అమెరికా సామ్రాజ్యవాదం పెంచి పోషించింది. భారత జాతీయ కాంగ్రెస్ దశాబ్దాల పాటు దుర్బల భావాలకు లోనైన రాజ్యవ్యవస్థకు ఆధిపత్యం వహించిందని, పాకిస్థాన్‌కు అనవసరంగా అనేక విషయాలలో పలు రాయితీలు ఇచ్చిందని ఇది భారత్ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీసిందని కాషాయ మితవాదులు విశ్వసిస్తున్నారు.

భారత్ - పాకిస్థాన్ సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు అలముకొంటున్నాయి. భారత్-పాక్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తలు కొనసాగుతున్నాయి. సరిహద్దు ఇరువైపులా యుద్ధ ట్యాంకర్లను, సైనిక బలగాలను మోహరించినట్లు, పాఠశాలలు మూసివేసినట్లు వార్తలు వస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాలలోని ప్రజలను ఇరు దేశాలు ఖాళీ చేయించాయి. పదాతి దళాలను మోహరించాయి. ఒకరి కదలికలను ఒకరు గమనించడం కోసం మానవ రహిత (డ్రోన్లు) విమానాలు విరివిగా ఉపయోగిస్తున్నాయి. మరోవైపు శాటిలైట్స్, రాడార్ల ద్వారా సైనిక కదలికలను 24 గంటలపాటు గమనిస్తూ సైనికాధికారులకు సమాచారమందిస్తున్నాయి. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఆర్మీతో పాటు నేవీ, వైమానిక దళాలను కూడ సిద్ధం చేసి ఉంచారు. పాకిస్తాన్‌ను బూచిగా చూపించి కశ్మీర్ ప్రజల్ని అణచివేయడం భారత పాలక వర్గాలకు ఒక అలవాటుగా మారింది. ఇప్పుడు యుద్ధం సాకుతో కశ్మీరీ సమస్యను పక్కదారి పట్టించటం, దేశ ప్రజల దృష్టిని పాకిస్తాన్ మీదకు మరల్చటం కొరకు కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తుంది.

యుద్ధ వ్యూహాత్మక నిర్ణయాల విషయంలో భారత్ రక్షణ మంత్రి మనోహర్ పారికర్‌కు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆర్మీ చీఫ్ దల్బీర్ సింగ్, ఇతర అధికారులు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. మరోవైపు పాక్ సరిహద్దున ఉన్న రాష్ట్రాలను అప్రమత్తంగా ఉండాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. పాకిస్తాన్ సరిహద్దుకు 10 కి.మీ. పరిధిలో ఉన్న గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస శిబిరాలకు తరలించాల్సిందిగా కేంద్రం జమ్మూకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలకు సూచించింది. రాజస్థాన్‌లోని సరిహద్దు ప్రాంతాల్లోనూ హై అలర్ట్ ప్రకటించారు. అరేబియా సముద్రంలో చేపల వేటకు 20 కి.మీ. నాటికల్ మైళ్లు దాటి వెళ్లొదంటూ గుజరాత్‌లోని జాలర్లను ఆ రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ ఆదేశించింది.

యుద్ధం సమస్త జీవనరంగాలను ధ్వంసం చేస్తుంది. సమాజాలు దీర్ఘకాలం శ్రమించి సమకూర్చుకున్న సంపదనంతటిని బూడిద చేస్తుంది. యుద్ధాల వల్ల జరిగే మానవ విధ్వంసానికి, విపరిణామాలకు మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలే సజీవ సాక్ష్యం. 1914 నుండి 1918 వరకు నాలుగేళ్ళపాటు జరిగిన మొదటి ప్రపంచయుద్ధంలో వివిధ దేశాలకు చెందిన 80 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా, 1939 నుండి 1945 వరకు జరిగిన రెండో ప్రపంచ యుద్ధంలో 5 కోట్ల మందికిపైగా మరణించగా, ఒక్క సోవియట్ రష్యాలోనే 2 కోట్ల మందికిపైగా చనిపోయారు. రెండు ప్రపంచ యుద్ధాలోనూ లక్షలాది మంది క్షతగ్రాతులయ్యారు. జపాన్‌లోని హిరోషిమా - నాగసాకిలపై అమెరికా వేసిన అణుబాంబు విస్ఫోటన ఫలితంగా వ్యాపించిన రేడియోధార్మిక శక్తి ప్రభావానికి విగత జీవులైన వారు నేటికీ ఆయా ప్రాంతాల్లో తారసపడతారు.

భారత్ - పాక్ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణంపై విశ్లేషణలు జరుగుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం సంభవిస్తే పరిస్థితి ఏమిటి? చోటు చేసుకోబోయే పరిణామాలు

బిజెపి మద్దతుదారుల సాంస్కృతిక జాతీయవాదం పాకిస్థాన్‌ను శాశ్వత 'శత్రువు'గా పరిగణిస్తోంది. ఈ సాంస్కృతిక జాతీయవాదం ప్రతిపాదిస్తున్న అఖండ్ భారత్ దృక్పథం మేరకు పాకిస్థాన్‌ను సంపూర్ణంగా నిర్మూలించాలని బిజెపి మద్దతుదారులు దృఢంగా విశ్వసిస్తున్నారు. ఇటువంటి అహేతుక ధోరణి ఒకటి భారత్‌కు ఆవలవైపు కూడా ఉన్నది. భారత్‌ను వెయ్యి గాయాలతో రక్తమోడేలా చేయడమే పాకిస్థాన్‌లోని భారత్ వ్యతిరేకుల ధ్యేయంగా ఉన్నది. ఈ వ్యతిరేకతను మొదట బ్రిటన్, ఆ తర్వాత అమెరికా సామ్రాజ్యవాదం పెంచి పోషించింది.

ఎలా ఉండబోతాయన్న దానిపై అనేక అధ్యయనాలు జరిగాయి. రెండు పొరుగు దేశాలవద్ద ఒక్కొక్కటి 15 కిలోల టన్నుల హిరోషిమాపై వేసిన అణు బాంబుతో సమానమైన దాదాపు 100 అణ్వస్త్రాలను ప్రయోగిస్తే ఈ భూగోళాన్ని కాపాడుతున్న ఓజోన్ పొరలో సగం నాశనమైపోతుందని, అదే జరిగితే రేడియో ధార్మిక శక్తి రుతుపవనాల్ని దెబ్బతీస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయం సర్వనాశనమైపోతుందని, అణ్వస్త్రాలను ప్రయోగిస్తే రెండు దేశాల్లో కలిపి మొదటి వారంలోనే రెండు కోట్ల మంది మరణిస్తారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. దీని దృష్ట్యా యుద్ధమే సంభవించినట్లయితే వినాశనం ఎంత విస్తృతంగా ఉంటుందో అర్థమవుతున్నది.

పాకిస్థాన్ వద్ద దాదాపు 130 అణు శీర్షాలు ఉన్నాయని, అణ్వస్త్ర సహిత మధ్యశ్రేణి హతాఫ్ క్షిపణులతో భారత్‌లోని నాలుగు ప్రధాన నగరాలైన న్యూఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నైలను లక్ష్యం చేసుకోగలదని అంచనా. అలాగే జైపూర్, అహ్మదాబాద్, పూణే, నాగపూర్, భోపాల్, లక్నోలు దాని రేంజ్‌లో ఉంటాయి. షహీన్-2 రకం క్షిపణులు 2, 500 కి.మీ లక్ష్యాలను ఛేదించగలవు. భారత్ వద్ద పాక్‌లోని ఏ భాగాన్నైనా ఛేదించగల సామర్థ్యంగల పృథ్వీ, అగ్ని అణుక్షిపణులు ఉన్నాయి. ఐఎన్ఎస్ అరిహంత్ జలాంతర్గామి నుండి కె-15 సాగరిక క్షిపణులు ప్రయోగించగలదు. ఉభయ దేశాల వద్ద ఉన్న అణ్వస్త్రాలను గమనంలోకి తీసుకొని, ప్రపంచ శాంతి పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి పూనుకోవాలి. సరిహద్దుల్లో ఉద్రిక్తతను తగ్గించడానికి దౌత్యపరంగానూ, రాజకీయ పరంగానూ భారత ప్రభుత్వం చర్యలను కొనసాగించాలి. సరిహద్దు ఆవలి ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు చర్చలు ప్రారంభించడానికి అన్ని మార్గాలను భారత్ తెరచి ఉంచాలి.

ఇప్పటి వరకు భారత్, పాక్‌ల నడుమ యుద్ధాలు గానీ, ఘర్షణలు గానీ నాలుగు పర్యాయాలు (1947-48, 1965, 1971, 1999) సంభవించాయి. యుద్ధం వల్ల తీవ్రస్థాయి విధ్వంసకాండ, మారణ హోమం, ప్రజానీకం నిరాశ్రయులు కావడం తప్ప ఎలాంటి ప్రయోజనం చేకూరదని గత యుద్ధాలు తెలియజెప్పాయి. ఇప్పుడు సరిహద్దుల్లో ఒకర్ని ఒకరు చంపుకోవటంతో భావోద్రేకాలు చెలరేగుతున్నాయి. రెచ్చగొట్టే ప్రకటనలతో ప్రతికార చర్యలు, యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. వీటివల్ల ఉభయ దేశాలకు దక్కే ఫలితం ఏమీలేదు. యుద్ధ సమయాన సామ్రాజ్యవాద దేశాలు ఆయుధాలు అమ్ముకుని లాభాలు మూట కట్టుకుంటాయి. ఇరు దేశాల పాలకుల్లో మతతత్వం, విస్తరణ కాంక్ష, ఆధిపత్య ధోరణులు, రాచరికపు పోకడలు ప్రస్ఫుటమవుతున్నాయి. అవి అహానికి ప్రతీకలై ప్రజలను కష్టనష్టాలకు గురి చేస్తాయి. ఆ ధోరణులు కొనసాగుతున్నంత కాలం ప్రజలకు కన్నీళ్లు తప్ప మరేమి మిగలవు. ప్రస్తుతం సరిహద్దు రేఖ వెంట ఉన్న ప్రజలు పడుతున్న బాధలను దృష్టిలో పెట్టుకొని ఉభయ దేశాల పాలకులు గత (1966-తాష్కెంట్, 1972-సిమ్లా) ఒప్పందాలను, కశ్మీర్ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన 370 అధికరణను అక్షరాల అమలు చేయడానికి అహంకారాలకు, అప్రజాస్వామిక ధోరణులకు పోకుండా తక్షణం ఉపక్రమించాలి.

ప్రముఖ చరిత్రకారుడు గోపాలకృష్ణ గాంధీ హిందూ దినపత్రికలో రాసిన వ్యాసంలో "రెండు దేశాల్లోనూ అసహనం అభిషేకించబడుతుంది. యుద్ధం ప్రకటించటమో లేదా ప్రజ్వరిల్లటమో జరుగక మునుపే యుద్ధ మనస్తత్వాన్ని రాజేయటానికి యుద్ధోన్మాదులు ఆ అసహన ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు . పాకిస్తాన్ టెర్రర్‌లో, భారత్ హిందుత్వలో తమ ఉత్తమ మిత్రుడ్ని కనుగొన్నారు. టెర్రర్, హిందుత్వలు ఒకరి పనిని మరొకరు నెరవేర్చుతుంటారు. అవి ఇరు దేశాల్లోని తెలికగా నమ్మే, సందేహ మనస్సు గల ప్రజలకు ప్రత్యామ్నాయ దేశభక్తిని ప్రతిపాదిస్తున్నాయి. అదేమంటే ద్వేషభావం, రెండో దేశాన్ని, దాని మతాన్ని అసహ్యించుకోవటం. ఆ రెండింటికీ ఉమ్మడి శత్రువు - ఉదార లౌకికత, బహుళత్వం, సామరస్యం. టెర్రర్, హిందుత్వలో ఏదో ఒకటి లేకపోతే రెండోది చనిపోతుంది. తప్పుగా అవగాహన చేసుకున్న, తప్పుడు మార్గదర్శకంగల, తప్పుదోవ పడుతున్న జాతీయ వాదాలను ఆధారం చేసుకుని అవి బతుకుతాయి, ఒకదాని గూర్చి ఒకటి అలా నిందించుకుంటాయి. భారత్-పాకిస్తాన్‌లు యుద్ధ మనస్తత్వంలోకి నెట్టబడుతున్నాయి - యుద్ధం సంభవిస్తే దాన్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండటం అనే భావంలో కాదు, యుద్ధాన్ని కోరుకుంటున్న భావంలో ఆ ప్రయత్నం జరుగుతోంది. ఇదీ తేడా" అని పేర్కొన్నారు.

కశ్మీరీల జీవన విధానాన్ని, మనస్తత్వాన్ని, మతపరమైన భావజాలాన్ని అర్థం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కశ్మీర్ లోయలో పరిస్థితి దిగజారడానికి అదీ ఒక కారణమే. కశ్మీరీ ఇస్లామ్ అన్నది సూఫీ తరహాకు చెందినది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కనిపించే ఛాందసవాద ఇస్లామ్‌కు అది భిన్నమైనది. వాస్తవంలో కశ్మీరీ ఇస్లామ్ మీద హిందూ వేదాంత ప్రభావం ఉంది. కశ్మీరీలు శాంతికాముకులు, హిందువులు ముస్లిములు సిక్కులు బౌద్ధులు అక్కడ దశాబ్దాల తరబడి శాంతియుత సహజీవనం సాగించారు. సౌభ్రాతృత్వం కొనసాగించారు. సోపోర్, అనంతనాగ్ వంటి చోట్ల మాత్రమే ఇస్లామిక్ ఛాందసవాద ఛాయలు కనిపించాయి. మిగతా కశ్మీర్ లోయలో చాలావరకు శాంతి సుహృద్భావాలు, ప్రజాస్వామ్య విలువలే ప్రభాసించాయి.

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు కశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అనుసరించిన అప్రజాస్వామిక అణచివేత విధానాల వల్లనే కశ్మీర్‌లో భారత్ వ్యతిరేక ధోరణులు పెరిగాయి. విశేషాధికారాలతో సైన్యం కొనసాగుతున్నంత కాలం కశ్మీర్‌లో శాంతిని సాధించడం అసాధ్యమని పాలకులు గుర్తించి వెంటనే అక్కడి నుంచి సైన్యాన్ని విరమించుకోవాలి. అవమానభారంతో, ఆగ్రహంతో ఉన్న వారి మనస్సులను సైన్యాలు గెలువలేవు. అందువలన కశ్మీర్ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలకులు వ్యవహరించగలిగితే ఈ సమస్యను పరిష్కరించడానికి వీలవుతుంది. స్థానిక ప్రజానీకం క్రియాశీల భాగస్వామ్యంతో తప్ప బయటి శక్తుల ద్వారానో, బలప్రయోగంతోనో దాన్ని పరిష్కరించలేం. కశ్మీర్ చారిత్రక ప్రత్యేకతలను పరిగణలోకి తీసుకోకుండా చేపట్టే ఏకపక్ష చర్యలు కశ్మీరీల్లో పాదుకున్న అసంతృప్తిని తొలగించజాలవు.

మత ఫాసిజాన్ని నిరసించే జీలానీబానూ కథలు

బాసిత్



మనుషుల్లో కొనసాగుతున్న అశాస్త్రీయ భావనల్ని ఎత్తి చూపుతూ మత ఫాసిజాన్ని, నియంతృత్వాన్ని జీలానీబానూ కథలు నిరసిస్తాయి. ఉత్తరప్రదేశ్‌లో పుట్టి హైదరాబాద్‌లో స్థిరపడిన జీలానీబానూ దక్కన్ ముస్లిం నాడిని సమర్థవంతంగా పట్టుకున్నారు. ఆమె ముస్లిం జీవితాలతో పాటు, దళిత, తదితర పీడిత కులాల, వర్గాల జీవితాల్లోకి తొంగి చూసి పీడక వర్గ స్వభావాన్ని వర్గదృష్టితో నిశితంగా ఎండగడుతారు. హైదరాబాద్‌పై భారత సైనిక చర్య మొదలుకొని, ఇరాక్‌పై అమెరికా యుద్ధం దాకా ఆమె ప్రజాస్వామిక, సెక్యులర్, విశ్వమానవ ఆలోచనల ధార కొనసాగుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాల విచ్ఛిన్నం కూడా ఆమె కథాంశాలుగా ఉన్నాయి. ఆశ్చర్యకరంగా వ్యవసాయ సంక్షోభం కూడా ఆమె కథాంశమవ్వడం చూస్తాం. ఉన్నత మధ్య తరగతి, సంపన్న వర్గాల పుచ్చిపోయిన ఆలోచనాసరళిని ఆమె ఒడుపుగా దొరకపుచ్చుకొని మానవ సంస్కారాన్ని అందిస్తారు.

జీలానీబానూ రాసిన 22 పుస్తకాలలో 12 కథా సంపుటాలు, రెండు నవలలు, రెండు నవలికలు, ఇంకా పలు రేడియో నాటికలు ఉన్నాయి.

'ఐవానె గజల్', 'బారిషేసంగ్' అనేవి ఆమె రాసిన రెండు నవలలు. 'జుగ్ను ఔర్ సితారె', 'నగ్మేకా సఫర్' అనేవి నవలికలు.

'రోష్నీ కె మినార్', 'నయీ ఔరత్', 'నిర్వాణ్', 'పరాయఘర్', 'రోజ్ కాకిస్సా', 'ఏ కౌన్ హసా', 'భాత్ పూలోంకీ', 'సూఖీరేత్', 'కున్', 'సబ్ కెసివా', 'రాత్ కె ముసాఫిర్', 'రాస్తా బంద్ హై' అనేవి ఆమె 12 కథా సంపుటాలు. మిగతావి రేడియో నాటికలు.

ఆమె దక్కనీ ఉర్దూలో రాసిన రచనలు పలు భారతీయ భాషల్లోకి మాత్రమే కాక ఇంగ్లీషు, రష్యన్, జర్మన్ భాషల్లోకి కూడా అనువాదమయ్యాయి.

ప్రస్తుతం మెహక్ హైదరాబాదీ అనే పాత్రికేయ సాహిత్యకారుడు తాను ఎంపిక చేసుకున్న 21 జిలానీబానూ కథలను అనువదించి 'గుప్పిట జారే ఇసుక' పేరిట 2016 ఏప్రిల్‌లోనే కథా సంపుటిగా ప్రచురించాడు.

ఈ అనువాద సంపుటిలోని కథలు : 'దర్శనం', 'అబ్బాస్ ఆన', 'గవాక్షన్యాయం', 'స్నేహితుడు కావలెను!', 'ఆమెను చంపిందెవరు?', 'బంతాట', 'ప్రామిస్', 'స్వర్గానికి నిచ్చెన', 'షూటింగ్ స్క్రిప్ట్', 'అనగనగా ఓ మమ్మీ', 'అపరాధి', 'నేను చనిపోయా!', 'మసక చిత్రం', 'నర్సయ్య బావి', 'గుప్పిట జారే ఇసుక', 'ఈ దారి ఎక్కడికి?', 'అంతరిక్షంలో ఆశా దీపం', 'గొంతెండిన కూజా!', 'విషవిత్తులు', 'నిందితుడు', 'పర్దా జారుతోంది!'.

పైన పేర్కొన్న జీలానీబానూ కథల్లోని 'హైదరాబాదీ' పరిమళాన్ని తెలుగులోకి తర్జుమా చేసిన మెహక్ హైదరాబాదీ, అందుకోసం ఆయన పడ్డ తపన అంతా ఇంతా కాదు. హైదరాబాదీ ఉర్దూ సొగసును, తెలంగాణ సొబగులద్దీ అనువదించడానికి ఆయన పడ్డ ప్రయాస ప్రశంసనీయం. భాష, యాస, శైలి, నుడికారం కోసం మెహక్ హైదరాబాదీ తీసుకున్న శ్రద్ధ అనన్య సామాన్యం.

కథల్లోకి వస్తే, మత కల్లోలాల నేపథ్యంలో వచ్చిన కథ "దర్శనం". మత కల్లోలంతో కల్లోలమైన మనసును అదుపులో పెట్టుకొని హసన్‌బానూ - 'దేవుని పేరు చెప్పి మనమంతా ఇపుడు మతాన్ని బద్నాం చేస్తున్నం' అని రాషిద్‌తో అనడంతో కథలోని సమస్యాకారక మూల పదార్థం మనకు అందుతుంది. కానీ, కథలోని మిస్ రాషిద్ పాత్రకు మత కల్లోలం సందర్భంగా విధించే 'కర్ఫ్యూ' మాట వింటే అదో శృంగార పద బంధంలా వినిపిస్తుంది.

అల్లర్లలో, మంటల్లో కాలిపోతున్న శవాల వాసన నలుమూలల నుంచి వ్యాపిస్తుంటే రోస్టు చికెన్ గుర్తుకొస్తుంది. నిజానికి మూడ్ చెడగొట్టడం కోసం పానకంలో పుడకలా హసన్ బానూ అక్కడికొస్తుందని రాషిద్ కుటుంబం అనుకుంటారు. అదలా ఉండగా, బయట నుంచి శవాలు కాలుతున్న భరించలేని దుర్వాసన గుళ్లోకి రాకుండా ఉండేందుకు అగరొత్తులు వెలుగుతుంటాయి. ఏ గుడిలో చూసినా దట్టమైన పొగ కమ్మేసి ఉంటుంది. ఇంకోవైపు గుడి సింహద్వారం దగ్గర వచ్చే భక్తుడు దళితుడా, బ్రాహ్మడా, మినిస్టరా, బిచ్చగాడా అనే శల్య పరీక్ష జరుగుతూ ఉంటుంది. ఇంతటి హింసకు, వివక్షకు కారణమైన మతం మంచిదేనా అనే ప్రశ్న మానవ వివేకానికి తాకకుండా పోదు.

'విషవిత్తులు' కథలో బద్రుద్దీన్, రోషన్‌మియా పాత్రల ద్వారా కథాంశం కళ్లకు కడుతుంది. శాస్త్రవేత్తగా 'ఎదిగిన' రోషన్‌మియా పేరు పేపర్లో ఎపుడైనా వచ్చిందంటే బద్రుద్దీన్ ఎగిరి గంతేసేవాడు. 'ఇదివరకు ఆయనింట్లోనే నేనుండేవాడ్ని' అని ఘనంగా చెప్పుకొనేవాడు బద్రుద్దీన్. రోషన్ లాగే గొప్ప సైంటిస్టు కావాలని కలలు సైతం బద్రుద్దీన్‌కు రానివ్వకుండా సహజంగానే రోషన్ తల్లిదండ్రులు కత్తిరించినా బద్రుద్దీన్‌కు వాళ్లంటే అభిమానం పోదు. బద్రుద్దీన్ ఇంట్లో పెరిగే గడ్డి లాంటివాడు. ఏపుగా పెరిగినప్పుడల్లా గడ్డిని కత్తిరించేయాల్సిందేగా. అతను తలెత్తుకొని తిరగాలనుకుంటున్నప్పుడల్లా అణిచివేసే యంత్రాంగం ఉండనే ఉంది. అయినా సరే బద్రుద్దీన్ అగ్రికల్చర్ కోర్సు చేసి కొత్తరకం పంటలు ఎలా వేయాలో, దిగుబడి ఎలా పెంచుకోవాలో తెలుసుకున్నాడు. కాని ఇసుక మేట వేసిన కొండలన్నీ కరువుకు తలొగ్గాయి. ఈ పరిస్థితుల్లో రోషన్‌మియా పోఖరణ్ ఎడారి భూముల్లో విత్తులు వేసి పచ్చని పంటలు పండించాలని చూస్తున్నాడని బద్రుద్దీన్ విన్నాడు. కానీ, రోషన్‌మియా సైంటిస్ట్‌గా 'పోఖరణ్‌లో ఇసుకతో నిండిపోయిన ఈ ప్రాంతాన్నంటినీ క్షణాల్లో నాశనం చేయగల శక్తి సామర్థ్యాలు నా దగ్గరున్నాయ్. బ్రీఫ్‌కేస్‌లో ఆ డిజైన్లు ఉన్నాయ్..." అనుకొంటూ బ్రీఫ్‌కేస్ కోసం చూస్తాడు... కాని రోషన్‌మియా విధ్వంసక పథకాన్ని పసికట్టిన బద్రుద్దీన్ ఆ బ్రీఫ్‌కేసును నదిలోకి విసిరికొడతాడు. "పచ్చటి పంటల్ని నిలువుగా మాడ్చేసే ఆ చావు విత్తనాల్ని మా ఊరికెందుకు తెచ్చావు?" అనే ప్రశ్నతో రోషన్‌మియా దిమ్మ తిరుగుతుంది. టెన్షన్‌తో, బీపి పెరిగి కళ్లు తిరిగి పడిపోయి లేచాక అణుబాంబు విధ్వంసాన్ని మొదటిసారి కళ్లారా చూశాక ఏడ్చిన రాబర్ట్ ఓపెన్‌హైమర్ గుర్తుకొస్తాడు. శత్రునాశనం పేరిట మానవ విధ్వంసక అణుపరీక్షల ఆంతర్యాన్ని, సగటు మనిషి సంక్షేమంతో సంబంధం లేని భావోద్వేగ జాతీయవాద నిరంకుశత్వాన్ని ఈ కథలో మనసుకు హత్తుకునేలా జీలానీబానో చెప్పారు.

'అనగనగా ఓ మమ్మీ!' కథలో ఆ తల్లి ఓ వంట పాత్ర మాత్రమే. మమ్మీ ఆ ఇంట్లో వాళ్లకు మాత్రమే కాక చుట్టు పక్కల వాళ్లకు కూడా మమ్మీయే. సత్యవతి 'ఇల్లలుకగానే" కథలోని పాత్రలా ఆమె తన పేరు కూడా మర్చిపోతుంది. 'మమ్మీ చేతిలో రేఖలు ఎన్ని ఉన్నాయో, అన్ని గాయాలూ ఉన్నాయి! - చపాతీలు కాల్చేటప్పుడు, కబాబ్ మటన్ కోసేటప్పుడు, పప్పుకూర చేసేటప్పుడు అయిన గాయాలు. 'ఇంకా మంట తగ్గలేదా...? చల్లగా లేదా...?' వంటి మాటల అంతరార్థం పరామర్శ కాదు. అసలు విషయం 'ఆయనకు ఆఫీసుకు టైమవుతోంది... కనుక త్వరగా తెములుకొని, తెములుకోకున్నా, చేతి వేళ్లు మండుతున్నా హడావిడిగా బూర్ల మూకుడూ పెట్టి పూరీలు రెడీ చేయాలి. కథ చివర్లో మమ్మీ దీర్ఘాలోచనలో పడుతుంది. ఇన్నేసి వంటలు, ఇన్నేసి పనులు ఎందుకు చేయాలి? కథ చివర్లో మమ్మీ కిచెన్ నుంచి మాయమవుతుంది. స్త్రీని వంటింటికే పరిమితం చేయాలనే మగబుద్ధికి చెంపఛెళ్లుమనిపించే ముగింపు కథలో మెరుపు.

'స్వర్గానికి నిచ్చెన' కథలో అబద్ధం చెప్తే... చోరి చేస్తే 'అల్లా' మిమ్మల్ని నరకంల పడేస్తడని ప్రతి రోజూ 'దీన్-ఇ-తాలిమ్' చెప్పే మౌల్వీసాబ్, కళ్లెర్రజేసి మరీ పిల్లలకు తీవ్ర స్వరంతో హెచ్చరించేవాడు. కాని కార్మిక బస్తీలో అగ్ని ప్రమాదం సంభవించి, పూరిళ్లన్నీ తగలబడిపోతూ నరకపు అగ్ని కీలలూ పవిత్రమైన మస్జిద్‌లోకి నేరుగా ఎలా చొరబడుతున్నాయి అనే పిల్లల ప్రశ్నతో మౌల్వీ ఇరకాటంలో పడతాడు. ఈ కథలో పిల్లల్లో సహజ సిద్ధంగా ఉండే 'హేతువు' మత విద్య పేరిట ఎలా చంపివేయబడ్తుందో జీలానీ బానూ చిత్రిస్తారు.

'ప్రామిస్' కథలో - రెక్కలొచ్చి ఎగిరిపోయిన కొడుకులు కనీసం తన అంత్యక్రియలైనా దగ్గరుండి జరిపించాలని తల్లి తన నలుగురి కొడుకుల నుండి హామీ పొందుతుంది. తల్లికిచ్చిన మాట కోసం తప్పని సరిగా తమ సుఖ, సౌకర్యాలను వదులుకొని రావాలా అని విదేశాల్లో ఉన్న ముగ్గురు కొడుకులు తర్జన భర్జన పడుతూంటారు. ఎలాంటి తర్జన భర్జనకు తావు లేకుండానే ఈ నేల మీద ఉండి రాజకీయాల్లో తలపండిన ఇంకో కొడుకు 'ప్రైం మినిస్టర్ కూడా పరామర్శించడానికి వస్తాడు కాబట్టి తల్లి చావుని ఎలా సెలబ్రేట్ చేసుకోవాలా?, ఎలా అన్ని ఛానల్లలో వచ్చేలా, ఏర్పాట్లు చేయాలో...' వదినకి సూచనలిస్తాడు. తీరా చూస్తే వాళ్లనుకున్న సమయానికి ఆమె చావదు. ఆమె చచ్చేంత వరకు వీళ్లు తమ పనులు వదులుకొని ఉండలేరు. వాళ్ల, వాళ్ల కారణాలు చెప్పి వాళ్లు వెళ్లిపోతారు. ఆమెకిచ్చిన మాట సంగతి ఎట్లా ఉన్నా కొడుకుల ఆంతర్యం తెలిసి తల్లి కొయ్యబారిపోతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాల తీరుకు ఇంకేం వివరణ కావాలి?

ఇట్లాంటిదే మరో కథ 'నేను చనిపోయా!' పొట్ట కూటి కోసం తల్లిదండ్రుల్ని, కొత్తగా పెళ్లి చేసుకున్న భార్యను వదిలి దుబాయ్ వెళ్లిన సాదిక్ సెలవు మీద ఇండియా రాదల్చుకున్నాడు. తాను ఎక్కదల్చుకున్న విమానం కూలిపోయింది. సాదిక్ అనుకోకుండా ఆ విమానం ఎక్కకపోవడంతో బతికి బయటపడ్డాడు. కాని అదే విమానంలో వస్తున్నట్లు అప్పటికే ఉత్తరం రాసి ఉన్నందున, అందరూ సాదిక్ చనిపోయారని 'కన్‌ఫర్మ్' చేసుకుంటారు. సాదిక్ మారు పేరుతో తన గురించి భార్య, తల్లిదండ్రులు ఏం అనుకుంటున్నారో తెల్సుకోవాలనుకుంటాడు. చచ్చిపోయిన భర్త గురించి భార్య, చచ్చిపోయిన కొడుకు గురించి తండ్రి ఒక్కలాగే ప్రవర్తించడంతో విస్తుపోతాడు. అతడు సంపాదించిన డబ్బు గురించిన యావ తప్ప

మనిషి పోయాడన్న దిగులు వాళ్ల మాటల్లో లేకపోవటంతో సాదిక్ కళ్లు కన్నీటి ధారను కురిపిస్తాయి. మమతలు, అనురాగాలు, మానవ సంబంధాలు ఎంత నిష్ప్రయోజనకరంగా తేలిపోతాయి డబ్బు ముందు! ఈ కరుడుగట్టిన విషాదకర మానవ ప్రవృత్తిని కొంతైనా కరిగించడానికి జీలానీబానూ కథ దోహదం చేయకపోదు.

'నర్సయ్యకీ బౌలీ' అనే టీవీ నాటికను 'నర్సయ్య బావి' అనే కథానికలా మెహక్ హైదరాబాది తెలుగులోకి అనువదించాడు. నర్సయ్య చేను పక్క ఉన్న పొలంలో పారుతున్న నీటిని చూసి 'తన చేనులో కూడా 'బావి' ఉంటే తనకు కూడా పచ్చగా పంట చేతికి వచ్చు గదా' అని బావికి ముగ్గుపోసినట్లు ఊహించుకుంటూ కొడవలితో చెక్కల గీస్తాడు. ఎదిగిన బిడ్డకు పెళ్లి చేయడానికి బ్యాంకుల రుణం తీస్కోవచ్చన్న మస్తాన్ సలహాతో పట్నం వెళ్లి బ్యాంక్ మేనేజర్‌ను కలుస్తాడు. పల్లెటూరి నర్సయ్య వాలకం చూసి మేనేజర్ చీత్కరిస్తాడు. బ్యాంక్‌లో కనబడిన దళారీ నర్సయ్య చేనును కుదువ బెట్టించి మేనేజర్‌ను 'మేనేజ్' చేసి ఏదో మాదిరిగా అప్పు ఇప్పించి అందులోంచి సగం దళారీ తీసుకుంటాడు. మిగిలిన డబ్బుతో ఏదోలా బిడ్డ పెళ్లి జరిపిస్తాడు. కాని ఈ లోగా బావి అప్పు కట్టమని నోటీసులు వస్తాయి. బావి లేకుండా, బావి తవ్వడానికి ఇచ్చిన అప్పు కట్టమంటే ఎలా కట్టేదని నర్సయ్య వాపోతాడు. బావి తవ్వించినట్లు ఆ ఊరి సర్పంచ్ కూడా సాక్షి సంతకం పెడతాడు. అట్లాంటప్పుడు తన బావి ఎక్కడికి పారిపోయింది? తన బావి అవుపడ్తలేదని, దానిని ఎవరో చోరి చేసిన్రని పోలీసులకు నర్సయ్య ఫిర్యాదు చేస్తాడు. రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వ విధానాల డొల్లతనం, ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకొనే దళారుల వంచన, ప్రభుత్వాధికారుల అవినీతి కథలో సాక్షాత్కరిస్తాయి.

'అబ్బాస్ ఆన!' కథలో విధ్వంసక ఆయుధాలు దాచి పెట్టిందని ఇరాక్‌పై ఆరోపణతో అమెరికా, దాని మిత్రదేశాలు అటువంటి విధ్వంసక ఆయుధాలతోనే దేశాన్ని సర్వ నాశనం చేసేందుకు బరితెగించిన నేపథ్యంలో వచ్చిన కథ. 'మేం గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన అమెరికాకు ప్రతినిధులం. ఇరాకీ ప్రజలకు ఎలాంటి కష్టం, నష్టం కలిగించరాదని కోరుకుంటున్నాం. అందుకే ఇరాక్‌లోని స్కూళ్లకూ, చారిత్రక గ్రంథాలయాలకు, మ్యూజియం లకు, పవిత్రమైన సమాధులకు నిప్పు పెట్టాం... ఇమామ్ హుసేన్, అలీ అబ్బాస్ వంటి పిల్లలు పుడతారన్న భయమే ఉండదు' అంటూ టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూ ఇస్తూ యుద్ధ పిపాసులు తమ ఆంతర్యాన్ని వెళ్లగక్కుతారు. అయితే చమురు బావులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులను వాళ్లు మినహాయిస్తారు. ఎందుకో మనకందరికీ తెలుసు. సామ్రాజ్యవాదులు వనరులు కొల్లగొట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకొంటూనే ఇరాకీ విధ్వంసానికి పాల్పడతారు. ఇక్కడ జిలానీబానూ మహమ్మద్ ప్రవక్త మనుమడు హుసేన్, కర్బలా మైదానంలో 'యజీద్' సేనలతో తలపడినపుడు జరిగిన యుద్ధ సన్నివేశాలను పురాస్మృతిగా, కథలో మేళవిస్తారు. హుస్సేన్‌లాగే యుద్ధ రంగంలో గాయపడి ఫరాత్ నది ఒడ్డున కాళ్లు చేతులు విరిగిపడిన ఇరాకీ క్షతగాత్రులకు మంచినీళ్లిచ్చేందుకు అబ్బాస్ ప్రతిన బూని, నెరవేరుస్తుంటాడు. అమెరికా ముష్కర సైనిక దాడిలో అబ్బాస్ తన చేతుల్ని కోల్పోతాడు. 'గాయపడ్డ వాళ్లకి నేనిపుడు మంచినీళ్లెట్లా ఇవ్వగలను?' అమ్మీ నా కోసం కళ్లల్లో వత్తులేసుకొని ఎదురు చూస్తూ ఉంటుంది'. 'నా అబ్బాస్ ఎక్కడ? అబ్బాస్... అబ్బాస్... అబ్బాస్...' అంటూ అరచి అరచి ఆ తల్లిగొంతు బొంగురుపోతుంది. అరబ్బు దేశాల్లోనూ ఇరాన్, కువైట్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దాకా... విస్తరించిన ఎడారి మైదానాలు, చమురు బావులను దాటి ఆమె ఆక్రందనలు మార్మోగుతూనే ఉంటాయి.

జీలానీబానూ 'గుప్పిట జారే ఇసుక' కథలోని దేశ విభజన పురాస్మృతులను ఇప్పటి అమానవీయ యుద్ధోన్మాద సందర్భానికి అనువర్తించుకోకుండా ఉండలేం. పాకిస్థాన్ సందర్శించడానికి వెళ్లిన రచయితల బృందానికి పాకిస్థానీ సంప్రదాయ కుటుంబం తరపున హుమా రఫీక్ ఆతిథ్యం ఇస్తుంది. అక్కడ వారంతా ఇష్టాగోష్ఠిగా చర్చించుకుంటున్న సందర్భంలో ఇంట్లోంచి 'ఖళ్ ఖళ్'మని దగ్గుతూ శాలువా కప్పుకొని ఉన్న టోపితో బక్క పలుచని ముసలాయన ఒకరు వచ్చి "మీరంతా తప్పకుండా క్లిఫ్టన్ బీచ్‌కెళ్లండి..." అంటూ సలహా ఇస్తాడు. ఆయన తన మధురమైన బాల్యానంతా హైదరాబాద్‌ను వదిలేసి... అప్పటి పరిస్థితుల్లో కుటుంబంతో సహా పాకిస్థాన్ వచ్చారు. కొడుకు ఆర్మీలో ఉన్నాడు కాబట్టి హైదరాబాద్‌లో శాశ్వతంగా మర్చిపొమ్మని 'అబ్బాకు' చెపుతుంటారు. 'మా పిల్లలు, పిచ్చోళ్లు, సన్యాసులు' అంటూ అబ్బా చేతి కర్రను నేలకేసి కొడతాడు. పెద్దాయనకు హైదరాబాద్ మీది ప్రేమ... కోడలు, కొడుకుల మీద కోపంగా తర్జుమా అవుతుంది. హైదరాబాదు నుంచి ఓ రైటరు వచ్చారని వినగానే చేతకాకపోయినా మంచం మీంచి లేచి నేరుగా రచయితల బృందం దగ్గరికి వచ్చి వారితో మాట కలుపుతాడు. హైదరాబాద్ రైటర్‌తో గతంలో తాము హైదరాబాద్‌లో నాంపల్లి స్టేషన్‌కు ముందు, పబ్లిక్‌గార్డెన్‌కు కుడివైపు నిహారీ కుల్చా షాప్ దగ్గర డాక్టర్ చంద్రభాన్ క్లినిక్ సమీపంలో నివసించేవారమని చెప్తాడు. డాక్టర్ చంద్రభాన్ కలిస్తే తన సంగతి చెప్పి, ఆయన తనకు ఎప్పుడూ ఇచ్చే 'ఖమీరహ్ గావ్ జబాన్ జవాహర్ వాలా' అనే యునానీ మందు పంపమని చెప్పమని హైదరాబాద్ రైటర్‌తో అంటాడు. రాత్రి బాగా పొద్దుపోవడంతో వాళ్ల సంభాషణ ముగించకుండానే పెద్దాయనను లోపలికి పంపే ప్రయత్నం చేస్తారు. ఇష్టంలేకపోయినా లేస్తూ, 'బీబీ' మళ్లెపుడొస్తారు?' అంటూ ఆశగా హైదరాబాద్ రైటర్ వైపు తిరిగి అడుగుతాడు. 'ఇంకా కొన్ని రోజులు ఇక్కడే ఉండాల్సిందే కనుక తప్పక మళ్లీ వస్తానని సెలవు తీసుకొంటుంది. పెద్దాయన పదే పదే అడుగుతున్నారని హుమా రఫీక్ నుంచి ఫోన్ రావడంతో హైదరాబాద్ రైటర్ మళ్లీ పెద్దాయనను కలవడానికి వెళ్తుంది. 'ఇంతకీ క్లిఫ్టన్ బీచికెళ్లారా మీరు?' పెద్దాయన మాట్లాడే క్రమంలో అడుగుతాడు. 'ఆ! వెళ్లానని చెపుతుంది'. బీచ్‌లో ఎగిసిపడే కెరటాలలో మళ్లీ పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకోవడానికి పెద్దాయన కూడా బీచ్‌కు వెళ్తుంటాడు. కాని ఎండకు ఎండి మలమల మాడుతున్న ఇసుక తిన్నెలపై అట్లాగే నిలబడి వెనక్కు వస్తుంటాడు.

నేనెందుకు రాస్తున్నాను?

పి.వరలక్ష్మి

(సెప్టెంబర్ 10, 11 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నిర్వహించిన మహిళా రచయితల సమ్మేళనంలో నలుగురు విరసం సభ్యుల ప్రసంగ పాఠాలు వరుసగా ...)

సాహిత్యకారులుగా అంతకన్నా, సాహిత్య ప్రేమికులుగా ఇక్కడ మనమంతా కలిశాం. రాయడానికన్నా ముందు మనమంతా సాహిత్యాన్ని ఇష్టపడిన వాళ్ళం. జీవితంలో భాగం చేసుకున్న వాళ్ళం. అక్షరాలు సృష్టించిన జగత్తులో ఏవేవో అనుభూతులు పొందుతాం. అలా సాహిత్యం చదువుతున్నప్పుడు నేనూ ఇలా రాయగలనా అనుకున్నాను. ప్రయత్నిస్తూ పదాలు పేర్చుకుంటూ ఒక రూపాన్నిచ్చి చూసుకోవడం గమ్మత్తుగా ఉంటుంది. ఎందుకు రాశారు అనంటే బహుశా రచయితలందరూ సాహిత్యాన్ని ఇష్టపడే రాసి ఉంటారు. ఫలానానే ఎందుకు రాశారు అంటే మాత్రం సామాజిక రాజకీయ కారణాలు ఉంటాయి. అటువంటివేమీ లేవు, కళ కోసమే రాశాను అని చెప్పుకునే దశను తెలుగు సాహిత్యం ఎప్పుడో దాటి వచ్చింది.

నాకు సాహిత్యమంటే ఎంత ఇష్టమో సైన్స్ అంటే అంత ఇష్టం. బాల్యదశలో కథలు, ఆ తర్వాత పాపులర్ నవలలు ఏవో చదివాను కానీ నన్ను తీవ్రంగా ప్రభావితం చేసింది శ్రీశ్రీ, మాక్సిమ్ గోర్కి. అవి సాహిత్యం పట్ల ప్రేమనే కాదు, గౌరవాన్ని కలిగేలా చేశాయి. రష్యన్ సాహిత్యానికి, దాన్ని మనకందించిన వారికి సెల్యూట్ చేయాలి. సోవియట్ వాళ్ళు ప్రచురించిన సాహిత్యం

'తీరం దాటి ఇండియా వెళ్లడం' అనే ఊహ సైతం ఇంట్లో రానియ్యరు. ఆయనకు అంతకన్న విషాదం మరోటి ఉండదు. ఊహ సైతం అంతమైన ఆ క్షణంలో ఆయన తల మరో వైపు తిప్పేస్తాడు. ఇక్కడ కథ ముగుస్తుంది. గుండెలు పిండేసే ఈ కథ ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చే పాలకులకు ఎప్పుడర్థమవుతుందో కదా!

ఇవి కేవలం మచ్చుతునకలు మాత్రమే. ఈ సంపుటిలో ఇంకా చాలా కథలు గురించి చెప్పాల్సింది మిగిలే ఉంది.

'గవాక్ష న్యాయం' కథలో పురుషాధిపత్యం, 'స్నేహితుడు కావలెను' కథలో భార్యా పిల్లలు ఎవరి ప్రపంచంలో వాళ్ళు బిజీ అయ్యాక ముదిమి వయస్సులో స్నేహం కోసం పరితపించడం. 'ఆమెను చంపిందెవరు' కథలో - ఎవరికీ పట్టని ఓ బిచ్చగత్తె మరణం, 'బంతాట' కథలో ఆఫీస్‌లో ఒక మహిళపై ఆమె ప్రమేయం లేకుండా జరిగిన అత్యాచారయత్నం ఘటనను ఆమె భర్త, ఆమె చుట్టూ ఉన్న వాళ్ళ అర్థం చేసుకొనే తీరు; 'షూటింగ్ స్క్రిప్టు' కథలో తయారు చేసుకున్న స్క్రిప్టుకంటే రంజుగా ఓ నిజమైన రాజకీయ నాయకుడు సీన్‌ను రక్తి కట్టించడం, 'అపరాధి' కథలో మత ఘర్షణల కారణంగా సన్నిహిత మిత్రుల నడుమ అహేతుక అపనమ్మకం, 'మసక చిత్రం' కథలో జీవితం ఛిద్రమైన ఒక ఒంటరి మహిళ భ్రమాత్మక జీవితాన్ని వెల్లడియడం, 'ఈ దారి ఎక్కడికి?' కథలో సిఎం కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను గంటల తరబడి నిలపడం; 'అంతరిక్షంలో ఆశాదీపం' కథలో బయటి సమాజంలోని మతోన్మాద కోరల కన్న పులి బోను సురక్షితమని నిరూపించడం, 'గొంతెండిన కూజా' కథలో సంపన్నురాలైన అమ్మాయితో, పేద కళాకారుడి ప్రేమ పెళ్లికి దారితీస్తుందా? అనే అంశం, 'నిందితుడు' కథలో చట్టం దృష్టిలో నిందితుడైన వ్యక్తి - చట్టం పేరు చెప్పుకొని జీవించే రకరకాల విభాగాల మనుగడ కోసం 'కొందరు నిందితులుగా జీవించాల్సిన' అవసరాన్ని చెప్పడం, 'పర్దా జారుతోంది' కథలో ఆడదాన్ని రాయిగా మార్చాలంటే ఆమెను ఓ మాతృమూర్తిగా సృష్టిస్తే చాలు!' వంటి ఇతివృత్తాల్ని జీలానీబానూ తనదైన శైలిలో మనసుకు తాకేలా చిత్రించారు.

జీలానీబానూ కథలకు మెహక్ హైదరాబాదీ తెలంగాణ సొబగులద్దినా, అందులోంచి కూడా దక్కనీ ఉర్దూ సొగసులు విరజిమ్ముతాయి. అరెభయ్, కిస్మత్, పర్షాన్ - పర్షాన్, తమాషా, జిందగీ, దేవర్, దఫ్తర్, ఫకర్, సడక్, బేకార్, బక్వాస్, మజా, జల్దీ-జల్దీ, కీమత్, కరాబ్, బేటా, బీబీ, అమ్మీ, అబ్బా, కబాబ్, ఫరక్, జమీన్, జరా, కతం, రాస్తా, గల్లీ, షాయిరీ, మొజ్జిన్, అజాఁ వంటి ఉర్దూ పదాలు ముస్లిం జీవన సంస్కృతులను కథల నిండా పరుచుకునేలా చేస్తాయి.

మొత్తం మీద జీలానీబానూ కథలు ప్రజాస్వామిక సెక్యులర్ భావాలతో పాటు వర్గదృష్టిని కూడా కలిగి, వ్యవస్థ బాగును అడుగడుగునా ప్రతిపాదిస్తూ ముందుకు సాగుతాయి. కథల్లో అసంకల్పితంగానే శాస్త్రీయ భావాలు అల్లుకొని మత ఛాందసాన్ని ఎండగొట్టడం చూస్తాం. ధనిక వర్గాల జీవితాల్లోని డొల్లను పరిచయం చేస్తూ, కుండలో ఉన్నదేదో తిని బతుకు పోరాటం చేసే కూలీ, నాలీ ప్రజల జీవన మాధుర్యాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా ఎత్తిపట్టడాన్ని చూస్తాం. సామ్రాజ్యవాదుల వనరుల దాహానికి కల్లోలమైన పశ్చిమాసియా గుండెలవిసే చిత్రాన్ని రచయిత్రి సాహిత్యీకరించడాన్ని చూస్తాం. పోలీస్ ఆక్షన్ పేరిట జరిగిన మిలిట్రీ చర్యలో హైదరాబాద్ విడిచి వెళ్లిన కల్లోల బతుకు చిత్రాల్ని జీలానీ బానూ ఆవిష్కరించడాన్ని చూస్తాం.

మొత్తం జీలానీబానో కథలన్నీ మన రక్త కణాల్లోకి మానవీయ సంస్కారాన్ని నింపి, గుండెల నిండా పోరాట స్ఫూర్తిని రగిలిస్తాయ నడంలో సందేహం లేదు. ☆

> **ఒక్కోసారి మొరటుగాను, ఒక్కోసారి వ్యంగ్యంగానూ, ఒక్కోసారి వేదనతోనూ రాస్తాను. వాటిలో దినపత్రిక పాఠకులను ఉద్దేశించినవి కొన్ని ఉంటే, రచయితలను ఉద్దేశించినవే కొన్ని ఉంటాయి. అయితే ఏది రాసినా వర్గపోరాట రాజకీయాల కోసమే రాస్తున్నాను. రాయడానికి నేను విశ్వసించే మావోయిస్టు రాజకీయ సైద్ధాంతిక భావజాల విస్తృతి నాకు స్పష్టతనిస్తుంది.**

తెలుగు సమాజంలో కనీసం రెండు మూడు తరాల మానవులను గొప్పగా ప్రభావితం చేసింది. అటువంటి సాహిత్యంతో పాటు పాపులర్ సైన్స్ కూడా చిన్నతనం నుండి ఎంతో కొంత చదివే అవకాశం నాకు కలిగింది. ప్రశ్నలు మొలకెత్తని మెదడు ఉండదు. వాటిని నొక్కిపెట్టకుండా, సమాధానాలు అందించే కొద్దీ మరిన్ని మొలకెత్తుతుంటాయి. అలాంటి దశలో ప్రపంచాన్ని అర్థం చేసుకునే శాస్త్రీయ సిద్ధాంతంగా మార్క్సిజం ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. సామాజిక చలనాలను అర్థం చేసుకోడానికి అవసరమైన చూపునిచ్చింది. దుర్భర పీడనామయమైన ఈ సమాజం మారుతుందని, ఈ జగత్తును నిర్మించిన అద్భుత సృజనకారులైన శ్రమజీవులు, చరిత్ర నిర్మాతలు దీనిని సకల బంధనాల నుండి విముక్తి చేస్తారని విశ్వాసాన్నిచ్చింది. ప్రకృతి శాస్త్రాలను, వాటి నియమాలను అధ్యయనం చేస్తున్న క్రమంలో మానవ సమాజాన్ని, అందులోని వైరుధ్యాలను మార్క్సిజం పట్టుకున్న తీరు ఎంతగానో ఆశ్చర్యపరిచింది. గొప్ప కళాత్మక విలువలున్న సాహిత్యాన్ని చదివినప్పుడు కలిగే అనుభూతి మార్క్సిజం పరిచయమవు తున్నప్పుడు కలిగిందంటే చిత్రంగా అనిపించవచ్చు. ఈ రెండు జమిలిగా నన్ను విరసం వైపు నడిపించాయి. ప్రత్యక్ష ఉద్యమాల ప్రభావం కానీ, పరిచయం కానీ నాకు లేకపోయినా అవి లేకుండా ప్రగతిశీల సాహిత్యం ఉండదు కదా. తెలుగు నేల మీద వర్గపోరాట రాజకీయాల నుండే రచయితల ముందు విశాఖ విద్యార్థుల సవాల్ నిలబడింది. ఆనాడు రచయితలు దానికి సమాధానం చెప్పి తీరాలి. చెప్పారు కూడా. ఆ చరిత్రంతా అందరికీ తెలిసిందే.

ఇక ఇప్పుడు మరింత స్పష్టంగా చెప్పాలంటే విరసంలో భాగమైన నేను వర్గపోరాట రాజకీయాల కోసం రాస్తున్నాను. ఈ అక్షరాలు, ఈ మాటలు, ఈ కథలు, గాథలు ఏవీ మనవి కావు. ఏ ప్రజల నుండి వాటిని తీసుకున్నామో ఆ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజలు పోరాటం చేస్తుంటే దాని గురించి తక్కిన వాళ్ళకు చెప్పడం కోసం రాయాలి. ఆ పోరాటాలకు సైద్ధాంతిక, నైతిక తోడ్పాటునందించడం బుద్ధిజీవుల కర్తవ్యం. మహాశ్వేతాదేవి అన్నట్లు రచయితలందరూ తమ తరానికి జవాబుదారులు. ఈ తరం దండకారణ్యంలో పోరాడుతోంది. కాశ్మీర్‌లో పోరాడుతోంది. వెలివాడల్లో పోరాడుతోంది. వీటిని గురించి చెప్పడం కోసం రాస్తాను. దాదాపు రోజూ రాస్తాను. కథ, కవిత్వం కన్నా నావన్నీ దాదాపుగా వ్యాసాలే. లెక్క పెట్టలేదు కానీ ఇప్పటికి వందకు అటు ఇటుగా వ్యాసాలు రాసి ఉంటాను. వ్యాసానికి సాహిత్యగౌరవం ఎంత ఉందీ, ఎంత లేదూ అన్న ఆలోచన పక్కన పెట్టి అవసరం కోసమే రాస్తున్నాను.

ఒక రచయితకు పాఠకులు కూడా ముందే నిర్ణయమై పోతారనుకుంటా. నేను రాస్తున్నది ఎటువంటి పాఠకులు చదువుతారు, లేదా ఎటువంటి పాఠకుల కోసం నేను రాస్తున్నాను అనే విషయం బహుశా రచయిత దృష్టిలో ఉండి ఉంటుంది. ఏదైనా రాస్తున్నప్పుడు 'ఫలానా వాళ్ళు నా రచన చదివి ఎలా స్పందిస్తారో' అని రచయిత అనుకుంటారని నా ఊహ. ఉద్యమ కార్యకర్తల కోసం, విద్యార్థుల కోసం, అంతగా సాహిత్యం చదవని సాధారణ పాఠకుల కోసం రాయాల్సిన అవసరం నా చేత రాజకీయ వ్యాసాలనే రాయిస్తోంది.

'రోహిత్ ఎందుకు చనిపోయాడు మేడమ్' అని ఒక విద్యార్థి నన్నడిగినప్పుడు ఎలా చెప్తే వీళ్ళకు అర్థమవుతుంది అనుకుని నేను విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కరపత్రం రాశాను. సరే, కరపత్రాలో, పత్రికా ప్రకటనలో, రాజకీయ వ్యాసాలో అది రోజువారీ పని. నాకు తెలిసిన ఒక విద్యార్థి -చాలా సరదాగా, ఈ కాలపు టేకిట్ ఈజీ యూత్ లాగే ఉండే అబ్బాయి ఒక రోజు రైలు పట్టాల మీద శవమయ్యాడు. ఆ కల్లోలాన్ని ఎలా వ్యక్తీకరించాలి? పైకి కనిపించే జీవితాల్లో తెలియని లోతులెన్ని? విద్యార్థుల ఆత్మహత్యలకు మనకు స్పష్టంగా గోచరించే కారణాలు ఒత్తిడి అనండి, ఆత్మ విశ్వాసం ఇవ్వని విజ్ఞానం అనండి, సమాజం అనండి -ఈ సమాధానాలు చచ్చిపోయే ముందు ఆ విద్యార్థి మానసిక స్థితిని ఎంతవరకు వివరించగలవు? అప్పుడు నాకు కథ రాయాలనిపించింది. రాశాను కూడా. దానికి నాకెన్ని మార్కులు పడ్డాయో కానీ రాయకుండా ఉండలేని స్థితి నుండి రాశాను. మనిషి జీవితపు లోతుల్లో నుండి, ఉదాహరణకు ఆ పిల్లవాడి మనసు నుండి లోకాన్ని చూడగలమా? దీనికి కాల్పనిక సాహిత్యమే మార్గం కదా. అట్లా అనుకున్నప్పుడు నేను రాయాల్సి ఉండి రాయలేక పోతున్నవి చాలా ఉన్నాయి. నేనెందుకు రాయలేకపోతున్నాను అని అది మరో టాపిక్ అవుతుంది. రచయితలకు అటువంటి సవాళ్ళు నేడున్నాయి. ఇటువంటి విషయాలు మాట్లాడుకోడానికి సాహిత్య వ్యాసాలు, మేము వర్క్ షాపుల్లో చేసిన చర్చలు, వాటి సారాంశం తోటి రచయితలను ఉద్దేశించి రాస్తాను. అట్లా భాష దగ్గరి నుండి ప్రక్రియ దాకా ఏది రాయాలో, ఎలా రాయాలో, ఏ పాఠకుల కోసం, ఏ అవసరం కోసం రాయాలో అదే నన్ను రాయమని నిర్దేశిస్తుంది.

బూర్జువా పార్టీలు, మీడియా అబద్ధాలు ప్రచారం చేస్తాయి కాబట్టి వాస్తవాలు చెప్పడం కోసం రాస్తాను. ఉదాహరణకు కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం అని దశాబ్దాలుగా ఒక అబద్ధాన్ని నిజం చేయడానికి అవి చరిత్రను, వర్తమానాన్ని, రాజ్య దుర్మార్గాన్ని కప్పిపెడితే, వాస్తవం చెప్పాల్సిన బాధ్యత ఉంది కాబట్టి రాస్తాను. అది తీవ్రవాదం కాదు ఆజాదీ పోరాటం అని చెప్పడం కోసం రాస్తాను. భారత ప్రభుత్వం దండకారణ్యంలో ఆదివాసులపై నిశ్శబ్ద

తప్పని అవసరంగా రచన

పద్మకుమారి

నేను ఇప్పటికీ రచయిత్రిని కాను. రాయాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇలా రచయిత్రుల మధ్యకు రావడం బెరుగ్గా కూడా ఉంది. చిన్నప్పుడు చందమామ, బాలమిత్ర కథలు చాల ఇష్టంగా చదివేదాన్ని. మాది విప్లవోద్యమం బలంగా ఉన్న ప్రాంతం. అప్పట్లో మా ఇంటికి వచ్చే కామ్రేడ్ నల్ల ఆదిరెడ్డి వల్ల నాకు విప్లవ కథలు, నవలలు పరిచయమయ్యాయి. 'రక్తాక్షరాలు', ఆలూరి భుజంగరావుగారు అనువాదం చేసిన 'గంగా నుండి యమునా తీరం వరకు' చదవమని ఆయన ఇచ్చాడు. రష్యా, చైనా అనువాద విప్లవ నవలలు కూడా మా ఇంటికి వచ్చే ఇతర కామ్రేడ్స్ ఇచ్చేవారు. మాగ్జిమ్‌గోర్కి 'అమ్మ', మహాశ్వేతాదేవి రాసిన 'ఒక తల్లి కథ', 'బషాయిటుడు' చాలా కదిలించాయి. అజ్ఞాత ఉద్యమంలోకి వచ్చిన తొలిరోజుల నుంచి విప్లవ కార్యకర్తలు, నాయకులు చదువుతూ ఉంటే నేను కూడా అల్లం రాజయ్య రచనలు చదివాను. ఆయన మా ప్రాంతం అతనే కావడం వల్ల అక్కడ చేస్తున్న పోరాటాలే వాస్తవికంగా ఆయన రచనల్లో కనిపించేవి. వాటిలోని వాతావరణం, భాష, మనుషులు అన్నీ నేను రోజూ చూసేవే. కాబట్టి చాలా ఇష్టంగా వాటిని చదివేదాన్ని. అట్లాగే ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు, ఆదివాసీ, సింగరేణి పోరాటాల గురించి వచ్చిన ఇతర కథలు, నవలలు చదివేదాన్ని. మొదట్లో మామూలు నవలలు చదివినా అవి నా మీద ఏ ప్రభావం వేయలేదు. తెలుగులో వచ్చినవైనా, అనువాదాలైనా ప్రజలు చేసే పోరాటాల మీద వాస్తవిక దృష్టితో రాసిన రచనలేనే ఎక్కువగా ఇష్టపడేదాన్ని.

అప్పటి కంటే ఇప్పుడు తెలుగులో చాలా రకాల రచనలు వస్తున్నాయి. అయితే నాకు వాటితో పెద్దగా పరిచయం లేదు. ఆ రచయితల వివరాలు కూడా నాకు తెలియవు. విప్లవోద్యమ కథలు, నవలలు రాస్తున్న వాళ్లతోనే నాకు పరిచయం. ఇది నా పరిమితి కావచ్చు. ఈ పరిమితులు ఉంటే మంచి పాఠకులు కానట్టే. అయితే నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇవ్వాల్టి దాకా నేనున్న ప్రపంచం అదే. చిన్నప్పుడైనా, ఆ తర్వాత అజ్ఞాత విప్లవోద్యమంలో ఉన్నప్పుడైనా, జైలు జీవితమైనా, బయటికి వచ్చాకైనా నేను ఈ ప్రపంచంలోనే ఉన్నాను.

నేను ఇప్పుడు కథలు రాయడానికి కూడా అదే కారణం. ప్రయాణం, కాంత పున్నం వెన్నెల, పాల్గుణ, ఉండవలసిన తీరు, వారధి... మొదలైనవి ఇలా రాసినవే. నేను నా ఉద్యమ అనుభవాలను ఇతరులతో పంచుకోడానికి రాయాలనిపించింది. ఉద్యమాలతో ప్రత్యక్షంగా సంబంధం లేని పాఠకులకు ఈ విషయాలు తెలియజేయాలని బలంగా కాంక్షించాను. విప్లవం వల్ల మనుషులు ఎంత గొప్పగా మారుతారో నేను దగ్గరిగా చూశాను. నేను, నా అనే పరిమితుల నుంచి బయటపడ్డం వల్లే వాళ్లు విప్లవకారులుగా, మానవీయంగా మారగలిగారు. అలాంటి వాళ్లు చాలా మంది నాకు ఆత్మీయ మిత్రులు. వాళ్లలో కొందరు అమరులయ్యారు. కొందరు ఉద్యమంలో ఏదో ఒక రంగంలో కొనసాగుతున్నారు. విప్లవోద్యమంపట్ల ప్రజలకు ఎంత గౌరవం ఉంటుందో, దాన్ని తమ సొంతమనుకొని అందులో ఎలా పాల్గొంటూ ఉంటారో కూడా దగ్గరిగా చూస్తున్నాను. వందలాది మంది పోలీసులు పట్టపగలే సింగరేణి కాలనీల్లోకి చొరబడి ఇండ్లలో కూంబింగ్ చేస్తున్నా, సైనిక కవాతులతో బీభత్సం చేస్తున్నా.. కార్మికులు తమ ఇండ్లలో విప్లవ కార్యకర్తలను, నాయకులను దాచుకునేవారు. కాపాడేవారు. నా చిన్నప్పుడు మా ఇండ్లలో నేను పదే పదే చూసిన దృశ్యాలివి.

నేను జైల్లో ఉండగా మహిళా ఖైదీల ఛిద్రమైన జీవితాల్లోంచి 'నర్సమ్మ' అనే కథ రాశాను. అత్తా కోడళ్ల మధ్య వైరం కాకుండా ఆత్మీయ బంధం ఉండటం చూసి అబ్బురపడి రాసిన కథ అది. అమరుల బంధు మిత్రుల సంఘంలోకి వచ్చాక విప్లవకారుల శవాల స్వాధీనం కోసం తల్లిదండ్రులతో, రక్త సంబంధీకులతో జిల్లాలు, రాష్ట్రాలు దాటి అడవుల్లోకి వెళ్లాల్సి వస్తున్నది. చత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్లో ఆదిలాబాదుకు చెందిన సాంబిరెడ్డి అనే కామ్రేడ్ అమరుడయ్యాడు. ఆయన శవం తేవడానికి కుటుంబ సభ్యులతో వెళ్లాం. ఒక పక్క పోలీసులు, ఇంకో పక్క సాల్వాజుడుం మూకల దాడులు, బెదిరింపుల మధ్య తిరిగి వచ్చాం. ఆ అనుభవమే 'ప్రయాణం' కథ. మూడు నాలుగు రోజులు కుళ్లిపోయిన శవాలను తీసుకొని వచ్చి అంత్యక్రియలు చేశాక.. కొన్ని రోజులపాటు డికంపోజ్ అయిన శవాల వాసన శ్వాసలో వస్తున్నట్లే ఉంటుంది. నిద్రపోతే అవే కలలు వస్తుంటాయి. తల్లిదండ్రుల దు:ఖం, శవాల

యుద్ధం చేస్తున్నది కాబట్టి, అదక్కడ చేస్తున్న హత్యలు, అత్యాచారాలు, హింసాత్మక దాడులు, గృహదహనాలు మీడియా మూసిపెడుతుంది కాబట్టి నేను రాస్తాను. తలకిందుల న్యాయాన్ని నిరసించడానికి, తలకిందులైన సత్యాన్ని సరిచేయడానికి మనమైనా రాయాలి కదా. అందుకే రాయడం. ఒక్కోసారి మొరటుగాను, ఒక్కోసారి వ్యంగ్యంగానూ, ఒక్కోసారి వేదనతోనూ రాస్తాను. వాటిలో దినపత్రిక పాఠకులను ఉద్దేశించినవి కొన్ని ఉంటే, రచయితలను ఉద్దేశించినవే కొన్ని ఉంటాయి. అయితే ఏది రాసినా వర్గపోరాట రాజకీయాల కోసమే రాస్తున్నాను. రాయడానికి నేను విశ్వసించే మావోయిస్టు రాజకీయ సైద్ధాంతిక భావజాల విస్తృతి నాకు స్పష్టతనిస్తుంది. విప్లవోద్యమం బలాన్నిస్తుంది. విరసం బాధ్యతను గుర్తు చేస్తుంది.

పట్ల రాజ్యం వ్యవహరించే దుర్మార్గమైన పద్ధతులు, శవాలను ఇవ్వకుండా పోలీసులు చేసే దౌర్జన్యాలు, స్థూపాలు కట్టుకున్నందుకు భర్తలను, బిడ్డలను పోగొట్టుకున్న వాళ్ల మీద కేసులు, అరెస్టులు, దాడులు.. ఇలా ఎన్నో. ఈ మారణకాండ వల్ల ఈ విషాదకర, దౌర్జన్యకర వాతావరణంలోనే జీవిస్తున్నట్లు ఉంటుంది. ఆ దు:ఖం, ఆ సన్నివేశాలు వెంటాడుతుంటాయి. అయితే ఈ విషయాలు కొద్ది మందికే తెలుస్తుంటాయి. రాజ్యం మనుషులను చంపేయడం అనేది కేవలం ఒక హత్యతో పూర్తి కాదు. ఆ మనిషి కుటుంబసభ్యులను శారీరకంగా, మానసికంగా అనేక రకాల హింసలకు గురి చేస్తుంది. ఈ దుర్మార్గం చేస్తున్న గాయాల లోతెంతో సభ్యసమాజం తెలుసుకోవల్సిన అవసరం వుంది. వాళ్లకు తెలియజేయాల్సిన బాధ్యత కూడా మనకు ఉందని అనుకునే దాన్ని.

విప్లవం గురించి తెలిసీ తెలియక ఏవోవో మాట్లాడేవాళ్లు మన చుట్టూ చాలా మందే ఉన్నారు. వీళ్లంతా విప్లవాన్ని వాస్తవికంగా అర్థం చేసుకుంటున్నారా? అనే ప్రశ్న ఒక కార్యకర్తగా నాకు ఎప్పుడూ ఉంటుంది. ఇట్లాంటి రచయితలు, మేధావులు ఒకసారి అమరుల వార్షిక సంస్మరణ సభలో పాల్గొని అక్కడికి వచ్చే అమరుల వందలాది మంది తల్లిదండ్రులు, భార్యలు, పిల్లలను చూస్తే విప్లవాన్ని అర్థం చేసుకోవాల్సిన కోణం ఏమిటో కొంచెమైనా తెలుస్తుంది కదా? అనిపిస్తుంటుంది. వాళ్లు అక్కడికి రాకపోయినా వాళ్లకు విప్లవోద్యమం గురించి చెప్పాల్సిన బాధ్యత మనకు ఉంది కదా అనుకున్నా.

ఎందుకంటే విప్లవోద్యమాన్ని ఒక్కొక్కరు ఒక్కోలాగా అర్థం చేసుకుంటారు. కానీ ప్రజలు దాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నారు? అనేది చెప్పడమే నా ఉద్దేశం. నాకు అది మాత్రమే తెలుసు. ఇద్దరు ముగ్గురు బిడ్డల్ని, కుటుంబ సభ్యుల్ని కోల్పోయి, దారుణమైన హింసలు అనుభవిస్తూ, పేదరికంలో, కష్టాల్లో బతుకుతున్న తల్లిదండ్రులు పార్టీ వాళ్లనుకాని, ప్రజాసంఘాల వాళ్లనుకానీ 'మనోల్లు' అని వ్యవహరిస్తారు. మీటింగు కోసం ఎక్కడికైనా వస్తారు. మామూలుగా అయితే మనకు ఎవరి వల్ల అయినా కొంచెం కష్టం కలిగితే ఇంక ఆ వైపు తిరిగి చూడం. వాళ్లు కనిపించినా పలకరించం. కానీ ప్రజలు విప్లవోద్యమాన్ని ఇంతగా అభిమానిస్తారు. పాల్గుణ కథలో మణి, కాంత కథలో కాంత, ఉండవలసిన తీరులో ధనలక్ష్మి మొదలైన వాళ్లంతా ఎంతో కోల్పోయినా విప్లవంపట్ల ప్రేమతో ఉంటారు. దానికి సంబంధించిన విలువలు కాపాడుకోడానికి ప్రయత్నిస్తుంటారు. ఏదో ఒక పద్ధతిలో కాంతలాగా, ధనలక్ష్మిలాగా ప్రజల కోసం పని చేయాలని ఆరాటపడుతుంటారు. విప్లవంలో వీళ్లలాగా అనేక నేపథ్యాలున్న మహిళలు భాగమవుతున్నారు. వీళ్లు చాలా శక్తివంతమైన స్త్రీలు. కొద్ది మంది మధ్య తరగతి వాళ్లు ఉన్నా అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన స్త్రీలే ఎక్కువ. మామూలుగా స్త్రీల గురించి రాస్తున్న రచనల్లో ఇలాంటి మహిళల గురించి ఉండదు. కాంత, ధనలక్ష్మిలాంటి మహిళల ఆచరణ తీవ్రమైన దు:ఖం, ఎడబాటు, నిర్బంధం మధ్యనే కొనసాగుతోంది.

దీనికి భిన్నంగా, నిరాశ నిస్పృహలతో ఉండే వాళ్లూ ఉన్నారు. ఉద్యమంపట్ల విముఖతతో ఉండే వాళ్లూ ఉన్నారు. వాళ్లను రాజ్యం, విప్లవ వ్యతిరేకులు ఎక్కువ ప్రచారంలో పెడుతుంటారు. కానీ విప్లవంతో అనుబంధంలో ఉన్న కుటుంబాల గురించి, మనుషుల గురించి తెలుసుకోవాల్సి ఉంది. వీళ్లంతా సాహసోపేతమైన పోరాటాల్లో ఉండి కూడా తమ గురించి తాము చెప్పుకోలేక పోతున్నారు. దాని వల్ల ఒక గొప్ప త్యాగ సంప్రదాయం అందరికీ తెలియడం లేదు. దీనికి కారణం ఏమంటే ఇప్పటికీ అమరుల కుటుంబాల్లో చాలా మంది నిరక్షరాస్యులే. కొంత చదువు వచ్చిన వాళ్లు ఉన్నా వాళ్లకు తమ అనుభవాలు రాసుకోవడం తెలియదు. అందువల్ల ప్రజలకు సంబంధించిన ఈ చరిత్ర రికార్డు కాకుండా పోతోంది.

ఇవన్నీ మామూలు మాటల్లో చెప్పలేం. కథలు రాయాల్సిందే. నాకు తెలిసిన విషయాన్ని ఎవరైనా అడిగితే ఎలా చెప్తానో అలాగే రాస్తున్నాను. రిపోర్టు రాసినప్పుడు అందులోకి వివరాలు తప్ప మనుషులు, వాళ్ల దు:ఖం, స్పందనలు, ఆరాటాలు, విలువలు, విశ్వాసాలు ఏవీ రావు కదా? కథ రాస్తే ఇవన్నీ వస్తాయని రాయడానికి ప్రయత్నిస్తున్నాను. అందు కోసమే నాకు సంబంధం లేని రచన రంగంలోకి ఏ నైపుణ్యం లేకపోయినా ప్రవేశించాను. రచనల్లో ఉండాల్సిన భాష, శిల్ప నైపుణ్యం మొదలైన వాటి ఛాయల్లోకి కూడా నేను వెళ్లలేకపోయాను. వీటి కోసం విరివిగా చదివే వెసులుబాటు కూడా లేదు. చేతనైన పద్ధతిలో రాయడం మొదలు పెట్టాను.

విరసం ఆన్‌లైన్ మ్యాగజైన్ www. virasam. org 15 మే 2016 నుంచి ప్రారంభమయ్యింది.
ప్రతి 15 రోజులకు ఒకసారి కథ, కవిత్వం, వ్యాసాలు, నివేదికలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, ప్రకటనలు, ఇతర సాహిత్య ప్రక్రియలతో అప్‌డేట్ చేస్తూ అందిస్తున్నాం.
మీ రచనలను యూనికోడ్ ఫాంట్‌తో virasam1970@gmail.com కు మెయిల్ చేయగలరు.

- ఆన్‌లైన్ మ్యాగజైన్ ఎడిటోరియల్ టీం

దక్షిణ కోస్తా రాజకీయ ఆర్థిక పరిణామం - రచయితల బాధ్యత

నల్లూరి రుక్మిణి

ప్రపంచ ప్రజల దృష్టిలో అమెరికా ఎంత అపప్రద పొందివుందో తెలుగు ప్రజలలో దక్షిణ కోస్తా అటువంటి అపప్రదను పొంది వుంది. తెలంగాణా, రాయలసీమ వెనకబాటుతనానికి ఈ కోస్తా జిల్లాలే కారణమని, అందునా దక్షిణ కోస్తానే ముఖ్యమని తిట్లు వినని రోజంటూ వుండదు. తప్పుదుమరి చేసుకున్న వాడికి చేసుకున్నంత. అదలా ఉంచుదాం.

ఇప్పుడు మనం మాట్లాడబోయేది దక్షిణ కోస్తాలో ఏం జరిగిందీ? ఏం జరగ బోతోందన్నది. ఉమ్మడి రాష్ట్రం విడిపోకముందున్న ఇరవై మూడు జిల్లాలది కూడా ఏ జిల్లా ప్రత్యేకత దానిదే. అయినా వీటన్నిటినీ స్థూలంగా ఐదు ప్రాంతాలుగా ప్రజలు నిర్ధారించారు. ఉత్తర తెలంగాణా, దక్షిణ తెలంగాణా, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా రాయలసీమ. అయితే ఉత్తర కోస్తా అనడానికి ఆ ప్రాంతం వాళ్ళు అంగీకరించరు. కోస్తానుండి విడివడి ఉత్తరాంధ్రగా దాన్ని పిలుచుకుంటున్నారు. మా చలసాని మాటల్లో అది 'కళింగాంధ్ర'.

ఇక ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని పదమూడు జిల్లాలల్లోనూ దక్షిణ కోస్తా ఆరు జిల్లాలు ఎప్పుడూ ప్రత్యేకమైనవే. అయితే ఈ జిల్లాలన్నీ ఒకేరకంగా సంపన్నమైన జిల్లాలు కానేకావు. ప్రకాశంజిల్లా దానంతటదే ఏ ప్రమాణాల రీత్యా చూసుకున్నా కళింగాంధ్ర రాయలసీమ జిల్లాలకంటే మెరుగైన స్థితిలోలేదు. గుంటూరు జిల్లాలోని పల్నాటిప్రాంత స్థితికూడా అంతే. ఒకప్పుడు 'ధాత' కరువుపాలై లక్షల సంఖ్యలో జనం శవాల గుట్టలైంది ఇక్కడే. ఆ స్థితిని చూసే ఆనాటి పాలకులు ధవళేశ్వరం, కృష్ణా ఆనకట్టలు కట్టడం, వాటి రాకతోనే ఈ ప్రాంతపు రూపురేఖలు మారిపోయాయి.

నదుల మీద ఆనకట్టలు రావడమేకాక, ఈ ప్రాంతం నల్లరేగడి భూములు కావడం, సాధారణ వర్షపాతం కూడా విస్తారంగా ఉండటంతో ప్రాంతం వ్యవసాయానికి అనుకూలంగా ఉండి, లాభాలు చేకూరాయి, అదీగాక బ్రిటిష్ వాళ్ళు అమలు చేసిన 'రైత్వారీ పద్ధతి' వల్ల కూడా భూమి సొంత ఆస్తిగా మారడంతో - రైతాంగంలో సొంత సేద్యం మీద ఆసక్తి పెరిగింది.

క్రమంగా వాణిజ్య పంటలు మొదలవడంతో వ్యవసాయంలో మిగులు కనబడింది. ఆ 'మిగులు'ను వ్యాపారాల్లోకి మళ్ళించడంతో ఈ ప్రాంతపు అభివృద్ధి ముఖచిత్రం మారిపోయింది. ఈ మిగులు తొలిదశలో రైసుమిల్లులు, చక్కెర మిల్లులు వంటి వ్యవసాయాధారిత పరిశ్రమల వైపు దృష్టి సారించగా, డెబ్భైల తరువాత సినిమా, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు, వడ్డీ వ్యాపారం వంటి అనుత్పాదక రంగాల వైపు, క్రమంగా ఎనభైయవ దశకం నాటికి రియలెస్టేట్ ప్రైవేటు విద్యా సంస్థల వైపు ఈ పెట్టుబడుల దిశమారింది.

ఈ అవకాశాలకు తోడు సంఘ సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం, కమ్యూనిస్టు భావజాలం ఈ ప్రాంతాన్ని ప్రభావితం చేయడంతో ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి విద్య వైపు దృష్టి సారించారు. ఉన్నత విద్యలు అందుకోగలిగారు.

దక్షిణ కోస్తా ప్రాథమికంగా అభివృద్ధి బాటలోకి నడవడానికి ఇవి ఉపకరించాయి..

ఈ దశనుండి భూస్వామ్య కుటుంబాలు చదువులతోపాటు, వ్యాపారాల్లోకి దిగి పట్టణాలకు వచ్చారు. రాజకీయ రంగంలోకి దిగారు.

ఈ పరిణామంలో మొదటి దశలో భూములు కొందరి చేతుల్లో కేంద్రీకరింపబడ్డాయి. దక్షిణ కోస్తాలో 5 శాతంగా ఉన్న భూస్వాముల కింద 51.85 శాతం భూమివుంది. 70.38 శాతం కుటుంబాలకు భూమి అసలు లేదు.

ఈ భూకేంద్రీకరణ కూడా తూర్పుగోదావరిలో అత్యధికంగా 81.99 కాగా, పశ్చిమ గోదావరిలో 77.99%, కృష్ణా 75.91, గుంటూరు 71.10 శాతం, నెల్లూరు 61.49 శాతంగా ఉంది. ఈ లెక్కలు చెప్పున్నదేమిటంటే ఎక్కడైతే దీర్ఘకాలంగా సాగునీటి సౌకర్యం ఉందో, అక్కడ భూకేంద్రీకరణ జరిగింది. అక్కడ పెట్టుబడి ప్రవేశించింది. కనుక ఈ ప్రాంతంలో భూమిలేని పేద కుటుంబాలు ఎక్కువయ్యాయి. తరచుగా ఈ కుటుంబాలు వెనకబడ్డ, దళిత కులాలు కావడం మనకు తెలిసిందే.

అయితే దీనిలోనూ ప్రత్యేకత ఏమంటే కేంద్రీకరింపబడ్డ భూమిలో - సాగునీటి వసతి ఉన్న, సారవంతమైన భూమిలో ఎక్కువ భాగం పై వర్గం, పై కులాలవారి చేతుల్లో ఉండటం ఓ వాస్తవం.

70వ దశకం వచ్చే నాటికి భూమిలేని పేదలు, నిరుద్యోగ యువత అశాంతికి లోనై ఉన్న స్థితిలో - దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలు తిరిగి పెల్లుబికాయి. అన్ని ప్రాంతాలలోనూ ముఖ్యంగా తెలంగాణలో భూస్వాములు ఆయా ప్రాంతాలలోని పోరాటాల వత్తిడివల్ల తమ భూములు చాలా వరకు అమ్ముకుని పట్టణాలకు పోయారు.

ఈ రాజకీయ పరిణామంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూపరిమితి చట్టం తీసుకు వచ్చింది. దీనితో కోస్తా జిల్లాలలో తమ భూములను బినామీ పెట్టుకున్న వాళ్ళు పెట్టుకోగా - అప్పటికే పట్టణాలకు పోయి స్థిరపడిన పారిశ్రామిక వేత్తలు తమ భూములను అమ్మివేశారు. ఇలా అమ్మిన భూములను అటు తెలంగాణాలోనూ, ఇటు దక్షిణ కోస్తాలోనూ మధ్య తరగతి రైతాంగం కొన్నది. ఈ కొన్నవారు చాలాచోట్ల నడిమి కులాల, మధ్యతరగతి, కావడం మూలంగా గ్రామాల వర్గపొందికలో మార్పులొచ్చాయి. వీరిలో కొందరు నూతన, ధనిక భూస్వామ్య వర్గంగా తయారయ్యారు.

"కొన్ని ప్రాంతాలలో కమ్మ, రెడ్డి, వెలమ, రాజు, బ్రాహ్మణ లాంటి కులాల భూస్వామ్య వర్గం ప్రాబల్యం గ్రామాల్లో తగ్గుతూ వెనకబడిన తరగతి నుండి నూతనంగా రంగం మీదికి వచ్చిన భూస్వాముల ఆధిపత్యం స్పష్టంగా చూడవచ్చు" అనే నిర్ధారణను "ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలు - సామాజిక పరిశీలన" కోర్ గ్రూప్ ప్రకటించి ఉంది.

భూస్వామ్య వర్గం వ్యాపార నిమిత్తం పట్టణాలకు పోయాక భూములు స్వయంగా సాగు చేసుకునే అవకాశం లేకపోవడంతో తమ భూములను కౌలుకు ఇవ్వసాగారు. వారేగాక మధ్య తరగతిలోనూ చదువులు, ఉద్యోగాల పేరుతో పట్టణాలకు పోయిన వారి భూములను దిగువ మధ్య తరగతి రైతులు, దళితులు కౌలుకు తీసుకున్నారు.

ఈ "కౌలు" కిచ్చే పద్ధతివల్ల కూడా కౌలు రైతు నష్టపడ్డాడు. స్వయంగా భూస్వామి పెట్టుబడి పెడితే, పంటలో ఎక్కువ భాగం అతనికే చెందేది. అలాకానిచోట కౌలు రైతు ప్రైవేటు వడ్డీకి తెచ్చి మదుపు పెట్టడంతో ఖర్చు పెరిగింది. దీనివల్ల కౌలు రైతు అప్పుల పాలయ్యాడు. పైగా కౌలు రేటు 16 నుండి 25 బస్తాల వరకు ఉండటంతో పండించింది ఖర్చులకే సరిపోయేది.

ఈ కౌలు పద్ధతి రాతపూర్వకంగా లేకపోవడంవల్ల బ్యాంక్‌లోనుగానీ, క్రాప్‌లోనుగానీ, సబ్సిడీలుగానీ కౌలు రైతుకు అందేవికాదు. ఆఖరికి నష్టపరిహారాలు కూడా భూయజమానే తీసుకునేవాడు. అందువల్ల పంటలు నష్టపోయినపుడు, ఖర్చులు, వడ్డీలు పెరిగిపోయి ... కౌలు రైతు ఆకాశం కేసి శూన్యంలోకి చూడటమే మిగిలేది. మిణుగురు చుక్కల్లాగా బలవన్మరణాలతో రాలిపోయారు.

ఈ పరిణామంవల్ల వ్యవసాయం 'దండగ' అనే స్థితి వచ్చింది. దీనికి తోడు పాలకుల అపసవ్య పాలనా విధానాలు రైతులకు గరళం మింగినట్లుగా తయారయ్యాయి. ఇప్పటికీ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయరంగానిదే కీలకమైనదయినప్పటికీ అత్యధిక జనాభాకి ఉపాధి కల్పన వ్యవసాయ రంగమే కల్పిస్తున్నప్పటికీ 90ల నుండి ప్రభుత్వం వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించి వేసింది. విత్తనాలు, పురుగుమందులు, ఎరువులపై సబ్సిడీలు ఎత్తివేశారు. ప్రైవేటు వ్యాపారుల దగ్గరే అన్నీ కొనవలసి రావడంతో విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. అమ్మవలసిన తమ పంటలకు ధరలు లేకుండా పోయాయి. రైతుల బలవంతపు ఆత్మహత్యలకు ఇది కూడా మరొక కారణం.

మరి వ్యవసాయరంగాన్ని ఇంత అధోగతిపాలు చేసిన పాలకులు పారిశ్రామిక రంగానికేమైనా చేశారా? అంటే ! అదీ లేదు. అసలు దేశంలో పారిశ్రామిక రంగం పెరగలేదని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. 1960-85 సంవత్సరాల మధ్య 3754 పరిశ్రమలు, 16, 927 కు పెరిగాయి. అవి 1990 ల నాటికి 19, 881కి పెరిగాయి. కానీ మరో పదేళ్ళు గడిచేటప్పటికి అంటు 2002 నాటికి 14, 683 కు దిగజారాయి. బాబు పాలనలో అప్పటికే ఉన్న చిన్న, సన్న పరిశ్రమలను మూసి వేశారు. ఐ.టి. ముందు ఇవి పనికిరాలేదు.

మరోవైపు 90ల నుండి అభివృద్ధిపేరుతో పెరిగిన విదేశీ పెట్టుబడులవల్ల ఫార్మాస్యూటికల్ కంపెనీలు, డ్యామ్‌లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, సెజ్‌లు, ఓడరేవులు, విమానాశ్రయాలు మొదలుకావడంతో తీరప్రాంత పేద రైతులు, మత్స్యకారులు విపరీతంగా విస్థాపనకు గురయ్యారు. గంగవరం, కృష్ణపట్నం, వాన్‌పిక్, శ్రీసిటి వంటివి గ్రామాలకు గ్రామాలను కబళించాయి, కబళిస్తున్నాయి.

ఈ విస్థాపనవల్ల ఆ జనం జీవనాధారం పోవడమే కాదు, జీవన శైలిలో విపరీతమైన మార్పులు వస్తున్నాయి. ఆ సామూహిక బృందాలు ఒకచోట లేకుండా విసిరివేయబడుతున్నారు. ఇలా తలో ప్రాంతానికి తరలి పోవడంవల్ల బంధువులను, ఆత్మీయులను, ఊరినీ, సంస్కృతులనూ పోగొట్టుకొని, సమూహపు జీవితమూ ధ్వంసమైపోయి ... మూలాలులేని గుంపులుగా మిగిలిపోవడం వారి జీవితానికి పెద్ద శాపం. ఇంకా విషాదమేమిటంటే జీవిక కోసం పునరావాసాలనుండి తిరిగి వలసలు పోవాల్సి రావడంతో స్థిర నివాసాలులేని సంచార జీవులుగా మిగిలిపోతున్నారు.

మరో పక్క ఆదివాసీలు అడవిని వదిలి బతకలేకపోవడంతో వారి పరిస్థితి మరింత సంక్షోభంలో పడిపోతోంది. వీరు తమ సాంప్రదాయక వ్యవస్థ నుండి గెంటివేయబడుతున్నారు. కానీ ఆధునిక వ్యవస్థలో ఇమడలేకపోతున్నారు. దక్షిణ కోస్తా జిల్లాల్లో అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలోను, కొంత మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలోను, ఏజెన్సీప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలోని ఆదివాసీ ఆర్థిక, సామాజిక వ్యవస్థ రాష్ట్రంలోని మిగిలిన ఆదివాసీ ప్రాంతాలకంటే భిన్నంగా ఏమీలేదు. ఇలా చివరికి వారు మిగులు మనుషులుగా క్రమంగా అంతరించిపోయే స్థితి కల్పించారు.

వీటన్నిటితోపాటు దక్షిణకోస్తా జిల్లాలను 90ల ప్రాంతాలనుండి ఊహించని విధంగా ప్రభావితం చేసింది సాఫ్ట్‌వేర్ రంగం. అంతక్రితం నుండే అమెరికా ప్రయాణాలున్నా - ఈ కాలంలో వేగం పుంజుకుంది. ఇక 2000 తరువాత (వై2కె) అది జెట్‌స్పీడునందుకుంది. ఈ రోజు దక్షిణకోస్తా కుటుంబాలలో - ప్రతి కుటుంబంలో ఇద్దరూ, లేక ఒక్కరైనా విదేశాల్లో ఉన్నవాళ్ళే.

దీనివల్ల ఇక్కడ సామాజిక జీవితం విపరీతమైన మార్పులకు లోనైంది. 2004-05ల నుండి రియలెస్టేట్ విపరీతంగా పెరిగిపోయింది. ఎన్నారైలు విదేశీ డాలర్లతో ఇక్కడి భూములపై వాలడంతో భూముల రేట్లకు రెక్కలు వచ్చి, సామాన్యుడికి అందకుండా పోయాయి. కరువులవల్ల, గ్రాసం గడవక వలసలు పోవడం పాతమాటైపోయింది. ఆర్జన కోసం పరుగెత్తసాగారు.

ఈ సంపాదనమీద కృష్ణ కోస్తా జిల్లాల సంస్కృతిని ఎంతగానో

మార్చివేసింది. ఇలా విదేశాలకు పోయిన దిగువ మధ్య తరగతి, సన్నకారు రైతు కుటుంబాల వాళ్ళు ఎగువ మధ్యతరగతిగా మారి, సమాజాన్ని, తమ చుట్టు పక్కల జనాన్ని పట్టించుకోని స్థితికి దిగజారారు. విదేశంలో పౌరసత్వం తీసుకుని, అక్కడి వనరులు పొందుతూ, ఇక్కడి సమాజాన్ని సంక్లిష్టతలోకి నెట్టివేస్తున్నారు. బంధువులు, స్నేహితులు గ్రామాలలోని సమూహాలు - ఈ విదేశీ భారతీయులను చూసి - తామూ అలా ఎదిగిపోవాలని తపన పడుతున్నారు.

ఆ వ్యామోహంలో కొందరు అప్పుల పాలయ్యారు, . పెద్దవాళ్ళకు ఆసరా లేక 'వృద్ధాప్య హోం'లు మొదలయ్యాయి.

మరోవైపు సాఫ్ట్‌వేర్ రంగం మనదేశంలోనూ ఉద్యోగాల మీద మోజును పెంచింది. విదేశీ వ్యాపారుల రాకతో ప్రైవేటు బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, వంటి రంగాలలో ఊహించని విధంగా జీతాలు పెరిగిపోయాయి. దానితో మన ప్రభుత్వాలూ పెంచక తప్పలేదు. కనుక పాతికేళ్ళ నవయువకుడి చేతికి 40 నుండి 50 వేలదాకా నెల తిరిగే సరికి చేతిలో పడటంతో ఏం చెయ్యాలో తెలియనట్టుగా, పైగా మరో నెలకల్లా అంత డబ్బూ చేతిలో ఉంటుంది కనుక ... ఈ మొత్తం ఖర్చు పెట్టాలనే ఆలోచనకు నాంది పలికింది. అందుకు వారిముందు రకరకాల దుస్తులు, వస్తువులు, కార్లూ, బార్లూ అన్నీ పరిచినట్టు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అంతే ఇక ఖర్చు పెట్టాలనే దాహం, వస్తువులపై మోజు, ఆడంబరంగా బతకాలనే కాంక్ష పెరిగిపోయింది. డబ్బే ప్రపంచమయింది.

ఎన్నడూ ఎరగని ఓణీల, పంచెల పంక్షన్స్ కోట్లలో పెళ్ళి ఖర్చులు - ఆ పంక్షన్ లన్నీ చీరల, నగల ప్రదర్శనలుగా మారిపోయాయి. అవి తమ స్టేటస్‌కి సింబల్‌గా భావిస్తున్నారు. అన్ని తరాలవారూ - తరాల తారతమ్యం లేని అలంకరణలను చూస్తుంటే మనమో ఫ్యాషన్ పెరేడ్ కొచ్చినట్టుగా ఉంటుంది. ఈ ధోరణి కోస్తా జిల్లాలలో ముఖ్యంగా దక్షిణ కోస్తాలో అదీ ఎగువ మధ్యతరగతికి పాకిన కొత్త సంపన్న వర్గం వారి చలవే.

ఈ ప్రభావానికి భౌతిక పునాది ఆదినుండీ దక్షిణకోస్తా జిల్లాలకు ఉంది. తొలిగా తెలుగు సినిమాల్లోకి వచ్చింది ఈ ప్రాంతం వారే. తొలిదశలో వీరు సాంఘిక సమస్యలమీద దృష్టిపెట్టినా తరువాత కాలంలో వ్యాపారపు ధోరణి పుంజుకుంది. ఈ ధోరణివల్ల స్త్రీలను, అపభ్రంశ భావజాలంలో పలు ధోరణుల్లో చూపడంతో, ఆడవారు ఆకర్షణీయ వస్తువులుగా సినిమా సంస్కృతి మిగిల్చింది. అందుకు వ్యవస్థ తోడ్పడింది.

ఈ రోజు ఈ సినిమాల ప్రభావం యువతమీద ఎట్లాంటి చెడు ప్రభావాన్ని కలిగిస్తుందో చెప్పలేకుండా ఉన్నాం, తెలుగు సినిమా అంటే 'ప్రేమ' అదీ టీనేజ్ ప్రేమ. మిగిలిన సకల సంబంధాలు వట్టి మాయగా మిగిలిపోయాయి. ఆత్మహత్యలు, యాసిడ్ దాడులు, మైనర్ పిల్లలపై రేప్‌లు - చివరికి కోస్తా ప్రాంతంలో ఎయిడ్స్ రోగంలో కూడా ముందు పీఠిన ఉండటం దురదృష్టం.

రెండు దశాబ్దాలుగా స్త్రీవాదం తెచ్చిన ప్రతిష్టను ఈ రోజు 'శరీరం అనుభవానికి గురిచెయ్యడం' తప్పులేదన్నస్థాయికి దిగజారి ... పబ్బులు, క్లబ్బులు, టూరిస్టు ప్లేసులకు చదువుకున్న పిల్లలే వెళ్ళటం, ఈ సమాజంలో లగ్జరీలపట్ల, వస్తు వ్యామోహంపట్ల పెరిగిన వైఖరిని, దిగజారుతున్న విలువలను సూచిస్తోంది.

రెండు దశాబ్దాలుగా స్త్రీవాదం తెచ్చిన ప్రతిష్టను ఈ రోజు 'శరీరం అనుభవానికి గురిచెయ్యడం' తప్పులేదన్నస్థాయికి దిగజారి ... పబ్బులు, క్లబ్బులు, టూరిస్టు ప్లేసులకు చదువుకున్న పిల్లలే వెళ్ళటం, ఈ సమాజంలో లగ్జరీలపట్ల, వస్తు వ్యామోహంపట్ల పెరిగిన వైఖరిని, దిగజారుతున్న విలువలను చూచిస్తోంది.

పైన చెప్పినవన్నీ అందరికీ తెలిసినవే, ఎప్పుడూ చెప్పుకునేవే! ఇప్పుడు కోస్తా జిల్లాలకు వచ్చిన కొత్త తక్షణ సమస్య మాత్రం రాష్ట్రం విడిపోవడం. ఒకటి కొత్త రాజధాని కోసం భూములు సేకరణతో భూములు రేట్లు పెరగడం అలా ఉంచి పదిగ్రామాలలోని మూడు పంటలు పండే జరీబు భూములు కూడా ఈ సేకరణలో పోయాయి. ఈ ప్రాంతాలలో ఉన్న చిన్న సన్నకారు రైతులేకాదు. ముఖ్యంగా రైతు కూలీలు జీవనం కోల్పోతున్నారు. వీరు జీవనం కోల్పోవడమేకాదు, అంతకంటే ముఖ్యంగా వాళ్ళు ఉత్పత్తి క్రమానికి దూరం చేయబడుతున్నారు. ఆ ప్రాంతంలో ఉండే రైతు కూలీలు, సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయపు పనులే తప్ప మరొకటి రాదు, చేయలేరు. అలా వారిని ఆ భూముల నుండి దూరం చేయడమూ అంటే ఉత్పత్తికి దూరం చెయ్యడమే. ఒక్క ఈ రాజధాని ప్రాంతమనేకాదు విస్థాపనకు గురైన ప్రతిచోటా ఇదే స్థితి. ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకారులయితే మరో పనిఏదీ రాక విలవిల్లాడిపోతున్నారు. వారు నీటినుండి బయట పడ్డ చేపల్లాగా చచ్చిపోవడమే. ఇలా ప్రతిచోట పని నుండి, ఉత్పత్తినుండి, ప్రాంతంనుండి పరాయి వాళ్ళైపోయి సమాజంలో అంచులకు నెట్టివేయబడుతున్నారు.

భూముల ధరలు పెరిగాయని రైతులు కొందరు హర్షించ వచ్చునేమో గానీ. రేపటి రోజు ఆ ప్రాంతమంతా కాలుష్యంతో నిండిపోయి కృష్ణానది - మూసీనదిలాగా తయారు కాదని ఎలాచెప్పగలం? రకరకాల ప్రాజెక్టులు, జనం పెరిగాక ఈ వ్యర్థం ఎక్కడికి పోతుంది. బహుశ కొత్త రాజధాని ఈ బెడదను ఎదుర్కోక తప్పదు.

ఇక కొత్త రాజధాని 'అమరావతి'ని 'మయసభ'ను తలదన్నేటట్టు, ఎనిమిదో వింతగా నిలపాలని పాలకులు పగటి కలలు కంటున్నారు. దీని కోసం విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించాలని దేశ దేశాలూ తిరిగి వస్తున్నారు. వారు కోరకుండానే వరాల వర్షం కురిపిస్తున్నారు.

రాష్ట్ర పారిశ్రామిక విధానం పేరుతో 2015లో చంద్రబాబు ప్రకటన చూస్తే విదేశీ పెట్టుబడులకోసం ముఖ్యమంత్రి ఆరాటం,

వారికి ఎర్రతివాచీపరచడం కన్పిస్తుంది. ఈ పెట్టుబడిదారులకు నోరూరించేటట్లుగా - పది లక్షల ఎకరాల 'భూ' బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం, ఒకే కార్యాలయంలో పరిశ్రమలకు 21 రోజుల్లో అన్ని అనుమతులు వచ్చేటట్లు ఏర్పాటు చేయడం, పరిశ్రమలు వాడుకునే విద్యుత్తును రాయితీకింద మొదటి ఐదేళ్ళు యూనిట్‌కి 1 రూపాయి చొప్పున ఎదురు ప్రభుత్వమే ఇస్తుందని, భూమి కొనుగోలుగానీ, బదిలీగానీ, తనఖాలకుగానీ మొత్తంగా స్టాంప్‌డ్యూటీ మినహాయింపు ఉంటుందనీ, ఈ భూములన్నీ 99 ఏళ్ళపాటు లీజుకాలంగా ఉంటాయనీ ప్రకటించారు. పైగా ఎలాంటి అలజడులూ, సమ్మెలూ లేకుండా చూస్తానని హామీకూడా ఇచ్చారు.

ఈ ప్రకటన సారాంశమేమంటే, అంతా ఉచితమే... విదేశీ పెట్టుబడిదారులు అక్కడినుండి డబ్బు తెచ్చుకుని, పరిశ్రమలు పెట్టి, లాభాలు వాళ్ళ దేశం తీసుకుపోతారు. ఒకప్పుడు బ్రిటిషువాడు చేసినపని ఇప్పుడు అన్ని దేశాల పెట్టుబడిదారులు చేయబోతున్నారు. అందుకు మనకు కొన్ని వందల ఉద్యోగాలు రావచ్చు. కాని పెట్టుబడి పెడతామంటున్న ప్రతిఒక్కరూ వేలవేల ఎకరాల భూమి నోరుపట్టకుండా డిమాండ్ చేస్తున్నారు. కొత్త రాజధాని నిర్మాణం పేరుతో దక్షిణకోస్తా ముఖ్యంగా గుంటూరు జిల్లా సొంత భూమిని కోల్పోతోంది.

బహుశ భూమిని కోల్పోతున్నామనే ఒక జీవన ఆకాంక్ష గుర్తురాకుండా, మనుషుల అంతరంగాలను స్పర్శించకుండా ఉండేందుకేమో - పుష్కరాల పేరుతో, శంకుస్థాపనలపేరుతో తిరునాళ్ళులాగా, క్రతువులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. దీనిలో తమ రాజకీయ అవసరం ఉండటమలావుంచి ... అంతిమంగా ఇది మత బలోపేతానికి దారితీయడం ప్రమాదకర పరిణామం.

ఈ మత కార్యకలాపాలను పైకెత్తడంవల్ల మిగిలిన మతాలవారి మనోభావాలు దెబ్బతినడం ... 'సెక్యులర్‌స్టేట్' స్ఫూర్తిని కాలరాయడం, రెండోది సాంప్రదాయాలను నిలబెట్టాలనే కోరిక వెనక స్త్రీల అస్తిత్వాలకు చెందిన ప్రశ్నలు మరుగు పర్చే లక్ష్యం దాగివుండటం. ఈ సాంప్రదాయాలు, పూజలు పునస్కారాలు అన్నీ స్త్రీల ప్రమేయంతో జరిగేవి, స్త్రీలు వాటికి కట్టుబడి ఉండాలనే ప్రయత్నంతో జరిగేవి. దీని ప్రభావం స్త్రీలమీద ఎలా ఉండబోతోందో మనం తప్పక ఆలోచించాలి. పట్టించుకోవాలి.

దక్షిణ కోస్తాలోని మరొక ప్రత్యేకత ఏమిటంటే దళిత చైతన్యం. ఈ ప్రాంతం సంపన్న వంతంగా మారటంతో - ఆ సంపద కూలీ రూపంలో కింది దాకా ప్రవహించింది. ఆ వనరులను ఉపయోగించుకుని వారు చదువుల్లోకి, ఉద్యోగాల్లోకి వచ్చారు. దీనితో సాంప్రదాయకంగా గ్రామాల్లో ఉండే 'ఇంటి వతను' వ్యవస్థ ఏనాడో పోయినా - వ్యవసాయపనుల్లోకి మాత్రం పోతూనే ఉన్నారు. అయితే ఇటీవల పెరిగిన రవాణా వ్యవస్థవల్ల ఆటోలు మారుమూల గ్రామాల్లోకి కూడా పోవడంతో దళితులు, పేద బడుగువర్గాలు ఆటోలు తోలడం, దగ్గర సిటీల్లోకి పెయింటింగ్, ప్లంబరింగ్, కరెంటు పనులవంటి వాటికి పోతున్నారు. దీనివలన గ్రామ సంబంధాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అవి దక్షిణ కోస్తాలో దళిత ఆత్మగౌరవ ప్రకటనగా ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో వచ్చిన అపురూపమైన నవల జి. కల్యాణరావు 'అంటరాని వసంతం', ఏడుతరాల జీవితాన్ని అద్భుతంగా మనకళ్ళముందు ఉంచింది. సమాజంలో కుల అణిచివేత మూలాలను విప్పిచెప్పింది.

నిజానికి తెలుగు సాహిత్యంలో సామాజిక పరిణామాలను పట్టుకున్న రచనలు వేళ్ళమీద లెక్కించవచ్చు. జాతీయోద్యమం, కమ్యూనిస్టు భావజాలం సమాజం మీద చూపిన ప్రభావంతో ఉన్నవ 'మాలపల్లి' వంటి గొప్ప నవల వచ్చింది. అది అప్పటి భూస్వామ్యంలోని క్రౌర్యాన్నీ, ఇంగ్లీషువాడి అణిచివేతనూ, చిగురిస్తున్న సోషలిస్టు భావాలనూ చిత్రించింది. కొడవటిగంటి 'చదువు', 'అరుణోదయం' వంటి నవలలు ఆనాటి ప్రపంచ ఆర్థికమాంద్యాన్నీ, అది ఆంధ్రసమాజంమీద నెరపిన ప్రభావాన్నీ పట్టుకున్నాయి.

మా గోఖలే, గోపీచంద్, చలం, బుచ్చిబాబు, శారదవంటి గొప్ప రచయితలు సాహిత్య రంగంమీదికి వచ్చారు.

ఆ తరువాత కాలంలో ఉద్యమం అని చెప్పదగిందేమీ ఈ ప్రాంతంలో రాలేదు. దానితో దక్షిణకోస్తా మధ్యతరగతి జీవులు 'కడుపునిండిన' చందమయ్యారు. జీవితంలో ఘర్షణలేకపోయింది. సాహిత్యం అక్కడితో పలచబారింది. గత స్మరణే మిగిలింది.

అయితే ఉత్తరాంధ్ర, తెలంగాణా, రాయలసీమల్లో 'అభివృద్ధి' అందకపోవడంవల్ల వారింకా సజీవంగా, సృజనాత్మకంగా ఉన్నారు. రావిశాస్త్రి, చా.సో వంటి వారు ఎంతో ప్రభావ శీలమైన రచనలు చేశారు. ఉత్తరాంధ్ర అయినప్పటికీ కా.రా. గారి 'యజ్ఞం' కథ ... ఆంధ్రదేశపు రాజకీయ ఆర్థిక పరిణామాలను పట్టుకున్న అద్భుతమైన కథగా 'మాలపల్లి' తరువాత తెలుగు సాహిత్యంలో నిలిచిపోయింది.

యజ్ఞం తరువాత రుక్మిణి 'ఒండ్రుమట్టి' నవల కోస్తాజిల్లాల సామాజిక రాజకీయ ఆర్థిక పరిణామాలను, ఆ ప్రభావంతో జరిగిన సాంస్కృతిక విధ్వంసాన్ని చిత్రించింది.

ఇలా ఈనాటి రచయితలుకూడా సమాజంలో వస్తున్న అన్ని మార్పులను సాహిత్య సృజనలో పట్టించుకోవాల్సిన బాధ్యత ఉంది. నిజమేగానీ ... అయితే మొత్తంగా సామాజిక సమస్యలను, సంక్షోభాలను, అణిచివేతలను పట్టించుకోకుండా రచయితలు ఉదాసీన వైఖరి అవలంబించడం, తమని కాదన్నట్లుండటం క్షంతవ్యంకాదు. అందుకు ఈ మధ్యకాలంలో వినిపిస్తున్న సాహిత్య వాతావరణమే నిదర్శనం. ఇది అంతిమంగా ప్రగతినిరోధానికే దారితీస్తుంది.

కనుక ప్రజాస్వామిక రచయిత్రులంతా సమాజంలో వస్తున్న ఈ అన్ని మార్పులనూ పట్టించుకుని, గతితార్కిక వైఖరితో సాహిత్య సృజనచేయాలి. అలా ఆలోచిస్తున్నప్పుడు దక్షిణ కోస్తా జిల్లాల్లో మన ముందు కనిపిస్తున్నవి ప్రధానంగా విస్థాపనవల్ల ప్రజలకు కలుగుతున్న నష్టం, కౌలు రైతుల సమస్యలు, రాజధాని నిర్మాణంలో పెట్టుబడిదారుల రాజకీయ నాయకుల "భూ" దందాలు, పెరుగుతున్న వస్తు వినియోగ సంస్కృతి, క్రతువులపేరుతో మతోన్మాదాన్ని పెంచడం, దళితులపై దాడులనూ స్త్రీలు, పిల్లలపై జరుగుతున్న హత్యలను నిరసించడం వంటి సమస్యలపై స్పందించాల్సివుంది.

అదే మన సామాజిక బాధ్యత.

నాకు నచ్చిన నా కథ

తాయమ్మ కరుణ

నేను దాదాపు 32 కథల వరకు రాశాను. ఒకటి రెండు ముద్రణకు పంపలేదు. చాలా మంది చెప్పినట్టు కథ రాయకుండా ఉండలేని తనం వల్ల కథలు రాశాను. కొన్ని పని గట్టుకొని ఈ విషయం మీద కథ రాయాలని రాశాను. కొన్ని కథలు.. కథ రాస్తానని మాట ఇచ్చాను కాబట్టి రాశాను. అలాంటిదే 'తాయమ్మ కథ'. నిజానికి ఇది నా మొట్ట మొదటి కథ. చాలా పెద్ద కథ. నాకు నచ్చిన కథ. నా రచనల్లో ఇదొక్కటే నాకు నచ్చిన కథ కాదు. ఇంకా ఉన్నప్పటికీ...

నా సహచరుడి (మంజీరా)తో జీవనం ప్రారంభించక ముందు నాకు సాహిత్యం గురించి అంతగా పరిచయం లేదు. మా ఇంటి వాతావరణం కూడా అది కాదు. చందమామ కథలు, అప్పుడప్పుడు న్యూస్ పేపర్లో వచ్చే ఒకటి రెండు సీరియల్స్‌కు మించి చదవలేదు నేను. ముఖ్యంగా నాకు రాజకీయాలు ఒంటబడుతున్న కాలంలోనే సాహిత్యంతోనూ అనుబంధం ఏర్పడింది. విప్లవ రాజకీయాలు చదువుకున్న వారికి చేరాలంటే మార్గం సాహిత్యమే. నవలలు, కథల ద్వారా ఆ (విప్లవ విజయవంతమైతే ఉండే) సమాజం ఎట్లా ఉంటుంది? దాని కోసం ఏం చేయాలి? ఈ సమాజం ఎందుకిలా ఉంది? దోపిడీ ఎక్కడ ప్రారంభమైంది? అసలు మంచి బతుకులు రావాలంటే ఏం చేయాలి? ఎట్లా చేయాలి? ఎట్లా చేశారు? చేస్తున్నారు? తదితరాలు సాహిత్యం ద్వారా ప్రాథమికంగా తెలుస్తాయి (సిద్ధాంతం తెలుసుకోవాలంటే గ్రంథాలే చదవాలి). అట్లాగే నాకు రాజకీయాలతో పాటు, సాహిత్యం ఒంటబట్టాయి. ఈ క్రమంలో 'పెళ్లి'. ఆ సందర్భంగా ఏడాదిలోగా కథ రాస్తానని నేను ఇచ్చిన మాట. మాటైతే ఇచ్చాను కానీ అప్పటికి నేను సాహిత్యాన్ని అంతగా చదవలేదు. నా సహచరుడితో ఉంటున్న క్రమంలోనే విస్తృతంగా చదవాను. నాకు అన్ని పుస్తకాలు (తెలుగు సాహిత్యం మొదలు ప్రపంచ సాహిత్యంవరకు సిద్ధాంత గ్రంథాలు) ఆయన రూములో అందుబాటులో ఉన్నాయి. దానికితోడు మా ఇంటికి తరచూ వచ్చే సాంబశివరావు (మాష్టారు)గారు. చదవడమే కాదు, ఆ కథలో మంచి చెడులేవీ? మంచిగా ఉందీ అంటే ఎందుకు మంచిగా ఉంది? బాగా లేకపోతే ఏం బాగాలేదు? ఎందుకు బాగాలేదు? వస్తువు బాగా లేదా, చెప్పే పద్ధతి (శిల్పం) బాగా లేదా?... ఇట్లా చర్చలు సాగుతుండేవి. మాష్టారుకు రావిశాస్త్రి సాహిత్యమంటే వల్లమానిన ఇష్టం. శాస్త్రిగారి కథలు, నవలలు వాటిలోని పాత్రలు, అవి మాట్లాడే మాటలు, శాస్త్రిగారు వాడిన కొన్ని కొత్త పదాలు.. ఇలా ఎన్నో చెప్తుండేవారు. అందుకే నా మీద రావిశాస్త్రిగారి ప్రభావం బాగా ఉంటుంది. 'నాకేమీ తెలియదురా బాబు!' అన్నట్టుగా, అమాయకంగా ఉంటూనే కథలు చాలా అద్భుతంగా సమాజంలోని దోపిడీని, రాజ్యం స్వభావాన్ని ఆవిష్కరిస్తాయి, కళ్లకు కడతాయి. ఆ ప్రభావంతోనే రావిశాస్త్రిగారు చనిపోయినప్పుడు 'ఛాత్రిబాబుకు ముత్యాలమ్మ నివాళి' రాశాను (1994 జనవరి, అరుణతార మాసపత్రికలో బ్యాక్ కవర్ పేజీ మీద అచ్చు వేశారు). నేను పక్కా తెలంగాణ అమ్మాయిని. కానీ శాస్త్రిగారి కథలు చదివి ఉత్తరాంధ్ర యాసలో దానిని రాశాను. నిజానికి ఇది నా మొట్టమొదటి రచన.

అప్పటికి మా పెళ్లి అయ్యి ఏడాది అవుతుంది. ఇచ్చిన మాట ప్రకారం నేను కథ రాసి ఇవ్వాలి. 'కథ మొదలు పెట్టావా?' అని అటు నుంచి ఉత్తరం. అట్లా 1994లో 'తాయమ్మ కథ' రాయడం మొదలు పెట్టిన. నాకు బాగా తెలిసిన వ్యక్తి. ఏ అండా లేని మహిళ కుటుంబాన్ని ఈదడానికి పడ్డ కష్టాలు (ఏ అండా అంటే తల్లిగారి నుంచి అని), ఆత్మగౌరవంతో ఉన్న మహిళ ఎదుర్కొన్న కష్టాలు, ఈ కథలోని కాలాన్ని తీసుకుంటే ఆనాటి అత్తల పెత్తనం, తోటి కోడలితో పోరు, అన్నింటికి మించి భర్తతో తన్నులు.. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న తాయమ్మ అన్నింటినీ ఎదుర్కొంటుంది. జీవితంలో నిలబడుతుంది. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంది. పెరిగిన మగపిల్లలు ఆసరా అవుతారని ఆశపడ్డ తాయమ్మకు నిరాశే ఎదురవుతుంది. తాయమ్మ కాలానికి పిల్లల తరానికి సమాజంలో ఎంతో మార్పు వచ్చింది. చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయి. బాధ్యతల నుంచి తప్పుకునే స్వభావం నెమ్మదిగా సమాజాన్ని ఆవరిస్తున్న కాలం. తాయమ్మ అర్థం చేసుకుంటుంది. కొడుకుల మీద కూడా ఆశను తుడిచేసుకుంటుంది. తన రెక్కలే తనకు ఆధారమనుకుంటుంది. అట్లాగే బతుకుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే ఆడది 'మాట వినదు' (ఆత్మగౌరవంతో ఉంటుంది). పైగా మాటకు మాట ఎదురుచెప్తుంది. తాయమ్మ పొగరు అణచాలని అంతకుముందు మొగుడు ఎన్నోసార్లు అనుకుంటాడు. కానీ ఎట్లా అణచాలో తెలిసేది కాదు.

ఎన్ని చేసినా పొట్ట మీద కొట్టద్దు అనేది సామెత. ఆనాటి జనం దాన్ని నమ్మేవారు. పొట్ట మీద మాత్రం కొట్టేవారు కాదు. సమాజం మారుతుంది కదా, విలువలూ మారాయి. తాయమ్మ 'పొగరు' ఏంటో అల్లుడికి తెలుసు. మామ చేయలేని పనిని... పొట్ట మీద కొట్టే పనిని అల్లుడు చేస్తాడు. తాయమ్మకు తిండి పెడుతున్న వడ్లమిల్లును అమ్ముకొస్తాడు. అప్పుడు తాయమ్మ ఎట్లా రగిలిపోయి ఉండాలి? ఏం చేయాలి? ఒక సాధారణ స్త్రీ తాయమ్మ. కట్టుబాట్లు, పెద్దమనుషుల తీర్పుల మధ్య ఉంటున్న మధ్యతరగతి స్త్రీ తాయమ్మ. ఏం చేయగలదు? అట్లని ఊరుకోనూ లేదు. ఆ స్థితిలో ఉండే స్త్రీలు చేయగలిగిందీ... అల్లుడి మీదా, మొగుడి మీదా

తారకం గారితో ఓ జ్ఞాపకం

నల్లూరి రుక్మిణి

అది 1972 అక్టోబరు. గుంటూరులో విరసం మూడవ మహాసభలు జరుపుతున్నారు.

అప్పటికి మేం అమరావతిలో ఉన్నాం. సభల కోసం గుంటూరు వచ్చాం. నేను పాల్గొన్న మొదటి మహాసభ కూడా అదే.

ఆ సభలో కొకు, శ్రీశ్రీ, మధుసూదనరావు, కారా, ఆర్టిస్ట్ చంద్ర, సి.ఎస్.రావు, రంగనాయకమ్మ వంటి ఎందరో మేధావుల్ని మొదటిసారి చూశానన్న గొప్ప జ్ఞాపకం మిగిలే ఉంది.

అప్పటికి తారకం గారు అసలు తెలియదు. పేరు కూడా వినలేదు. నిజామాబాద్ యూనిట్ నుండి వచ్చారు. ప్రతిరోజూ సభానంతరం సాంస్కృతిక ప్రదర్శనలుండేవి. అయితే ఇప్పట్లాగా సాంస్కృతిక బృందాలు లేవు. ఆయా యూనిట్ల నుండి సభ్యులే ప్రదర్శనలిస్తుండే వాళ్ళు.

మరి తారకంగారు ముందే అనుకుని వచ్చారో, అప్పటికప్పుడు అనుకున్నారో గానీ 'వీర కుంకుమ' నాటకం వేశారు ఆ సభల్లో. నాటకంలో ఓ స్త్రీ పాత్ర ఉంది. ఆ సభకు స్త్రీలు పెద్దగా రాలేదు, వచ్చిన వాళ్ళలో నేను కాస్త పని కొస్తాననుకున్నారేమో! నన్ను ఆ పాత్ర వెయ్యమని అడిగారు.

అప్పటికి ఆ నాటకం నేను చదవనేలేదు. పైగా మరుసటిరోజే. గుర్తు పెట్టుకోవాలి. అయినా నేను కాదనలేదు, వెనకాడలేదు, అయితే లక్కీగా ఆ పాత్రకు పెద్దగా డైలాగులు లేవనుకోండి. అందరం కలిసి ఒక్కసారి మాత్రమే రిహార్సల్స్ చేశాం.

నాటకంలో నేను వేసిన పాత్ర పేదరాలు. నేను అప్పట్లో మరీ భారీగా ఉండేదాన్ని. దానికి తోడు అప్పుడే 'కన్సీవ్' అయి - మార్నింగ్ సిక్‌నెస్‌తో ఉన్నాను. దానిమీద ఎన్ని జోకులు నడిచాయో!

తారాకంగారు డైరెక్టరు, పాత్రధారి కూడా. ఆయన చెప్పే ప్రాంప్టింగ్ కోసం ఎదురుచూస్తూ స్టేజీ మీద యాక్షన్ మర్చిపోయి ఆయన్నే చూడటం అదో గొప్ప హాస్య సన్నివేశంగా మారిపోయింది. అప్పట్లో ప్రేక్షకులు చాలా బుద్ధిమంతులు, పాపం!

ఆ నాటకం వల్ల వనగూడిన ప్రయోజనం ఏమోగానీ, నాకూ, తారకం గారికి మధ్య మాత్రం స్నేహాన్ని నిలిపింది. ఎక్కడ కలిసినా ఆ తరవాత ఆప్యాయంగా పలకరించేవారు.

తరవాత కాలంలో ఆయన విరసం సభలకు రాకపోవడమే కాక, హైకోర్టులో లాయరుగానూ, దళిత ఉద్యమంలోనూ బిజీగా మారడంతో, ఆయన్ను కలిసే సందర్భం రాలేదు.

అయితే చాలా కాలం తరవాత, సమస్యా, సందర్భం గుర్తుకు రావడం లేదు గానీ - ఏదో ప్రదర్శన కోసం గుంటూరు, శంకర్ విలాస్ సెంటర్‌లో అందరం పోగయ్యాం. ఆ ప్రదర్శనకు ఆయన వచ్చారు. ఆ కలిసిన ప్రదేశం కూడా గుర్తుంది. చాలా మంది జనం కూడా వచ్చారు.

నేను దగ్గరకెళ్ళి 'గుర్తున్నానా సార్!' అని పలకరించాను.

"అదేంటమ్మా! నువ్వు గుర్తులేకపోవడం, మనం ఆడిన నాటకం మర్చిపోయేదేనా?" అని నవ్వారు. నాకు ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ మాటలు రాకపోయాయి. ఆ నాటకాన్ని పాతిక ఏళ్ళ తరవాత కూడా ఆయన మర్చిపోనందుకు.

ఆ నాటకం, ఆ రెండు రోజుల్లో పాత్రధారులెవరికీ డైలాగులు సరిగా రాక, కర్టెన్ చాటు నుండి ఆయన పడిన తిప్పలు ఇప్పటికీ జ్ఞాపకానికొస్తున్నాయి.

అప్పటికీ, ఇప్పటికీ ఛామన ఛాయలో, బక్క పలుచని ఆ రూపంలో మార్పేమీలేదు. రూపంలోనే కాదు, సారాన్ని కూడా అలాగే నిలుపుకున్న ఆచరణశీలి.

దుమ్మెత్తి పోస్తుంది. పొగిలి పొగిలి ఏడుస్తుంది. ఈ కథ తాయమ్మ ఏడుపుతో ముగుస్తుంది. తాయమ్మ జీవన సంఘర్షణను చిత్రిస్తున్న క్రమంలో నేను కూడా ఆ యాతనంతా పడ్డాను. అది రాస్తున్నంత సేపూ నేనూ ఏడ్చాను. తాయమ్మ లాంటి స్త్రీల కథలకు అంతం అంటూ ఉంటుందా?

దాదాపు ఇలాంటి సంఘర్షణనే కవులమ్మా పడుతుంది ('కవులమ్మ ఆడదేనా' కథలో). ఈ కథ కూడా ఇష్టమైన కథనే. ఇక.. 'సహచరులు' నాకు చాలా ఇష్టమైన కథ, అలాగే 'నేను గొడ్డును కాను' కథ కూడా.

ఈ సందర్భంగా మరొక్క విషయం.. 'తాయమ్మ కథ' నేను రాసిన తర్వాత దాదాపు నాలుగు సంవత్సరాలకు 'మహిళా మార్గం' పత్రికలో అచ్చు అయింది. అది కూడా అంత 'పేరున్న' మాసపత్రిక కాదు. కానీ ఈ కథ కథాసాహితి వారి 'కథ-96'లో అచ్చుకాకపోయి ఉంటే నలుగురికి తెలిసి ఉండేది కాదు. ఈ 'కథ-96' సంకలనాన్ని ఢిల్లీలో ఆవిష్కరించారట (అట! అని ఎందుకంటున్నానంటే... నేను అప్పటికి పూర్తికాలం విప్లవోద్యమ కార్యకర్తగా వున్నాను కాబట్టి బయట ఏం జరిగిందనేది చాలా కాలానికి కానీ నాకు తెలియలేదు). ఆ ఆవిష్కరణ సభలో తాయమ్మ కథలోని ఏడుపు సీన్‌ను సమీక్షకుడు (పేరు గుర్తు లేదు. క్షమించాలి) చదువుతుండగా సభలో కూర్చున్న కారా మాష్టారు తట్టుకోలేక స్టేజీ ఎక్కి ఆ ఏడుపు సీన్‌ను అంతా చదివి వినిపించారట. అట్లాగే ఆ కథ గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ... కథ (షార్ట్ స్టోరీ) అంటే పరిమిత పేజీలే ఉండాలనే వారు ఈ కథలోని ఏ పదం వృథాగా ఉందో చెప్పగలరా అని (అచ్చు ఈ మాటలే కాకపోయినా ఇదే అర్థాన్నిచ్చే మాటలు - ఈ విషయం వాడ్రేవు వీరలక్ష్మీదేవీగారు చెప్పారు.) అన్నారట. అందుకు ఈ కథ 'వెలుగు'లోకి వచ్చింది. సంకలనంలో పడకపోయి ఉన్నా, విమర్శకుల దృష్టిలో పడకపోయి ఉన్నా... ఈ రెంటిలో ఏది జరగకపోయినా ఈ కథ మరుగున పడిపోయి ఉండేది. వారందరికీ కృతజ్ఞతలు. సరైన విమర్శకులు లేక ఇంకెన్ని కథలు, ఇంకెందరి కథలు మరుగున పడిపోయి ఉన్నాయో

(చైనా శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవానికి 16 మే 2016 నాటికి యాభై ఏళ్లు. అలాగే రాబోయే మూడు నాలుగేళ్లలో బోల్షివిక్ విప్లవం వందేళ్లు, మార్క్స్ 200 జయంతి, చైనా విప్లవానికి 70 ఏళ్లు, నక్సల్బరీ యాభై ఏళ్లు, విరసం యాభై ఏళ్ల వంటి చారిత్రక సందర్భాలు రాబోతున్నాయి. వీటిని పురస్కరించుకొని మార్క్సిస్టు సిద్ధాంత, రాజకీయ అధ్యయనంలో భాగంగా విరసం 'సోషలిజమే ప్రత్యామ్నాయం' అనే నినాదాన్ని ఇచ్చింది. దీని గురించిన విరసం కార్యదర్శి ఓ చిన్న నోట్ అరుణతార ఏప్రిల్ 2016 సంచికలో రాశారు. అప్పటి నుంచి విప్లవ సిద్ధాంత, సృజనాత్మక సాహిత్య పరిచయ వ్యాసాలు అరుణతారలో అచ్చేస్తున్నాం. అలాంటి రచనలు అరుణతారలో ఎప్పుడూ వచ్చేవే అయినా ఈ సందర్భంలో ప్రత్యేకంగా వస్తున్నాయి. గమనించే ఉంటారు. ఈ మూడు నాలుగేళ్లు ఇలాంటి రచనలకు అరుణతారలో మరింత ప్రాధాన్యత ఇద్దామనుకున్నాం. విరసం అంతర్జాల పత్రికలో కూడా ఈ తరహా వ్యాసాలు అచ్చవుతున్నాయి. అక్కడ 'సోషలిజమే ప్రత్యామ్నాయం' అనే శీర్షిక కింద వస్తున్నాయి. కాబట్టి అరుణతారలో కూడా ఇక నుంచి ఇలాంటి వ్యాసాలకు ఇదే శీర్షిక ఇద్దామనుకుంటున్నాం. మార్క్సిస్టు మౌలిక రచనల పరిచయం, అనువాదం, ప్రపంచ విప్లవోద్యమాల విశ్లేషణలు, మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవిత రేఖలు, ఆయా విప్లవాల నేపథ్యంలో వచ్చిన సృజనాత్మక సాహిత్య పరిచయాలు ఈ శీర్షికకు రాసి పంపమని మనవి. - సం.)

శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం:

విజయాలు, వైఫల్యాలు

బి.ఎస్.రాజు

చైనాలో సాంస్కృతిక విప్లవం జరిగి 50 ఏళ్ళు గడిచిన తరువాత ఇప్పుడు దానిని మననం చేసుకుని చర్చించడ మంటే కత్తి అంచుమీద నిలబడి సాముచేయడమే! ఈ విప్లవం వీగిపోయిన తరువాత కూడా దీనిపై ఇంకా నడుస్తున్న అనేకానేక చర్చలు, విస్తృతంగా వస్తున్న పరిశీలనాత్మక రచనలు, ఈ చారిత్రక ఘటనను తాజాగా నిలబెడుతూనే ఉన్నాయి. దీనిపై ఇదివరలో తెరపైకి రాని అనేక కొత్త అంశాలు, కోణాలు, విమర్శలు, వ్యాఖ్యలు ఎన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇటువంటి సమాచారాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా ఇప్పుడు చైనా సాంస్కృతిక విప్లవాన్ని కేవలం 50 ఏళ్ళ పాతబడ్డ చారిత్రక ఘటనగా మననం చేసుకోవడమో, విశ్లేషించుకోవడమో సరికాదు. అలాగే, అప్పటి సాంస్కృతిక విప్లవ ఘటనలను కేవలం సంవత్సరాల, నెలల, తేదీల సమాహారంగా కుదించి, గుదిగుచ్చి వదిలేయడం కూడా సరికాదు.

కమ్యూనిస్ట్ విప్లవాల విజయానికి ముందు, ఆ విప్లవాలకు నాయకత్వం వహించిన ఆ, యా కమ్యూనిస్ట్ పార్టీల ఆలోచన, నడత అవి అధికారంలోనికి రాక మునుపు ప్రవచించిన సిద్ధాంతాలు అధికారంలో కొనసాగే క్రమంలో వాటి సైద్ధాంతిక ఆచరణ, ప్రజా విధానాలు.. ఏ సెంటిమెంట్లకు గురి కాకుండా, తెగడ్తలతోనూ, పొగడ్తలతోనూ నాయకులకు భుజకీర్తులు తగిలించడంతోనూ చరిత్రను వక్రీకరించకుండా ప్రజలకు చెప్పాల్సి ఉంది. కమ్యూనిస్ట్ ఆచరణలో సాంస్కృతిక విప్లవం పాత్ర గురించి విడమర్చి చెప్పాల్సిన అవసరం ఎప్పటి కన్నా ఇప్పుడు పెరిగింది. ఐతే, వచ్చిన చిక్కేమిటంటే చైనా సాంస్కృతిక విప్లవానికి మూలాలు, పునాదులు బోల్షెవిక్ విప్లవోద్యమంలో ఉన్నాయని మర్చిపోవడంలోనూ, అప్పటి నుండి కొనసాగుతూ వచ్చిన సాంస్కృతిక విప్లవోద్యమ క్రమాన్ని తెగ్గొట్టి పారేయడంలోనే ఉంది.

తమ సుదీర్ఘ విప్లవ పోరాటంలో చైనా ప్రజలు చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో, మావో మార్గదర్శ కత్వంలో జపాన్ దురాక్రమణ నుండి, బద్ధ విప్లవ వ్యతిరేకి, సామ్రాజ్యవాద బంటు 'చాంగ్ కై షేక్' ఊచ కోతల నుండి విముక్తి సాధించుకున్నారు. 1949 లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా లేక జనచైనా ఆవిర్భవిం చిన తదనంతరం అది నూతన ప్రజాస్వామిక విప్లవ దశనుండి క్రమేణా సోషలిస్టు నిర్మాణంలోనికి అడుగు పెట్టింది. ఈ క్రమంలో ఎన్నో అద్భుతమైన, ప్రజా పరమైన ప్రయోగాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు చేపట్టింది. ఆ క్రమంలోనే 1966-1976 మధ్య కాలంలో అక్కడ చోటు చేసుకున్న పరిణామమే చైనా సాంస్కృ తిక విప్లవంగా చరిత్ర పుటల కెక్కింది. శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవమంటే చాలామందికి వెంటనే స్ఫురించేది ఇదే .

1965-1976 మధ్య, ఒక దశాబ్ద కాలంపాటు చైనా కమ్యూనిస్టు పార్టీలో, చైనా సామాజిక ఉత్పత్తి, విద్య సాంస్కృతిక రంగాల్లో పేరుకుపోతున్న శ్రామికవర్గ వ్యతిరేక బూర్జువా పోకడలకు, పెట్టుబడిదారీ పెడదారులకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ఈ సాంస్కృతిక విప్లవానికి గల గతితార్కిక, చారిత్రక మూలాలను పరిశీలనలోనికి, పరిగణనలోనికి తీసుకోకుండా, అదేదో కేవలం మావో సృష్టి అనే కురచ ఆలోచనకు కుదించుకుపోవడం కూడా ప్రపంచ మొత్తం మీద ఒక సెక్షన్ కమ్యూనిస్టు శ్రేణుల్లో, అభిమానుల్లో బలంగా పాతుకుపోయి ఉండటం సమ్యక్ కమ్యూనిస్ట్ దృష్టికి, దృక్పథానికి వచ్చిచేరిన ఒక అపకరమని చెప్పాలి.

1871ప్యారిస్ కమ్యూన్ విఫలమైన తరువాత, మొట్టమొదటి సారి బోల్షెవిక్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో, 1917లో విప్లవాన్ని చవిచూసిన రష్యన్ శ్రామిక ప్రజలు ఈ బోల్షెవిక్ విజయంతో ప్రేరణపొంది తమను పట్టిపీడిస్తున్న ఫ్యూడల్, సామ్రాజ్యవాద దోపిడీ శక్తులపై చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో ఓ నూతన మార్గంలో, సుదీర్ఘ విప్లవ పోరాటంలో 1949లో గెలిచిన చైనా శ్రామిక ప్రజలకు, శ్రామిక వర్గ రాజ్యాలను ప్రాథమిక స్థాయిలో స్థాపించుకోవడానికి అవకాశం చిక్కింది. ప్రాథమిక స్థాయిలో ఏర్పడ్డ ఈ నూతన శ్రామిక రాజ్యాలు తొలినాటి నుండే అనివార్యంగా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవభావజాలం గురించి ఆలోచించాల్సిన చారిత్రక అగత్యం వాటిని వెన్నాడుతూ వచ్చింది. రష్యాలో లెనిన్, స్టాలిన్‌లే గాక అనేక కమ్యునిస్ట్, కమ్యూనిస్టేతర ప్రగతిశీల నాయకులు, కార్మిక శ్రేణులు, దిగబడిన పాత సమాజంలోనూ, నూతనంగా మొగ్గతొడుగుతున్న విప్లవసమాజంలోనూ సాంస్కృతిక విప్లవభావజాలం ఎలా వ్యాపింప చేయాలనే ఆలోచనలతో ఆచరణాత్మక ప్రణాళికలు రచించారు. ఇదే అగత్యం చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడైన మావోకు, ఆయన అనుయాయులకు, పార్టీ బయట చైనా సమాజానికి కూడా ఏర్పడింది. 20వ శతాబ్దపు కమ్యూనిస్ట్ విప్లవ విజయాలు, వైఫల్యాలు, పరాజయాలు అర్థం చేసుకుని గుణ పాఠాలు నేర్చుకోవాలంటే ప్రపంచ కమ్యూనిస్టు విప్లవోద్యమ క్రమంనుండి విడదీయరాని అంశంగానే శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ పోరాట ధారను పరిగణించవలసి ఉంటుంది.

మానవ సమాజంలోని వర్గ వ్యత్యాసాలను, ఎగుడు దిగుళ్ళను చదునుచేసే 20 వ శతాబ్దపు కమ్యూనిస్టు ఉద్యమ ప్రయత్నం, మానవ చరిత్రలోనే ఓ మహోన్నతమైన, అద్భుతమైన మరువశక్యంగాని ఆశావహ ప్రయోగం. సామాజిక వ్యత్యాసాలను చదునుచేసే ఉద్యమాలు చరిత్ర పొడవునా అక్కడక్కడా, అప్పుడప్పుడూ పొడసూపినప్పటికీ, మానవాళిపై కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రభావమంతగా.. అంటే భౌగోళిక వైశాల్యంలోగాని, అది ప్రభావితం చేసిన విస్తృత ప్రజారాసిలోగాని, అది కొనసాగిన కాలపు నిడివిలోగాని, సైద్ధాంతిక ఔన్నత్యంలోగాని, ఏ ఇతర ఉద్యమం దీని దరిదాపుల్లోకూడా నిలవలేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ అద్భుత ప్రయోగం, ప్రయత్నం ఇటు సోవియెట్ రష్యాలోనూ, దాని ప్రభావిత దేశాల్లోనూ అటు జన చైనా లోనూ ఎప్పుడు ముగిసిందో తారీకులతో నిర్దుష్టంగా చెప్పడం కష్టమే ఐనప్పటికీ, ఈ సమాజాలు తిరిగి 'వ్యక్తిగత-ఆస్తి' ప్రాభవంలోకి మరలిపోవడం అన్నది 1988-1990 నాటికి పూర్తయ్యిందని మట్టుకు చెప్పవచ్చు. ఈ కమ్యూనిస్ట్ వ్యతిరేక చెడుపరిణామం, మొత్తం కమ్యూనిస్ట్ ప్రాజెక్టునే ప్రశ్నార్థకం చేసేసిందనడంలో అతిశ యోక్తి ఏమీలేదు. నామమాత్రంగా కొన్ని దేశాలు కమ్యూనిస్ట్ పార్టీల ముసుగులో, అధికారంలో అరకొరగా ఉన్నప్పటికీ, అవన్నీ కూడా కమ్యూనిస్ట్ సమాజ నిర్మాణ సూత్రాలను గాలికి వదిలిపెట్టి, సామాజిక సంపదను పాలక ముఠాల ధనార్జన కొరకు మళ్లించి వేసాయి. సమాజాన్ని దుర్భర మైన ఆర్థిక వ్యత్యాసాలోనికి, శ్రామిక ప్రజలను కష్టాల, కడగండ్ల అగాథాల్లోనికి నెట్టివేసాయి. చూడగా 1990 నాటికి 20వ శతాబ్దపు కమ్యూనిస్ట్ సమాజ నిర్మాణ ప్రణాళిక మూతపడి ప్రపంచాన్ని నయా ఉదార వాద వెల్లువ ముంచె త్తిందని చెప్పవచ్చు.

అయితే, నిజానికి సోవియెట్ యూనియన్, చైనా తదితర దేశాల్లోని కమ్యూనిస్ట్ పార్టీలు పైన ఉదహరించిన తిరోగమన దశకు పూర్తిగా చేరుకోక మునుపే సామాజిక వర్గ వ్యత్యాసాలను చదునుచేసే కమ్యూనిస్టు ఆదర్శాలను, కార్యక్రమాలను అంచెలంచెలుగా నరుక్కుంటూ వచ్చారని చెప్పడం పూర్తిగా సబబే! ఇదేదో అదాటున, ఒకే కుదుపుతో జరిగిపోయిన వ్యవహారం కాదు. కమ్యూనిస్ట్ గొడుగు కింద, ఎర్రజండా ఊపుతూ నే, విప్లవకర వాగాడంబరాన్ని ప్రదర్శిస్తూనే ప్రజ ల, ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేస్తూవచ్చారు. దీన్నే రివిజనిజంగా మనం పిలుచు కుంటూన్నాంకానీ, నిజానికి ఇప్పటి వరకు జరిగిన ప్రపంచ కమ్యూ నిస్ట్ ఉద్యమం ఫ్రెంచ్ ఉదారవాద ఊహాజనిత పెటీ-బూర్జువా సోషలిజపు ప్రవచకుడైన 'సెయింట్-సైమన్' సూత్రీకరణల దగ్గర ఆగిపోయిందని చరిత్ర రుజువు చేస్తోంది. సమాజపు మీగడ పొరగా ఉండే శిష్టులూ, ప్రవీణులు, విద్యాధికులు, నేర్పరులు సమాజాన్ని నడపడం ద్వారా వర్గవ్యత్యా సాలను రూపు మాపవచ్చు ని, సమసమాజాన్ని స్థాపించవచ్చని బలప్రయోగంగాని, వర్గ సంఘర్షణ గాని, వర్గ పోరాటాలు గాని అవసరంలేదని, సమాజంలోని ధనవంతులను ఒప్పించి సమసమాజ ఆశయ పథంవైపు వారిని నడిపించ వచ్చని ఆయన ఉపదేశించాడు. సుదీర్ఘ రక్తసిక్త కమ్యూనిస్ట్ చరిత్ర, శ్రామిక వర్గ త్యాగాల చరిత్ర వర్గరహిత సమాజ నిర్మాణంవైపు కొన్ని దశాబ్దాలపాటు పయనించి 'సెయింట్-సైమన్' ఆలోచనల అగాథంలోనికి జారిపోయిందనే వాస్తవం ఇప్పుడు మనకళ్ల ముందు ఉంది. మొత్తానికి కమ్యూనిస్ట్ ప్రయోగాలన్నీ ఉన్నత శిఖారాలకు జేరి కాలుజార్చుకుని కూలి పోయినా, వైఫల్యాల బారిన పడినా, ఆ వైఫల్యాల నుండి సరైన గుణపాఠాలు తీయడం, ఈ గుణపాఠాల నుండి మరింత జ్ఞానవంతమైన నూతన విప్లవోద్యమ మార్గాలను ఎంచుకోవడం ఇప్పుడు మానవాళి ముందున్న కర్తవ్యం. ఎందుకనంటే ముందు ముందు మరిన్ని

'సామాజిక చదును(సోషల్ లెవెలింగ్) ఉద్యమాలు' అనివార్యంగా తోసుకొస్తాయి కాబట్టి.

వ్యక్తిగత సంపద, ఇప్పుడు యావత్ ప్రపంచ సమాజంలో తిరుగులేని దైవంగా చలామణీ ఔతున్నప్పటికీ, ఓ గుప్పెడు మంది సంపదలో మెట్టువాటాను కాజేసి కులకడాన్ని, ఏ ఆస్తిపాస్తులు లేని మెజారిటీ ప్రపంచ జనాభా ఎల్లకాలం సహిస్తుందని అనుకోవడం భ్రమే ఔతుంది. ఈ చారిత్రక అనివార్యతను గుర్తించి ఆలోచిస్తే తిరిగి వ్యక్తిగత ఆస్తి స్థానాన్ని, సామూహిక ప్రజా-ఆస్తి నిర్వహణ అనే అంశం 'కొత్త చదును ఉద్య మాల' ద్వారా మానవాళి ముంగిట కొస్తుంది. అంటే గత కమ్యూనిస్ట్ ప్రయోగాల పాఠశాల మానవాళికి వెలుగు దీపమై నిలుస్తుందనడానికి ఎటువంటి సందేహం ఉండనవసరం లేదు. ఈ నేపథ్యం నుండి శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవపు ఆలోచనలను, ముఖ్యంగా సోవియెట్ యూనియన్, జన చైనాల్లో సమ సమాజ నిర్మాణ క్రమంలో శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవాల పాత్రను, ఆచరణ తీరుతెన్నులను అధ్యయనం చెయ్యడం సమంజసంగా ఉంటుంది.

కమ్యూనిస్ట్ విప్లవోద్యమ విజయాలతో కొత్తగా అధికారంలోనికి వచ్చిన శ్రామిక వర్గానికి రాజకీయ-ఆర్థిక వ్యవస్థను నడిపించడంలో అనుభవం ఉండదు. అధికారం కోల్పోయిన బూర్జువా వ్యవస్థ తాలూకు నిపుణులు, అధికారులు, వారి సహాయక బృందాలపై ఆధారపడటం తప్ప తక్షణ పరిష్కార మార్గాలేమీ శ్రామిక వర్గానికి అందుబాటులో ఉండవు. నూతన సమసమాజ నిర్మాణంలో శ్రామిక వర్గం తర్ఫీదు పొందేవర కు, తామే సమాజానికి నిర్మాతలుగా ఎదిగే వరకు పాత వ్యవస్థ భుజాలపైకెక్కి, మెడలు వంచి, ఒకింత బుజ్జ గించి, ఒకింత భయపెట్టి మనుగడ సాగించవలసి వస్తుంది. అధికారం కోల్పోయిన పాత-బూర్జువా వ్యవస్థ తాలూకు అధికారగణం, ముంచుకొచ్చిన నూతన పరిస్థితిలో, ఇదివరలో తమ చెప్పుచేతల్లో మసులుకున్న కూలినాలి జనానికే సేవచెయ్యాల్సిన స్థితికి నెట్టబడతారు. వారు రాజకీయాధికారాన్ని కోల్పోయినప్పటికీ, విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక రంగాల్లో ఇంకా చక్రం తిప్పే స్థానంలోనే ఉంటారు. ఇటువంటిస్థితిని అధిగ మించాలంటే శ్రామిక వర్గం సాంస్కృతిక రంగాలపై పట్టు సాధించ వలసి ఉంటుంది. అలా పట్టుసాధిం చాలంటే ముందుగ శ్రామిక వర్గం తనని తాను వేగవంతంగా, సాంస్కృతికంగా ఉన్నతీకరించు కోవాల్సి ఉంటుంది. అలా ఉన్నతీకరించుకోవాలంటే సాంస్కృతిక రంగంలో వర్గ పోరాటం, సాంస్కృతిక విప్లవం అనివార్యమౌతాయి. బోల్షెవిక్ విప్లవ శక్తులకు ఈ స్పృహ శ్రామిక ఉద్యమ నిర్మాణ దశనుండే ఉందనే విషయం కమ్యూనిస్ట్ చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తే గాని అవగతం కాదు.

అక్టోబర్ విప్లవంతో శ్రామిక వర్గం రాజకీయాధికారాన్ని చేజిక్కించుకున్నా, సాంస్కృతిక అధికారాన్ని ఎలా చేజిక్కుంచుకోవాలనే విషయంలో లెనిన్ నుండి మావో వరకు ఆయా కమ్యూనిస్టు పార్టీలలోను, బయట ప్రజాసంఘాలలోనూ భిన్న అభిప్రాయాలు, భిన్నధోరణులు, భిన్నమార్గాలు ఉంటూవచ్చాయి. ఈ వ్యత్యా సాలు చివరివరకు, అంటే కమ్యూనిస్ట్ వ్యవస్థలు ఓడిపోయేవరకు కొనసాగుతూనే ఉన్నాయి. స్టాలిన్ మరణానికి ముందు 1953లో జరిగిన సోవియెట్ రష్యా 19వ కాంగ్రెస్‌లో కూడా దీనిపై విస్తృతమైన చర్చ జరిగింది. కమ్యూనిస్ట్ వెన్నుపోటుదార్లు, ద్రోహులుగా మారిన కత్తు-కత్తంతా ఆ 19వ కాంగ్రెస్ లో అందరికన్నా మిన్నగా మిలిటెంట్‌గా అప్పుడు మాట్లాడినవాళ్ళే! ఈ క్రమంలో.. చైనాలో మావో నాయకత్వంలో జరిగిన 'మహత్తర శ్రామిక వర్గ విప్లవం'గా పిలవబడుతున్న సాంస్కృతిక ఉద్యమం ఓ పరాకాష్ట.

1917 నుండే కొనసాగుతూ వచ్చిన సాంస్కృతిక విప్లవ ఆలోచనల, ఆచరణల కొనసాగింపే చైనా సాంస్కృతిక విప్లవ వెల్లువ. స్థల కాలమానాల మార్పు వల్ల, శ్రామిక వర్గ ఉద్యమ అనుభవ సారాల చేర్పువల్ల ఒనకూడిన జ్ఞానం, ప్రపంచ కమ్యూనిస్ట్ ఉద్యమం త్వరితగతిన వెనకపట్టు పడుతున్న సూచనలు, చైనా కమ్యూనిస్ట్ పార్టీలో పేరుకుపోతున్న పెట్టుబడిదారీ పోకడలు, మావో తన జీవిత చరమాంకంలో మరొక తీవ్రమైన సాంస్కృతిక విప్లవోద్యమాన్ని నడిపించ వలసి వచ్చింది. అది ఏమి సాధించింది? ఏమి సాధించలేక పోయింది? ఎందుకు వైఫల్యం చెందింది? ఇవన్నీ జవాబులు కనుక్కోవాల్సిన ప్రశ్నలు. ఆ పని మనం సజావుగా చెయ్యాల్సి ఉంది.

విప్లవకర సోవియెట్ రష్యాలో శ్రామిక వర్గ సంస్కృతిపై చర్చ:

'ప్రోలేటరస్కాయ కల్చురా' అనే రష్యన్ పదానికి సంక్షిప్త నామం 'ప్రోలెట్ కల్ట్' అంటే 'శ్రామిక సంస్కృతి' అని అర్థం. శ్రామిక వర్గ రాజకీయ విప్లవానికి సాంస్కృతిక పరిపుష్టి చేకూర్చే ఉద్దేశంతో, 1917లో బోల్షెవిక్ విప్లవకారులు, వారి సమర్థకులు, ప్రగతిశీలవాదులు, రచయితలూ, కళకారులు ఐక్యమై ఈ సాంస్కృతిక సంస్థను స్థాపించారు. లెనిన్, బొగ్దనోవ్, బుఖరిన్, లూనాచారిస్కీ, గోర్కీ లాంటివారు ఎందరో ఇందులో ఉండేవారు. వీరి మధ్య సైద్ధాంతిక వివాదాలు, నిర్మాణ పద్ధతుల్లో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ విప్లవ తొలిదశలో ఈ సంస్థ నిర్వహించిన పాత్ర గణనీయమైనది. 1917-20 మధ్యకాలంలో దీని సభ్యత్వం 5 లక్షలకు చేరుకుంది. ఇది 30 వరకు పత్రికలను ప్రచురించేది. 300ల గ్రూపులు 'ప్రోలెట్ కల్ట్'తో కలిసి పనిచేసేవి. బోల్షెవిక్ పార్టీ శ్రామిక వర్గ రాజకీయ క్షేత్రంలోనూ, ట్రేడ్ యూనియన్లు ఆర్థిక క్షేత్రంలోనూ, తాను కళా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పనిచేయాలని 'ప్రోలెట్ కల్ట్' భావించేది. కార్మికులు చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం మొదలైన కళారూపాల్లో నూతన రీతులు, ప్రయోగాలు చేయడానికి కళాకేంద్రాలను ఇది స్థాపించింది. కళా బృందాలుగా పనిచేయడానికి, సామూహిక జీవనం గడపడం పట్ల కార్మికుల ఆశక్తిని పెంపొందించడానికి కృషిచేసింది. ఆ విప్లవోత్సాహ సరంభంలో వందలాది ఔత్సాహిక సాంస్కృతిక సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పడి పనిచేయడానికి 'ప్రోలెట్ కల్ట్' కృషి ఎంతగానో దోహద పడింది. అప్పటి వరకు రష్యన్ సమాజంలో వేళ్లూనికుని ఉన్న సనాతన భావజాలానికి విరుగుడుగా మార్క్సిస్టు భావజాలాన్ని ప్రచారంలో పెట్టింది. శ్రామిక వర్గం సనాతన, బూర్జువా భావజాలాన్ని వదిలించుకుని నూతన ఆవిష్కరణలను చేపట్టే దిశగా పనిచేసింది. అధునాతన రీతులను ప్రోత్సహించే క్రమంలో కొన్ని ఒంటెత్తు పోకడలకు గురైనా ఆకాలంలో 'ప్రోలెట్ కల్ట్' పోషించిన శ్రామిక వర్గ పక్షపాత పాత్ర శ్లాఘనీయం. మొత్తానికి చూస్తే అప్పటిలోనే రష్యాలో శ్రామిక వర్గసంస్కృతిపై జరిగిన చర్చ చాలా విలువైనదేనని 1920లో 'ప్రోలెట్ కల్ట్' కాంగ్రెస్కు కమ్యూనిస్ట్ విభాగం తరపున లెనిన్ ప్రవేశ పెట్టిన ఈ కింది డ్రాఫ్ట్ తీర్మానం తెలియచేస్తుంది:

1. కార్మికుల, రైతుల సోవియెట్ రిపబ్లిక్‌లో విద్యకు సంబంధించిన పని యావత్తు.. అంటే రాజకీయ విద్యా క్షేత్రంలోను, మరీ ముఖ్యంగా సాంస్కృతిక కళా రంగాల్లోనూ గరపవలసిన విద్య.. శ్రామిక రాసులు బూర్జువా శక్తులను కూలదోయడంలో, వర్గాలను రద్దుచేయడంలో, మనిషిని మనిషి దోచుకునే సకల మార్గాలను, వ్యవస్థలను లేకుండా చేయడంలోనూ వర్గ సంఘర్షణోద్యమ స్ఫూర్తితో శ్రామిక వర్గ నియంతృత్వాన్ని విజయవంతంగా సాధించుకోవడంలో దోహద పడేట్లుగా మలచబడాలి .

2. ఆ రకంగా, కార్మికవర్గం తన అగ్ర దళమైన కమ్యూనిస్ట్ పార్టీ ద్వారా, తదితర శ్రామిక ప్రజాసంఘాల ద్వారా ప్రజావిద్యా వ్యాప్తికి ఉత్సాహంతో పనిచేస్తూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాలి.

3. ఆధునిక చరిత్ర అనుభవం, మరీ ముఖ్యంగా కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో ప్రచారంలోనికి వచ్చిన గత అర్ధ శతాబ్ద కాలంలో అన్ని దేశాల్లో శ్రామిక ఉద్యమాల చరిత్ర తిరుగులేని విధంగా తెలియచేస్తున్నదేమంటే.. విప్లవకార శ్రామిక వర్గ ప్రయోజనాలను, దృష్టి కోణాన్ని, సంస్కృతిని నిలబెట్టగలిగే ఏకైక నిజమైన సరిఅయిన మార్గదర్శి మార్క్సిస్ట్ ప్రపంచ దృక్పథ మొక్కటే అని.

4. మార్క్సిజం విప్లవకర శ్రామిక వర్గ సిద్ధాంతంగా ప్రాధాన్యతను సంతరించుకుందంటే.. దానికి కారణం, అది బూర్జువా శకం సాధించిన విలువైన విజ్ఞాన విజయాలను తిరస్కరించకుండానే, గత 2000 సంవత్సరాల పైబడి మానవ వికాస చరిత్రలో పెంపొందిన మంచిని, సాంస్కృతిక సారాన్ని గ్రహించి, దానిని సరైన రీతిలో అర్థం చేసుకుని, సానబట్టి ప్రోది చెయ్యడమే. ఈ శ్రామిక వర్గ దృక్పథాన్ని శ్రామిక వర్గ నియంతృత్వ ఆచరణ అనుభవాల స్ఫూర్తితో స్వీకరించి ప్రతి దోపిడీ అంశాన్ని నిర్మూలించడానికి సంఘర్షణ పడటమే శ్రామిక వర్గ సంస్కృతి యొక్క నిఖార్సైన అభివృద్ధిగా గుర్తించాలి.

5. ఈ ఆదర్శానికి ఎటువంటి ఊగిసలాట లేకుండా కట్టుబడి ఉంటూ.. 'ప్రోలేట్-కల్ట్' లో కొనసాగుతూ తాత్వికంగా యోగ్యతలేని, ఆచరణరీత్యా ప్రమాదకరమైన ఒంటెత్తు ప్రయోగాలకై తాపత్రయపడే విడివిడి అస్తిత్వ నిర్మాణాలు, విడి విడి సంస్కృతీ ముద్రలతో భిన్న మార్గాల్లో పయనించాలనే ఆలోచన, 'ప్రజా విద్యా వ్యవహారాల శాఖ' కు 'ప్రోలిట్-కల్ట్' కు మధ్య విభజన రేఖలు గీసి వాటిమధ్య వైరుధ్యాలను సృష్టించడం, లేక 'ప్రోలిట్-కల్ట్' కు విద్యా సంస్థనుండి స్వయంప్రతిపత్తిని కోరుకోవడం, విద్యాశాఖ ఆశయాలకు అవల గిరిగీసుకుని ఉండిపోయే ప్రయత్నాలను ఈ అఖిల రష్యా 'ప్రోలేట్-కల్ట్' మహాసభ నిర్ద్వందంగా తిరస్కరిస్తుంది. అంతేగాక ఈ మహాసభ ప్రోలేట్-కల్ట్ లో భాగస్వామ్య సంఘాలన్నిటికీ ఏమి చెబుతుందంటే, తామంతా సోవియెట్ ప్రజా విద్యా వ్యవహారాల శాఖకు ఉపాంగాలుగా ఉంటూ సోవియెట్ ప్రభుత్వ, రష్యా కమ్యూనిస్ట్ పార్టీ మార్గదర్శకత్వంలో వాటి అధికార పరిధిలో శ్రామిక వర్గ నియంతృత్వం నెరవేర్చాల్సిన విధులను పరిపూర్తి చేసే కార్యక్రమంలో నిమగ్నమవ్వాలని వక్కాణి స్తుంది. (లెనిన్, 'శ్రామిక వర్గ సంస్కృతి పై', అక్టోబర్ 8, 1920, రచనా సంకలనం, సంపుటి 31, పుట 316-3170).

1924లో ప్రొలెట్-కల్ట్ రద్దయిపోయింది
రష్యాలో సాంస్కృతిక విప్లవం(1928-32):

ఆర్‌ఏపిపి(రష్యన్ అసోసియేషన్ ఆఫ్ ప్రొలిటేరియన్ రైటర్స్), రష్యా శ్రామిక రచయితల సంఘం, కమ్యూనిస్ట్ భావజాలానికి పూర్తిగా అంకితమై పనిచేసే వివిధ రచయితల బృందాల కలయికగా 1928లో ఏర్పడింది. కళా, సాహిత్య రంగాల్లో కమ్యూనిస్టేతర భావజాలంగల రచయితలకు, కళాకారులకు ఇందులో చోటులేకుండా చేసే ఉద్దేశ్యంతోనే ఈ సంఘం ఏర్పాటయింది. లియోపోల్డ్ ఎవర్బాఖ్ నాయకత్వంలోని ఈ సంఘం 1929 లో సోవియెట్ ప్రభుత్వ ఆమోద ముద్రతో సాహిత్య రంగంపై పట్టుసాధించింది. సోవియెట్ యూనియన్ మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆ బృహత్ కార్యక్రమానికి మద్దతుగా ప్రజల్లో సాహిత్య ప్రచారం చేయడంలో ఈ సంస్థ గొప్ప కృషిచేసింది. ఈ సంస్థ తనకు ప్రభుత్వం అప్పచెప్పిన బాధ్యతను యాంత్రికంగా అమలు చేయడం, నియంతృత్వ ధోరణులకు గురికావడంతో సోవియెట్ ప్రభుత్వం దీన్ని 1932లో రద్దు చేసి, దీని స్థానంలో సమాజంలో జరుగుతున్న మార్పులకనుగుణంగా, సృజనాత్మక రచయితల సమూహాలను కూడా కలుపుకుని 'సోవియెట్ రచయితల సమాఖ్య' (సోవియెట్ రైటర్స్ యూనియన్) ను స్థాపించింది.

సోవియెట్ రష్యాలో సాంస్కృతిక విప్లవంపై అక్టోబర్ విప్లవారంభం నుండి రెండు ప్రధాన ధోరణులుండేవి. ఇందులో ఒక ధోరణి ఏమిచెబుతుందంటే, శ్రామిక వర్గం విప్లవం ద్వారా రాజకీయాధికారాన్ని సాధించు కున్న తర్వాత సాంస్కృతిక విప్లవాన్ని అమలుచేస్తుందని. ఈ అమలు చేయడం దేనికంటే, సమాజంలో నాలుగు విలక్షణమైన మార్పులను తీసుకు రావడానికి.. ఒకటి: సంస్కృతి ప్రజాస్వామికీకరణ, రెండు: విద్యా -సాంస్కృతిక అవకాశాల సమానీకరణ, మూడు: ప్రజా విద్యా స్థాయిని అత్యంత వేగవంతంగా ఉన్నత శిఖరాలకు చేర్చడం, నాలుగు: నూతన ప్రజాపక్ష బుద్ధిజీవులను తయారుచేసుకోవడం. రాజకీయ విప్లవంలా గాక సాంస్కృతిక విప్లవం బలప్రయోగంతో అదాటున విరుచుకుపడేది కాదని, సాధించిన సాంస్కృతిక విలువలను నిలబెట్టుకుంటూ లెనినిస్ట్ సూత్రాలను పాటిస్తూ క్రమేణా సాంస్కృతిక రంగంలో సైద్ధాంతిక పరివర్తన సాధించటమని ఈ ధోరణి చెబుతుంది. ఇటువంటి ధోరణి సాంప్రదాయక సాంస్కృతీవాదంగాను, మిత వాదంగాను పిలవబడింది. 1917 నుండి ఈ ధోరణి కొనసాగుతూ బలంగా ఉంటూ వచ్చింది. దీనికి 'నార్కొమ్ప్రాస్' బుద్ధిజీవుల సంస్థ కొమ్ముకాసేది. ఈ సంస్థలో పాత బూర్జువా, పాత బోల్షెవిక్ బుద్ధిజీవులు లూనచరిస్కీ నాయకత్వంలో ఉండేవారు. ఈయన మొదట్లో సోవియెట్ విద్యా మంత్రిత్వ శాఖకు నాయకత్వం వహించేవాడు. ఈ ధోరణి కృశ్చేవ్ తర్వాత 1960ల్లో చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవాన్ని తప్పుడు విప్లవమని అంటూనే, అసలు తప్పుడు సాంస్కృతిక విప్లవం సోవియెట్ రష్యాలోనే 1928-32, మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలోనే జరిగిందని గేలి చేసింది. స్టాలిన్ మరణానంతరం రివిజనిజాన్ని తలకెత్తుకున్న సోవియెట్ కమ్యూనిస్ట్ పార్టీలో, తద్వారా సమాజంలో ప్రబలంగా ఈ ధోరణి పాతుకుపోయింది.

ఇక రెండవ ధోరణి 'సాంస్కృతిక విప్లవం కూడా వర్గ యుద్ధమే' అని అంటుంది. ఈధోరణి ముఖ్యంగా 1928-32 సోవియెట్ మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉధృతంగా కొనసాగింది. సోషలిస్టు కార్మిక యువత, విద్యార్థులు 'నార్కొమ్ప్రాస్ (NARKOMPROS)' సంస్థపై

నిరసనగా ఈ సాంస్కృతిక విప్లవం క్షేత్ర స్థాయిలో సహజ సిద్ధంగా ముందుకొచ్చింది. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న మితవాద ఉదారవాద ధోరణులకు, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ఇంకా పాతుకుపోయి ఉన్న బూర్జువా బుద్ధిజీవులకు, వారు అమలు చేస్తున్న పాలసీలకు వ్యతిరేకంగా, వ్యవసాయ సమిష్టీకరణను వేగవంతం చేయడంలో పొడసూపిన సాచివేత ధోరణిపైనా, మొదటి పంచవర్ష ప్రణాళిక అమలుకు కావలసిన నైపుణ్య కార్మికుల, టెక్నీషియన్ల, ఇంజనీర్ల అవసరాన్ని గుర్తించకుండా నత్తనడక అవలంబించడంపై, నూతన శ్రామిక ఉత్తేజిత సమసమాజ నిర్మాణానికి విప్లవకరంగా ముందుకు రాకపోవడాన్నీ తీవ్రంగా విమర్శిస్తూ.. ఈధోరణి వర్గ యుద్ధం ద్వారా శ్రామిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించాలని కోరుకుంది. ఈ ధోరణి మిలటరీ పదజాలాన్ని, సంకేతాలను సాంస్కృతిక ఉద్యమానికి జోడించింది. సాంస్కృతిక ఫ్రంట్.. విద్య, శాస్త్ర విజ్ఞానానికి, కళారంగానికి ఎగబాకడం 'ప్రావ్దా' దినపత్రికలో 'దఫైటింగ్ టాస్క్స్' పేరిట వచ్చిన సంపాదకీయాలు, ద ప్రోలిటేరియన్ 'అన్ గార్డ్ గ్రూప్' ఇన్ లిటరేచర్ కాస్మోసాల్ లైట్ కెవలరీ ఎటాక్స్ అన్ గవర్నమెంట్ ఆఫీసెస్, 'ముసుగులను చించేయండి' అన్నవి కొన్ని ఉదాహరణలు.

కమ్యూనిస్ట్ కార్యకర్తలు, కాస్మోసోల్ సభ్యులు అప్పటికి వారు నివసిస్తున్న వర్తమాన సమాజంపైన, వారు నిర్మించ తలపెట్టిన సమీప భవిష్యత్ సమాజంపైన ఐచ్ఛిక వ్యక్తీకరణే.. అప్పటి సోవియెట్ రష్యాలో, పార్టీ రాజకీయ చట్రాన్ని అతిక్రమించక నియమిత పరిధిలోనడిచిన, మితవాద రాజకీయాలపై కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎక్కుపెట్టిన ఉద్యమమే ఈ 'సాంస్కృతిక విప్లవం' అని చెప్పాలి. ఈ ఉద్యమకారులు తమ సాంస్కృతిక ఆయుధాన్ని అందమైన ముసుగు చాటున పబ్బం గడుపుకుంటున్న కల్చర్డ్ వర్గ శత్రువుపై సరిగ్గానే ఎక్కుపెట్టి నప్పటికీ, దుందుడుకు, సెక్టేరియన్ రొంపిలో కూరుకుపోయి కమ్యూనిస్ట్-అహంభావానికి గురయ్యారు. సోవియెట్ సమాజంలో ఈ సాంస్కృతిక విప్లవం కొత్తగా విద్యాధికులైన వారిపై నిర్మాణ బాధ్యత, పార్టీ సభ్యత్వం అనే భారాన్ని మోపింది. ఆ భారం వారు పక్కదారి పట్టి గర్విష్టులుగా మారడానికి కూడా దారితీసింది.

వర్గ వ్యత్యాసాలను రూపు మాపే ఉద్దేశాలను ఎంత ఘనంగా ప్రకటించుకున్నప్పటికీ, చైనా కమ్యూనిస్ట్ పార్టీ, ఇతర సోషలిస్టు దేశాల్లోని సహోదర కమ్యూనిస్ట్ పార్టీల్లానే రాజకీయ, సాంస్కృతిక పెట్టుబడి ఆధారిత సామాజిక వ్యత్యాసాలను రూపుమాపలేక పోయింది. కమ్యూనిస్ట్ విప్లవకారులు ఆస్తిపర వర్గాలను అధికారం నుండి తప్పించి 'ప్రజా-ఆస్తి' (పబ్లిక్ ప్రాపర్టీ) రూపంతో సోషలిస్టు వ్యవస్థలను నిర్మించ తలపెట్టినపుడు, వారి ఆదర్శాన్ని సాంకేతిక ప్రవీణుల వర్గ అధికార వ్యవస్థ ద్వారా (టెక్నోక్రాటిక్ క్లాస్ ఆర్డర్) సాధించదల్చుకున్నారా? అనే ప్రశ్న వేసుకోవాల్సి వస్తోంది. అలాకాకపోతే మరి చైనాతో సహా సోషలిస్టు మార్గం అనుసరించిన అన్ని ఇతర దేశాల్లో ఎందుకని ఇటువంటి స్థితే వచ్చింది? ఈ మార్పు అనివార్యమా? ఇది లోతుగా పరిశీలించాల్సిన అంశం.

చైనాలో సాంస్కృతిక విప్లవకాలంలో జరిగిన రెడ్-గార్డ్ మిలిటెంట్ ఉద్యమాలవంటివి, సోవియెట్ రష్యాలో కొద్దిపాటి తేడాలతో 1917-20 ల నాడే ప్రొలెట్-కల్ట్ సభ్యులు అవలింబించారు. అయితే వాటికి సోవియెట్ పార్టీ ఆశీస్సులు లభించలేదు. అలానే తదనంతరం జరిగిన సోవియెట్ సాంస్కృతిక ఉద్యమాలన్నీ పార్టీ, ప్రభుత్వ చట్రంలోనికి కుదించబడ్డాయి. ఇదే తంతు మక్కికి మక్కీగా చైనాలోనూ జరిగింది. విద్యార్థి ఉద్య మాలను, కార్మిక ఉద్యమాలను పార్టీలు తమ ఆధీనంలోనే, తమ అధికార పరిధి దాటిపోకుండా కంట్రోల్ చేసుకుంటూ వచ్చాయి. అందుకనే ఆదర్శాలు ఎన్ని వల్లించినా, కబుర్లు ఎన్నిచెప్పినా చేతల్లోనికి వచ్చే సరికి శ్రామిక వర్గ నియంతృత్వం అనేది, కేవలం టెక్నోక్రాట్ల నియంతృత్వంగానే మిగిలిపోయింది, కమ్యూనిస్ట్ సమాజ నిర్మాణం పేరున సామాజిక చదును కార్యక్రమాలు చేబట్టిన అన్ని సమాజాల్లోనూ ఇదే జరిగింది.

కమ్యూనిస్ట్ సమాజాలని పిలవబడ్డ సమాజాల్లో ఉత్పత్తి సాధనాలపై 'వ్యక్తి ఆస్తి యాజమాన్య ఆర్థిక పెట్టుబడి రూపాన్ని' (ఎకనామిక్ కాపిటల్ ను) రద్దుచేసినా, రాజకీయ, సాంస్కృతిక పెట్టుబడి రూపాలను వారు ముట్టుకోలేక పోయారు. వ్యక్తిగత పెట్టుబడిదారుల సమూహం లేని ఖాళీని కమ్యూనిస్ట్ పార్టీలోని రాజకీయ, సాంస్కృతిక ఆస్తిపరుల బృందం భర్తీ చేసుకుంది. సోషలిస్టు ఆర్థిక సామాజిక చట్రాన్ని, ఉత్పత్తిని, ఉత్పత్తుల పంపిణీని నిర్వహించడానికి అవసరమైన నైపుణ్యాలు కొత్త పెట్టుబడి వికృత రూపాలను సంతరించుకుని కమ్యూనిస్ట్ పార్టీలు నూతన బూర్జువావర్గం పాదాక్రాంతమైపోయాయి. అక్కడ కార్మికులు, రైతులు, కష్టజీవులు ఈ నూతన బూర్జువా వర్గానికి సంపదను సృష్టించే వనరుగానే దిగజారిపోయారు. అంటే ఈ మొత్తం కమ్యూనిస్ట్ ప్రాజెక్టును కొత్త కోణంనుండి వీక్షించవలసిన సందర్భంలో శ్రామిక వర్గం క్రాస్ రోడ్స్ లో ఉంది.

ఏ వనరైనా.. అది భౌతికమైన ఆస్తి కావచ్చు, లేదా జ్ఞానం, రాజకీయ అధికారం కావచ్చు ఇవి సమాజంలో అసమానపు పంపిణీకి గురైనప్పుడు వర్గవ్యత్యాసాల రూపాలు స్థిరపడే ఉంటాయి. ఎందుకనంటే పెట్టుబడి కేవలం ఆర్థికమైనదే అనుకోవడం పొరబాటు. వర్గాధికారం అనేది ఈ ఆస్తిరూపాల అసమాన పంపిణీ పై, అసమాన పంపిణీ వల్ల ఏర్పడే మైనార్టీ చేతుల్లో కేంద్రీకరణ చెంది ఎలా తోడుకుంటున్నదీ అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆస్తిరూపాల పంపిణీ వ్యవస్థలు, అసమాన పంపిణీని, తద్వారా మైనార్టీ చేతుల్లో ఆస్తి కేంద్రీకరణను పునరుత్పత్తిచేస్తూ ఉంటాయి. ఏ మేరకు అన్ని ఆస్తిరూపాలు, సమాన పంపిణీకి గురౌతాయో, ఆమేరకు సమసమాజ ఛాయలు ఆవరిస్తాయి. అలాకాక ఏ మేరకు ఆస్తిరూపాలు అసమాన పంపిణీకి గురౌతాయో, ఆమేరకు అన్యాయపు అంధకార.అసమ సమాజం పరుచుకుని ఉంటుంది. సమాజాల పేర్లు ఏమైనా కావచ్చు, అవి ఏ రంగు జండాలైనా ఊపవచ్చు.

ముగింపుగా చైనాలో నూతన బూర్జువా వర్గం ఎలా పేరుకుందో చూద్దాం. 1949 చైనా విప్లవానంతరపు తొలి దశలో ఆర్థిక, సాంస్కృతిక పెట్టుబడి పాత పాలక వర్గ వ్యక్తుల చేతుల్లో కేంద్రీకరించి ఉండేది. రాజకీయ పెట్టుబడి నూతనంగా అధికారంలోనికి వచ్చిన కమ్యూనిస్ట్ నాయకుల చేతుల్లో కేంద్రీకరించిబడి ఉండేది. ఈ కమ్యూనిస్ట్ నాయకుల బృందం ప్రధానంగా రైతాంగ విప్లవకారుల బృందమని చెప్పవచ్చు. కొత్త రాజ్యం అప్పటివరకు ఉత్పత్తిసాధనాల వ్యక్తిగత ఆస్తి రూపాన్ని ప్రజల సమిష్టి సహకార ఆస్తి, ప్రభుత్వ ఆస్తి రూపాలుగా మార్చింది. కొత్త యాజమాన్య రూపం ప్రజల పేరుమీద ఉన్నప్పటికీ, ఆ ఆస్తి నిర్వహణ, అధికారం కమ్యూనిస్ట్ ప్రభుత్వ కార్యాలయాల్లో, సమష్టి వ్యవస్థల కార్యాలయాల్లో కేంద్రీకరించబడి ఉండేది. రాజకీయ, సాంస్కృతిక పెట్టుబడి గల వ్యక్తులకే (వీళ్ళు సాధారణ దుస్తులు

అభివృద్ధి ముసుగులో విధ్వంసం

సాగర్ బొప్పూడి

నిర్వాసితత్వం - స్త్రీపై రాజ్యహింస, పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక పోరాటంలో - స్త్రీలు అనే రెండు వ్యాసాలను కలిపి రత్నమాల గారు 'ప్రజలు - నిర్వాసిత సమస్య - రాజ్యం' అనే పుస్తకాన్ని ప్రచురించారు. అభివృద్ధి ముసుగులో ప్రజలను నిర్వాసితులను చేయడం, దాని వల్ల ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు ఎదుర్కొంటున్న హింసను ఈ పుస్తకంలో వివరించారు .

భారీ నీటి ప్రాజెక్టులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ఐటీ, కోస్టల్ కారిడార్లు, విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్రజల దగ్గరి నుంచి వేల ఎకరాల సాగుభూమిని తీసుకోవడం నిర్వాసిత సమస్యకు ప్రధాన కారణం. ఆ తర్వాత ప్రజలను వేరే ప్రాంతానికి తరలించడం ద్వారా వారి జీవితం, సంస్కృతి విధ్వంసమవుతున్నది. దీనికి అభివృద్ధి అనే ముసుగు వేస్తున్నది. ప్రాజెక్టుల వల్ల వచ్చే ఉద్యోగాలను, జీడీపీ పెరుగుదలను సూచికలుగా చూపించి భ్రమలు కల్పిస్తున్నది. నిజంగానే ఇది అభివృద్ధేనా? అని రత్నమాలగారు చాలా వివరంగా విశ్లేషించారు.



హైదరాబాద్ చుట్టూ సెజ్‌ల వల్ల నిర్వాసితులైన ప్రజలను చూస్తే అభివృద్ధి పేరుతో విధ్వంసం ఏమిటో తెలుస్తుంది. సెజ్‌ల కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను చూస్తే.. అక్కడ ఏ కార్మిక చట్టాలూ వర్తించవని వివరించారు.

సెజ్‌లు, జలయజ్ఞం లాంటి వాటికి భూ కేటాయింపుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నిర్వాసితులైన ప్రజలకు నామమాత్రంగా పునరావాసం కల్పించారు. నష్టపరిహారం ఇచ్చారు. ఒక్క సారిగా డబ్బు చేతికి రావడం వల్ల కుటుంబ జీవితం, సంస్కృతి ఎలా ధ్వంసం అయ్యేదీ రచయిత్రి నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద భూములు పోయిన దేవరకొండ ప్రాంత ప్రజలను మనకు ఉదాహరణగా చూపిస్తారు. ముఖ్యంగా కుటుంబ పోషణ కోసం మహిళలు వలస కూలీలుగా మారారని, పిల్లల్ని అమ్ముకోవాల్సి వచ్చిందని, బలవంత వ్యభిచార వృత్తిలోకి నెట్టివేయబడ్డారని విశ్లేషించారు.

అయితే భూములు ఇవ్వడానికి నిరాకరించిన వాళ్లను అభివృద్ధి నిరోధకులుగా ప్రభుత్వం ప్రచారం చేసి దారుణమైన నిర్బంధం అమలు చేసింది. సోంపేట పవర్ ప్రాజెక్టు, జిందాల్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాటాలపై ఎంత అణచివేత ప్రయోగించిందీ చూశాం. జిందాల్ వ్యతిరేక పోరాటంలో గ్రామస్తులను అణచివేయడానికి వాళ్లలో మావోయిస్టులు ఉన్నారనే నెపంతో కూంబింగు జరిపి నిర్బంధాన్ని ప్రయోగించారు. విశాఖపట్నం వాకపల్లి దగ్గరైతే 11 మంది గిరిజనులపై లైంగిక అత్యాచారం చేశారు.

నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో నూతన రాజధాని, కోస్టల్ కారిడార్, మల్లన్న సాగర్, పోలవరం ప్రాజెక్టు పేరుతో కొన్ని వేల మంది ప్రజలు నిర్వాసితులు అవుతున్నారు. ఊళ్లకి ఊళ్లు మునిగిపోతున్నాయి. భూములు ఇవ్వడానికి నిరాకరించిన ప్రజలను చట్టాలు, జీవోల పేరుతో భయపెడుతున్నారు.

అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని, దాన్ని సారాన్ని అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం బాగా ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా మహిళల కోణంలో నిర్వాసిత సమస్యను రచయిత్రి పరిశీలించారు. విస్థాపనకు వ్యతిరేకంగా పోరాడితే రాజ్యం ఎలా నిర్బంధం ప్రయోగించేదీ ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. ★

ధరించిన పేదలే కావచ్చు, కానీ కేడర్-ఆఫీషియల్స్) ఈ కార్యాలయాల లోనికి మార్గం సుగమమై ఉంటుంది. వ్యక్తిగత ఆర్థిక పెట్టుబడి నిర్మూలించబడ్డ తర్వాత చైనా కమ్యూనిస్ట్ పార్టీ తొలి దశలో పాత పాలక పెట్టుబడిదారీ వర్గపు పట్టును నిర్మూలించే ఉద్దేశంతో సాంస్కృతిక పెట్టుబడిని పున: పంపకం చేయనారంభించింది. సాంస్కృతిక పెట్టుబడిని పున: పంపిణీ అంటే చదువుల్లో, ఉద్యోగాల్లో, వ్యవసాయంలో, పరిశ్రమల్లో శ్రామిక వర్గానికి అవకాశాలను పెంచడం. క్రమేణా సాంస్కృతిక విప్లవం ఈ పున: పంపకం అనే అంశం పైనే తెరపైకి వచ్చింది. పాత బూర్జువాలు ఒకమేరకు తెరమరుగైనా కొత్తగా కమ్యూనిస్ట్ బూర్జువా వర్గం చాపకింద నీరులా పాకి అధికారంలో ఉన్నత స్థానానికి చేరుకున్నాది. నిజానికి ఈ మోసాన్ని ముందుగా గ్రహించి ఆగ్రహించింది బుద్ధిజీవుల్లోనూ, విద్యార్థుల్లోనూ, కార్మికుల్లోనూ ఒక సెక్షన్ మాత్రమే! మావో దీనికి ఊతమిచ్చాడు. ఆ తదనంతర పరిణామాలే మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవ చరిత్ర. ఈ విప్లవం రాజకీయ, సాంస్కృతిక పెట్టుబడిని ఆర్జించిన కొత్త కమ్యూనిస్ట్ బూర్జువాలను ఏమీ చేయలేక పోయింది. నిజానికి ఇందులో కొత్తేమీ లేదు. సోవియెట్ కమ్యూనిస్ట్ పార్టీలోనూ, సోవియెట్ సమాజంలోనూ జరిగిన యావత్ చిత్రమే చైనాలో మరో మారు తెరపై కనిపించింది. స్టాలిన్, మావోల మరణాలకు ఈ పరిణామాలకు లింకు ఉందనుకోవడం కేవలం ఊహాజనితమే! అయితే వారు బతికున్న కాలంలోనే ఆ రెండు సమాజాల్లో కమ్యూనిస్ట్ మూల సూత్రాలను అతిక్రమించడం కూడా చరిత్ర పరివర్తనలో భాగమే! ★

కైఫీ, నేనూను

కృష్ణాబాయి

హిందీ సినిమాతారలు పృథ్వీరాజ్ కపూర్, అశోక్ కుమార్, లీలా చిట్నీస్, దేవికారాణి, దిలీప్‌కుమార్, రాజ్‌కపూర్, నర్గీస్ నటించిన హిందీ సినిమాలు బందరు మినర్వా టాకీసులో మా చిన్నప్పుడు ప్రదర్శించేవాళ్ళు. "అదిగో చూడండి, మన హీరో హీరోయిన్‌తో పాట పాడుతూ గుర్రం మీద దౌడు తీస్తున్నాడు" అంటూ అనువాదకుడు తెలుగులో బిగ్గరగా రన్నింగ్ కామెంట్రీ చేస్తూండేవాడు. భాష రాకపోయినా, అతని చమత్కారపు కామెంట్రీ సినిమాని అర్థం చేయించేది!

తర్వాతి కాలంలో బలరాజ్ సహానీ, సంజీవ్‌కుమార్, షబానా అజ్మీ, స్మితా పాటిల్, నసీరుద్దీన్ లాంటి నటీనటులు తెలుగు వాళ్ళక్కూడా తమవాళ్ళే ననిపించేటంత దగ్గరయ్యారు. బ్రిటిష్ వాళ్ళు ఉరికంబాలెక్కించిన గదర్ వీరులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురుల గురించిన చిత్రాలు తెలుగు యువతని కూడా ఉత్తేజితుల్ని చేసేవి. అభ్యుదయ భావాల ధర్తీకేలాల్ (బెంగాల్ కరువు), కాబూలీవాలా లాంటి మంచి చిత్రాలెన్నో హిందీలో తయారై తెలుగు ప్రాంతాల్లో కూడా విజయవంతంగా ఆడేవి.

గరమ్ హవా, దో బిఘా జమీన్, కాబూలీ వాలా లాంటి ప్రయోజనాత్మక చిత్రాలెన్నో హిందీలో వచ్చాయి. ప్రఖ్యాత ఉర్దూ కవి కైఫీ ఆజ్మీ గొప్పగొప్ప పాటలెన్నో అందించగా, నటిగా షౌకత్ అజ్మీ అద్భుతంగా నటించిన నాటకాలూ, చిత్రాలు పేరు ప్రఖ్యాతులు పొందాయి. వీరి సంతానంలో షబానా అజ్మీ అద్భుతంగా నటించిన నాటకాలూ, చిత్రాలు పేరు ప్రఖ్యాతులు పొందాయి. వీరి సంతానంలో షబానా అజ్మీ కారెక్టర్ యాక్ట్రెస్‌గా రాణిస్తోంది. కొడుకు బాబా అజ్మీ సినిమటోగ్రాఫర్‌గా కీర్తి పొందుతున్నాడు. షబానా అజ్మీ, జావేద్ అఖ్తర్‌తో సహా కుటుంబంలో అందరూ చిత్ర రంగానికి చెందిన అన్ని శాఖల్లోనూ నైపుణ్యం పొందారు. కేవలం కళాకారులే కాకుండా, కమ్యూనిస్టు భావజాలానికి అంకితమయ్యారు.

కైఫీ, షౌకత్‌లు కేవలం దంపతులు మాత్రమే కాదు, జీవితాంతం గాఢ ప్రేమికులుగా నిలిచారు. కైఫీ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యుడు కూడాను. షౌకత్ కూడా టెక్నికల్‌గా పార్టీ సభ్యురాలు కాకపోయినా ఆ భావజాలంతో మమేకమైన యువతి. నమ్మిన సిద్ధాంతానికి కడకంటా బద్ధులైన ఆ జంట జీవితాలు చదివి ముగ్ధులమవుతాం.

కైఫీ, షౌకత్‌ల జ్ఞాపకాల సమాహారం 'కైఫీ అండ్ ఐ' అనే పేరుతో ఇటీవల హిందీలోనూ, ఇంగ్లీషులోను పుస్తకంగా వెలువడింది. కళారాధకులైన అజ్మీ దంపతుల అనురాగాన్నీ, వాళ్ళ సామాజిక బాధ్యతని ఎంతో కళాత్మకంగా షౌకత్ ఈ పుస్తకంలో చిత్రించింది. అభ్యుదయ భావాలతో కవితాత్మకంగా పరిమళించిన యాభై ఏళ్ళ వైవాహిక జీవితాన్ని షౌకత్ ఉర్దూలో వర్ణిస్తే, చక్కటి ఇంగ్లీషులో నస్రీన్ రహ్మాన్ మన కందించారు. ఒక కళాఖండాన్ని దర్శించిన అనుభూతి కలుగుతుంది ఇది చదివితే.

ఈ జంట ప్రేమని ఎంతలా పంచుకున్నారో, బీదరికాన్నీ అంతగా కలిసి అనుభవించారు. ఇద్దరూ ప్రేమా పెళ్ళితోనే కాక సమాజం పట్ల ఎంతో నిబద్ధతతో జీవించి చరితార్థులయ్యారు.

మార్చి 2002లో గుజరాత్ మత కల్లోలంలో మునకలేసింది. భయంకరంగా పసిబిడ్డల్నీ, పిండాల్నీ ఎగరేసి చంపేసారు. వినడానికే ఎంతో జుగుప్సాకరంగా జరిగిన సంఘటనలు పత్రికల్లో చదివీ, కళ్ళారా చూసి భీతావహులయ్యారు జనం. మత విద్వేషానికి వ్యతిరేకంగా జీవితమంతా పోరాడిన కైఫీ బాబ్రీ మసీదు కూల్చివేతకీ, ఒక సమాధిని తవ్వి పారేసిన ఘటనకీ తల్లడిల్లిపోయాడు. షౌకత్ టీవీ కట్టేసి, పేపర్ మడిచేసేది.

మార్చి 1న సీతారాం ఏచూరి, అమర్‌సింగ్‌లతో కలిసి షబానా గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీని కలవాలని విఫల యత్నం చేసింది. కల్లోలం చెలరేగిన ప్రాంతాలకి వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. కాని "పరిస్థితి అంతా కంట్రోల్ లోనే ఉంది-చిన్న చిన్న సంఘటనలు మినహా. మీరు ఢిల్లీ వెళ్ళిపొండి" అని మోడీ షబానా బృందాన్ని ఒత్తిడి చేసాడు. కాని మర్నాడే నరోదా పాటియాలలో 25 మందిని నజీవదహనం చేసారు. షబానా గుండె బద్దలయ్యింది. తండ్రికీ విషయమంతా నివేదించింది. "నీ కర్తవ్యం నువ్వు నిర్వహించమ్మా. ఈ పిచ్చి, ఉద్రేకం త్వరలోనే మాసిపోతాయి" అన్నాడు అజ్మీ. కాని ఏం జరిగిందో మనందరికీ తెలుసు.

"కైఫీ ఆదర్శవంతమైన భర్త మాత్రమే కాదు, నన్ను ఎన్నో విధాల మంచికి ప్రోత్సహించేవాడు. నా స్వేచ్ఛని ఎంతో గౌరవించాడు" అంటూ "నిర్జీవమైన నా కైఫీ దేహాన్ని నాకు దూరం చేస్తారా?" అని ఆక్రోశిస్తుంది. అతను లేని జీవితం, ఆ వెలితిని భరించలేక షౌకత్ రాసిన ఆఖరి పేరా చదివితే మన గుండె బరువెక్కుతుంది.

రాజకీయ రంగంలో మార్క్స్ దంపతుల్లాగా, కళారంగంలో అజ్మీ దంపతులు చిరకాలం నిలుస్తారు.

ఆ దంపతుల ముఖ చిత్రంలో వెలువడిన ఈ పుస్తకం పేరు 'కైఫీ అండ్ ఐ'

ఈ పుస్తకం దొరికే చోటు - ZUBAAN, 128 B Shahpur JAT, Ist Floor, NEW DELHI-220 049

వెల - 295/-, పేజీలు - 150

(రోమన్ కేథలిక్కులకు ప్రశ్నలు-జవాబుల పద్ధతిలో మత విషయాలు బోధించే పద్ధతిని CATECHISM అంటారు. 1905లో లూయిస్ కాస్ ఫ్రై అనబడే అమెరికన్ మార్క్స్ 'పెట్టుబడి'ని ఈ పద్ధతిలో అందరికీ సులభ గ్రాహ్యంగా చెప్పటానికి ప్రయత్నించాడు. CATCHISM OF KARL MARX"S CAPITAL పుస్తకానికి తెలుగు అనువాదం సీరియల్‌గా అందిస్తున్నాం. - సం.)

కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు

లూయిస్ కాస్ ఫ్రై

అనువాదం: ముక్తవరం పార్థసారథి

(గత సంచిక తరువాయి...)

(2)

21. ఎందుకు? రకరకాల శ్రమ ఆ సరుకుల్లో ఉన్నందువల్లే అవి (మారకపు) సరుకులుగా మారాయి. అందరూ ఒకే రకమైన శ్రమ చేస్తే, ఆ వస్తువులను మార్పిడి చేసుకోవలసిన అవసరమే ఉండదుగదా!

సరుకుల ఉత్పత్తి జరగకుండా సామాజికంగా శ్రమ విభజన సాధ్యమా? ప్రాచీన ఇండియన్ సమాజంలో సరుకుల ఉత్పత్తి ప్రారంభం కాని దశలోనే సామాజికంగా శ్రమ విభజన అమల్లో ఉంది. అప్పుడు తయారైన వస్తువులకు కేవలం ఉపయోగపు విలువ మాత్రమే ఉండేది. ఈ రోజుల్లో ప్రతి పెద్ద ఫ్యాక్టరీలో ఒక పద్ధతి ప్రకారం శ్రమ విభజన జరుగుతుంది. అయితే దీనికీ, వస్తు మార్పిడికీ సంబంధం లేదు.

22. పై విషయాలను మరొక్కసారి మననం చేసుకొంటే, మొదట సరుకు యొక్క ప్రతి ఉపయోగపు విలువలోనూ ఉపయోగకరమైన శ్రమ దాగి ఉంది. రెండు: పరస్పరం భిన్నంగా ఉంటే తప్ప, సరుకులలోని ఉపయోగపు విలువలు ఒక దానితో ఒకటి పోటీ పడలేవు. మూడు: భిన్నమైన వ్యక్తులు భిన్నమైన సరుకుల్ని ఉత్పత్తి చేసే సమాజంలో ఒక సంక్లిష్టమైన శ్రమ విభజన వ్యవస్థ ఏర్పడుతుంది. ఈ వ్యవస్థను ఏమంటారు? దీన్నే పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ అంటారు.

23. ఒక సరుకు ఉదాహరణకు ఒక కోటును, దాన్ని కుట్టిన దర్జీ ధరించినా, కొనుక్కున్నా వినియోగదారుడు ధరించినా, దాని ఉపయోగపు విలువ మారదు. దర్జీ వృత్తి అనేది లేకుండా ఉంటే, కోటుకూ, దాన్ని కుట్టటానికి అవసరమైన శ్రమకూ ఉన్న సంబంధంలో ఏమైనా మార్పు వస్తుందా? ఏ మాత్రం రాదు. దుస్తులు లేనప్పుడు, తరతరాలుగా జనం ఎవరికి వాళ్ళు వాటిని కుట్టుకుంటేనే ఉన్నారు. పని వాళ్ళెవరూ దర్జీ వృత్తి చేపట్టినట్టు కాదు. బట్టలూ, కోట్లూ ఉండటానికి కారణమేమిటి? ఒక ఖచ్చితమైన లక్ష్యంతో, ఒక ఉత్పత్తి క్రమం అమలు జరుగుతున్నది గనక.

ఈ ప్రత్యేక శ్రమ ఏ ఫలితాన్నిస్తున్నది? ప్రకృతిలో సహజంగా లభ్యమైన వనరులను మనిషి అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తున్నది. ఉపయోగకరమైన శ్రమ ఉపయోగ కరమైన విలువల్ని ఎలా సృష్టిస్తున్నది? ఇది ఒక అనివార్యమై పరిస్థితి. సమాజ స్వరూపం ఎలా ఉన్నప్పటికీ, మానవజాతి కొనసాగాలంటే, ఇది జరగక తప్పదు. ఇది ప్రకృతి కల్పించిన అవసరం. ఇది లేకుండా, మనిషికీ, ప్రకృతికీ మధ్య భౌతికమైన మార్పిడి ఉండే అవకాశమే లేదు. అంటే జీవితమే కొనసాగదు.

24. ఏవి కలిసి సరుకుల్లోని ఉపయోగపు విలువలు గా మారతాయి? పదార్థం, శ్రమ. సరుకులోంచి ఉపయోగపు విలువను తీసేస్తే ఏం మిగులుతుంది? పదార్థం యొక్క మౌలికరూపం. (ప్రకృతి నుండే మనకు రసాయన పదార్థాలు-కార్బన్, నైట్రోజన్, క్లోరాలు వగైరా లభిస్తున్నాయి. సూర్యుని వేడి మనకు రక్షణ ఇవ్వటమే కాకుండా, మొక్కల ఎదుగుదలకు దోహదం చేస్తున్నది) మనిషి ఎలా పని చేస్తాడు? ప్రకృతిలాగే తన శ్రమ వల్ల పదార్థ రూపాన్ని స్వభావాన్ని మార్చివేస్తాడు. ఈ శ్రమలో, అతడికి ప్రకృతి సహకరిస్తుంది. దీన్ని బట్టి మనకేం తెలుస్తుంది? సంపద సంసృష్టికి శ్రమ ఒక్కటే సరిపోదు. సంపదకు, శ్రమ తండ్రి అయితే, తల్లి ప్రకృతి.

25. ఇక మనం సరుకును ఉపయోగపు విలువగా చూడటానికి పరిమితం కాకుండా సరుకుల విలువల గురించి మాట్లాడుకుందాం.

26. మొదట్లో మనం కోటు ధర, బట్ట ధరకన్నా రెట్టింపు అనుకున్నాం. కాని ఇది కేవలం బట్ట రూపం మార్చుకోవటం గురించిన చర్చ మాత్రమే. ప్రస్తుతానికి దీన్ని కాసేపు పక్కన పెడదాం. అంటే పది మీటర్ల గుడ్డ ధర, కోటు ధరలో సగం అనుకుంటే ఇరవై మీటర్ల గుడ్డ, ఒక కోటుకు సమానమన్నట్టే కదా. విలువలుగా చూసినప్పుడు కోటు, గుడ్డ ఒకే వస్తువు. కాని రెంటికీ అవసరమైన శ్రమలో తేడా ఉంది. దర్జీ శ్రమకూ, నేతగాడి శ్రమకూ తేడా ఉంది. వీళ్ళు ఈ శ్రమ మాత్రమే చెయ్యాలని అన్ని సమాజాలూ ఏమైనా షరతులు విధించాయా?

లేదు. ఒకే వ్యక్తి బట్టలు నేసి, మరో సమయంలో దర్జీగా కూడా మారవచ్చు. అంటే ఒకే వ్యక్తి రెండు రకాల శ్రమ చేస్తున్నాడు.

దర్జీ ఒక నాడు కోటు కుడతాడు. మరొక రోజు పాంటు కుడతాడు. అంటే, దర్జీ శ్రమలో కూడా వైవిధ్యముంది.

పెట్టుబడిదారీ సమాజంలో పరిస్థితి ఏమిటి? మనిషి శ్రమ, డిమాండ్‌ను బట్టి ఒకసారి దర్జీ రూపంలోనూ, మరోసారి నేతగాడి శ్రమ రూపంలోనూ అవసరమవుతుంది.

ఈ మార్పు అనివార్యమా? ఇందులో కొంత ఘర్షణ ఉండకపోదు. కాని మార్పు జరగక తప్పదు. (దీన్నే మన బూర్జువా పొలిటికల్ ఆర్థిక శాస్త్రవేత్తలు సప్లై/డిమాండ్ అంటారు) ఒక సరుకుకు డిమండ్ పెరిగిందంటే, దాని ఉత్పత్తికి ఎక్కువ మంది కార్మికుల అవసరం ఉంటుంది. అయితే, ఒక సరుకు ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి అయిందంటే, అదే నిష్పత్తిలో అందుకవసరమైన శ్రమ కూడా తగ్గుతుంది. అంటే ధర కూడా తగ్గుతుంది. ఉత్పత్తి పరిస్థితులు మారకుండా ఉన్నంత వరకూ సరుకుకు డిమాండ్ పెరిగితే దాని ధరా తగ్గుతుంది.

ఉదాహరణకు: ఒకే కోటు కుట్టాలనుకుంటే చేత్తో గుడ్డ కత్తిరించి పని ప్రారంభించాలి. కాని పదివేల కోట్లు కుట్టాలనుకుంటే, పదివేల కోట్ల కవసరమైన గుడ్డను ఒక గంటలో కత్తిరించగల యంత్రం సమకూర్చుకుని అనేక వందల గంటల శ్రమను ఆదా చేయవచ్చు.

(ఒక కోటు గుడ్డ కత్తిరించటానికి గంటసేపు పడుతుందనుకుంటే, పదివేల కోట్లకు పదివేల గంటల శ్రమ అవసరమవుతుంది. అంటే, యంత్రం మీద ఒక కోటు కత్తిరించటానికి అవసరమైన శ్రమ 1/10000 గంటలు మాత్రమే. ఫలితంగా ధర కూడా తగ్గుతుంది)

27. బట్టలు కత్తిరించటం, కుట్టటం, అంతకు ముందు దూదిని బట్టలుగా నేయటం వంటి ప్రత్యేకతల మాటున ఉన్నదేమిటి? అమూర్తమైన మానవ శ్రమ. మేధస్సు, నరాల, కండరాల సామర్థ్యం.

సరుకు విలువ అంటే ఏమిటి? అమూర్తమైన మానవ శ్రమ. మానవశ్రమను ఉపయోగించటానికి అనేక పద్ధతులున్నాయి. అయితే, దీన్ని వివిధ (ఉత్పత్తి ప్రక్రియలకు) ఉపయోగించటానికి ముందు అది కొంత నైపుణ్యం సంతరించుకుని ఉండాలి.

సమాజంలో ఒక సైనికోద్యోగీ, ఒక బ్యాంకు అధికారీ గొప్ప, గౌరవప్రదమైన పాత్ర పోషిస్తారు. కాని సామాన్యులు కూలీ పనులు, చిరుద్యోగాలు చేసుకుని బతుకీడుస్తారు. అలాగే మౌలికమైన మానవ శ్రమకూ, నైపుణ్యం సంపాదించిన మానవ శ్రమకూ తేడా ఉంది. సగటు మానవ శ్రమలో కూడా తేడాలుంటాయా? ఉంటాయి. దేశం నుండి దేశానికీ, కాలం, సాంకేతికాభివృద్ధిని బట్టే ఇది మారుతుంది.

నైపుణ్యం సంపాదించిన శ్రమ అంటే ఏమిటి? సామాన్య శ్రమ మెరుగుపడితే అదే నైపుణ్యం సంపాదించిన శ్రమ అవుతుంది. ఉదాహరణకు, ఒక వృత్తి నేర్చుకోవటానికి అయిదు సంవత్సరాలు అవసరమవుతుందనుకోండి. ఆ తర్వాత కార్మికుడు ఆ వృత్తిలో మరో పదిహేను సంవత్సరాలు కొనసాగ గలడనుకుంటే, అతడు మొత్తం ఇరవై సంవత్సరాల శ్రమకాలం వెచ్చిస్తున్నాడు. అంటే, పదిహేను సంవత్సరాలు అతడు సుశిక్షితుడైన కార్మికుడిగా తన ఉత్పత్తి సామర్థ్యం పెంచుకుంటాడు. ఇప్పుడు అతడి మూడు గంటల శ్రమ, వృత్తి నేర్చుకోని నాలుగ్గంటల శ్రమకు సమానం.

నిపుణులైన కార్మికులు ఉత్పత్తి చేసిన సరుకునూ, నిపుణులు కాని కార్మికులు ఉత్పత్తి చేసిన సరుకునూ ఎలా పోల్చవచ్చు? నిపుణులు కాని కార్మికులు దాని ఉత్పత్తికి ఎంత శ్రమించారో పోల్చి చూడటం వల్ల. అసలు ఈ రెండు రకాల (నిపుణులైన/నిపుణులు కాని కార్మికుల) ఉత్పత్తుల మధ్య నిష్పత్తిని నిర్ధారించవచ్చునా? ఆ సమయంలో, ఉత్పత్తిదారులకు లభ్యమయినటువంటి సామాజిక సాంకేతిక దశను బట్టి అంచనా వేయగలం.

అయితే, అది నిర్ధారణ కాదు. ఒక అంచనా మాత్రమే. అది కూడా సాంప్రదాయకంగా అంగీకరించిన అభిప్రాయం మాత్రమే.

28. వివిధ సరుకుల విలువలను మనం ఎలా గుర్తించాలి? ఉపయోగాపు విలువలు కాకుండా అమూర్తమైన శ్రమను పరిగణనలోకి తీసుకోవాలి. కాని ఉపయోగపు విలువలుగా వివిధ రకాల శ్రమ అవసరం.

29. ఉపయోగపు విలువకూ, శ్రమకూ మధ్య గుణాత్మకమైన సంబంధముంటుంది.

30. శ్రమకూ, విలువకూ మధ్య పరిణామపరమైన సంబంధం ఉంటుంది.

31. శ్రమను విలువగా చూడాలంటే అది కేవలం మానవ శ్రమ అని మాత్రమే అర్థం చేసుకోవాలి.

32. సరుకుల్లో శ్రమ నిక్షిప్తమై ఉంటుంది గనక కొన్ని సరుకులు ఒక నిర్ణీతమైన విలువకు సమానం.

ఉదాహరణకు: కోటు కుట్టడానికి అవసరమైన సమయం రెట్టింపైతే, అప్పుడు ఒక కోటు, ఇదివరలో కుట్టిన రెండు కోట్ల విలువకు సమానమవుతుంది. లేదా సమయం సగానికి సగం తగ్గితే, అప్పుడు రెండు కోట్లు, (పాత) ఒక్క కోటుకు సమానమవుతాయి.

అయితే, మారకపు విలువ మారినంత మాత్రాన, ఉపయోగపు విలువలు ఏ మాత్రం మారవు. ఆ సరుకుల్లో నిక్షిప్తమైన శ్రమలో కూడా మార్పు రాదు.

33. ఉపయోగపు విలువ పెరిగితే ఏమవుతుంది? అది భౌతిక సంపద పెరిగిందనటానికి సంకేతం. ఒక్క కోటు ఒక వ్యక్తి అవసరమే తీర్చింది. రెండు కోట్లు ఇద్దరి అవసరాలు తీరుస్తాయి.

సంపద పెరిగినంత మాత్రాన విలువ తప్పనిసరిగా పెరుగుతుందా? పెరగవలసిన అవసరం లేదు. సంపద పెరిగీ, విలువ తగ్గిన సందర్భాలు కూడా ఉంటాయి.

ఈ వైరుధ్యం ఎందుకు ఏర్పడుతుంది? శ్రమకున్న రెండు భిన్న లక్షణాలు వల్ల ఇలా జరుగుతుంది.

శ్రమ శక్తి అంటే ఏమిటి? ఉపయోగకరమైన శ్రమను శ్రమ శక్తి అంటాం.

ఉత్పత్తి పెరగటానికి ఉపయోగపడేదే ఉత్పాదక శక్తి.

ఉపయోగకరమైన శ్రమ ఎలా పరిణామం చెందుతుంది? ఇదే ఉత్పాదక శక్తిగా మారుతుంది. అన్ని రకాల వస్తువులూ

దీని వల్లే సృష్టింపబడతాయి.

ఉత్పాదక శక్తిలో వచ్చిన మార్పులవల్ల, సరుకులో నిక్షిప్తమైన శ్రమ విలువ మారుతుందా? లేదు. అమూర్తమైన (ఉపయోగకరమైన) శ్రమ విలువ మారదు.

34. శ్రమశక్తిని ఉపయోగించటమే శ్రమ. దీని వల్లనే సరుకులకు విలువలేర్పడతాయి.

3. విలువ యొక్క రూపం లేదా మారకపు విలువ

35. సరుకులు ఈ లోకంలోకి ఎలా ప్రవేశిస్తాయి? ఉపయోగపు విలువలుగా, వస్తువులుగా. ఉదాహరణ: ఇనుము, గుడ్డలు, ధాన్యం వగైరా సాధారణంగా మనకు కనిపించే సురుకుల రూపాలివి.

వాటిని సరుకులని ఎందుకంటున్నాం? వాటికి కొంత విలువ ఉంది. వాటి వల్ల ఉపయోగముంది గనక.

అవి సరుకులుగా మనకెలా దర్శనమిస్తున్నాయి? వాటి భౌతిక రూపం వల్ల, వాటి విలువ యొక్క రూపం వల్ల.

36. సరుకు విలువ అనేది భౌతికమా? కాదు. సరుకు యొక్క భౌతికత ఎంత మాత్రం కూడా దాని విలువగా కనిపించదు. సరుకు విలువను మనం ఎలా అర్థం చేసుకోవాలి? అది దాని సామాజికమైన విలువ అని తెలుసుకోవాలి.

సరుకు ఈ విలువను ఎలా సంతరించుకుంటుంది? అన్ని సరుకుల్లోనూ శ్రమ నిక్షిప్తమై ఉన్నందువల్లే అవి విలువను కలిగి ఉన్నాయి. సరుకుల సామాజిక విలువనే మనం విలువ అంటున్నాం. మనమసలెక్కడ ప్రారంభించాం? మారకపు విలువ వద్దా లేక సరుకుల మారకపు సంబంధాల వద్దా? మనకేం తెలిసింది? సరుకులలో నిక్షిప్తమై ఉంటుంది విలువ.

37. సరుకులకు విలువ ఉంటుందని తెలియని మనుషులుండరు. వాటి ఉపయోగపు విలువలకు సంబంధం లేకుండా ఉంటాయా విలువలు. సరుకుల విలువను ఏమందాం? డబ్బు రూపంలో ఉన్న విలువ ఇది. ఇప్పుడు మనమో ముఖ్య విషయం తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. ఇంతవరకూ ఏ బూర్జువా ఆర్థికవేత్తా కూడా ఈ సాహసం చెయ్యలేదు. అదేమిటంటారా? డబ్బు రూపం ఆవిర్భవించిన క్రమం తెలుసుకోవాలి. సరుకుల సంబంధాలను నిర్దేశిస్తున్న విలువ-అత్యంత మౌలిక భావన నుండి కళ్ళు మిరిమిట్లు గొలిపే డబ్బుగా ఎలా రూపింతరం చెందింది?

ఇది తెలుసుకోవటం వల్ల మనం సాధించేదేమిటి? డబ్బు గురించి ఉన్న మిస్టరీని ఛేదించవచ్చు.

38. విలువల మధ్య ఉన్న సంబంధమంటే ఏమిటి? ఒక సరుకుకూ మరొక సరుకుకూ ఉన్న సంబంధం. ఉదాహరణ: ఇరవై గజాల గుడ్డను ఒక కోటు వగైరా అంటే ఒక సరుకు విలువను మరొక సరుకు విలువతో పోల్చినప్పుడే ఈ విషయం స్పష్టమవుతుంది.

గుడ్డను గుడ్డతో, కోటును కోటుతో పోల్చటం వృథా.

39. అసలు కేవలం మానవ శ్రమకు విలువ ఉందా? లేదు. అది సరుకులో నిక్షిప్తమైనప్పుడు మాత్రమే దాని విలువను గుర్తిస్తాం.

40. సరుకు విలువ ఎలా వ్యక్తమవుతుంది? సరుకుకు సంబంధించిందే అయినా దాని కన్నా భిన్నంగా. ఈ విలువను వ్యక్తపరిచే పద్ధతి అన్ని సరుకులకూ సామాన్యంగా (కామన్) గా ఉంటుంది.

41. కోటు విలువ కూ గుడ్డ విలువకూ ఏమి సంబంధం? "సరుకుల విలువ" అంటాం అదే వాటి మధ్య ఉన్న సంబంధం.

42. కోటుకు విలువ ఎలా వచ్చింది?

43. దర్జీ పని రూపంలో మానవ శ్రమ అందులో నిక్షిప్తమై ఉంది గనక.

44. ఉపయోగపు విలువలుగా కోటు, గుడ్డ భిన్నమైనవి. కాని విలువలుగా ఒక నిష్పత్తిలో రెండూ సమానమే.

4. సాపేక్ష విలువను నిర్ణయించటం ఎలా?

45. మానవ శ్రమ సరుకుల్ని సృష్టించింది. అది ప్రతి సరుకులో ఒక ఖచ్చితమైన పరిమాణంలో ఉంటుంది. ఒక గజం గుడ్డ నేయటానికి గంట సేపు అవసరమవుతుందనుకుంటే, మరమగ్గాలతో ఈ సమయం సగానికి సగం తగ్గుతుంది. మొదట పది రూపాయలకు గజం ఉన్న గుడ్డ విలువ ఇప్పుడు ఐదు రూపాయలవుతుందన్న మాట.

46. అలాగే, చేత్తో కుట్టిన కోటుకూ, మెషీన్ మీద కుట్టిన కోటుకూ విలువలో తేడా ఉంటుంది.

47. అంటే, సరుకులో ఉన్న శ్రమను బట్టి దాని విలువ నిర్ణయించబడుతుంది.

48. కోటు, గుడ్డల ఉత్పత్తికి అవసరమైన శ్రమ ఒకే దిశలో పెరిగినా, లేదా ఒకటి ఒక దిశలో, మరొకటి మరొక దిశలో పెరిగినా, తగ్గినా, వాటి పరస్పర మారక విలువల్లో ఆ నిష్పత్తిలో తేడా వస్తుంది.

49. ఈ నిష్పత్తి దేని మీద ఆధారపడి ఉంటుంది? గుడ్డ యొక్క నిడివికీ, కోటు విలువకూ ఉన్న సంబంధమేంటి.

50. కోటు విలువనెలా నిర్ణయిస్తాం? దాన్ని కుట్టటానికి అవసరమైన సమయం/శ్రమను బట్టి.

51. గుడ్డ నేయటానికి అవసరమైన సమయం/శ్రమలో మార్పు రాదు. కాని కోటు కుట్టటానికి అవసరమైన సమయం/శ్రమ మారుతుంటుంది. దాన్ని బట్టి వాటి మధ్య మారకపు విలువలో కూడా తేడా వస్తుంది.

52. కొన్ని సార్లు పది గజాల గుడ్డకు ఒక కోటు, లేదా ఇరవై గజాల గుడ్డకు ఒక కోటు- వగైరా. కోటు మీద వెచ్చించిన సమయాన్ని/శ్రమను బట్టి మారుతుంటుంది.

53. రెండు కోట్లు తమ విలువను, ఒక దాని రూపంలో మరొకటి వ్యక్త పరచుకోగలవా?

54. లేదు.

55. ఒక దాన్ని మరొక దానితో పోల్చినప్పుడు మాత్రమే విలువ

నిర్ధారించగలం.

56. ఒక బెల్లం ముద్ద బరువు తెలుసుకోవాలంటే ముందే బరువు తెలిసిన ఇనప తూకం రాళ్ళతో తూచాల్సిందే. బరువు తెలియకపోతే ఇనప తూకం రాళ్ళ పరిస్థితి అంతే. ఇనుముకూ, బెల్లానికీ సంబంధం లేదు. కాని తెలిసిన ఒక బరువుతో తూచి మరొక దాని బరువు తెలుసుకొంటున్నాం. రెండూ (బెల్లం/ఇనుము) కొంత నిర్ధారిత బరువున్నాయి. అందువల్లనే ఒక దానితో ఒకటి తూచటం సాధ్యపడింది.

57. రెండూ బరువుగానే ఉన్నాయి. ఒక దాన్ని బరువులోనూ, మరొకదాన్ని వైశాల్యంలోనో, మరే ఇతర పరిమాణంలోనో పోల్చటం సాధ్యపడదు.

58. రెండూ భిన్నమైన సరుకులే అయినప్పటికీ, త్రాసులో ఉన్నప్పుడు రెండూ ఒకటే. అదే విధంగా, కోటునూ, గుడ్డనూ పోల్చినప్పుడు వాటి విలువను మాత్రమే మనం పరిగణనలోకి తీసుకుంటున్నాం.

59. కాని ఈ పోలిక ఇక్కడితో ఆపాలి. బెల్లం, ఇనుము అన్నప్పుడు మనం వాటి సహజ స్థితిలో తూకం వేసాం. కాని, కోటు, గుడ్డ యొక్క సహజ స్థితి కాదు. ఇది సామాజికంగా (శ్రమ వల్ల) వచ్చిన మార్పు.

60. మనకీ విషయం ఎలా తెలిసింది? మనకు గజాల్లో తెలిసిన గుడ్డ కోటుగా మారిందంటే ఎవరో శ్రమించి దాని రూపం మార్చారన్నమాటే గదా? పైగా కోటుకున్న విలువ, గుడ్డకున్న విలువకన్నాభిన్నమైంది.

61. అన్ని సందర్భాల్లోనూ ఈ వివరణ వర్తిస్తుందా?

62. లేదు. రెండు సరుకుల మధ్యా సంబంధమున్నంత వరకు మాత్రమే ఇది సాధ్యం.

63. గుడ్డ యొక్క లక్షణం వేరు, కోటుగా మారిన తర్వాత అది మన అవసరాన్ని మరో రకంగా తీర్చుతుంది. రెంటిలోనూ శ్రమ దాగి ఉన్నప్పటికీ, గుడ్డ నేయటం లోని శ్రమకూ, కోటు కుట్టటంలోని శ్రమకూ తేడా ఉన్నదని మనకు తెలుసు. అయితే, ఈ ప్రత్యేకతలను కాసేపు పక్కనబెడితే, అమూర్తమైన శ్రమగానే మనం అర్థం చేసుకోవాలి.

64. సరుకులను సృష్టిస్తున్న శ్రమ అంతా ప్రైవేటు వ్యక్తులకు చెందినదే అని కూడా తెలుసుకోవాలి.

65. కాని, ఇది సామాజికంగా ఉపయోగకరమైన శ్రమ. ఇలా, సామాజికంగా ఉపయోగకరమైన శ్రమలకు కూడా మార్చిడే స్వభావం ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం, ప్రైవేటు వ్యక్తుల శ్రమ సామాజిక రూపం సంతరించుకుంది.

66. మనుషుల ఆలోచనా విధానం గురించి, సమాజం గురించి, ప్రకృత్తి గురించి విశ్లేషించిన మరో మహానుభావుడు- అరిస్టాటిల్ గురించి కూడా ఇప్పుడు తెలుసుకుందాం.

67. "వస్తువులను డబ్బుతో లెక్కగట్టటం కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. మార్పిడికి అవి అవసరమే కావచ్చు గాని "అయిదు పడవలు ఒక ఇంటికి సమానం అంటే, ఐదు పడవల ఖరీదు ఒక ఇల్లు అని అర్థం కాదు" అన్నాడాయన.

68. "రెండు విలువలు సమానంగా ఉన్నప్పుడు మాత్రమే మారకం సాధ్యం"

69. కాని "నిజానికి రెండు భిన్న వస్తువులు సంపూర్ణంగా ఒకదాని విలువకు మరొకటి సమానం కావటం అసాధ్యం. కేవలం రోజువారీ అవసరాలకు మాత్రమే మనం సమానం అంటాం" అని కూడా వివరణ ఇచ్చాడు అరిస్టాటిల్.

69. ఆ తర్వాత తన విశ్లేషణ "ఇక ముందుకు సాగలేదు". కారణం " 'విలువ'ను మనం నిర్వచించలేం" అంటాడు.

70. "నిజానికి పడవలనూ, ఇంటిని పోల్చటమేమిటి? ఒకటి మరొక దానితో ఎలా సమానమవుతుంది? "కాని ఎందుకు కాదు?" అని మళ్ళీ ప్రశ్నించుకుంటే "రెంటిలోనూ నిక్షిప్తమైన మానవశ్రమ వల్లనే వాటిని పోల్చటం సాధ్యపడుతుంది" అన్నాడు.

71. అసలు 'వస్తువుల విలువ' అంటే మానవ శ్రమే అన్నది ఆయన అభిప్రాయం.

72. అంటే మానవ శ్రమ అవిభాజ్యం. అన్ని రకాల శ్రమా సమానమే.

73. దీని వెనక మనుషులందరూ సమానమే అన్న సత్యం దాగి ఉంది. మనుషులు సమానం గనకే, మనుషుల శ్రమా సమానం.

74. కాని సరుకుల ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత, మనం శ్రమను గుర్తించటం మానేసి, సరుకుల యజమానులమని చెప్పుకునే స్థితికి వచ్చాం. మరి మనం ఉంటున్న సమాజం ఎలాంటిది? ఇదే పెట్టుబడిదారీ సమాజం

75. అరిస్టాటిల్ జీనియస్. ఈ ఒక్క పరిశీలనతో స్పష్టంగా తెలిసిపోతుంది.

76. అయితే, ఆయన కాలంలో ఈ సత్యం ఇంత స్పష్టంగా ఆవిష్కృతం కాలేదు.

విలువ యొక్క మౌలిక రూపం

77. సరుకు విలువ యొక్క మౌలిక రూపం అంటే ఏమిటి? ఏ విలువ ఆధారంగా ఒక సరుకు మరొక సరుకుతో మారకం చెందగలదో, అదే మౌలిక రూపం. దీన్ని పరిమాణాత్మకంగా ఎలా వ్యక్తపరుస్తాం? ఏ పరిమాణంలో సరుకుల మారకం జరుగుతుందో అదే దాని మౌలిక రూపం. ఉదాహరణ: ఒక పరిమాణం గల కోటు, మరొక పరిమాణం గల గుడ్డతో మారకం జరుగుతుంది.

అంటే మారకం విలువ ద్వారా సరుకు విలువ ఏమిటో స్పష్టంగా తెలుస్తుంది. ఈ అధ్యాయం ప్రారంభంలో మనం "ఒక సరుకు ఉపయోగపు విలువగానూ, మారకపు విలువగానూ ఉంటుంది" అన్నాం. ఈ అభిప్రాయాన్ని ఇప్పుడు కొద్దిగా మార్చుకోవలసిన అవసరముంది. నిజానికది వైరుధ్యమేమీ కాదు గాని సరుకును దానికదిగా చూసినప్పుడు ఉపయోగపు విలువ గురించి మాట్లాడుకొంటాం గాని, మారకం జరిగినప్పుడు మారకపు విలువనే పరిగణనలోనికి తీసుకుంటాం.

(ఇంకా ఉంది.)

-: స్వీకారం :-



శృతి
నవల
శ్రామిక
ప్రచురణ :
శ్రామిక ప్రచురణలు
వెల : రు. 100/-
పేజీలు : 180



ఈ తరం మార్గదర్శి
(వివేక్ రచనలు - స్మృతులు)
ప్రచురణ :
శ్రామిక ప్రచురణలు
వెల : రు. 100/-
పేజీలు : 184



వి-వేకువ
కవిత్వం
ప్రచురణ :
శ్రామిక ప్రచురణలు
వెల : రు. 50/-
పేజీలు : 96



ఉద్యమకారుడి డైరీ
మద్దిలేటి రచనలు
ప్రచురణ :
నడుస్తున్న తెలంగాణ
వెల : రు. 200/-
పేజీలు : 248



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ
సామాజిక న్యాయం
సి. కాశీం
ప్రచురణ :
క్యాంపస్ వాయిస్ ప్రచురణలు
వెల : రు. 25/-
పేజీలు : 56



ఆకు కదలని చోట
కవిత్వం
బాలసుధాకర్ మౌళి
ప్రచురణ :
సిక్కోలు బుక్ ట్రస్ట్
వెల : రు. 116/-
పేజీలు : 135



ప్రేమ - పెట్టుబడి
కార్ల్ - జెన్నీ మార్క్స్ విప్లవం చిగురించిన వేళ
మేరీ గేబ్రియల్
సంక్షిప్త అనువాదం :
ముక్తవరం పార్థసారథి
ప్రచురణ :
ప్రజాశక్తి బుక్‌హౌస్
వెల : రు. 350/-
పేజీలు : 551

జాక్‌లండన్
ఉక్కుపాదం
తెలుగు సేత :
ముక్తవరం పార్థసారథి
ప్రచురణ :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
వెల : రు. 180/-
పేజీలు : 232



పరాగ భూమి
కథలు
కలవకొలను సదానంద
ప్రచురణ :
పలమనేరు మిత్రసాహితి ప్రచురణలు
వెల : రు. 150/-
పేజీలు : 220

గెలిచి నిలిచిన గళం
బండి చంద్రశేఖర్
ప్రచురణ :
కోటి లింగాల ప్రచురణ
వెల : రు. 80/-
పేజీలు : 95

ప్రజాసేవలో
తరిమెల నాగిరెడ్డి
ఎడిటర్:
చెరుకూరి సత్యనారాయణ
ప్రచురణ :
తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటి, గుంటూరు
వెల : రు. 90/-
పేజీలు : 564



సూర్యోదయం కుట్రకాదు
(కుట్రకేసుల సమాచారం)
ఎడిటర్:
చెరుకూరి సత్యనారాయణ
ప్రచురణ :
తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటీ, గుంటూరు
వెల : రు. 90/-
పేజీలు : 576

చలసాని ప్రసాద్ లేఖలు
సన్నిధానం నరసింహశర్మకు రాసినవి
సంపాదకుడు :
మలసాని శ్రీనివాస్
ప్రచురణ :
స్పృహ సాహితీ సంస్థ
వెల : రు. 80/-
పేజీలు : 91

ఆన్ ఫ్రాంక్
ఓ బాలిక డైరీ
తెలుగు:
బీనాదేవి
ప్రచురణ :
పీకాక్ క్లాసిక్స్
వెల : రు. 125/-
పేజీలు : 208



నెక్లెస్
మరికొన్ని ఇతర కథలు
తెలుగు:
బీనాదేవి
ప్రచురణ :
పీకాక్ క్లాసిక్స్
వెల : రు. 80/-
పేజీలు : 128

KLVA101M192

ARUNATARA RNI Regn.No.21152/72 Published on 24/10/2016 October 2016 Vol. : 44 Issue : 9
Hyderabad
A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వహించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది, విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార సంపాదకుడు
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి
వరవరరావు, టి. కృష్ణాబాయి, సిఎస్ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య,
అల్లం రాజయ్య, ఎం. రత్నమాల, సి. కాశీం, పాణి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి వివరాలు :

డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. 10243583773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)
ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.0007112, లాలాగుడ, సికింద్రాబాద్.
ఎం.ఓ.లు, డ్రాఫ్టులు, చెక్‌లు డి.వి. రామక్రిష్ణారావు పేరిట ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - 500 040 చిరునామాకు పంపగలరు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M192
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good